శ్రీమతే రామానుజాయనమః
శ్రీమతే అప్పిళ్ళార్యాయనమః

# శారీరక కారికావళీ

## రెండవ అధ్యాయము

## రెండవ అధ్యాయానికి అధికరణార్థసంగ్రహం

### ముందుమాట.

అవిరోధాధ్యాయం అనబడే రెండవ అధ్యాయంలో, మొదటి అధ్యాయంలో నిరూపించబడిన బ్రహ్మకారణత్వానికి విరోధం ఏమీలేదు అని నిరూపింపబడుతోంది. అందులో మొదటిపాదంలో, బ్రహ్మ కారణానికి ఏర్పడుతుందని తోచే స్మృతిన్యాయవిరోధాలకి పరిహారం, రెండవపాదంలో సాంఖ్యులు మొదలైన ఎదిరిపక్షంవాళ్ళని నిరసించడం, మూడవపాదంలో ఆకాశం మొదలైనవి బ్రహ్మకి కార్యాలుగానే అయినాయి అనిన్నీ, నాలుగోపాదంలో ఇంద్రియం మొదలైనవి బ్రహ్మకి కార్యములే అయినాయనిన్నీ వివరించబడ్డాయి.

### మొదటిపాదం (10 అధికరణాలు)

ఇందులో మొదటిపాదం కపిలస్మృతి మొదలైన స్మృతుల విరోధాలు లేవని నిరూపించడంచేత స్మృతిపాదం అనబడుతోంది. అందులో పది అధికరణాలు ఉన్నాయి. వాటిలో మొదటి ఆరు అధికరణాలలోను బ్రహ్మం లోకానికి ఉపాదానకారణం అనడానికి తర్క(యుక్తి)విరోధమున్నూ, తరువాతి నాలుగధికరణాలలోను బ్రహ్మం లోకానికి నిమిత్తకారణం అనడానికి తర్క(యుక్తి)విరోధమున్నూ తప్పించ బడుతున్నాయి. ఇక ఒక్కొక్క అధికరణార్థసంగ్రహమున్నూ కనిపిస్తాయి.

1. స్మృత్యధికరణం - కపిలమహర్షిచేత చెప్పబడిన సాంఖ్యస్మృతి భ్రాన్తి(మతిభ్రంశం)చేత రచింపబడినది అని నిరూపించడం.

2. యోగప్రత్యుక్త్యధికరణం - హిరణ్యగర్భుడు అనబడు బ్రాహ్మణుడివల్ల రచింపబడిన యోగస్మృతిని నిరసించడం.

3. విలక్షణత్వాధికరణం - బాగా ప్రత్యేకమైన తేలుకి గోమయం కారణమైనట్టు అతివిలక్షణమైన లోకానికి బ్రహ్మమే జగత్కారణమని నిరణయం.

4. శిష్టాపరిగ్రహాధికరణం - స్థిరములేని తర్కమూలంగా గ్రహింపబడినవవడంచేత పరమాణుకారణవాదం చేసే అక్షపాదుల నైయాయికమతం, కణాదుల వైశేషికమతం, జినుడి జైనమతం, శివుడు ప్రవర్తింపించిన శైవమతం, మొదలైన మతాలున్నూ, వెనుకచెప్పిన సాంఖ్య,యోగ మతాలలాగే అనాదరింపతగినవే అని స్థాపనం.

5. భోక్త్రాపత్త్యధికరణం - సుఖదుఃఖాలని అనుభవించడం కర్మకారణంగానే అవడంచేత కర్మకివశంకాని బ్రహ్మకి జీవుడిలా ప్రాకృతమైన సుఖదుఃఖానుభవం లేదు అని సాధించడం.

6. ఆరంభణాధికరణం - ఛాందోగ్యం 6-1-4 - వాచారంభణం అనిమొదలయే శ్రుతివాక్యం కార్యకారణాలని వేరుచెయ్యబడలేనివని చెప్పడంవల్ల వాటిలోనే ఉన్న బుద్ధిభేదం, నామభేదం, కార్యభేదం, కాలభేదం, అనే భేదాలని కార్యకారణంగాల వేరువేరు స్థితులతో సహించవీలులేకపోవడంచేత, కారణమైన బ్రహ్మంకంటె కార్యమైన లోకం వేరుచేయలేనిదే అవుతుంది.

7. ఇతరవ్యపదేశాధికరణం - **య ఆత్మని తిష్ఠన్** (బృ.ఉ. 5-7-22), **పృథగాత్మానం ప్రేరితారం**

(శ్వే. ఉ. 1-6) మొదలైన ఉపనిషద్వాక్యాలలో జీవుడినీ, బ్రహ్మమునూ, వేరువేరుగా చెప్పిఉన్నందువలన బ్రహ్మమును జీవునిగా చెప్పడంచేత బ్రహ్మం తనంతటతానే మంచిచెయ్యలేదు, అహితాన్నే చేసేడు క్నే దోషాలు కలుగుతాయి అని శంకించవలసిన అవసరం లేదు.

8 - ఉపసంహారదర్శనాధికరణం - బ్రహ్మం విచిత్రశక్తులని కలిగియున్నదవడంచేత ఉపకరణాలు లేకపోయినా, అది సంకల్పమాత్రంచేత జగత్సృష్టి మొదలైనవాటిని చెయ్యడానికి లోటు లేదు.

9 - కృత్స్నప్రసక్త్యధికరణం - బ్రహ్మకి అవయవాలు లేవు అనినీ, అది విచిత్రమైన జగత్తుకి ఉపాదానకారణం అయింది

10. ప్రయోజనవత్త్వాధికరణం - పరమాత్మ అన్ని కోరికలున్నూ పొందినటువంటి అవాప్తసమస్త కాముడయి ఉన్నప్పటికీ లీలారూపమైన ఫలం అతనికి కూడా ఉండడంచేత బ్రహ్మము జగత్కారణమవడానికి ఏఆటంకం లేదు.

మొదటిపాదం పూర్తి అయింది.

## రెండవపాదం. (8అధికరణాలున్నాయి)

ఇక రెండవపాదంలో తర్కాలతో బ్రహ్మకారణవాదాన్ని ఖండించే ఇతరవాదాలని నిరసించడంచేత ఈపాదం తర్కపాదం అనబడుతోంది.

1. రచనానుపపత్త్యధికరణం - ఇది సాంఖ్యపక్షప్రతిక్షేపం.
2. మహద్దీర్ఘాధికరణం - ఇది వైశేషికమతనిరసనం.
3. సముదాయాధికరణం - ఇది వైభాషికసౌత్రాన్తికుల సౌత్రాన్తికమతనిరసనం.
4. ఉపలబ్ధ్యధికరణం - బౌద్ధుల యోగాచారమతనిరసనం.
5. సర్వథానుపపత్త్యధికరణం - బౌద్ధుల మాధ్యమికమతనిరసనం.
6. ఏకస్మిన్నసంభవాధికరణం - జైనమతనిరసనం.
7. పశుపత్యధికరణం - పాశుపత (శైవ) మతనిరసనం.
8. ఉపపత్త్యసంభవాధికరణం - పాంచరాత్రాగమం, జీవోత్పత్తి మొదలైన శ్రుతివిరుద్ధమైన విషయాలని చెప్పడంచేత ప్రమాణంకాదు అనే సందేహపరిహారం.

రెండవపాదం పూర్తి అయింది.

## మూడవపాదం. (7అధికరణాలున్నాయి)

ఇక మూడవ, నాలుగవపాదాలలో, ఆకాశం మొదలైన అచేతనవస్తువులును, చేతనవస్తువులును వాటికి అనుగుణంగా బ్రహ్మకార్యంగానే ఉన్నాయి అని చూపించడంద్వారా, బ్రహ్మం సర్వజగత్కారణం అనే విషయానికి విరోధాలు పరహరించబడతాయి. అందులో వియత్(ఆకాశం) మొదలైనవి బ్రహ్మకార్యం అని నిరూపించడంచేత, ఈపాదం వియత్పాదం అని చెప్పబడుతోంది.

1. వియదధికరణం - తైత్తిరీయ ఆనందవల్లి - ఆకాశం బ్రహ్మంనుండే సృష్టింపబడిందని ప్రతిపాదనం.
2. తేజోధికరణం - ఆకాశం మొదలైన ఆయావస్తువులని శరీరంగాకలిగిన బ్రహ్మంనుంచే అగ్ని మొదలైన కార్యవస్తువులు సృష్టింపబడినాయి అని నిరూపణం.
3. ఆత్మాధికరణం - కఠోపనిషత్తు 2-18. ఆత్మలు ఒకరకమైన బ్రహ్మకార్యమైనా స్వరూపం నిత్యంగనుక, వాటికి ఉత్పత్తిలేదు అని సాధనం.
4. జ్ఞాధికరణం - ప్రశ్నోపనిషత్తు 4-9. బృహదారణ్యకోపనిషత్తు 6-3-30. జ్ఞానస్వరూపుడైన

జీవాత్మ జ్ఞానాన్ని గుణంగా కలవాడైఉన్నాడు, జ్ఞాతగా కూడా ఉన్నాడు అని ప్రసాధనం.

5. కర్త్రధికరణం - జీవుడికి కర్తృత్వం పారమార్థికం(సహజం) అని స్థాపనం.

6. పరాయత్తాధికరణం - జీవుడి కర్తృత్వం పరమాత్మవల్ల ఏర్పడింది అని నిరూపించడం.

7. అంశాధికరణం - శ్వేతాశ్వేతరోపనిషత్తు 1-9, పురుషసూక్తం. బ్రహ్మనుంచి వేరుగా ఉండశక్యంగానివిశేషణంగా ఉండడంవల్ల జీవుడు ఆబ్రహ్మకి అంశభూతుడు అని నిశ్చయించడం.

మూడవపాదం పూర్తి అయింది.

## నాలుగవపాదం. (8అధికరణాలున్నాయి)

ఇక జీవుడి ఉపకరణాలైన ప్రాణాలు అనబడే ఇంద్రియాలు ముఖ్యప్రాణం మొదలైనవి బ్రహ్మకార్యాలే అని నాలుగోపాదంలో నిరూపించబడుతోంది. ప్రాణాలు బ్రహ్మకార్యం అని నిరూపించడం చేత ఇది ప్రాణపాదం అనబడుతోంది.

1. ప్రాణోత్పత్త్యధికరణం - శతపథబ్రాహ్మణం 6-1-1. ఇంద్రియాలు బ్రహ్మమునుండే సృష్టింపబడ్డాయని నిరూపణం.

2. సప్తగత్యధికరణం - ముండకోపనిషత్తు 3-1-8, బృహదారణ్యకోపనిషత్తు 5-9-4. ఇంద్రియాలు పదకొండు అని స్థాపనం.

3. ప్రాణాణుత్వాధికరణం - బృహదారణ్యకోపనిషత్తు 3-5-13, 6-4-2. ఇంద్రియాలు అణుపరిమాణంగలవి అని సాధనం.

4. వాయుక్రియాధికరణం - ముండకోపనిషత్తు 2-1-3. ముఖ్యప్రాణం వాయువో, దానిక్రియో గాదు, అదికూడా ఒక స్థితినిపొందిన వాయువే అవుతుంది అని నిరూపించడం.

5. శ్రేష్ఠాణుత్వాధికరణం - ముండకోపనిషత్తు 2-1-3, బృహదారణ్యకోపనిషత్తు 6-4-2. ముఖ్యప్రాణంకూడా అణుపరిమాణమే అనిస్థాపించడం.

6. జ్యోతిరాద్యధిష్ఠానాధికరణం - బృహదారణ్యకోపనిషత్తు 5-7-5...22.జీవుడు, అగ్ని మొదలైన దేవతలుకూడా ప్రాణమును అధిష్ఠించడం పరమాత్మాధీనం అని సాధించడం.

7. ఇంద్రియాధికరణం - ఇంద్రియాలు ముఖ్యప్రాణంకంటే వేరైనవి అని నిరూపణం.

8. సంజ్ఞామూర్తిక్లుప్త్యధికరణం - ఛాందోగ్యోపనిషత్తు 6-3-2. త్రివృత్కరణాన్ని, నామరూపవ్యాకరణాన్ని చేసేవాడు ఒక్కడే, ఆయన పరమాత్మేగాని చతుర్ముఖబ్రహ్మగాడు అని సాధించడం.

॥శ్రీరస్తు॥

నాలుగవ పాదం పూర్తి అయినది.

రెండవ అధ్యాయం పూర్తి అయినది.

శ్రీమతే అప్పలార్యాయ నమః

శ్రీమతే రాఘవార్యమహా దేశికాయ నమః

## ॥శ్రీశారీరకకారికావళీ॥

## ॥అథ ద్వితీయాధ్యాయే ప్రథమపాదః॥

### ॥స్మృత్యధికరణమ్॥ (2-1-1)

*సూ ॥ స్మృత్యనవకాశదోషప్రసఙ్గః ఇతి చేన్నాన్యస్మృత్యనవకాశదోషప్రసఙ్గాత్ ॥ 2-1-1 ॥*

**స్మృత్యనవకాశదోషప్రసఙ్గః ఇతి చేత్** -(బ్రహ్మకారణవాదాన్ని అంగీకరిస్తే) కపిలస్మృతి ఫలంకలిగినదవడానికి అవకాశంలేకుండాపోయిఉంటుందనే దోషం వస్తుంది. ఎందుకంటే, **అన్యస్మృత్యనవకాశదోషప్రసఙ్గాత్** - (ప్రధానకారణవాదాన్ని అంగీకరిస్తే) మనువు మొదలైన ఇతరములైన అనేక స్మృతులు ప్రయోజనం కలిగినవిగా ఉండడానికి అవకాశం లేకపోయిఉంటుందనే దోషం వస్తుంది కనుక, **న**- వెనక చెప్పిన వాదం కుదరదు.

*1. నారాయణాఖ్యం బ్రహ్మైవ జగద్ధేతుతయా శ్రుతౌ ।*
*ప్రతిపాద్యమితి ప్రోక్తమాద్యేధ్యాయే సునీతిభిః ॥*

*2. పరపక్షాన్నిరాకృత్య స్థూణానిఖనక్రమాత్ ।*
*పూర్వోక్తార్థం దృఢీకర్తుమేషోధ్యాయః ప్రవర్తతే ॥*

*3. పూర్వ సాఙ్ఖ్యౌ నిరస్తౌ ద్వౌ వేదాన్తార్థప్రకాశనాత్ ।*
*నిరీశ్వరోత్ర కపిలస్మృతిగ్రాహీ నిరస్యతే ॥*

1-3. **అవతారిక** - శ్రీమన్నారాయణుడనే పరబ్రహ్మమే లోకానికి కారణం అని వేదంలో చెప్పబడు తున్నాడు అని మంచిన్యాయాలని చూపి ఈశారీరకశాస్త్రం మొదటి అధ్యాయంలో నిరూపించబడింది. స్తంభాన్ని కుదిపేసి కదిల్చి కదిల్చి నిర్ణయంగా భూమిలో స్థిరంగా ఉండేదానిలా. వెనుకటి అధ్యాయంలో నిర్ణయించిన బ్రహ్మకారణవాదానికి ప్రతిగా చెప్పే వాళ్ళ వాదాలని ఎత్తుకొని నిరసించడంద్వారా, బ్రహ్మ కారణవాదాన్నే స్థిరంచేయడానికి ఈరెండవఅధ్యాయంలో ప్రారంభిచుతోంది. వెనుకటి అధికరణాలలో నిరీశ్వరసేశ్వరసాంఖ్యులనబడే రెండురకాల సాంఖ్యులూ ఉపనిషదర్థాలని చూపించి నిరసింపబడ్డారు. ఈఅధికరణంలో కపిలస్మృతిని ప్రమాణంగా తీసుకొని మళ్ళీ తలెత్తిన నిరీశ్వరసాంఖ్యుడు నిరసింపబడు తున్నాడు.

*పూ. 4. ఆప్తప్రణీతస్మృత్యైవ వేదాన్తార్థవినిర్ణయః ।*
*కార్యోల్పశ్రుతమన్దైస్తత్ వేదోక్తకవిలీక్షయా ॥*

*5. స్మృత్యా తత్త్వైకపరయా న్యాయ్యో వేదార్థనిర్ణయః।*
*అన్యథానవకాశోస్యాః తస్మాదఖిలకారణమ్ ॥*

*6. ప్రధానమేవ వేదాన్తవేద్యమిత్యేవ యుక్తిమత్ ।*
*న చ వాచ్యమయుక్తత్వాత్ప్రధానం నేతి కారణమ్ ॥*

*7. వచనేన విరోధే హి నైవ న్యాయః ప్రవర్తతే ।*
*తతో జగత్కారణం తత్ ప్రధానమితి చేన్న తత్ ॥*

**4-7 పూర్వపక్షము** - ఉపనిషత్తులలో తత్త్వార్థాలు స్పష్టంగా చెప్పబడకపోవడంచేత ఆనువంశీకం

కానటువంటి ఉపనిషద్భాగాలలో ఉన్న అర్థాలని తమయోగమహిమచేత సాక్షాత్కరింపజేసుకున్న ఆప్తులవల్ల రచింపబడినటువంటి స్మృతివల్ల, అల్పశాస్త్రజ్ఞానంతో శ్రుతపాండిత్యంతో ఉన్న మనుషులు ఉపనిషత్తులని స్పష్టంగా తెలుసుకోవాలి. అందుచేత **ఋషిం ప్రసూతం కపిలం** (శ్వే. 5-2) అని ఉపనిషత్తులో ప్రశంసింపబడినవారున్నూ, అప్తులున్నూఅయిన కపిలమహర్షిచేత రచింపబడినదై, తత్త్వాన్ని చూపించడం కోసమే, ఏర్పడిన కపిలస్మృతితో, వేదార్థాలని నిర్ణయించడమే తగిఉంటుంది. అలా నిర్ణయించుకొనేటప్పుడు, మూలప్రకృతి అనబడే ప్రధానమే సమస్తలోకానికీ కారణమైందనేదే వేదార్థం అని కపిలస్మృతిలో స్పష్టం. ఆప్తులైన మనువు మొదలైన ఇతరులు రచించినస్మృతులనుంచి బ్రహ్మమే జగత్కారణం అనే వేదార్థం అని స్పష్టంగా చెప్తోందే అంటే, ఆస్మృతులు, వేదంతాలూకు పూర్వభాగంలో చెప్పబడిన యాగాదికర్మలనిగురించే విరివిగా చెప్పుతున్నవవడంచేత, ఆఅంశంలో, ఆస్మృతులు ప్రయోజనంగలిగినవవడానికి అవకాశం ఉంటుంది. ఈకపిలస్మృతివిషయమైతే యాగాదికర్మలనిగురించి చెప్పకుండా వేదాలకి ఉత్తరభాగమైన ఉపనిషత్తులలో చెప్పబడిన జగత్కారణవస్తువుగురించి చెప్పుతున్నదవడంచేత ఆఅర్థాన్ని నిర్ణయించడానికి ఈస్మృతినే తీసుకోవాలి. లేనట్లయితే, ఓపిసరు ఉపయోగించే స్మృతులలాకాకుండా ఈస్మృతి పూర్తిగా ఉపయోగం లేనిదైపోతుంది. అందుచేత, ఈస్మృతివల్ల ప్రధానమే జగత్కారణం అనేదే వేదాంతార్థం అని తెలుసుకోవడమే సరియైనది. ఇప్పుడు ఒక ఆక్షేపం రావచ్చు. అదేమిటంటే - ఈవిధంగా కపిలస్మృతితో మూలప్రకృతే జగత్కారణం అనిభావిస్తే, అది మొదటధ్యాయంలో చెప్పిన యుక్తులకి (న్యాయాలకి) కుదరడంలేదే? ఎలాగంటే: 'చేతనం, అచేతనం అని రెడురకాలైన వస్తువులతో నిండిన లోకానికి అచేతనమైన మూలప్రకృతి కారణమై ఉండడం కుదరకపోవడం' మొదలైన న్యాయాలకి విరుద్ధం అవడంచేత, కపిలస్మృతి గ్రహించతగనిదే అవుతుంది - అనేదే ఆఆక్షేపం. దీనికి సమాధానం ఇలా ఉంటుంది: "***నహి వచనవిరోధే న్యాయః ప్రవర్తతే***" *(వచనముతో విరోధించేటప్పుడు న్యాయం ప్రవర్తించదు)* అనే న్యాయప్రకారం కపిలస్మృతి విరోధించే ఆన్యాయాలు చెల్లనివవడం చేత కపిలస్మృతి గ్రహించవలసినదే అవుతుంది. అందుచేత కపిలస్మృతిప్రకారం '***ప్రధానం జగత్కారణం***' అన్నదే వేదాంతార్థం అని నిర్ణయించడానికి అభ్యంతరం లేదు.

*సి.* *8.* *న్యాయవిరుద్ధస్మృత్యోపబృంహితాన్నిగమాదపి ।*
*దుర్బలస్తద్విరుద్ధస్మృత్యుపబృంహిత ఇత్యతః ॥*
*9.* *శ్రుతిస్తుతోక్త్యాప్తతమమన్వాదిస్మృతిభిః కృతం ।*
*ఉపబృంహణమేవ స్యాత్ గ్రాహ్యం భూయోఽన్యథా మహాన్ ॥*
*10.* *ఆసామనవకాశత్వరూపదోషస్సమాపతేత్ ।*
*న హ్యాసాం సావకాశత్వం భవేద్ధర్మోపబృంహణాత్ ॥*
*11.* *యతస్తేషాం చ ధర్మాణాం పరారాధనరూపతా ।*
*'ఇష్టాపూర్త"మితి శ్రుత్యా 'యజ్ఞైస్త్వ'మితి చ స్మృతేః ॥*
*12.* *జ్ఞాయతేఽతః కాపిలోక్త్యోపబృంహణమసజ్గతం।*
*వేదోపబృంహణం నామ తదుక్తార్థప్రకాశనమ్ ॥*
*13.* *కాపిల్యాస్తద్విరుద్ధత్వాత్ న తత్సంభావనార్హతా ।*
*"ఋషిం ప్రసూత"మిత్యుక్త్యా నైవాప్తమతా భవేత్ ॥*

***8-13 సిద్ధాంతం:*** ఈపూర్వపక్షం తప్పు. మొదటధ్యాయంలో చెప్పిన న్యాయాలకి విరోధించే

కపిలస్మృతితో వేదార్థాన్ని నిర్ణయించడంకంటె ఆ న్యాయాలకి అవిరుద్ధమైన మను మొదలైన స్మృతులతో వేదార్థాన్ని నిర్ణయించడమే సరియైనది. పరిశీలించి చూస్తే, ఇక్కడ న్యాయానికి వచనానికీ విరోధం ఏర్పడలేదు. మన్వాది వచనానికిన్నీ, కపిలవచనానికే విరోధం ఏర్పడింది. కనుక, మొదటధ్యాయంలో చెప్పిన న్యాయాలతో దానిననుసరించిన మన్వాదివచనాలని తీసుకొని వాటితో పొసగని కపిలవచనాన్ని వదిలేయడమే సరియైనది. పైగా, సాంఖ్యమతప్రవర్తకులైన కపిలులకంటే, మనువు మొలైనవారు ఆప్తతములు. *"యద్వై కిఞ్చ మనురవదత్ తద్భేషజమ్" / యజు - అష్ట 3-2-11/ (మనువు చెప్పినది అంతా* మందువంటిది/ *"సహోవాచ వ్యాసః పారాశర్యః" / తై-ఆర 1-9-35/* /పరాశరుల పుత్రులైన వ్యాసులుగదా **చెప్పేరు/** అనిన ప్రకారం మనువు, వ్యాసుడు మొదలైనవారు తత్త్వాన్ని యథాతథంగా సాక్షాత్కరింపజేసుకోవడమే కాకుండా దానిని యథాతథంగా చెప్పినవారు అని వారిమాటలకికూడా వేదంలో గొప్పవిశేషత చెప్పబడింది. కపిలుడి మాటకి ఇలాంటి విశేషత చెప్పబడలేదు. పైగా, కపిలస్మృతి ఒక్కటే ప్రధానకారణవాదాన్ని చేస్తోంది; మనువుది మొదలైన అనేక స్మృతులు బ్రహ్మకారణవాదాన్ని చేస్తున్నాయి. అందుచేత *"భూయసాం స్యాద్బలీయస్త్వమ్"* (ఎక్కువ లెక్క ఉన్నదే అధికబలం కలిగినది) అనే న్యాయంప్రకారంకూడా మనస్మృతి మొదలైనవే స్వీకరించతగినవి. లేనట్లైతే, ఇన్నిస్మృతులు నిష్ఫలమయ్యే గొప్పదోషం ఏర్పడుతుంది. యాగం మొదలైన కర్మలని వివరించడంద్వారా అవి నిష్ఫలం అవుతాయే అని పూర్వపక్షంలో చెప్పినదికూడా తప్పే. *"ఇష్టాపూర్తం బహుధా జాతం జాయమానం విశ్వం బిభర్తి భువనస్య. నాభిః"*(తై. నా. 1-6) (మూడుకాలాలలోనూ చేయబడే యాగాలనే ఇష్టములు, చెరువులు తవ్వించడం మొదలైనవ పూర్తములు, మొదలైన అన్ని ధర్మాలనీ, జగత్కారణుడైన ఈభగవానుడు (ఆరాధ్యుడుగా ఉండి) ఇస్తున్నాడు) మొదలైన శ్రుతులలోనూ, *"యజ్ఞైస్త్వమిజ్యసే నిత్యం సర్వదేవమయాచ్యుత । హవ్యకవ్యభుగేకస్త్వం పితృదేవస్వరూపధృక్॥"*(వి.పు. 5-20-97) (సర్వదేవశరీరియైన అచ్యుతుడా! నీవే అన్ని యజ్ఞములచేతను, ఎల్లప్పుడునూ ఆరాధింపబడుచున్నావు. దేవశరీరియై హవిస్సులనూ, పితృశరీరియై కవ్యములనూ భుజించువాడు నీవే) మొదలైన స్మృతులలోనూ, వెనుక చెప్పిన యజ్ఞాలు పరమాత్మకి ఆరాధనమైఉంటూ పూర్తిని పొందుతున్నాయి అని ఘోషింపబడుతోంది. అందుచేత ఆరాధ్యుడైన పరమపురుషుడిని చెప్పడంలో మన్వాది స్మృతులకి దృష్టిలేదంటే ఆరాధనమైన యజ్ఞాదులని అవి వివరించడం ప్రయోజనంలేకపోయి ఆస్మృతులు పూర్తిగా వృథా అయిపోతాయి. అందుచేత ఈకారణాలవల్ల కపిలస్మృతితో వేదార్థాన్ని వివరించడం తగదు అని నిరూపించడం జరిగింది. పైగా, వేదాన్ని ఉపబృంహణంచెయ్యడం అంటే వేదంలో చెప్పిన అర్థాన్ని వివరించడమే అవుతుంది. అందువలన, చేతనాచేతనాలని శరీరంగా కలిగిన పరమచేతనుడైన నారాయణుడే జగత్కారణం అని ఎన్నోచోట్ల డప్పువాయించిన వేదానికి ప్రత్యక్షంగా విరోధించిన కపిలస్మృతిఅనేది వేదానికి ఉపబృంహణం అవుతుంది అని తలంచడానికి కూడా అవకాశం లేదు. *"ఋషిం ప్రసూతమ్"* (శ్వే. 5-2)అని ఉపనిషత్తులో కపిలుడిని 'ఋషి' (తత్త్వాన్ని తెలిసినవారు) అని అనడమే తప్పిస్తే, మనువు మొదలైనవాళ్ళలా తత్త్వాన్ని యథాతథంగా చెప్పినవారు అని కొండాడలేదు. అందువల్ల వారు మన్వాదులలా ఆప్తతములు కాలేరు.

*సూ ॥ ఇతరేషాం చానుపలబ్ధేః ॥ (2-1-2)*

*14. సాక్షాత్కృతాతీన్ద్రియార్థజాతానామాత్మయోగతః ।*
*వేదాన్తవిద్వరిష్ఠానాం మన్వాదీనాం చ భూయసామ్ ॥*

*15.* *కపిలోక్తప్రకారేణ తత్త్వస్యానుపలబ్ధితః ।*
*ఏతత్స్మృతిర్భ్రాన్తిమూలేత్యనయా నార్థనిర్ణయః ॥*
*॥ ఇతి స్మృత్యధికరణమ్ ॥*

***సూ ॥ ఇతరేషాం చ*** - మనువు మొదలైన స్మృతికర్తలకు, ***అనుపలబ్ధేః*** - (కపిలులకు ఏర్పడిన దృష్టి) ఏర్పడకపోవడంచేత (కపిలస్మృతి వేదోపబృంహణం కాలేదు).

14-15. ఇక "కపిలులు అనేవారు తనయోగమహిమచేత తత్త్వాలని యథాతథంగా సాక్షాత్కరింపజేసుకొని ఉండడంవల్ల వారి స్మృతినే అనుసరించేదాన్ర్తార్థాన్ని నిర్ణయించవలెనా? మనువు మొదలైనవారికి యాగాదికర్మలని చెప్పడంలో యోగాపేక్షలేదే" అనే పూర్వపక్షం ఈసూత్రంలో నిరసించబడుతోంది. మన్వాదులుకూడా యాగాదికర్మలచేత ఆరాధింపబడే పరమాత్మని తమయోగమహిమచేత సాక్షాత్కరించుకొనే ఆతనికి ఆరాధనమైన ధర్మాలని చెప్పేరుగనక, వాళ్ళకికూడా యోగాపేక్షఉండెను. ఈవిధంగా తమయోగమహిమచేత ఇంద్రియాలకి అందని పరమాత్మనిన్నీ, ఆయన ఆరాధనలనీ, సాక్షాత్కరించుకున్నవారవడంచేత వేదాంతరహస్యార్థాలని తెలిసినవారిలో విశేషమైనవారు, అనేకులైన మనువు మొదలైనవారు. కపిలుడు చెప్పినరీతిలో ప్రధానమే జగత్కారణమని సాక్షాత్కరించుకొనక పోవడంవల్ల కపిలస్మృతిఅన్నది భ్రాంతివల్ల ఏర్పడిందిఅని నిశ్చయించి, వేదాంతనిర్ణయంలో అడ్డుకోవడం తగినదే అగును.

స్మృత్యధికరణం పూర్తి అయింది.

## *॥యోగప్రత్యుక్త్యధికరణమ్ ॥ (2-1-2)*

### *సూ ॥ ఏతేన యోగః ప్రత్యుక్తః ॥ (2-1-3)*

*16.* *కపిలోక్తేర్భ్రాన్తిమూలకత్వేపి తదసంభవాత్ ।*
*వేదప్రవక్తృవిధ్యుక్తయోగతన్త్రస్య, తేన వై ॥*
**17.* *వేదోపబృంహణం న్యాయ్యమితి శఙ్కా నిరస్యతే ।*

***ఏతేన=*** (వెనుకటి సూత్రంలో) కపిలస్మృతిని నిరసించినప్రకారంగానే, ***యోగః=*** యోగస్మృతికూడా, ***ప్రత్యుక్తః=*** బదులు చెప్పబడినదైనది.

16-*17. వెనకటి అధికరణంలో కపిలఋషి రచించిన సాంఖ్యస్మృతిఅనేది వేదవిరుద్ధమవడంచేత భ్రాంతిచేత ఏర్పడింది అని నిరూపింపబడింది. "వేదాలన్నింటినీ అనేకులకి చెప్పిన చతుర్ముఖబ్రహ్మవలన రచింపబడినదవడంచేత భ్రాన్తికి అవకాశం లేనటువంటి యోగస్మృతివల్ల వేదార్థమును వివరించుట న్యాయం. అలా వివరించబడినప్పుడు బ్రహ్మం లోకానికి నిమిత్తకారణమాత్రముగాను, మూలప్రకృతే లోకానికి ఉపాదానకారణంగాను ఉన్నది, అనేదానినే వేదార్థమని తేలుతోంది' అనే సందేహం ఈఅధికరణంలో నిరసింపబడుతోంది.

పూ. *17*.* *కృత్స్నవేదప్రవక్త్రైవ యోగస్యాభిహితత్వతః ॥*
*18.* *ఈశాభ్యుపగమాచ్చాపి యోగస్మృత్యార్థనిర్ణయః ।*

17* - 18*. ***పూర్వపక్షం:*** సాంఖ్యస్మృతివలె కాకుండా, అన్ని వేదాలనీ మొదటే వల్లించి ఇతరులచేత వల్లెవేయించినవాడైన బ్రహ్మగారిచేతనే యోగస్మృతిఅనేది రచింపబడింది. పైగా, అందులో సర్వేశ్వరుడున్నూ, అంగీకరించబడ్డాడు. వేదాంతాలలో, మోక్షసాధనంగా చెప్పబడ్డ యోగంకూడా దానిని అంగీకరించింది. కనుక, దాంతో, అర్థనిర్ణయం చెయ్యడం, న్యాయం అవుతుంది. అందువలన, అందులో

చెప్పినప్రకారం, ఈశ్వరుడిని నిమిత్తమాత్రుడనిన్నీ, మూలప్రకృతిని ఉపాదానకారణంగానూ గ్రహించడమే తగిఉన్నది.

సి. 18*. *న్యాయ్యోఽతో వేదవాక్యానాం ప్రధానపరతేత్యసత్ ॥*

19. *కపిలోక్తేర్నిరాసేన యోగతన్త్రం చ వారితం।*
*కపిలస్మృతివద్వేదవిరుద్ధత్వావిశేషతః॥*

20. *అగ్రాహ్యా సర్వథా యోగస్మృతిశ్చ భ్రాన్తిహేతుకా।*
*క్షేత్రజ్ఞత్వాద్విధేర్వక్తుః భ్రమాదిస్సంభవేన్ననుం ॥*

*॥ ఇతి యోగప్రయుక్త్యధికరణమ్ ॥*

18*-20 ***సిద్ధాంతం:*** కపిలస్మృతిని నిరసించడానికి చెప్పిన కారణాలే యోగస్మృతి విషయంలోనూ ఉన్నవవడంచేత అదికూడా నిరసించవలసినదే. కపిలస్మృతి వలెనే, యోగస్మృతికూడా వేదానికి వ్యతిరేకంగానే అర్థాలని చెప్తుంది. సూచకంగా - లోకానికి నిమిత్తోపాదానకారణాలు రెండూగానూ, అవిరెండూకూడా సర్వేశ్వరుడే అని వేదాలు ఘోషిస్తూంటే, యోగస్మృతి అనేది వాటికి(ఆవేదాలకి) భిన్నంగా సర్వేశ్వరుడు నిమిత్తమాత్రుడని చెప్పుతోంది. అందుచేత సర్వేశ్వరుడిని అంగీకరిస్తూ, యథాతథంగా అంగీకరించలేదుగనుక ఉపయోగం లేకుండాపోయింది. మోక్షసాధనమైన యోగాన్ని అంగీకరించినప్పటికీ, ఆయోగానికి విషయమైన బ్రహ్మమును లోకానికి ఉపాదానకారణంగా అంగీకరించకపోవడంచేతనున్నూ, జీవాత్మని బ్రహ్మాత్మకంగా అంగీకరించకపోయినందువల్లనూ, యోగాన్ని చెప్పినదికూడా ఉపయోగం లేనిదే అయింది. నాలుగు వేదాలనీ చెప్పినవాడే అయినప్పటికీ, బ్రహ్మకూడా అంధకారాన్నిచ్చే, భ్రాన్తి, మరుపులకి వశపడ్డ ఒక జీవుడే. ఆతనికికూడా, రజస్తమోగుణాలు ఉంటాయి. త్రిగుణాత్మకుడవడం చేతనే ఒక్కొక్కగుణమూ మిక్కిలిగా ఉండే ఒక్కొక్కకాలంలో ఒక్కొక్కవిధమైన పురాణాలని ఆ.న ఉపదేశించేడని పురాణాలలోనే చెప్పబడి ఉండడాన్ని చూస్తున్నాం. అటువంటి రాజసతామసపురాణాలవంటివే ఈయోగస్మృతికూడా వేదవిరుద్ధమైఉండడంచేత ఆచతుర్ముఖుడి భ్రాన్తిచేత ఏర్పడిఉండవలె. అందువలన, కపిలస్మృతిలాగనే, యోగస్మృతికూడా, అన్నివిధాలుగానూ, వదలవలసినదే అవుతుంది.

యోగప్రత్యుక్త్యధికరణము పూర్తి అయినది.

## *॥ విలక్షణత్వాధికరణమ్ ॥ (2-1-3)*

### *సూ - ॥ విలక్షణత్వాదస్య తథాత్వం చ శబ్దాత్ ॥ (2-1-4)*

న = లోకము బ్రహ్మముయొక్క కార్యము గానేరదు, ***అస్య విలక్షణత్వాత్*** = ఈలోకము బ్రహ్మముకంటెను చాలా వేరైనదగుటచే, ***తథాత్వం*** = ఇట్లు వేరుగానుండుట, ***శబ్దాత్ చ*** = శాస్త్రప్రమాణముచేతనూ, తెలియబడుచున్నది.

21. *మన్వాదిస్మృతయస్తర్కవిరుద్ధత్వాత్సుదుర్బలాః।*
*తర్కానుసారిణీ గ్రాహ్యా కాపిలీత్యేదస్యతే ॥*

21.* ఈఅధికరణంలో ప్రధానకారణవాది తర్కాన్ని బలంగా తీసుకొని ఆక్షేపించుచున్నాడు. "మను మొదలైన స్మృతులు తర్కానికి వ్యతిరేకమైనవిగనుక, బాగా దుర్బలమై ఉంటాయి. అందుచేత, తర్కాన్ని అనుసరించే కపిలస్మృతియే గ్రహించవలసినది' అనేది అతని వాదం.

పూ. 22. *ఈశాద్వికారిత్వాజ్ఞత్వాపుమర్థాశ్రయతాదిభిః।*

*విలక్షణత్వాజ్జగతః న భవేత్ బ్రహ్మకార్యతా॥*

**23.** *వైలక్షణ్యంచ "విజ్ఞానఞ్చే"తి వేదాత్ప్రతీయతే ।*

*అతో జగత్కారణం తత్ ప్రధానం స్యాత్సలక్షణమ్ ॥*

22-23. **పూర్వపక్షం:** బ్రహ్మమునకు లోకం కార్యం (ఉపాదేయం) అని చెప్పడం తప్పు. బ్రహ్మముకంటెను చాలా భిన్నమైన ఈలోకం దానికి కార్యంగా ఉండలేదుగదా! ఈలోకం మార్పు ఉన్నది. బ్రహ్మం వికారంలేనిదని చెప్పబడుతోంది. ఈలోకం జ్ఞానం లేనిది; బ్రహ్మం సర్వజ్ఞం అని చెప్పబడుతోంది. ఈలోకం అపురుషార్థమైన దుఃఖం మొదలైనవాటికి స్థానం అయిఉన్నది. బ్రహ్మం పరమపురుషార్థమైన ఆనందానికి ఒకే ఒకస్థలం అయి ఉన్నదని అంగీకరించబడుతోంది. ఇటువంటి అనేక భిన్నత్వాలుండడంచేత లోకం బ్రహ్మనికి కార్యమై ఉండడానికి వీలులేదు. లోకంలో మట్టి మొదలైన (ఉపాదాన) కారణాలున్నూ, చట్టి మొదలైన కార్యములు(ఉపాదేయములు)న్ను, భేదత్వం లేకనే ఒకే లక్షణం కలిగినవై ఉండడాన్ని మనం చూస్తున్నాం. అంటే చట్టిగూడా, నిజంగా మట్టిరూపంగానే ఉండడాన్ని చూస్తున్నాం. ఇక్కడో అంటే బ్రహ్మం జ్ఞానం కలిగినదై ఆనందంకోసమే స్థానమై ఉన్నది; చేతనాచేతనాత్మకమైన లోకం దుఃఖానకి స్థానమై ఉన్నదిగానూ, జ్ఞానము లేనిదిగానూ, ఉన్నది. అందుచేత, లోకం బ్రహ్మనికి కారణంఅవడానికి వీలులేదు. లోకం బ్రహ్మంకంటె, చాలా వేరైనదిగా ఉన్నది అనే ఈవిషయం ప్రత్యక్షంచేతనూ, అనుమానంచేతా, తెలుస్తోంది. *"**విజ్ఞానంచ అవిజ్ఞానంచ**"* (తై. ఆనం. 3) (జ్ఞానమున్న బ్రహ్మమున్నూ, జ్ఞానం లేని లోకమున్నూ) మొదలైన శ్రుతులున్నూ, ఈభేదాన్ని చూపిస్తున్నాయి. అందుచేత, లోకంతో భేదంలేకుండా, ఒకే లక్షణంకలిగిన మూలప్రకృతే జగత్కారణమై ఉండతగినది.

**24.** *"తం పృథివ్యబ్రవీత్, ఆప" ఇత్యాది శ్రుతివాక్యతః ।*

*పృథివ్యాదేరపి స్పష్టం జ్ఞానయోగోఽవసీయతే ॥*

**25.** *తస్మాన్న జగతో బ్రహ్మవైలక్షణ్యం భవేదితి ।*

*ఆక్షేపపరిహారాయ పఠ్యతే సూత్రముత్తరమ్॥*

24- *25. **పూర్వపక్షంమీద ఒక ఆక్షేపం.** - బ్రహ్మంకంటెను, లోకం విలక్షణమైనదవడంచేత లోకానికి బ్రహ్మం కారణంకాలేదు అని చెప్పడం తప్పు. *"తం పృథివ్యబ్రవీత్"* ***(యజు - కా 5-5-2) ( ఆతనిని గురించి భూమి చెప్పెను)*** *"ఆపో వా అకామయన్త"* ***(యజు- అష్టకం 3-1-5) (జలములు సంకల్పించెను)*** మొదలైన వేదవాక్యాలవల్ల భూమి, జలం మొదలైన వస్తువులకిన్నీ, జ్ఞానం ఉన్నదని తెలుస్తోంది. అందుచేత జ్ఞానం ఉన్న లోకం జ్ఞానమున్న బ్రహ్మంకంటే విలక్షణమైనదికాదుగనుక లోకం బ్రహ్మముయొక్క కార్యం అవడానికి అభ్యంతరం లేదుగదా!

### *పూ-సూ - ॥ అభిమానివ్యపదేశస్తు విశేషానుగతిభ్యామ్ ॥ (2-1-5)

***అభిమాని వ్యపదేశః తు:*** ('భూమి చెప్పింది' మొదలైన చోట్ల భూమి మొదలైనవాటి) అభిమానిదేవతలనే చెప్తోంది; ***విశేషానుగతిభ్యాం***: (భూమి మొదలైనవాటిని దేవతాశబ్దంచేత) విశేషించి ఉండుటచేతనూ, (అగ్ని మొదలైనవి వాక్ మొదలైనవాటిని) అనుప్రవేశించినదిగా చెప్పుటచేతను (ఇది తెలుస్తోంది)

**26.** *ధీకార్యవ్యపదేశోఽయం "తం పృథివ్యబ్రవీది"తి ।*

*తత్తత్పదార్థాభిమానిదేవతావిషయో మతః॥*

**27.** *"హన్తాహ"మితిపృథ్వ్యాదేర్దేవతేతి విశేషణాత్ ।*
*"అగ్నిర్వాగి"తి వాగాదావగ్న్యాదేశ్చానువేశనాత్ ॥*

**28.** *బ్రహ్మసాలక్షణ్యమస్య జగతోఽతో న విద్యతే ।*
*ప్రధానోపాదానకత్వమతోఽస్త్వాగమసంమతమ్॥*

26-28. పూర్వపక్షం: వెనుకచెప్పిన ఆక్షేపం తగిలేదు. *"తం పృథివ్యబ్రవీత్"* (యజు - కా 5-5-2) {వానిని గురించి భూమి చెప్పెను.} మొదలైన శ్రుతివాక్యాలలో భూమిమొదలైనవాటికి జ్ఞానకార్యమైన వాక్కు మొదలైనవాటిని దేవతల వాక్కులు మొలైనవాటినే సూచించుచున్నది. వేరువేదవాక్యాలలో ఈభూమి మొదలైనవాటిని దేవతలు అని విశేషించిచెప్పడంవల్లనూ, ఈవిషయం స్పష్టమౌతోంది. *"హన్తాహమిమాస్తిస్రో దేవతాః .... అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి"* **(ఛాం. 6-3-2) (**అగ్ని, జలము, భూమి అనబడే ఈముగ్గురు దేవతలను ..... అనుప్రవేశముచేసి,నామరూపవ్యాకరణం చేయబడినవి) అని భూమి మొదలైనవాటిని దేవతలుగా ఒక ఉపనిషద్వాక్యం చెప్తోంది. *"అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్"* (ఐతరేయ 2-4) (అగ్ని అనునది వాక్కు అయి, ముఖములో ప్రవేశించెను) అని మరియొక వేదవాక్యం అగ్ని మొదలైనవాటికి వాక్కు మొదలైన ఇంద్రియాలలో అనుప్రవేశాన్ని చెప్పుతోంది. ఈవిధంగా దేవతలుగా విశేషించి ఉండడంచేతనూ, అనుప్రవేశాన్ని చెప్పడం చేతనూ, భూమి, అగ్ని మొదలైన వేదశబ్దాలు భూమి, అగ్ని మొదలైన శబ్దాలచేత లోకంలో అలవాటుగా చెప్పబడే అచేతనవస్తువుల అభిమానిదేవతలనే సూచిస్తున్నాయి అని తెలుస్తోంది. అందువలన భూమి, మొదలైనవాటికిన్నీ జ్ఞానం ఉండడంచేత జ్ఞానండున్న లోకం, జ్ఞానండున్న బ్రహ్మంకంటే విలక్షణమైనది కాకపోవడంచేత లోకం బ్రహ్మంయొక్క కార్యంగా ఉండడానికి అభ్యంతరం లేదనే ఆక్షేపం నిలవదు. అందువలన వెనకచెప్పిన బ్రహ్మంకంటేలోకం విలక్షణంగా ఉండడంచేత కపిలస్మృతిలో చెప్పినట్టుగామూలప్రకృతే లోకానికి ఉపాదానకారణం అవుతుంది.

### *సి-సూ - ॥ దృశ్యతే తు ॥ (2-1-6)*

***దృశ్యతే తు:*** (ఈగ మొదలైనవాటినుండి, చాలాభిన్నమైన పురుగూ మొదలైనవి ఉండడం అనేది) కనబడుతోంది; (అందుచేత బ్రహ్మంనుండి చాలాభిన్నవిధమైన లోకం సృష్టింపబడంలో తప్పేమీ లేదు).

**29.** *అత్రోచ్యతే మాక్షికాదేః క్రిమ్యాద్యుత్పత్తిదర్శనాత్ ।*
*కార్యకారణభావోఽస్తి సువిలక్షణయోరపి ॥*

29. సిద్ధాంతం: వెనకటి రెండు సూత్రాలలోనూ, వచ్చిన పూర్వపక్షం తప్పు. ఈగ మొదలైనవాటిలోంచి చాలాభిన్నవిధమైన పురుగు మొదలైనవి సృష్టించబడడం చూస్తున్నాంగనుక బ్రహ్మంనుంచి చాలాభిన్నవిధమైనదిగా అంగీకరించినా లోకం సృష్టింపబడడంలో* లోటేమీలేదు.

*(నిజంగా జగద్విశిష్టబ్రహ్మన్నే కారణంగానూ, కార్యంగానూ, అంగీకరించడంవల్ల ఇక్కడ కార్య కారణాలమధ్య సాలక్షణ్యం ఉన్నదే తప్ప వైలక్షణ్యం లేదనే సిద్ధాంతి భావం. ఇది తర్వాత స్పష్టం అవుతుంది.)

### *సి-సూ - ॥ అసదితి చేన్న ప్రతిషేధమాత్రత్వాత్ ॥ 2-1-7 ॥*

***అసత్ ఇతి చేత్:*** (వెనుకచెప్పినప్రకారము అంగీకరించినచో కార్యము కారణమందు) లేకుండాపోయినదే అనినచో, ***న:*** లేకుండపోదు. ***ప్రతిషేధమాత్రత్వాత్:*** (కార్యకారణాలు) ఒకేవిధముగానుండవలెను అనెడి నియమమునుమాత్రము నిరసించుచున్నాము; (కార్యకారణములు

ఒకేవస్తువు అనుదానినికూడ నిరసించలేదు)

*30. కారణాత్ యది కార్యస్య వైలక్షణ్యమిహేష్యతే ।*
*కారణే తర్హి కార్య న సదిత్యసత ఉద్భవః ॥*

*31. ప్రసజేదితి చేతన్న కార్యకారణయోర్మిథః ।*
*సలక్షణత్వనియమమాత్రస్య ప్రతిషేధతః ॥*

30-*31. వెనుకటి సూత్రమందు చెప్పినట్లు కారణంకంటె కార్యం చాలా భిన్నమైనది అని అంగీకరిస్తే, కారణంలో కార్యజాతం లేదు అని అవుతుంది. అలా ఐనట్లైతే లేనివస్తువు కొత్తగా సృష్టింపబడింది అని చెప్పే అసత్కార్యవాదాన్ని ఒప్పుకొన్నట్లవుతుందే! ఇది ఎలా సాధ్యం?

*32. తయోరేకద్రవ్యతా తు స్వీకృతైవైకమేవ తత్ ।*
*కారణం కార్యతాం ప్రాప్తం సలక్షణవిలక్షణే॥*

*33. అవస్థే భజతే తస్మాత్ నియమోऽత్ర న విద్యతే ।*
*అతోऽత్ర వైలక్షణ్యేపి బ్రహ్మకారణకం జగత్ ॥*

*31-33 ***సిద్ధాంతం***: ఈఆక్షేపం రావడానికి అవకాశం లేదు. వెనకటి సూత్రంలో కార్యం, కారణం ఒకే లక్షణాన్ని కలిగిఉండాలని అనే నియమాన్ని నిరసించడం జరిగింది. కార్యకారణాలు రెండూ ఒకే ద్రవ్యం అన్నది నిరసింపబడలేదు. అంగీకరించబడింది. ఒకటైన కారణమే కార్యస్థితిని పొందుతుంది. మట్టినించి కుండ తయారైందన్నట్లే, కొన్నిసమయాలలో కార్యకారణాలు ఒకే లక్షణాన్ని కలిగున్నవిగా ఉంటాయి. ఈగలోంచి పురుగు పుట్టినట్లే కొన్నిసమయాలలో, అవి వేరువేరు లక్షణాలనికలగిఉండడం జరుగుతుంది. దీనిలో ఒక నిర్బంధం లేదు. కారణమైనది సలక్షణంగానో, విలక్షణంగానో ఉన్న కార్యస్థితిని పొందుతుంది. ఈరెండుచోట్లాకూడా, కార్యకారణాలు ఒకే ద్రవ్యం అనేది దాచబడలేదు. దార్ష్టాంతికమైన జగత్తు, బ్రహ్మముల విషయంలోకూడా లోకం, బ్రహ్మం అనే కార్యకారణాలు ఒకే ద్రవ్యం అనే నియమానికి భంగం లేదు. అందుచేత, జగత్తు, బ్రహ్మం వేరైన లక్షణాలతో ఉన్నవని అంగీకరించినా, అవి, కార్యకారణాలుగా ఉండడానికి లోటులేదు.

## *పూ-సూ - ॥ అపీతౌ తద్వత్ప్రసఙ్గాదసమఞ్జసమ్ ॥ (2-1-8)*

***అపీతౌ:***ప్రళయమందు; ***తద్వత్ ప్రసఙ్గాత్:*** లోకమువలెనే (పరమాత్మకినీ, వికారమును పొందుట మొదలైన దోషములు) ఏర్పడుటచేత, ***అసమఞ్జసమ్:*** (వేదాన్తవాక్యములు) కుదరనివాక్యములై ఉండును.

*34. జగతః కారణే బ్రహ్మణ్యపీత్యాదౌ పరాత్మనః ।*
*జగద్వచ్చ వికారిత్వాద్యనిష్టః ప్రసజేత్తతః ॥*

*35. భవేద్వేదాన్తవాక్యానామసమఞ్జసతేతి చేత్ ।*

34-*35. ***పూర్వపక్షం:*** సూత్రంలో అపీతి అని అప్యయమైన లయాన్ని చెప్పడం సృష్టిస్థితులకి ఉపలక్షణం. వెనుకటి సూత్రంలో చెప్పినప్రకారం, కారణమైన బ్రహ్మమున్నూ, కార్యమైన లోకమున్నూ,ఒకే ద్రవ్యం అని తీసుకున్నట్లైతే, ప్రళయకాలం మొదలైనవాటిలో కార్యమైన లోకమే కారణంమైన బ్రహ్మమైనందువల్ల, కార్యమైన ఘటంలో ఉండే మట్టిగాఉండే స్వభావం మొదలైనవి కారణమైన మట్టిగడ్డలోకూడా ఉండినట్లే, కార్యమైన చేతనాచేతనాత్మకమైనలోకంలో ఉండే వికారాన్ని పొందినదవడం,

జ్ఞానంలేనిదిగా ఉండడం, కర్మానికి వశపడేదిగా ఉండడం మొదలైన స్వభావగుణాలు కారణమైన బ్రహ్మానికి కూడా ఏర్పడవలసివస్తుంది. వేదాన్తవాక్యాలుమాత్రం ఈవికారిత్వం మొదలైన స్వభావాలు బ్రహ్మానికి లేవని చెప్తున్నాయి. అందువల్ల ఇలా వెనుకకి తరువాత వ్యతిరేకంగా చెప్పడంచేత వేదాన్తవాక్యాలన్నీ కుదరనివైపోతాయి. ఇలా కాకుండా ఉండడానికి జగద్బ్రహ్మాలు, ఒకే ద్రవ్యంకాదు అనే అంగీకరించాల్సి వస్తుంది. అందువలన బ్రహ్మం లోకానికి ఉపాదానకారణం అవడానికి వీలులేదు. మూలప్రకృతే లోకానికి ఉపాదానకారణం ఔతుంది.

### *సి-సూ - // నతు దృష్టాన్తభావాత్ (2-1-9)*

***న తు:*** (బ్రహ్మంలో లోకంలోనున్న దోషాలు ఏర్పడనివి అవడంచేత) వేదాంతవాక్యాలు కుదర నివిగా ఉండశక్యంగాదు; ***దృష్టాన్తభావాత్:*** దృష్టాన్తముగానుండుటచేత.

***35**** *నైతద్యుక్తం బ్రహ్మణోస్య చిదచిద్వస్తుదేహినః//*

***36.*** *కార్యకారణభావే చాసంస్పర్శే గుణదోషయోః/*
*నిదర్శనస్య సద్భావాత్ యథా సీవస్య దేహినః//*

***37.*** *బాల్యయౌవనవృద్ధత్వధర్మాస్సన్త్యేవ విగ్రహే/*
*ఆత్మన్యేవ జ్ఞానసుఖాదీని తద్వత్పరాత్మనః //*

***38.*** *శరీరభూతచిదచిద్గతా దోషా అధీముఖాః /*
*సార్వజ్ఞ్యసత్యసఙ్కల్పతాదయశ్చ పరాత్మని//*

35*-38. ***సిద్ధాంతం:*** ఈపూర్వపక్షం తప్పు. కేవలబ్రహ్మస్వరూపం లోకంగా పరిణమించేదిగా మనం అంగీకరించలేదు. కారణస్థితిలో సూక్ష్మచేతనాచేతనాలతో ఉన్న బ్రహ్మమే కార్యస్థితిలో స్థూలచేతనా చేతనాలతో ఉన్నదిగా పరిణమించేదిగా ఒప్పుకొన్నాం. చేతనాచేతనవస్తువులని శరీరంగా స్వీకరించిన బ్రహ్మం కార్యంగానూ,కారణంగానూ అయినా, శరీరం ఐన చేతనాచేతనాలలోఉన్న దోషాలు బ్రహ్మంలో ఉండలేవనడానికిన్నీ, దృష్టాంతం ఉన్నది. అంటే, ప్రాకృతశరీరం కలిగిన జీవుడికి బాల్యం, యౌవనం, ముసలితనం మొదలైన స్థితులు ఏర్పడినప్పటికీ, బాల్యం మొదలైన స్థితులు శరీరానికే ఉండేవిగానూ, జ్ఞానం, సుఖం మొదలైన స్వభావాలు ఆత్మకే ఉండడాన్ని చూస్తున్నాం. అదేవిధంగా, పరమాత్మశరీరమైన చేతనాచేతనాలకే అజ్ఞానం మొదలైన దోషాలు ఉండున్నాయనిన్నీ, సర్వజ్ఞత్వం, సత్యసంకల్పత్వం మొదలైన గుణాలు శరీరియైన పరమాత్మకే ఉంటాయి అని అంగీకరించడానికి ఏమీ అభ్యంతరం లేదు. అందువల్ల ఇలా బ్రహ్మకి లోకానికి ఉన్న దోషాలు ఉండకపోవడంచేత విశిష్టబ్రహ్మమే ఉపాదానకారణం అవడానికి అభ్యంతరం లేదు.

### *సి-సూ - // స్వపక్షదోషాచ్చ // (2-1-10)*

***స్వపక్షదోషాత్ చ:*** సాంఖ్యపక్షంలో దోషం ఉండడంచేత (బ్రహ్మకారణవాదమే స్వీకరించతగినది).

***39.*** *బ్రహ్మకారణవాదస్య సంగ్రహోస్య న కేవలం/*
*నిర్దుష్టత్వాత్ ప్రధానస్య హేతుత్వే దోషతోపిహి //*

***40.*** *ప్రధానహేతువాదే హి పుంసో నిర్వికృతేస్సదా/*
*అజాసాన్నిధ్యతోన్యోన్యం ధర్మాధ్యాసో న సంభవేత్//*

***41.*** *అధ్యాతో హ్యన్యధర్మానుసంధానం స్యాన్యవస్తుని/*

*నిర్వికారస్య సోఽధ్యాసో న భవేదచితో భృశమ్ ॥*

39-42. ***సిద్ధాంతం:*** బ్రహ్మకారణవాదంలో దోషంలేదుగనకనే అదే స్వీకరించతగినది అని ఇంతవరకూ స్థాపించబడింది. ప్రధానకారణవాదంలో దోషం ఉన్నందువల్ల, దానిని వదిలేసి బ్రహ్మకారణ వాదమే స్వీకరించతగినది అని ఈసూత్రంలో స్థాపించబడుతోంది. ప్రధానకారణవాదులైన సాంఖ్యులు మార్పులేనివాడైన పురుషుడికినీ, మూలప్రకృతికినీ కలిగే సన్నిధిచేత (దగ్గరగా ఉండడంచేత) ప్రకృతిలో ఉన్న కర్తృత్వం పురుషుడికీ, పురుషుడనే చైతన్యం ప్రకృతిలోనూ అధ్యసింపబడినదిగా (తెచ్చిపెట్టుకొని నదిగా) స్వీకరిస్తున్నారు. ఇది కుదరదు. అధ్యాసం అంటే ఒకవస్తువులో వేరువస్తువుతాలూకు స్వభావాన్ని అనుసంధానంచేయడం. మార్పులేనివాడైన పురుషుడికి అటువంటి అనుసంధానం అనేది కుదరదుగనుక అధ్యాసం కుదరదు. జ్ఞానంలేనిదిగనుక మూలప్రకృతికి ఆఅనుసంధానం అసలే కుదరదు. అందుచేత ఈఅధ్యాసాన్ని మూలంగాతీసుకున్న జగత్సృష్టి మొదలైన ప్రవృత్తులు కొంచెంకూడా తగినవికావు. కనుక ఈసాంఖ్యపక్షం ఏమీ కుదరకుండా ఉండినదవడంచేత దానిని వదిలేసి బ్రహ్మకారణవాదాన్నే స్వీకరించవలెను.

*సి.సూ. ॥ తర్కాప్రతిష్ఠానాదపి ॥ (2-1-11)*

***తర్కాప్రతిష్ఠానాత్ అపి:*** తర్కం ఒకస్థితిలో నిలవలేనిదిగనుకనూ, (శ్రుతులనించి స్పష్టమైన బ్రహ్మకారణవాదమే స్వీకరించతగినది)

***43.*** *అస్యాప్రతిష్ఠితత్వాచ్చ తర్కస్యాన్యహతస్య చ।*
*ఏతన్మూలస్తన్త్రవాదః త్యాజ్యః ప్రామాణికైర్భృశమ్॥*

43. ***సిద్ధాంతం:*** ఒక తర్కం మరొక తర్కంచేత అనుసరిస్తున్నదిగా ఉండడం మనం లోకంలో చూస్తున్నాంగనుక, కేవలతర్కాన్ని అనుసరిస్తున్న సాంఖ్యమతం వదలతగినదే అగును. తర్కాన్ని సాయంగా తీసుకున్న వేదాన్ని ఆధారంగా తీసుకున్న బ్రహ్మకారణవాదమే స్వీకరించతగినది అవుతుంది.

*ఆర్షం ధర్మోపదేశం చ వేదశాస్త్రావిరోధినా । యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద నేతరః ॥*

(మను 12-106)

(శ్రుతిస్మృతులని వాటికి వ్యతిరేకంగాని తర్కంతో అర్థంతీసుకున్నవాడే ధర్మాన్ని తెలిసినవాడు) అని మనువుకూడా చెప్పేరుగదా!

*సి.సూ. ॥అన్యథానుమేయమితి చేదేవమప్యనిర్మోక్షప్రసఙ్గః ॥ (2-1-12)*

***అన్యథా:*** వేరువిథముగ; ***అనుమేయమ్:*** (ప్రధానముము జగత్కారణముగ) అనుమానము చేయవలసినది; ***ఇతి చేత్:*** అనినచో; ***ఏవమ్ అపి:*** ఈవిధముగ అనుమానము చేయుటచే; (తర్కము ఒకస్థితిలో నుండదు అని వెనుకటి సూత్రమందు చెప్పిన దోషమునుండియు) విడుదలలేకుండ పోవును.

***44.*** *క్లుప్తప్రకారాదితరప్రకారేణానుమానికం।*
*అనుమేయం తదితి చేత్ ఏవమప్యుక్తదోషతః ॥*

*44. ***పూర్వపక్షం:*** ఇంతవరకూ మూలప్రకృతిని జగత్కారణంగా స్థాపించడానికి విపరీతార్థమైన అనుమానాలు నిలవలేకపోయినా, మేధావిలాసంచేత, నిలిచేటటువంటి అనుమానాన్ని మరోవిధంగా పట్టుకొని, దానిమూలంగా, ప్రధానమే జగత్కారణమని స్థాపించవీలుకాక, తర్కాన్ని అనుసరించిన సాంఖ్య మతం స్వీకరించదగినదే అని నిశ్చయించడానికి అభ్యంతరం లేదు.

*45. అనిర్మోక్షప్రసఙ్గశ్చ దుర్వారో భవతి ధ్రువం।*
*త్వదుక్తతర్కాదధికకుతర్కస్యాపి సంభవాత్ ॥*
*॥ఇతి విలక్షణత్వాధికరణమ్॥*

***44*-45. సిద్ధాంతం***: ఈపూర్వపక్షము దోషభూయిష్ఠము. దీంట్లో చెప్పినప్రకారం, మరోమార్గంలో ఒక అనుమానాన్ని పట్టుకున్నా, ఈపూర్వపక్షికంటే, కుతర్కంచెయ్యగలిగినవాడొకడు పుట్టి, ఈతర్కాన్నికూడా, నిలపలేకపోవడంచేత, 'తర్కం నిలవలేకపోయింది' అని వెనకటిసూత్రంలో చెప్పిన దోషంనుంచి, బైటపడలేకపోతుందని నిశ్చయమవడంచేత కేవలతర్కాన్ని అనుసరించిన ప్రధానకారణ వాదం వదలవలసినదే.

విలక్షణత్వాధికరణం పూర్తి అయినది.

## *॥ శిష్టాపరిగ్రహాధికరణమ్ ॥ (2-1-4)*

### *సి.సూ. ॥ ఏతేన శిష్టాపరిగ్రహా అపి వ్యాఖ్యాతాః ॥ (2-1-13)*

***ఏతేన:*** ఇంతమాత్రముచేత; ***శిష్టాపరిగ్రహాః అపి:*** వేదముచేత ఆదరింపబడని (నైయాయికం మొదలైన) ఇతర (పరమాణుకారణవాద) పక్షాలున్నూ, ***వ్యాఖ్యాతాః:*** నిరసింబడినవి అని తెలియదగినది.

*46. బ్రహ్మకారణతావాదోచాల్యోప్యస్థిరతర్కతః ।*
*అణుకారణతర్కైస్స చాల్య ఇత్యేతదస్యతే ॥*

*46. ***పూర్వపక్షం:*** వెనుకచెప్పినప్రకారం ప్రధానకారణవాదియొక్క నిలబడని తర్కాలచేత బ్రహ్మ కారణవాదాన్ని కదల్చలేకపోయినా, పరమాణుకారణవాదుల దృఢమైనతర్కాలతో దాన్ని ఖండించవచ్చే! ప్రధానకారణవాదంలాగే పరమాణుకారణవాదాన్ని ఒకమతంతోచేర్చినవాళ్ళే స్థిరంగా ఉండలేకపోతు న్నారు, నైయాయికులు, వైశేషికులు, జైనులు, శైవులు మొదలైనఅనేకమతాలకి చెందినవాళ్ళు తమతమ తర్కాలతో పరమాణువే ఉపాదానకారణం అనే ఒకేనిశ్చయానికి వచ్చేరు. అందుచేత, పరమాణుకారణవాద విషయంలో 'తర్కం స్థిరంగా నిలవదు' అనే ఏర్పడే అవకాశం లేదు. కనుక, పరమాణుకారణవాదమే స్వీకరించతగినది.

*47. సాఙ్ఖ్యతన్త్రనిరాసేన శిష్టా వేదాపరిగ్రహాః ।*
*నిరస్తాః కణభక్షాదిస్మృతయశ్చాప్రతిష్ఠితాః॥*

*48. శఙ్కాధికాణువాదస్య న దుష్టత్వం బహుగ్రహాత్।*
*నిస్సారస్తర్కమూలత్వాదస్యాప్యస్థిరతేతి చ॥*
*॥ ఇతి శిష్టాపరిగ్రహాధికరణమ్ ॥*

46*-48. ***సిద్ధాంతం:*** ఈపూర్వపక్షం తప్పు. వేదంచేత ఆదరింపబడని సాంఖ్యమతాన్ని నిరసించిన కారణాలతోటే అవైదికులైన నైయాయికులూ మొదలైన పరమాణుకారణవాదుల పక్షాన్నికూడా, నిరసింపబడినవే అవుతాయి. కణాదులు, అక్షపాదులు, శమణులు, శైవులు మొదలైన అనేకమతాలకి చెందినవారు తమతమ తర్కాలతో పరమాణువే జగత్కారణం అని స్థాపించాలనుకున్నవాళ్ళవడం చేతనే 'తర్కం స్థిరంగా నిలిచేదిగాదు' అని అనేకవిధములైన ఆశంకలు లేవనెత్తేందుకు పరిహారంగా అనేకులు అనేకతర్కాలవల్ల పరమాణుకారణవాదాన్ని చేసినప్పటికిన్నీ, ఆతర్కాలుకూడా మరికొన్ని తర్కాలచేత వెనుకచెప్పిన మార్గాలలో ఖండింపబడి నవవడంచేత ఆతర్కాలుకూడా నిలవలేకపోవడానికి అవకాశం

ఉన్నది. పైగా నైయాయికులు మొదలైనవాళ్ళు 'పరమాణువు జగత్కారణము' అనే ఒకవిషయంలో ఒక్కత్రాటిమీద నుంచున్నవాళ్ళయినా, పరమాణుస్వరూపం ఎటువంటిది అని నిర్ణయించడంలో వాళ్ళ తర్కాలు నిలపడకపోవడాన్నే చూస్తున్నాం. పరమాణువుని కొంతమంది శూన్యం అంటారు; కొంతమంది అది జ్ఞానస్వరూపం అన్నారు, మరికొంతమంది అది అర్థస్వరూపం అన్నారు. ఇంకాకొంతమంది అది క్షణికం అన్నారు. మరోకొంతమంది అది నిత్యమైనదన్నారు. కొంతమంది అది ఒకేవిధంగా ఉండేది అన్నారు. మరికొంతమంది అనేకవిధాలుగా ఉంటుందన్నారు. కొంతమంది అది సత్యం అన్నారు మరికొంతమంది అది అసత్యమైనదన్నారు. ఈవిధంగా పరమాణుస్వరూపవిషయంలో వాళ్ళ తర్కాలు నిలబడలేకపోవడాన్ని చూడడంచేతనున్నూ, సాంఖ్యమతంలాగే పరమాణుకారణవాదంకూడా, వేదం చేత ఆదరింపబడినది కాకపోవడంచేతనూ, కేవలతర్కాన్ననుసరించినదవడంచేతనూ, సాంఖ్యమతం ఎలా నిరసింపబడిదో, ఆమార్గంలోనే ఈమతాలుకూడా, నిరసింపబడవలసినవే అని తెలుసుకోవలెను. అందువలన, శిష్టాలై - వెనక నిరసింపబడిన సాంఖ్యమతంకంటేకూడా, వేరైనవై, అపరిగ్రహాలైన (సాంఖ్యమతంలాగే) వేదవైదికులచేత పరిగ్రహింపబడని పరమాణుకారణవాదాన్ని చేసే మతాలున్నూ, వెనక చెప్పిన 'తర్కం నిలవదు' మొదలైన కారణాలచేతనే నిరసింపబడింది.

శిష్టాపరిగ్రహాధికరణం పూర్తి అయినది.

## // భోక్త్రాపత్త్యధికరణమ్ // (2-1-5)

### సి.సూ. // భోక్త్రాపత్తేరవిభాగశ్చేత్స్యాల్లోకవత్ // (2-1-14)

***భోక్త్రాపత్తేః*** - (బ్రహ్మము చేతనాచేతనములను శరీరంగా కలిగినది అని ఒప్పుకున్నందువల్ల, శరీరంగల జీవుడిలా శరీరంగల బ్రహ్మంకూడా) సుఖదుఃఖానుభవంగలది అని అవుతుంది గనుక, ***అవిభాగః చేత్:*** - (జీవుడికిన్నీ, బ్రహ్మానికిన్నీ) భేదంలేకపోతుందంటే, ***లోకవత్ స్యాత్:*** లోకంలోవలె (రాజూ, ప్రజలూ లాగ ఇద్దరూ శరీరంతో ఉన్నవాళ్లైనప్పటికిన్నీ, రాజుగారి ఆజ్ఞని మీరినందువల్లకలిగిన దుఃఖానుభవం పరతంత్రుడైన జీవుడికేగాని స్వతంత్రుడైన రాజుకు కలుగదు), ఇక్కడకూడా, (పరతంత్రుడైన జీవుడికంటే, స్వతంత్రుడైన పరమాత్మకిన్నీ) భేదం ఉంటుంది.

*49. త్వత్పక్షేపి జగద్దేహప్రతిసమ్బన్ధితావశాత్ ।*
*జీవ స్యేవ బ్రహ్మణోపి దోషాః స్యుః భోక్తృతాదయః ॥*
*50. ఇత్థమత్ర పునస్సాంఖ్యప్రత్యవస్థానమస్యతే ।*
*పూ. చిదచిద్రూపజగతా దేహినః పరమాత్మనః ॥*

స్మృత్యధికరణంలోనూ, విలక్షణత్వాధికరణంలోనూ సాంఖ్యమంతంలో దోషాలుండడంచేత అది స్వీకరించతగినది గాదు అని స్థాపించపడింది. ఈఅధికరణంలో బ్రహ్మకారణవాదంలోనూ, దోషం ఉండడంచేత అది స్వీకరించకూడదు అనిసాంఖ్యుడు మళ్ళీ ఆక్షేపించగా ఆఆక్షేపం నిరసించబడుతోంది. అంటే బ్రహ్మకారణవాదులు బ్రహ్మానికి లోకాన్ని శరీరంగా తీసుకోవడంవల్ల శరీరం ఉన్న జీవుడిలాగే శరీరం ఉన్న బ్రహ్మంకూడా సుఖదుఃఖాలని అనుభవించవలసివస్తుందిగనుక జీవుడికంటె బ్రహ్మానికి భేదం లేకుండాపోతుంది అనే ఆక్షేపం ఈఅధికరణంలో నిరసించబడుతోంది.

*51. జీవాత్మవద్దేహయోగప్రయుక్త సుఖదుఃఖయోః ।*
*భోక్తృత్వాపత్తితోస్య స్యాదవిభాగస్తు జీవతః॥*

50*-51. పూర్వపక్షం: చేతనాచేతనాలతో అమిరియున్న లోకం బ్రహ్మానికి శరీరం

అవడంవల్ల అటువంటి బ్రహ్మమే **లో**కానికి ఉపాదానకారణం అవుతోంది అని బ్రహ్మకారణవాదులవల్ల అంగీకరింపబడుతోంది. ఇలా అంగీకరిస్తే దోషం వస్తోంది. ఎలా అంటే, లోకంలో జీవుడికి శరీరం ఉండడంవల్లనే సుఖదుఃఖాల అనుభవం ఉన్నది అనేది చూస్తున్నాం. *"న హ వై శరీరస్య సతః ప్రియాప్రియయోరపహతిరస్తి । అశరీరం వావ సంతం న ప్రియాప్రియే స్పృశతః* (ఛాం. 8-12-1) (శరీరముతో నున్నంతవరకును సుఖదుఃఖములనుండి విడిపడుట సాధ్యముగాదు. శరీరమును వదలిన తరువాతనే సుఖదుఃఖములు వీనిని వదలును) అని వేదంకూడా చెప్తోంది. ఈవిధంగా ఉన్నప్పుడు పరమాత్మకి లోకం శరీరంగా ఉన్నది అని అంగీకరిస్తే పరమాత్మకూడా జీవుడిలాగే సుఖదుఃఖాలని అనుభవించవలసి వస్తుంది. అందువల్ల జీవుడికీ పరమాత్మకీ భేదం ఏమీ లేకుండా ఉంటుంది. కాని బ్రహ్మకారణవాదులు జీవుడులాగే పరమాత్మకూడా సుఖదుఃఖాలని అనుభవిస్తాడని ఒప్పుకోలేదు. అందువల్ల బ్రహ్మకారణవాదంలోకూడా దోషం ఉండంచేత అది అంగీకరించతగనిదే అగును.

సి. **52.** *ఇతి చేన్న విభాగస్స్యాత్ హేయప్రతిభటత్వతః ।*
*శరీరిత్వప్రయుక్తా న సుఖదుఃఖోపభోక్తృతా ॥*
**53.** *కర్మమూలైవ "న హ వా" ఇతి కర్మవపుఃపరమ్ ।*
*"స ఏకధే"త్యాదివాక్యాన్ముక్తస్యాపి శరీరితా ॥*
**54.** *శ్రూయతేతః పరస్యాస్య నితరాం భోక్తృతా నహి ।*
*రాజాజ్ఞావర్తినాం లోకే యథా తదతివర్తినామ్॥*
**55.** *సుఖదుఃఖాన్వయేప్యస్య రాజ్ఞో దేహిత్వమాత్రతః।*
*న స్యాత్తదుపభోక్తృత్వమనన్యాధీనతావశాత్॥*
**56.** *అతో జగచ్ఛరీరస్య బ్రహ్మణస్సర్వశాసితుః।*
*విశ్వోపాదానతావాదః దోషగన్ధవివర్జితః॥*

*॥ఇతి భోక్త్రాపత్త్యధికరణమ్॥*

52-56. **సిద్ధాంతం**: ఈపూర్వపక్షం తప్పు. పరమాత్మఅనేవాడు దోషాలన్నింటికీ ఎదిరైనవాడు గనుక లోకాన్ని శరీరంగా కలిగిఉన్నంతమాత్రంవల్ల ఆయన శరీరంగలజీవుడిలా సుఖదుఃఖాలని అనుభవించడు. కనుక, జీవుడికంటే పరమాత్మ భిన్నమైనవాడుగనే ఉన్నాడు. ఎలా అంటే, సుఖదుఃఖాలని అనుభవించడం కేవలం శరీరమున్నంతమాత్రంవల్లనేగాదు, కర్మవలననే అవుతుంది. *"న హ వై"* అని మొదలయ్యే వేదవాక్యం కర్మవల్ల కలిగిన శరీరం ఉన్నంతరకూ జీవుడికి సుఖదుఃఖాలుఉండనే ఉంటాయి. అది వదిలిపోయినతరువాతనే అవికూడా వదులుతాయి అనే చెప్తోంది. *"స ఏకధా భవతి త్రిధాభవతి"* (ఛాం. 7-26-2) (ముక్తాత్మ ఒక శరీరము గలది ఆయెను; మూడు శరీరములు గలది ఆయెను.) *"స యది పితృలోకగామో భవతి"* (ఛాం. 8-2-1) (ముక్తుడు పితృలోకానికి వెళ్ళాలనుకుంటే) *"స తత్ర పర్యేతి జక్షత్ క్రీడన్ రమమాణః"* (ఛాం. 8-12-3) (ముక్తుడు పరమాత్మను అనుభవించుచున్నాడు; తినడం, ఆడుకోవడం, ఆనందించడం మొదలైన భోగాలనికూడా పరమాత్మవద్దనే పొందుతున్నాడు) మొదలైన శ్రుతులలో కర్మకృతశరీరంలోంచి విడువడిన ముక్తాత్మకిన్నీ అకర్మకృతమైన శరీరం ఉన్నట్టుగా చెప్పబడుతోంది. ముక్తాత్మకే ఇలా ఐనప్పుడు బ్రహ్మనికి శరీరం ఉంటే దోషంకలుగదు అని వేరే చెప్పవలసిన అవసరం లేదు. అందుచేత *"న హ వై"* అని ప్రారంభం అయే వాక్యం కర్మవల్ల కలిగిన శరీరాన్నిగురించినదే అని చెప్పి ఉండాలి. లోకం పరమాత్మకివారి నిత్యేచ్ఛచేత శరీరంగా ఉన్నదే తప్ప కర్మవల్ల కలిగిన శరీరంకాదు.

హేయగుణాలకి ఎదిరైన పరమాత్మకి కర్మమే ఉండదు. కనుక పరమాత్మ లోకాన్ని శరీరంగా స్వీకరించినప్పటికీ, ఆయనకి జీవుడిలా సుఖదుఃఖాలు ఉండడానికి మార్గమే లేదు. అందుచేత జీవుడికంటె బ్రహ్మకి తేడా లేదు అని శంకించడానికి అవకాశమే లేదు. ఈవిషయంలో ఒక లోకదృష్టాంతంకూడా ఉన్నది. అదేమిటంటే, లోకంలో ప్రభుత్వాదేశాలప్రకారం నడుచుకొనేవాళ్ళు సుఖంగా ఉండడం, వాటిని అతిక్రమించి వ్యవహరించినవాళ్ళు దుఃఖపడుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. కాని రాజు తన ఆజ్ఞప్రకారం తాను నడుచుకొనడంవల్ల సుఖాన్నీ, తన ఆజ్ఞని మీరడంవల్ల దుఃఖం పొందడం అనేవి లేకపోవడాన్నీ మనం చూస్తూనే ఉన్నాం. ఇక్కడ ప్రజలాగ రాజుకూడా శరీరంగలవాడే అయినా సుఖదుఃఖాలని పొందడంలేదు. ఎందువల్ల అని చూస్తే ప్రజ రాజుకి పరతంత్రం అయి ఉండడం(వశపడి ఉండడం)వల్ల రాజుగారిఆజ్ఞని పాలించడం, అతిక్రమించడం వల్ల ఆరాజుగారి అనుగ్రహనిగ్రహాలవల్ల కలిగే సుఖదుఃఖాలని పొందుతారు. రాజు అలా ఎవరికీ పరతంత్రుడు కాకపోవడంవల్ల సుఖదుఃఖాలని పొందడం లేదని మనకి తెలుసు. అదేవిధంగా సర్వలోకచక్రవర్తియైన సర్వేశ్వరుడికి పరతంత్రుడైన జీవుడు ాయన ఆజ్ఞప్రకారం నడవడం అనే పుణ్యకర్మలని చెయ్యడంవల్ల అందువల్ల వచ్చే సుఖాన్నీ, ఆఆజ్ఞని మీరిప్రవర్తించడం అనే పాపకర్మలని చెయ్యడంవల్ల కలిగే దుఃఖాన్నీ అనుభవిస్తున్నాడు అనిన్నీ, ఎవరికీ పరతంత్రుడుకాకపోవడంవల్ల కర్మవశుడు కాని పరమాత్మ అటువంటి సుఖదుఃఖాలని పొందకపోవడం స్పష్టంగా తెలుస్తోంది. కనుక జీవుడుకంటె బ్రహ్మనికి చాలా వ్యత్యాసం ఉంది. అందుచేత లోకాన్ని శరీరంగా కలవాడైనప్పటికీ, అందరినీ నియమించేవాడై, తానెవరిచేతను నియమింపబడని సర్వేశ్వరుడు సుఖదుఃఖాలకి అతీతుడై లోకానికి ఉపాదానకారణమైనాడనే వైదికమతం దోషవాసనకూడా అంటదు అని నిరూపించడం కూడా జరిగింది.

భోక్త్రాపత్త్యధికరణం పూర్తి అయింది.

## ఆరమ్భణాధికరణమ్ ॥ (2-1-6)

### సి.సూ. ॥ తదనన్యత్వమారమ్భణశబ్దాదిభ్యః ॥ (2-1-15)

**తదనన్యత్వం** -కారణమైన బ్రహ్మముకంటెను (కార్యమైన లోకము) వేరుగాకనేయున్నది. **ఆరమ్భణ శబ్దాదిభ్యః**-- "**వాచారమ్భణమ్**" మొదలైన వేదవాక్యములనుండి (ఇది ప్రకటితమగుచున్నది).

57. *ఆశ్రిత్యానన్యతాం కార్య హేత్వోర్విశ్వపరాత్మనోః*
*విశ్వకారణతాస్యోక్తానన్యతా సాత్ర సాధ్యతే ॥*

57. *"అసదితి చేన్న ప్రతి షేధమాత్రత్వాత్"* (బ్రహ్మసూత్రం 2-1- 7) మొదలైనచోట్ల కారణమైన బ్రహ్మమున్నూ, కార్యమైన లోకమున్నూ భిన్నముకానివిగనే ఉన్నవని అంగీకరించి, బ్రహ్మం జగత్కారణమైనది అని నిరూపింపబడినది. ఈ అధికరణంలో కార్యకారణాలైన జగద్బ్రహ్మములు వేరుగా ఉండవలసినవేతప్ప ఒకటిగా ఉండడానికి సాధ్యంగాదు అనే తార్కికుల ఆక్షేపాన్ని పరిహరించడంద్వారా జగత్తు, బ్రహ్మములు వేరుచేయలేనివని ఇదివరకు చెప్పిన అర్థాన్ని స్థాపించడం జరుగుతోంది.

పూ. 58. *విశ్వేశయోరనన్యత్వం న కదాప్యుపపద్యతే ।*
*నహి హేతోరనన్యత్వం సంభవేత్కార్యవస్తునః॥*

59. *నామధేయాకారకార్యకాలధీభేదదర్శనాత్ ।*
*కారకియాక్రియాజాతవైయర్థ్యాపత్తితోపి చ॥*

60. *తస్మాజ్జగత్ బ్రహ్మకార్యం బ్రహ్మతోన్యత్ భవేద్ధ్రువమ్।*

సి. *అనన్యత్వశ్రుతిస్త్వత్రాన్యథా నేయేతి చేన్న తత్ ॥*

58-*60 - **పూర్వపక్షం:** లోకంలో అంతటా కారణవస్తువుకంటే కార్యవస్తువు వేరైనదిగా కనుబడుటచేత, కారణమైన బ్రహ్మము, కార్యమైన లోకమున్నూ వేరుకాకుండా(ఒకటిగా) ఉండవీలుగాదు. కారణవస్తువుకంటె కార్యవస్తువు వేరుగానే ఉండవలెను అన్న విషయాన్ని చూపించే హేతువులు అనేకం ఉన్నాయి. అవి యేవనగా: - 1. బుద్ధిభేదం - కారణమైన మట్టిగడ్డయూ, కార్యమైన కుండా వేరువేరు జ్ఞానాలవల్ల తెలుస్తున్నాయి. 2. నామభేదం: - మట్టిగడ్డని కుండ అనడం లేదు. కుండని మట్టిగడ్డ అని అనడం లేదు. 3. ఆకారభేదం:- మట్టిగడ్డ ఉండరూపంగా ఉంటుంది. కుండ కిందని పెద్దదిగా ఉండి మూతి చిన్నదిగా ఉన్న రూపాన్ని కలిగినదిగా ఉంటుంది. 4. కార్యభేదం:- కండతో నీళ్ళు తీసుకరాగలమే తప్ప మట్టిగడ్డతో నీళ్ళు తేవడం కుదరదు. మట్టితో చట్టిని చెయ్యగలమేగాని, కుండతో చట్టిని చెయ్యడం కుదరదు. 5. కాలభేదం:- మట్టి ముందరి కాలంలో ఉంటుంది. కుండ తరువాతి సమయంలో ఉండేది.

కారణానికి, కార్యానికీ ఈఐదువిధాలైన భేదాలు ఉండడంనుంచి కారణవస్తువులకంటె, కార్యవస్తువులు వేరైనవే అని స్పష్టమవుతోంది. పైగా కారణమైన మట్టిగడ్డని కార్యమైన కుండగా చెయ్యడానికి కుమ్మరి మట్టిముద్దని చక్రంలో పెట్టి తిప్పడం మొదలైన పనులని చేయవలసిఉన్నది. ఈపనులే **కారకవ్యాపారములు** అనబడుతాయి. మట్టీ, కుండా ఒకటే అయితేమట్టిని కుండగా చెయ్యడానికి ఈకారకవ్యాపారం అవసరంలేదు అని చెప్పుకోవలసివస్తుంది. ఇది ప్రత్యక్షవిరుద్ధం. కనుక మట్టిముద్దని కుండగా చేసే కారకవ్యాపారంఅవసరం అవడంనుంచి కారణవస్తువులకంటె, కార్యవస్తువులు వేరైనవే అని స్పష్టం అవుతోంది. కనుక బ్రహ్మముయొక్క కార్యవస్తువైన లోకం కారణమైన బ్రహ్మంకంటే వేరైనదిగానే ఉండాలి అన్నది నిశ్చయం. బ్రహ్మమూ, లోకం కూడా ఒకటే అనిచెప్పే వేదవాక్యాలకి ప్రత్యక్షమైన వస్తువులని గ్రహించితే ఇటువంటి ప్రత్యక్షవిరోధం రావడంచేత ఆశ్రుతులు లోకం బ్రహ్మంలో ఇమిడియున్నది అనే భావనకలిగియున్నవే అని వాటికి లక్షణగా అర్థం చెప్పుకోవడమే ఉచితం.

*61. కార్యస్య జగతస్తస్మాత్ కారణాత్పరమాత్మనః ।*
*వాచారమ్భణశబ్దాదేః అనన్యత్వం ప్రతీయతే ॥*

*62. వాక్పూర్వవ్యవహారస్య సిద్ధ్యై హేతుమ్మృదాదినా ।*
*పృథుబుధ్నోదరత్వాదివికారో ఘట ఇత్యాపి॥*

*63. నామ చ స్పృశ్యతే తస్మాత్కార్యరూపం ఘటాద్యపి ।*
*మృత్తికాద్రవ్యమిత్యేవ ప్రమాణేనోపలభ్యతే ॥*

*64. న తు ద్రవ్యాంతరత్వేన బుద్ధిశబ్దాన్తరాదయః ।*
*ఉపపన్నా యథైకస్యావస్థాభేదైరనేకథా ॥*

*65. బాలో యువా వృద్ధ ఇతి బుద్ధిశబ్దాన్తరాదయః।*
*కార్యభేదాశ్చ దృశ్యన్తే విరోధో నాత్ర కశ్చన ॥*

*66. తదవస్థోత్పాదకత్వాత్ క్రియాణామపి సార్థతా ।*
*నామరూపాస్పృష్టసూక్ష్మచిదచిత్తనుకం హి యత్ ॥*

*67. తత్ బ్రహ్మ కారణావస్థం యత్స్థూలచిదచిత్తను ।*
*తత్ కార్యావస్థమిత్యస్మాత్కారణాత్ బ్రహ్మణో జగత్॥*

### *68. కార్యరూపమనన్యత్స్యాదుభయావస్థయోరపి ।*
### *గుణదోషవ్యవస్థోక్తా శరీరస్య చ దేహినః ॥*

***60*-68:*** ***సిద్ధాంతం*** -- ఈపూర్వపక్షం తప్పు. "***వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం***" (ఛాం. 6-1-4) (వాక్కుతో ఏర్పడు వ్యవహారము సిద్ధించుటకు మట్టిముద్దయను కారణవస్తువే రూపము మారటం, కుండ అను మారుపేరును పొందుతోంది. (కార్యవస్తువైన కుండకూడ) నిజముగ మట్టిగనే ఉన్నది), "***సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్***" (ఛాం. 6-2-1) (ఈలోకము మొదట 'సత్' అను బ్రహ్మముగనే యున్నది) మొదలైన వేదవాక్యములనుండి కార్యమైన లోకము, కారణమైన పరమాత్మా, వేరుచేయలేకుండా ఉన్నవే అని స్పష్టమవుతున్నాయి. "వాచారమ్భణమ్" అని మొదలయే వేదవాక్యానికి ప్రతిపదార్థం ఈవిధంగా ఉన్నది :- **వాచా**- 'కుండలో నీరు తీసుకురా' మొదలైన మాటలని విన్నతరువాతనే జరిగే నీరు తీసుకురావడం మొదలైన వ్యవహారాలు సిద్ధించడానికి కారణం. (వాచా అన్నది వాక్పూర్వకవ్యవహారార్థం అన్నమాట). వికారః - కిందని బాగావెడల్పుగా ఉండి సన్నని మూతి గలదిగాఉండడం మొదలైన రూపంమార్పుకూడా, నామధేయం-కుండ మొదలైన పేరుమార్పున్నూ, ఆరంభణం - (మట్టిముద్దఅనే కారణవస్తువువల్లనే ప్రారంభం అవుతోంది. అంటే మట్టిముద్దే వ్యవహారంకోసం పేరుమార్పులను పొందుతోందన్నమాట ***(ఆరమ్భణం - ఆరబ్ధం- స్పృష్టం ఇత్యర్థః), మృత్తికా ఇతి ఏవ సత్యం*** - (కార్యమైన కుండమొదలైనవికూడా) మట్టిఅనే నిజముగా ఉన్నది; అంటే మట్టిగనే ప్రమాణాలవల్ల చూడబడుతోంది తప్ప వేరు ద్రవ్యంగా చూడబడలేదు అని అర్థం. మట్టిముద్దే కుండగా అయింది అన్న ఈదృష్టాంతంలో కారణం కార్యం ఒకటిగా ఉన్నట్లే కారణమైన బ్రహ్మమే కార్యమైన లోకంగా ఉన్నది అని ఈవేదవాక్యానికి అర్థం. బుద్ధిభేదం మొదలైన ఐదువిధాలైన భేదాలనీ కార్యం, కారణం వేరువేరైనవే అనే నిర్వహించాలి అనిగాదు. కార్యం, కారణం ఒకే వస్తువైనప్పటికీ, ఆవస్తువుయొక్క అవస్థాభేదాల(స్థితిభేదాల)తోటే వెనకచెప్పిన భేదాలని నిర్వహించాలి. ఒకే మనుష్యుడు ఒకప్పుడు బాలుడనీ, మరొకప్పుడు యువకుడనీ, మరొకప్పుడు ముసలివాడనీ వ్యవహారంలో ఉన్నా, ఆయాసమయాలలో బుద్ధిభేదం మొదలైన వెనుకచెప్పబడిన భేదాలున్నా, ఆయాసమయాలలో మనుష్యుడి స్థితిలో భేదాలేతప్ప మనుష్యుడు వేరుకాదు అన్నది మనకి తెలిసినదేగదా! అలాగే ఇక్కడకూడా తీసుకోవాలి. కారణస్థితికంటే, భిన్నమైన కార్యస్థితిని కలిగించడంలో కారకవ్యాపారం ఉపయోగపడుతోంది. కనుక, కారకవ్యాపారం పనికిరాకపోయింది అనే దోషంకూడా లేదు. ఇక కారణమైన బ్రహ్మం కార్యమైన లోకంగా అయినప్పుడు దానికి ఎటువంటి అవస్థాభేదం కలుగుతోంది అనే ప్రశ్న వస్తుంది. దానికి సమాధానం :- నామరూపాలులేని సూక్ష్మస్థితిని పొందియున్న చేతనాచేతనాలని శరీరంగా కలిగి ఉండడమే బ్రహ్మానికి కారణస్థితి ఔతుంది. నామరూపాలతోఉన్న స్థూలస్థితిని కలిగిఉన్న చేతనాచేతనాలని శరీరంగా కలిగి ఉండడమే బ్రహ్మానికి కార్యస్థితి ఔతుంది. ఈవిధంగా రెండుస్థితులలో ఉండే బ్రహ్మం ఒకటే అవడంవల్ల ఇక్కడకూడా, కార్యకారణాలు వేరుకానివే అని తేలింది. ఈవిధంగా బ్రహ్మానికి చేతనాచేతనాలు శరీరమై ఉండడంచేత చేతనాచేతనాలలోఉన్న దోషాలు బ్రహ్మానికి అంటవా? అంటే, అంటవు అని విలక్షణత్వాధికరణంలో ఉన్న "*న తు దృష్టాన్తభావాత్*" (2-1-9) అనే సూత్రంలో వివరించబడింది.

### *సి.సూ ॥ భావే చోపలబ్ధేః ॥ ( 2-1-16 )*

***భావే:*** కార్యస్థితిలో, ***ఉపలబ్ధేః చ:*** (కారణంతాలూకు) తలంపు కలుగుటచేతను (కార్యకారణాలు

ఒకటే)

*69. ఘటాదికార్యభావేపి తదేవేదం మృదాదికమ్।*
*ద్రవ్యమిత్యుపలబ్ధేశ్చ కార్యం కారణమేవ తత్॥*

69.మట్టిముద్ద అనేది కుండగా మారినతరువాతకూడా ఈకుండ మట్టే అని కుండఅనే కార్యస్థితిలో కూడా మట్టి అనే కారణవస్తువు కనబడుతూ ఉండడంవల్ల కార్యకారణాలు ఒకటే అని స్పష్టమౌతోంది.

*సి.సూ. ॥ సత్త్వాచ్చాపరస్య ॥ (2-1-17)*

***అపరస్య:*** (వెనుకచెప్పిన కారణవస్తువుకంటె) వేరైన కార్యవస్తువు, ***సత్త్వాత్ చ:*** (కారణవస్తువుగనే) ఉండినట్టు చూచుటచేతనున్నూ, (కార్యకారణములు ఒకటే.)

*70. ఘటాదికమిదం సర్వం ప్రాగభూదితి ।*
*"సదేవ సోమ్యేదమగ్ర" ఇతి లోకే శ్రుతావపి ॥*

*71. అపరస్యాస్య కార్యస్య కారణే సత్త్వతస్తయోః।*
*అనన్యత్వం తతః కార్యం కారణత్వేన కథ్యతే ॥*

70-71.'ఈకుండ మొదలైన కార్యవస్తువులన్నీ, నిన్న మట్టిగనే ఉండెను' అని లోకంలో కార్య వస్తువులన్నీ కారణవస్తువులుగానే ముందర ఉండేవి అని తెలుస్తోంది. శ్రుతిలోకూడా, "***సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్***" (ఛాం. 6-2-1) (కార్యమైన ఈలోకము మొదట కారణమైన బ్రహ్మముగానే ఉండెను) అని కార్యవస్తువు కారణంగానే ఉన్నదని చెప్పబడుతోంది. దీనివల్లకూడా కార్యకారణాలు రెండూ ఒకటే అని స్పష్టం అవుతోంది. కనుక, ఈరెండు సూత్రాలవల్లా కార్యమూ, కారణమూ ఒకటి మరొకటిగానే వ్యవహారంలో ఉండడంవల్లకూడా రెండూ ొకటే అని నిరూపించబడినది.

*సూ. అసద్వ్యపదేశాన్నేతి చేన్న ధర్మాన్తరేణ వాక్యశేషాద్యుక్తేశ్శబ్దాన్తరాచ్చ॥ (2-1-18)*

***అసద్వ్యపదేశాత్:*** లోకం అసత్తుగానే ఉన్నది అని ఒక వేదవాక్యము చెప్పుటచేత, ***న:*** (కార్యము కారణమందు ఉన్నది అనుట) తప్పు. ***ఇతి చేత్:*** అనినచో, ***న:*** అట్లు చెప్పుట సాధ్యముగాదు. ***ధర్మాన్తరేణ:*** మరియొకస్థితిని కలిగియుండుటను గూర్చి, (అచ్చట అసత్ అని చెప్పబడుచున్నది.) (ఈవిషయము) ***వాక్యశేషాత్:*** "మనోకురుత" (సంకల్పించవలెను) అను వాక్యశేషమునుండి, ***యుక్తేః:*** యుక్తినుండియు, ***శబ్దాంతరాత్ చ:*** వేరువాక్యమునుండియు, (స్పష్టమగుచున్నది.)

*పూ. 72. "అసద్వా ఇద"మిత్యాదావగ్రే కార్యస్య కారణే।*
*అసత్త్వవ్యపదేశాత్స ఉక్తార్థో నోపపద్యతే॥*

72. పూర్వపక్షం: కార్యం కారణంగానే ఉన్నది" అనిలోకవేదాలతో వెనుకటి సూత్రంలో చెప్పినది సరిగాదు. *"అసద్వా ఇదమగ్ర ఆసీత్"* (తై. ఆన.7-1), *"అసదేవేదమగ్ర ఆసీత్"* (ఛాం. 3-19-1/6-2-1?)(ఈలోకం మొదట్లో అసత్తుగనే యుండినది), *"ఇదంవా అగ్రే నైవ కించన ఆసీత్"* (యజుస్ - అష్టకం 2-2-9) (మొదట ఈలోకము ఉండలేదు) అనినీ, ఇంకా ఎన్నో వేదవాక్యాలు కార్యమైన ఈలోకం కారణంలో లేదు అని చెప్తున్నాయి. లోకంలోకూడా 'ఈచట్టిబాన మొదలైనవి నిన్నను లేవు' అని కార్యవస్తువులు కారణంలో లేవు అని మనం వాడుకలో చూస్తున్నాం. కనుక, వెనుకటి సూత్రంలో చెప్పినది సరిగాదు. అందుచేత కారణంకంటే కార్యం వేరైనదే ఔతుంది.

*సి. 73. ఇతి చేన్నాన్యధర్మేణ ద్రవ్యస్య వ్యపదేశతః ।*
*స్థూలత్వేతరసూక్ష్మత్వరూపధర్మాంతరాన్వయాత్॥*

*74. అసదిత్యుక్తి, అర్థోయం వాక్యశేషాదిబోధితః।*
*వాక్యశేషశ్చ "తదసదేవ సన్మన" ఇత్యయమ్॥*

*75. అసత్పదార్థస్తుచ్ఛాన్యో మనస్కారాది హేష్యతే।*
*యుక్తిస్సత్త్వాసత్త్వయోశ్చ వస్తుధర్మత్వసాధికా॥*

*76. మృదః కిఞ్చిదవస్థత్వం ఘటోస్తీత్యుక్తికారణమ్।*
*తద్విరుద్ధాకారయోగః తన్నాస్తీత్యుక్తికారణమ్॥*

*77. నేతరః కశ్చిదస్త్యత్ర పదార్థోభావసంజ్ఞకః।*
*శబ్దాన్తరం చ పూర్వోక్తం సదేవేత్యాదికం భవేత్॥*

73-77. సిద్ధాంతం: - ఈపూర్వపక్షం తప్పు. లోకంలో ఇవాళఉన్న చట్టి , బాన మొదలైనవి నిన్న లేవు అనడం వాడుకలో ఉన్నదనేది వాస్తవం. కాని చట్టి, బాన, కుందేటికొమ్ములా మొదటే లేనివస్తువులు అని అక్కడి భావం కాదు. మొదటిరోజున ఈబాన. చట్టి మట్టిముద్దరూపంలో ఉన్నవే తప్ప, చట్టి, బానలరూపంలో లేవని మాత్రమే అక్కడి భావం. ఈవిధంగా అర్థంచేసుకుంటేనే చట్టి, బానలు నిన్నమట్టిగా ఉండేయి అనే వాడుక కుదురుతుంది. ఇదేవిధంగా 'ఈలోకం అసత్‌గానే ఉండేది' మొదలైన వేదవాక్యాలకి, 'ఈలోకం మొదట్లో శూన్యముగానే ఉండెను' అనే భావంకాదు. ఈలోకం ప్రళయకాలంలో నామరూపాలతో ఉండడంఅనే స్థూలస్థితిని పొందలేదు అన్నదే ఆవేదవాక్యాల భావం. ఇలాగే ఈవేదవాక్యాలకి అర్థం చెప్పుకోవాలి అన్నది మూడు కారణాలవల్ల స్పష్టం అవుతోంది. అవేమిటంటే: **(1).** ***వాక్యశేషం:*** ***"ఇదం వా అగ్రే నైవ కిఞ్చన ఆసీత్"*** అనే వాక్యానికి తరువాతి వాక్యంలో *"తదసదేవ సన్మనోకురుత స్యామితి"* (యజు - అష్టక-2-29) (అది లేనిదిగనే (అంటే నామరూపములులేనిదిగనే) ఉండి, 'నేను అనేకముగ అగుదును' అని సంకల్పించింది) అని చెప్పబడుతోంది. మొదటివాక్యానికి కారణస్థితిలో శూన్యమే ఉన్నది అని అర్థం చెప్పుకుంటే అది సంకల్పించింది అని చెప్పే ఈవాక్యశేషం కుదరదుగనుక మేము వెనుకచెప్పినట్టు 'అసత్' అనే పదానికి 'నామరూపాలులేనిది' అనే అర్థం చెప్పుకోవాలి. **(2). యుక్తి:** ఉన్నది అనే అర్థానికే 'సత్త్వం', 'అసత్త్వం' అనే రెండు ధర్మాలు కలుగుతున్నాయేతప్ప వస్తువులేదు అనిగాదు. 'కుండ ఉన్నది', 'కుండ లేదు' అని రెండు రకాలైన వాడుకని చూస్తున్నాం. 'కుండ ఉన్నది' అంటే కిందని పెద్దబుంగలాఉండి మూతి సన్నంగా ఉన్నస్థితిలో ఉన్నది అని అర్థం. 'కుండ లేదు' అంటే మట్టిముద్దగా ఉన్న స్థితిలో, లేదా ఒకతాబేలుచిప్పలోదాగి ఉన్నస్థితిలో ఉన్నదే తప్ప కిందని పెద్దబుంగలా ఉండి, మూతి సన్నంగా ఉండే స్థితిలో లేదు అనే అర్థం. లేదు అనే వాడుకని ఈవిధంగా నిర్వహించడమే అనుభవానికి తగిఉంది తార్కికులు చెప్పినట్లుగా. అభావః (లేకపోవడం) అని ఒక పదార్థం దొరకదుగనుక దానితో లేదు అనే వాడుక నిర్వహించడం కుదరదు. **(3). శబ్దాంతరం:-** వెనుక ఎత్తుకున్న *"సదేవ సోమ్యేదమగ్రఆసీత్'* (ఛాం. 6-2-1) (కార్యమైన ఈలోకం మొదట సత్‌గనే ఉండెను) అని ప్రారంభం అయే ప్రకరణంలో "తస్మాదసదస్సజ్జాయత" ( అసత్తైనవస్తువు ఉండినది) అనే వాక్యంవల్ల అసత్కార్య- వాదాన్ని ఎత్తుకొని *"కుతస్తు ఖలు సోమ్య ఏవం స్యాదితి హోవాచ కథమసదస్సజ్జాయేతేతి"* (ఛాం. 6-2-2) ( పిల్లవాడా! ఇది ఎట్లు కుదురుతుంది? లేని వస్తువు ఎట్లు ఉండడం కుదురుతుంది? అని అడిగేరు)అనే వాక్యంచేత దానిని ఖండించి, *'సత్త్వేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్'* (ఛాం. 6-2-2) ( పిల్లవాడా! ఈలోకం ఉన్నదిగనే మొదట ఉన్నది. ఒకటిగను, రెండవదిలేనిదిగను ఉండెను.) అనే వాక్యంలో సోకం కారణస్థితిలోనూ ఉన్నదిగానే ఉండెను అని స్థాపించబడుతోంది. దీనితో ఉన్నదానిని

చూస్తే "అసత్తుగానే ఉన్నది'అనే వాక్యానికి 'నామరూపాలులేకుండా ఉన్నది'అనే అర్థం చెప్పుకోవాలి. *"తద్ధేతం తర్హ్యవ్యాకృత- మాసీత్ తన్నామరూపాభ్యాం వ్యాక్రియత"* (బృ-3-4-7) ( అటువంటి ఈలోకం అప్పుడు నామరూపవ్యాక- రణం చెయ్యడానికి వీలులేకుండా ఉండెను; అది తరువాత నామరూపవ్యాకరణం చెయ్యబడింది) అనే వేదవాక్యం ***'అసత్'*** అనే శబ్దాన్ని ***"అవ్యాకృతమ్'*** అని స్పష్టంచేయడంద్వారా ఈఅర్థాన్ని స్పష్టంగా చూపడం జరిగింది.

### *సూ. ॥ పటవచ్చ ॥ (2-1-19)*

**పటవత్ చ** -- (నూలుపోగులు) వస్త్రం అయేటప్పుడు వలె (బ్రహ్మం వస్త్రం అయేటప్పుడు)

*78. వ్యతిషఙ్గవిశేషేణ యథైవ బహుతన్తవః ।*
*కార్యాన్తరం నామరూపే భజన్తే బ్రహ్మ తత్తథా॥*

78. ఎన్నో దారపుపోగులు పడుగు, పేకగా అల్లబడి నెయ్యబడడంవల్ల ఉత్పత్తి తరువాత వస్త్రం అనే వేరొక పేరుని, వేరు రూపాన్నీ పొందుతున్నాయి. కేవలం దారపుపోగులతో చెయ్యడానికి శక్యంగాని కట్టుకోవడం (ధరించడం) అనే కార్యానికి ఉపకరిస్తున్నాయి. కాని ఈచోట ఈవిధంగా నామరూపకార్య భేదాలున్నప్పుడుకూడా, దారపుపోగులే ఇలా బట్టఅయినాయేతప్ప మరో వస్తువు కొత్తగా సృష్టించబడ లేదు అని తెలుసుకుంటున్నాం. అదేవిధంగా *"బ్రహ్మము" *లోకం అయినప్పుడు అనేక భేదాలున్నప్పటికీ కారణమైన బ్రహ్మం, కార్యమైన లోకం వేరుగావు అని తెలుస్తోంది.

### *సూ. ॥ యథా చ ప్రాణాదిః ॥ (2-1-20)*

***ప్రాణాదిః యథా చ:-*** ప్రాణం, అపానం మొదలైన నామరూపకార్యభేదాలని పొందినట్టుగా (ఒకటైన *బ్రహ్మము *లోకమైనప్పుడు అనేకభేదాలని పొందుతుంది.)

*79. యథైక ఏవ వాయుశ్చ దేహే వృత్తివిశేషతః।*
*ప్రాణాపానేత్యాదినామరూపకార్యాన్తరాణి చ॥*
*80. భజతే తద్వదేవైకం బ్రహ్మ స్థావరజఙ్గమమ్।*
*చిత్రం జగద్భవత్యేవేత్యతోఽన్యత్ జగత్పరాత్॥*

*॥ఇత్యారమ్భణాధికరణమ్॥*

79-80. ఒకటైన వాయువే శరీరంలో వేరువేరు పనులని చేసేటప్పుడు ప్రాణం, అపానం మొదలైన పేర్లని, వాటివాటికి సంబంధించిన రూపకార్యభేదాలనీ పొందుతుంది. అదేవిధంగా ఒకటైన *బ్రహ్మం రకరకాలైన అస్థిరమైన వస్తువులున్నూ, నశించనివస్తువులనిగల *లోకం అవుతుంది. ఈవిధంగా ఈసూత్రం లోనూ వెనుకటి సూత్రంలోనూ కారణంకంటే, కార్యానికి నామరూపకార్యభేదాలు ఉంటాయని రెండింటినీ వేరువేరుగా భావించవీలుగాదనిన్నీ, ఈభేదాలున్నప్పటికీ, కార్యకారణాలు ఒకటే అని నిరూపించబడింది.

ఆరంభణాధికరణం పూర్తి అయింది.

---

*ఈగుర్తు ఉన్నచోట్ల బ్రహ్మము అనేది సూక్ష్మచిదచిద్విశిష్టబ్రహ్మాన్నీ, లోకం అనేది స్థూలచిదచిద్విశిష్టబ్రహ్మాన్నీ సూచిస్తుంది అని గుర్తుంచుకొనవలెను.

---

## *॥ ఇతరవ్యపదేశాధికరణమ్ ॥ (2-1-7)*

### *పూ. సూ. ॥ఇతరవ్యపదేశాద్ధితాకరణాదిదోషప్రసక్తిః॥ (2-1-21)*

***ఇతరవ్యపదేశాత్:*** (బ్రహ్మాన్ని) జీవుడుగా చెప్పడంవల్ల, ***హితాకరణాదిదోషప్రసక్తిః-*** (బ్రహ్మం

తనకితానే) మంచినిచెయ్యలేదు, చెడు చేసింది అనే దోషాలు ఏర్పడుతాయి.

*81. పరస్యోపాదానతయా విరోధోఽస్తః పరేరితః।*
*అనన్యత్వే, నిమిత్తత్వప్రయుక్తోఽత్ర నివార్యతే॥*

81. ఇంతవరకూ, బ్రహ్మము లోకానికి ఉపాదానకారణం అయింది అనే వేదాంతులపక్షంమీద "అలాఉపాదానం అని తీసుకుంటే కపిలస్మృతి విరోధిస్తుంది' అనడం మొదలైన సాంఖ్యుడు చేసే తర్కవిరోధాలు, "అలా ఉపాదానంగా తీసుకున్నట్లయితే, బ్రహ్మం, లోకం ఒకటిగా ఉండడానికి వీలుగాదు, వేరువేరుగానే ఉండవలెను" అనడం మొదలైన తార్కికులతర్కవిరోధాలు ఖండించబడినాయి. ఇక ఈఅధికరణంలో "బ్రహ్మం నిమిత్తకారణం అయింది అనే వేదాంతుల పక్షంమీద వచ్చే ఆక్షేపం పరిహరింపబడుతోంది. అంటే "జీవుడినుంచి వేరుకాలేని బ్రహ్మం తనకి దుఖాన్నిచ్చే లోకాన్ని తానే సృష్టించుకొన్నది" అని ఒప్పుకోవలసిరావడంవల్ల "బ్రహ్మం తనకితాను మంచిని చెయ్యలేదు, చెడునే చేస్తోంది" అని దోషాలు కలుగుతున్నాయి అనే పక్షం పరిహరింపబడుతోంది.

*పూ. 82. బ్రహ్మేతరస్య జీవస్య బ్రహ్మత్వవ్యపదేశతః।*
*స్వహితాకరణం దోషః స్యానిష్టకరణం తథా॥*

*83. ప్రసక్తస్త్ర దుర్వారః తత్త్వమస్యాదివాక్యతః।*
*జీవాత్మబ్రహ్మణోరైక్యం హ్యుచ్యతే బ్రహ్మణోఽస్య చ॥*

*84. సర్వజ్ఞత్వాదయోఽనేకగుణాశ్చాఙ్గీకృతా అతః।*
*తథావిధబ్రహ్మణో హి స్రష్టృత్వం నోపపద్యతే॥*

*85. జగద్దుఃఖోల్బణమిదం ప్రతికూలం చ దృశ్యతే।*
*జీవానన్యబ్రహ్మణోఽతః కారణత్వమసఙ్గతమ్॥*

82-85- **పూర్వపక్షం**: లోకం, బ్రహ్మం ఒకటే అని చెప్పేవాళ్ళు *"తత్ త్వం అసి"* (ఛాం. 3-8-7) (నీవు ఆ పరమాత్మవస్తువైనావు) *"అయమాత్మా బ్రహ్మ"* (బృహ.6-4-5) ( ఈఆత్మ బ్రహ్మమే) మొదలైన వాక్యాలలో బ్రహ్మంకంటే భిన్నమైనవాడిగా తోచే జీవుడుకూడా బ్రహ్మంగానే చెప్పబడుతున్నాడు అని అంగీకరిస్తున్నారు. ఇలా ఒప్పుకుంటే, "బ్రహ్మంఅనేది తనకిమంచిని తాను చేసుకోవడంలేదు, చెడే చేసుకొంటోంది" అనే దోషం తప్పించలేకుండా వస్తుంది. ఎలా అంటే, ఈవాక్యాలు జీవాత్మకీ పరమాత్మకీ ఐక్యాన్ని చెప్పుతున్నాయి అని వీళ్ళు అంగీకరిస్తున్నారు అన్నది వస్తుంది. ఈబ్రహ్మానికి సర్వజ్ఞత్వం మొదలైన అనేక కల్యాణగుణాలనికూడా అంగీకరిస్తున్నారు. ఈలోకం మాత్రందుఃఖమయమైనదిగానూ, జీవుడికి దుఃఖాన్నే ఇచ్చేదిగానూ ఉన్నది. బ్రహ్మమే జీవుడై ఉంటే, అన్నింటినీ తెలిసినదై(సర్వజ్ఞం అయి), సర్వశక్తిమంతం అయి, ఆబ్రహ్మం తనకు మంచిదైఉండే లోకాన్ని సృష్టించలేనిదికాకుండా తనకి చెడునే ఇచ్చేలోకాన్ని తానే సృష్టించుకొంటోంది అనే మహాదోషం వస్తుంది. కనుక, ఇలా జీవుడికంటే వేరుకానిదిగా బ్రహ్మన్ని అంగీకరించే పక్షంలో బ్రహ్మం తనకే వ్యతిరేకమైన లోకాన్ని సృష్టించదుగనుక బ్రహ్మంలోకానికి నిమిత్తకారణం అవడానికి వీలులేదు అని స్పష్టం అవుతోంది.

## సి.సూ. ॥అధికం తు భేదనిర్దేశాత్ ॥ (2-1-22)

***భేదనిర్దేశాత్:*** (జీవుడికంటేపరమాత్మని) వేరుగా వేదాలు చెప్పడంవల్ల ***అధికంతు:*** (జీవాత్మకంటే పరమాత్మ) వేరైనదే ఔతుంది.

*86. "జ్ఞాజ్ఞౌ, యఆత్మని"త్యాదిభేదనిర్దేశతః శ్రుతౌ।*

*జీవాత్మనోఽర్థాన్తరం తత్ బ్రహ్మేత్యావసీయతే॥*

**87.** *తాదాత్మ్యం జీవపరయోః తత్త్వమస్యాదిభిః శ్రుతమ్।*
*శరీరాత్మత్వతః తస్మాత్ అన్యోఽన్యంస్రష్టృసృజ్యయోః॥*

**88.** *స్వరూపభేదస్సిద్ధోఽతో జీవకర్మానుసారతః।*
*తదనిష్టప్రపఞ్చస్య స్రష్టృత్వేఽపి పరాత్మనః॥*

**89.** *నోక్తదోషోఽస్త్యతశ్చాస్య జగత్కారణతా స్థిరా।*

86-*89:-- **సిద్ధాంతం--** "**జ్ఞాజ్ఞౌ ద్వావజావీశనీశౌ**" (శ్వే.1-9) (పరమాత్మ, జీవుడు అనే ఇద్దరూ క్రమంగా సర్వజ్ఞులుగానూ, ఏమీతెలియనివాడిగాను, సమస్తాన్నీ నియమించేవారిగానూ, నియమింపబడని వారిగానూ ఉన్నారు.) "***య ఆత్మనితిష్ఠన్ ఆత్మనోఽన్తరో యమాత్మా న వేద, యస్యాత్మా శరీరం య ఆత్మానమన్తరో యమయతి***" (బృహ. 5-7-22) (ఎవడు ఆత్మలో నించున్నాడో, ఎవడు ఆత్మయందు ఉన్నాడో, ఎవనిని ఆత్మ తెలుసుకొనలేదో, ఎవనికి ఆత్మ శరీరమో, ఎవడు ఆత్మలోపల ప్రవేశించి నియమించుచున్నాడో), "***పృథగాత్మానం ప్రేరితారం చ మత్వా జుష్టస్ తతస్తేనామృతత్వమేతి***" (శ్వే. 1-6) (ఆత్మయు, దానిని నియమించు పరమాత్మవస్తువుయు, వేరుగా తెలిసికొని, ఆపరమాత్మచే అనుగ్రహింపబడి మోక్షమును పొందుచున్నాడు.) మొదలైన వేదవాక్యములనుండి జీవాత్మకంటెను బ్రహ్మమనేది వేరైనదనే తెలుస్తోంది. అలా అయినట్లయితే, వెనుక ఎత్తుకున్న "***తత్ త్వమసి***" (ఛాం. 3-8-7) మొదలైన వేదవాక్యాలలో ఇద్దరినీ ఒకటే అన్నది ఎలా కుదురుతుంది? అంటే, జీవుడు శరీరం గానూ, బ్రహ్మం ఆత్మగానూ ఉండడంచేతనే ఇద్దరూ ఒకటే అన్నది సరిపోతుంది. ఈవిధంగా, ఈవాక్యాలలో స్వరూపైక్యం చెప్పబడకపోవడంవల్ల సృష్టించే పరమాత్మవస్తువుకీ, సృష్టింపబడే జీవాత్మకీ స్వరూపభేదం సిద్ధించింది. కనుక, జీవుడి కర్మలని అనుసరించి జీవుడికి దుఃఖాన్నిచ్చే లోకాన్ని పరమాత్మ సృష్టించినప్పటికీ 'తనకి మంచిని చేసుకోకుండా చెడునే పరమాత్మ చేసుకొంటోంది" అని పూర్వపక్షంలో చెప్పిన దోషం బ్రహ్మానికి అంటదు. కనుక, బ్రహ్మం లోకానికి నిమిత్తకారణం అవడంలో ఏమీ తప్పులేదు.

*సి.సూ. ॥ అశ్మాదివచ్చ తదనుపపత్తిః ॥ (2-1-23)*

***అశ్మాదివత్ చ -- రాయి*** మొదలైన అచేతనవస్తువులకివలె, ***తదనుపపత్తిః***-- (జీవుడికీ పరమాత్మతో) స్వరూపైక్యం కుదరదు.

**89*** *అశ్మకాష్ఠాదిహేయాచిత్పదార్థానాం యథా సదా॥*

**90.** *హేయప్రతిభటానన్తకల్యాణబ్రహ్మరూపతా।*
*న సంభవేత్తథా స్వల్పధియోఽశక్తస్య దుఃఖినః॥*

**91.** *జీవస్యాపి బ్రహ్మతా సా సర్వదైవ న సంభవేత్।*
*తయోశ్శరీరాత్మతయా సామానాధికరణ్యవాక్॥*

**92.** *జగతో బ్రహ్మకార్యత్వం తదనన్యత్వమస్య చ।*
*అచిజ్జీవబ్రహ్మణాం చ గుణదోషవ్యవస్థితిః॥*

**93.** *సర్వశ్రుత్యవిరోధశ్చ సర్వమత్ర సమఞ్జసమ్।*
*నిమిత్తకారణమపి తతో నారాయణః ప్రభుః॥*

*॥ఇతి ఇతరవ్యపదేశాధికరణమ్॥*

***89*-93. సిద్ధాన్తం.*** రాయి, కర్ర మొదలైన దోషములుగల అచేతనవస్తువులు ఎప్పుడూ

హేయపదార్థాలన్నింటికీ ఎదిరైనదై, అపరిమితకల్యాణగుణాలుకలిగిన బ్రహ్మంగా అవడానికి శక్యంగాదు అనేది ఎలా దాచశక్యంగాదో, అదేవిధంగా, అల్పజ్ఞానశక్తులుగల దుఃఖంతోటే నిండియున్నటువంటి జీవుడుకూడా వెనకచెప్పిన మహత్త్వాలుగల బ్రహ్మంగా అవడానికి వీలుగాదు అన్నదిగూడా ఏవిధంగానూ దాచశక్యంగానిదే అవుతుంది. జీవపరమాత్మలని ఒకే శాఖకి చెందినవిగా వేదాంతాలు చెప్తున్నాయి. జీవుడు శరీరంగానూ, పరమాత్మ ఆత్మగానూ ఉండడంవల్లనే అవుతుంది. ఇలా తీసుకుంటేనే. లోకం బ్రహ్మానికి కార్యమై ఉండడం, రెండూ ఒకటి అనిచెప్పడం చేతనాచేతన-ఈశ్వరుల స్వభావాలు ఒకదానితో ఒకటి కలిసిపోకుండా ఉండడం, అన్ని వేదవాక్యాలకీ వ్యతిరేకతలేకుండా ఉండడం మొదలైన అన్నీ తగియుంటాయి. కనుక, వెనకచెప్పినప్రకారం, సర్వేశ్వరుడైన నారాయణుడు నిమిత్తకారణంగా అవడంలో ఏమీ లోటులేదు.

ఇతరవ్యపదేశాధికరణం పూర్తి అయింది.

## *॥ ఉపసంహారదర్శనాధికరణమ్ ॥ (2-1-8)*

### *సూ. ॥ ఉపసంహారదర్శనాన్నేతి చేన్న క్షీరవద్ధి ॥ (2-1-24)*

***ఉపసంహారదర్శనాత్:*** (లోకంలో కార్యవస్తువులని సృష్టించేటప్పుడు ఉపకరణాలని) ఉపకరించేవిగా చూస్తున్నాంగనుక, ***న:*** (అటువంటి ఉపకరణాలులేని పరమాత్మవస్తువు) కారణం అవడానికి శక్యంగాదు, ***ఇతి చేత్:*** అన్నట్లైతే, ***న:*** ఈఆక్షేపం కుదరదు. ***క్షీరవత్:*** పాలు(ఉపకరణాల సహాయంలేకుండానే) పెరుగుగా మారినట్లుగానే, (ఉపకరణంలేని బ్రహ్మంకూడా కారణం అవవచ్చును **హి-** ఇది లోకంలో ప్రసిద్ధము

*94. వైలక్షణ్యం పరస్యోక్తం సత్యసంకల్పతాదిభిః ।*
*సంకల్పమాత్రతః సృష్టిః న యుక్తేత్యేతదస్యతే॥*

94. సర్వజ్ఞుడై, సత్యసంకల్పుడైన పరమాత్మ అటువంటి మహత్త్వాలులేనటువంటి జీవుడికంటే, వేరైనవాడు అన్నది వెనుకటి అధికరణంలో చెప్పబడింది. ఆవిధంగా సత్యసంకల్పుడై ఉన్నప్పటికీ, ఉపకరణాలసహాయంలేకుండా కేవలం సంకల్పంవల్ల సృష్టించడం ఆతనికి తగదు అనే ఆక్షేపం ఈఅధికరణంలో నిగ్రహించబడుతోంది.

పూ. *95. కారకౌఘోపసంహారదర్శనాత్కార్యసర్జనే।*
*నిస్సహాయబ్రహ్మణోఽస్య న జగద్ధేతుతా భవేత్॥*

95. **పూర్వపక్షం:--** లోకంలో కుమ్మరి మొదలైనవాళ్ళు ఎంత శక్తిమంతులైఉన్నప్పటికీ, కుండమొదలైన వస్తువులని చేసేటప్పుడు దండం, చక్రం మొదలైనకారక(ఉపకరణ)సమూహాలని సహాయంగా తీసుకొనే వీటిని చెయ్యడం మనం చూస్తూనే ఉన్నాం. కనక, పరమాత్మ సర్వజ్ఞుడూ, సత్యసంకల్పుడూ అయినప్పటికీ, ఉపకరణాలులేకుండా లోకాన్ని సృష్టించేడు అని చెప్పడం కుదరదు. కనుక, బ్రహ్మం జగత్కారణమవడం కుదరదు అని స్పష్టం అవుతోంది.

సి. *96. ఇతి చేన్నాసహాయస్య యథా క్షీరస్య హేతుతా।*
*దధిభావే తథాఽస్యాపి సంభవేద్విశ్వహేతుతా॥*

***96.*** **సిద్ధాంతం:-- ఈపూర్వపక్షం తప్పు.** ఉపకరణాలసాయం ఏదీలేకుండానే పాలు పెరుగుకి కారణం అవడంలాగ, ఉపకరణాలులేని బ్రహ్మంకూడా లోకానికి కారణం అవడంలో లోటులేదు. పాలని కాచి కొంచెం మజ్జిగని తోడువేసినతరువాతనే పెరుగు అవడంవల్ల ఉపకరణాలసహాయం కూడా కనబడుతోందే

అంటే, కాచి, తోడుపెట్టకపోయినా, పాలు పెరుగుగడ్డగా మారడం వల్ల దానికి ఉపకరణాలసహాయం అవసరంలేదు అన్నది స్పష్టం అవుతోంది. తొందరగా రుచికరమైన పెరుగుని పొందడంకోసం పాలు మరగబెట్టి కొంచెం మజ్జిగని చేర్చబడుతోంది అని గ్రహించవలెను.

## సూ. ॥ దేవాదివదపి లోకే ॥ (2-1-25)

***లోకే:*****--** తమతమలోకాలలో, **దేవాదివత్ అపి:--** దేవతలు మొదలైనవాళ్ళ(సంకల్పమాత్రంచేత సృష్టిస్తున్నట్లుగా శాస్త్రాలవల్ల తెలుస్తోంది.)లాగే, (బ్రహ్మంకూడా సంకల్పంచేతనే లోకాలని సృష్టించ డానికి లోటులేదు.)

*97. యథా దేవాదయః స్వే స్వే లోకే సఙ్కల్పమాత్రతః।*
*సృజన్త్యాత్మా పేక్షితాని తథాసౌ పురుషోత్తమః॥*
*98. స్వసఙ్కల్పేనైవ కృత్స్నం జగత్సృజతి చావశః।*
*దృష్టాన్తోక్తిర్బ్రహ్మణోऽత్ర సుఖగ్రహణసిద్ధయే॥*

॥ ఇత్యుపసంహారదర్శనాధికరణమ్ ॥

***97-98.*** దేవతలు మొదలైనవాళ్ళు తమతమలోకాలలో తమతమకి కావలసిన వస్తువులని కేవలం సంకల్పంవల్లనే సృష్టించుకొంటున్నారని ఎలా శాస్త్రాలవల్ల తెలుసుకొంటున్నామో, అలాగే,

## కృత్స్నప్రసక్త్యధికరణమ్ ॥ (2-1-9)

## పూ. సూ. ॥ కృత్స్నప్రసక్తిర్నిరవయవత్వశబ్దకోపోవా (2-1-26)

(బ్రహ్మం ఉపాదానకారణం అని అంగీకరించినట్లైతే) **కృత్స్నప్రసక్తిః (ఆబ్రహ్మం అవయవాలు లేనిదవడంవల్ల) బ్రహ్మం పూర్తిగా కార్యవస్తువుగా మారవలసివస్తుంది. (ఈదోషాన్ని తప్పించడంకోసం ఆబ్రహ్మం అవయవాలతో కూడిఉన్నది అని అంగీకరిస్తే) నిరవయవత్వశబ్దకోపః వా:-** బ్రహ్మం అవయవాలులేనిది అని చెప్పే వేదవాక్యాలు బాధింపబడినవి ఔతాయి.

*99. ఉక్తా ప్రాక్ క్షీరదృష్టాన్తాత్ విశ్వారమ్భకతేశితుః।*
*తత్ర దృష్టాన్తవైషమ్యశఙ్కాऽత్ర వినివార్యతే॥*

99. పాలని దృష్టాంతంగా చూపించి బ్రహ్మం జగత్కారణం అవడంలో లోటేమీలేదని వెనకటి అధికరణంలో నిరూపించబడింది. అవయవాలతోఉన్న పాలని అవయవాలులేని బ్రహ్మనికి దృష్టాంతంగా చెప్పడం కుదరదు అనే సందేహం ఈఅధికరణంలో తీర్చబడుతోంది.

*పూ. 100. నిర్గతావయవస్యాస్య బ్రహ్మణో జగదాత్మనా।*
*పరిణామే స్వరూపం తత్ కృత్స్నం కార్యాన్వితం భవేత్॥*
*101. అంశేన పరిణామేతు నిరంశత్వావబోధకాః।*
*శబ్దాఃస్యుర్బాధితాస్తస్మాత్ కారణత్వమసంగతమ్॥*

100-101. **పూర్వపక్షం: నిరవయవియైన పరమాత్మవస్తువు** లోకంగా పరిణామం చెందడం అంగీకరిస్తే అటువంటి బ్రహ్మస్వరూపం పూర్తిగా కార్యంగా పరిణమించి, కారణస్థితిలోఉన్న బ్రహ్మం అనేది లేకుండా పోతుంది. అలా కార్యమైనప్పుడుకూడా, అవయవాలులేని బ్రహ్మస్వరూపం ఒకే కార్యవస్తువుగా పరిణమించాలితప్ప అనేక కార్యవస్తువులుగా పరిణమించవీలుగాదు అని చెప్పాలి. ఈదోషాన్ని పరిహరించడానికి బ్రహ్మనికి అవయవాలని అంగీకరించి ఒకవంతు కారణస్తితిలో ఉన్నట్లుగానూ, మరొకవంతు అనేకభాగాలుగా విభజింపబడి, అనేకకార్యవస్తువులుగా అయిందనిన్నీ అంగీకరిస్తే, "**నిష్కళం**

*నిష్క్రియం"*(శ్వే.6-19) (పరమాత్మవస్తువు అవయవాలులేనిది, క్రియలేనిది), *"సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవ"* (ఛాం. 6-2-1) (అబ్బాయీ, ఈలోకం మొదటలో సత్తుగనే ఉండెను; ఒక్కటిగానే ఉండెను) మొదలైనచోట్లలో బ్రహ్మాన్ని నిరవయవి అని చెప్పే వేదవాక్యాలు బాధింపబడినవౌతాయి. బ్రహ్మస్వరూపం నిరవయవియైనా, సూక్ష్మచేతనాచేతనాలతోనున్న బ్రహ్మమే స్థూలచేతనాచేతనాలతో నున్న బ్రహ్మంగా అవుతుందని అంగీకరించినందువల్ల విశేషణమైన అచేతనాంశ అవయవాలుకలిగినదిగా అంగీకరించి, కార్యకారణభావాన్ని నిర్వహించవచ్చుగదా అంటే, అలా తీసుకున్నా, శరీరియైన బ్రహ్మం తనకి కార్యమైన ఒకవస్తువుకే శరీరిగా ఉండలదుగాని అనేకవస్తువులకిశరీరిగా ఉండడం సాధ్యంగాదు అనేదోషం వచ్చితీరుతుంది. కనుక, అవయవాలులేని బ్రహ్మాన్ని అనేకవస్తువులకి ఉపాదానకారణంగా తీసుకోవడానికి సాధ్యంగాదు.

## *సి.సూ.॥ శ్రుతేస్తు శబ్దమూలత్వాత్॥ (2-1-27)*

శ్రుతేః **తు:- శ్రుతిలో** చెప్పినందువల్ల (నిర్వికారమైన బ్రహ్మం జగత్కారణం అవడంలో దోషం లేదు.) **శబ్దమూలత్వాత్:-** శాస్త్రంవల్లనే తెలవడంచేత (బ్రహ్మం లోకంలో కనబడుతున్న ఇతరవస్తువుల కంటే చాలా భిన్నవర్గానికి చెందినదవడంవల్ల ఇటువంటి దోషం లేదు)

*102. శ్రుతిప్రామాణ్యతో నైవమసామఞ్జస్యమాపతేత్।*
*బ్రహ్మణోఽనంశితాం విశ్వసర్గం చాహ శ్రుతిస్స్వయమ్॥*
*103. అస్యశబ్దైకవేద్యస్యాలౌకికస్య చ వస్తునః।*
*విచిత్రశక్తియోగోఽత్ర వేదోక్తో న విరుధ్యతే॥*
*104. సామాన్యతో దృష్టమూలం చోద్యం బ్రహ్మణి సర్వదా।*
*సర్వార్థవిసజాతీయే సర్వశక్తౌ న సంభవేత్॥*

102-104. **సిద్ధాంతం:-** వెనక చెప్పిన పూర్వపక్షం తప్పు. బ్రహ్మం నిర్వికారమై జగత్కారణంగాకూడా అవుతోంది అని నిర్దుష్టప్రమాణం అయిన శ్రుతియే చెప్తోంది. ఈశ్రుతిప్రమాణంబట్టి చూస్తే పూర్వపక్షంలో చెప్పిన దోషం రాదు. "నిప్పుతో నానబెట్టవలెను" అని చెప్పినట్టుగా కుదరని అర్థాన్ని శ్రుతి చెప్తుందా? నీటివికారంగా ఉంటూనే లోకానికి ఉపాదానంగాకూడా పరమాత్మవస్తువు అయింది అని చెప్పడం ఇలాంటి కుదరనిమాటేగదా! మట్టి కుండఅయినట్లుగా ఉపాదానకారణమైయుండే వస్తువులన్నీ వికారంపొందుతుండడం చూస్తున్నదేగా అంటే ఈబ్రహ్మం అనేది లోకంలో కనిపించే వస్తువులలాగ ప్రత్యక్షంవల్లో అనుమానంవల్లో తెలిసేదిగాదు. శాస్త్రం ఒక్కదానివల్లనే తెలిసేదై లోకంలో కనిపించేవస్తువులకి ఆవలిపక్కన ఉన్నది. వేదాలవల్ల దీనిని తెలిసికొన్నప్పుడు నిర్వికారంగానూ, ఉపాదానకారణంగానూ, ఉండగలిగిన విచిత్రమైన శక్తినిగలదిగానే ఇది తెలియబడుతోంది. కనుక సాధారణంగా లోకంలో కనిపించే పద్ధతులవల్ల లోకరీతినిమించిన సర్వశక్తిమంతమైన బ్రహ్మవిషయంలో మాటలు వినడం తగదు. కనుక, శ్రుతిలో చెప్పినప్రకారం నిర్వికారమైనదనిన్నీ, లోకానికి ఉపాదానకారణమనిన్నీ బ్రహ్మాన్ని అంగీకరించడంలో ఏవిధమైన లోటూ లేదు.

## *సి.సూ. ఆత్మని చైవం విచిత్రాశ్చ హి॥ (2-1-28)*

**ఆత్మని చ: జీవాత్మ విషయంలోనూ** (అచేతనమైన వస్తువుల గుణంలేకుండాఉండే విషయంలో) **ఏవమ్:** ఈవిధంగానే ఉన్నది. **విచిత్రాః చ హి:** (అచేతనవస్తువులలో ఒకదాని గుణం మరోదానిలో లేకుండా ఉండే గుణాలు) విచిత్రంగా కదా ఉన్నాయి.

*105. అచేతనవిజాతీయత్వాదేవాచిద్గతా గుణాః।*
*న చేతనే ప్రసజ్యన్తే విజాతీయేష్వచిత్స్వపి॥*

*106. అగ్నివార్యాది కేష్వేవమాసతేऽద్భుతశక్తయః।*
*ఏవం పరాత్మనోపి స్యుః విచిత్రాశ్శక్తియస్సదా॥*

105-106. లోకంలో కనబడే అచేతనపదార్థాలలో అల్పంగా ఉండడం, అస్థిరమై(ఒకస్థితిని కలిగి ఉండకపోవడం) ఉండడం, ఇంకా ఎన్నో దోషాలకి స్థానం అయిఉండడం మొదలైన లోటుపాట్లు కనబడుతున్నాయి. వాటిలో కనబడుతుండడంవల్ల ఇవి ఆత్మలోకూడా, ఉండాలి అని చెప్పగలమా? అలా చెప్తే, ఆత్మఅనేది అచేతనపదార్థాలకంటే, బాగాభిన్నమైనదిగానే స్వానుభవంవల్లా, శాస్త్రంవల్లా, తెలుస్తోంది. కనుక, అచేతనపదార్థాలగుణాలు ఇందులో ఉండవు (కలగవు) అనే సమాధానం చెప్పాలి. ఇక కంటికి తెలిసే అచేతనపదార్థాలనే తీసుకొని చూసినా, నిప్పులో సహజంగా ఉండే వేడితనం, మిగతా ఏపదార్థాలలోనూ కనబడదు, నీటిలో సహజంగా ఉండే చల్లదనం మిగతా ఏపదార్తాలలోనూ కనబడదు. ఎందుకు కనబడలేదు అని వీటివిషయాలలో ప్రశ్నిస్తే ఆయాగుణాలు ఆయాపదార్థాలకే సంబంధించినవి అనే బదులు చెప్పవలసివస్తుంది. అలాగే, నిర్వికారంగానూ, ఉపాదానకారణంగానూ ఉండడానికి కావలసిన విచిత్రశక్తి ఎప్పుడూకూడా, బ్రహ్మానికే ఉన్నది అనడానికి లోటులేదు. శ్రీవిష్ణుపురాణంలో

*నిర్గుణస్యాప్రమేయస్య శుద్ధస్యాప్యమలాత్మనః। కథం సర్గాదికర్తృత్వం బ్రహ్మణోऽభ్యుపగమ్యతే॥*
*(వి.పు. 1-3-1)*

(సత్త్వాదిగుణాలులేనివాడై, దేశకాలాదులచేత అపరిచ్ఛిన్నుడై, శరీరంలేనివాడై, పుణ్యపాపాలులేనివాడై, ఉండేపరమాత్మకి లోకాలని సృష్టించడం మొదలైన కార్యాలు ఎలా అంగీకరించబడుతున్నాయి?) అని "లోకంలో సత్త్వాదిగుణాలుగలవారై, దేశకాలాదిపరిచ్ఛిన్నులై , శరీరంగలవారై పుణ్యపాపాలుగలవారైన కుమ్మరి మొదలైనవారే కుండ మొదలైనవాటిని సృష్టించడం చూచినప్పుడు ఈగుణాలులేనటువంటి పరమాత్మ జగత్సృష్టి మొదలైనవాటిని చెయ్యడం ఎలా కుదురుతుంది"అని మైత్రేయుడు ప్రశ్నించగా,

*"శక్తయః సర్వభావానాం అచిన్త్యజ్ఞానగోచరాః। యతోऽతో బ్రహ్మణస్తాస్తు సర్గాద్యా భావశక్తయః॥*
*భవన్తి తపతాంశ్రేష్ఠపావకస్యయథోష్ణతా॥* *(వి.పు. 1-3-2,3)*

(నిప్పుకున్న ఉష్ణశక్తిలా ప్రతీపదార్థానికీ దానికి తగిన శక్తులు తర్కానికి నిలవలేనివిగాను, ఆపదార్థాన్ని తెలిపే ప్రమాణంచేతనే తెలియబడేవిగాను, ఉన్నాయి. ఇలా ఉండడంచేత బ్రహ్మానికి ఉండే సృష్టి మొదలైనవాటికి అవసరమైన శక్తులు ఇటువంటివే ఉన్నాయి) అని పరాశరులు సమాధానం చెప్పడం ఇక్కడ అనుసంధించతగినది.

### *సి.సూ. ॥ స్వపక్షదోషాచ్చ ॥ (2-1-29)*

***స్వపక్షదోషాత్ చ:-*** (ప్రధానం మొదలైనవి కారణం అని చెప్పే) మీపక్షంలో దోషం ఉండడంవల్లనూ (బ్రహ్మమే ఉపాదానకారణం అవుతుంది)

*107. లౌకికార్థసజాతీయప్రధానాదౌ చ కారణే।*
*లోకదృష్టా దోషగణా భవేయురత ఏవ చ॥*

*108. విలక్షణం తత్ బ్రహ్మైవ కారణం భవితుం క్షమమ్।*
*అనేకదోషదుష్టత్వాత్ న ప్రధానాది కారణమ్॥*

107-108. బ్రహ్మం ఉపాదానం అనే విషయంలో పూర్వపక్షిచేత చెప్పబడ్డ దోషం నిజంగా

"ప్రధానం ఉపాదానమ్" అనే పూర్వపక్షి తాలూకు పక్షంలోనే వస్తుంది. ఎలా అంటే, అచేతనం ఐన ప్రధానం కారణం అని అంగీకరించే పూర్వపక్షి దానిని అవయవాలులేనిదిగాకూడా ఒప్పుకొంటున్నాడు. ఈవిధంగా అవయవాలులేనిదవడంవల్ల ప్రధానం పూర్తిగా కార్యవస్తువుగానే పరిణమిస్తుందని అంగీకరించవలసిరావడంవల్ల లోకంలో చూస్తున్నవిధంగా ప్రధానం పూర్తిగా ఒకకార్యపదార్థంగా అవగలదేతప్ప ఎన్నో కార్యపదార్థాలుగా అవడం శక్యంగాదు అనే దోషం పూర్వపక్షంలోనే వస్తుంది. నిరవయవియైన అణువును కారణంగా అంగీకరించేవాళ్ళ పక్షంలోకూడా ఈదోషం వస్తోంది. ప్రధానం, పరమాణువులు, లోకంలో చూడబడే కార్యపదార్థాలతో సమానమైన ఒకేరకమైనవి అవడంవల్ల వాటిని కారణంగా అంగీకరించేవాళ్ళపక్షంలో ఈదోషం లేకుండాపోవడానికే వీల్లేదు. బ్రహ్మాన్ని ఉపాదానంగా చెప్పే మనపక్షంలో వెనకచెప్పినట్లుగా బ్రహ్మం లౌకికపదార్థాలకంటే చాలా భిన్నమైనదవడంవల్ల ఈదోషం రావడానికే అవకాశం లేదు. చేతనాచేతనాత్మకమైన లోకానికి కేవలం అచేతనమైన ప్రధానమో, పరమాణువో కారణం అవడానికి వీలులేదనడం మొదలైన అనేక ఇతరదోషాలు ప్రధానాదికారణవాదంలో ఏర్పడుతున్నాయి. కనుక, లోకవిలక్షణమైన బ్రహ్మమే లోకానికి ఉపాదానకారణం ఔతుంది అన్నది తగియున్నటువంటివాదం.

*సి.సూ. ॥ సర్వోపేతా చ తద్దర్శనాత్ ॥ (2-1-30)*

**సర్వోపేతా చ:-** (పరదేవత) సమస్తశక్తులనీ కలిగినది. **తద్దర్శనాత్:-** శ్రుతి అలా చెప్పడం వల్ల.

*109. సర్వశక్తియుతా హ్యేషా దేవతా పరమా సదా।*
*"పరాస్య శక్తి"రిత్యాది శ్రుతిరర్థం బ్రవీత్యముమ్॥*

109. లోకంలో కనపడే సమస్తపదార్థాలకంటే, చాలాభిన్నమైన ఈపరదేవత ఎల్లప్పుడూ, సమస్తశక్తులని కలిగియున్నది. ఈవిషయాన్ని *"పరాస్యశక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ"* ***(శ్వే.*** 6-8) (ఈపరమాత్మకిస్వభావసిద్ధమైనది, అనేకరకాలైనశక్తి, జ్ఞానం, బలం, క్రియ, ఉన్నాయి అనిచెప్పబడుతోంది) అని వేదవాక్యంకూడా చెప్తోంది. కనుక, విచిత్రమైన శక్తిగల పరమాత్మవస్తువు వికారంలేనిదిగాను, ఉపాదానకారణంగాను, అవడానికి ఏమీ అడ్డులేదు. ఇక సూక్ష్మమైన చిదచిత్తులకి అంతర్యామిగాఉండి, బ్రహ్మం కారణం అయిందనిన్నీ, స్థూలమైన వాటికి అంతర్యామిగా ఉంటూ, అదే కార్యం అయిందనిన్నీ అనే సిద్ధాంతంలో అంగీకరించబడడంచేత, విశేషణమైన అచేతనాంశం అవయవంగలదిఅని బ్రహ్మం ఉపాదానం అవడాన్ని నిర్వహించవచ్చుగదా అనే సందేహం వస్తే, అప్పుడుకూడా బ్రహ్మం తనకార్యజాతంలో ఒకదానికే అంతర్యామిగా ఉండడంకుదురుతుందితప్ప, ఎన్నింటికో అంతర్యామిగా ఉండడం సాధ్యంకాదు, అలా అంగీకరిస్తే బ్రహ్మస్వరూపం అవయవి అయిఉండాల్సివస్తుంది"అని పూర్వపక్షంలో చెప్పినదానికి బ్రహ్మం మిగతాపదార్థాలలో కనబడనటువంటి విచిత్రశక్తియుక్తం అవడంవల్లనే అది వికారంలేనిదయినా అనేకపదార్థాలకి అంతర్యామిగా ఉండగలదు అన్నదే సమాధానం. సూక్ష్మచేతనాచేతనాలతోకలిసిఉండడం అనే కారణస్థితిని వదిలి స్థూలచేతనా చేతనాలతో కలిసిఉండడం అనే కార్యస్థితిని పొందడమే బ్రహ్మానికి ఒకవికారమేగదా అంటే, బ్రహ్మానికి స్వరూపంలోనే ఎలాంటి వికారం ఉండదనేతప్ప, స్వభావాలలో వికారాలుంటాయి అని తీసుకుంటాం. కాని మిగతా పదార్థాలకిలా బ్రహ్మస్వభావవికారాలు ఆబ్రహ్మానికి దోషాలనిచ్చేదిగాదనడంలో విశేషాన్నే చెపుతోంది. బ్రహ్మానికి వికారంలేదు అనిచెప్పేవాక్యాలు 'దానిస్వరూపంలో పూర్తిగా వికారంలేదు; స్వభావంలోకూడా దోషాన్నిచ్చేవికారాలు లేవు' అనేభావాన్ని కలిగిఉన్నవే. ఇలా బావించకపోతే 'కర్తా వికర్తా'

(సుబాలోపనిషత్తు) అని బ్రహ్మానికి స్వభావవికారాన్ని చెప్పే ఉపనిషద్వాక్యాలు విరోధిస్తాయి. కనుక ఈవిధంగా కారణస్థితినివదిలి కార్యస్థితిని పొందడం అనే స్వభావవికారంబ్రహ్మానికి సర్వశరీరిత్వం అనే మహత్త్వాన్నే ఇస్తుందిగనుక నిర్వికారశ్రుతివిరోధం లేదు అన్నది గర్తించదగినది.

### సి.సూ. ॥వికరణత్వాన్నేతి చేత్తదుక్తమ్॥ (2-1-31)

***వికరణత్వాత్:*** (బ్రహ్మానికి) శరీరం, ఇంద్రియాలు లేకపోవడంవల్ల, ***న:*** (బ్రహ్మం) నిమిత్తకారణంగా ఉండశక్యంగాదు. ***ఇతి చేత్:*** అన్నట్లయితే, ***తత్ ఉక్తమ్:*** ఈవిషయంలో ఇదివరకే సమాధానం చెప్పబడింది.

*110. "న తస్య కార్య"మిత్యాదిశ్రుత్యా దేహేన్ద్రియోజ్ఝితాత్।*
*న కార్యారంభ ఇతి చేత్పూర్వమత్రోక్తముత్తరమ్॥*
*111. "శ్రుతేస్తు శబ్దమూలత్వా"దిత్యాదావాహ చ శ్రుతిః।*
*"పశ్యత్యచక్షు"రిత్యాద్యా తస్మాద్బ్రహ్మైవ కారణమ్॥*

*॥ఇతి కృత్స్నప్రసక్త్యధికరణమ్॥*

110-111. బ్రహ్మం వికారంలేనిదిగాను, ఇతరపదార్థాలకంటె వేరైనదిగాను, సర్వశక్తిమంతమైనదిగాను, ఉండడంవల్ల సంకల్పమాత్రంచేతనే సృష్టిస్తుందనిన్నీ ఒప్పుకున్నా, అటువంటి సంకల్పం నిత్యమైతే ప్రళయకాలంతోసహా అన్నిసమయాలలోనూ సృష్టిస్తూ ఉండాలిగనుక ఆసంకల్పం అనిత్యమనే ఒప్పుకోవాలి. అటువంటి అనిత్యసంకల్పాన్ని లోకంలో శరీరేంద్రియాలుగలవాడికే ఉండడం మనం చూస్తున్నాంగనుక, *"న తస్య కార్యం కరణం చ విద్యతే"*(శ్వే. 6-8)(ఆపరమాత్మకి సరీరం, ఇంద్రియాలు లేవు) అనే శ్రుతిప్రకారం శరీరేంద్రియాలు లేని బ్రహ్మానికి ఆఅనిత్యసంకల్పం తగిఉండదుగనుక బ్రహ్మం నిమిత్తకారణం అవడానికి శక్యంగాదుకదా అంటే, "శ్రుతేస్తు శబ్దమూలత్వాత్", "ఆత్మని చైవం విచిత్రాశ్చైవహి" అన్న వెనుకటి సూత్రాలలో చెప్పినప్రకారంబ్రహ్మం విచిత్రశక్తులనిగలదిగా శ్రుతిలో తెలియడంవల్ల, అటువంటి శక్తితో శరీరేంద్రియాలులేకపోయినా అనిత్యసంకల్పం కూడా బ్రహ్మానికి తగియున్నదే అని స్వీకరించేంగనుక, బ్రహ్మం నిమిత్తకారణం అని అనడంలో తప్పేమీ లేదు. *"పశ్యత్యచక్షుః", "సశ్రుణోత్యకర్ణః"* (శ్వే.3-19) (పరమపురుషుడు కన్నులేకనే చూస్తున్నాడు, చెవిలేకనే వింటున్నాడు) అనిశ్రుతికూడా ఈవిచిత్రశక్తి వీనికి ఉన్నదని చూపించింది. కనుక, బ్రహ్మం నిమిత్తకారణంగానూ, ఉపాదానకారణంగాను అవడంలో ఎటువంటి అభ్యంతరం లేదు.

కృత్స్నప్రసక్త్యధికరణం పూర్తి అయినది.

## ॥ప్రయోజనత్వాధికరణమ్॥ (2-1-10)

### పూ.సూ. ॥న ప్రయోజనత్వాత్ ॥ (2-1-32)

**ప్రయోజనత్వాత్** - (సృష్టి మొదలైన) ఒక ఫలాన్ని గలదిగా ఉండవలసినదవడంచేత. **న** - (సమస్త ప్రయోజనమును పొందే పరమాత్మ) జగత్కారణము కాలేదు.

*112. జగత్స్రష్టత్వముక్తం ప్రాక్ స్వేచ్ఛ్యైవ పరాత్మనః ।*
*సృష్టేః ప్రయోజనాభావాత్తన్న స్యాదితి వార్యతే॥*

112. వెనుకటి అధికరణంలో పరమాత్మతన ఇచ్ఛవల్ల లోకాన్ని సృష్టించినట్లుగా చెప్పబడింది. ఈవిధంగా సృష్టించబడడంచేత పొందదగినఫలం ఏదీ పరమాత్మకి లేదుగనుక అది జగత్కారణం అవడానికి వీలులేదు అనే ఆక్షేపానికి ఈఅధికరణంలో సమాధానం ఇవ్వబడుతోంది.

*113. ఫలావినాభూతతయా సృష్టేస్తస్య పరాత్మనః।*
*అవాప్తాఖిలకామస్య వైముఖ్యాత్తత్ప్రయోజనే॥*

*114. న స్రష్టృత్వం, సమారమ్భే కార్యాణాం ద్వివిధం ఫలమ్।*
*స్వార్థః పరార్థ ఇతిచ పూర్ణస్యాస్య న చాదిమః ॥*

*115. దయాలోర్నాన్తిమో దుఃఖయుగ్గగత్సృష్ట్యసంభవాత్ ।*
*తస్మాత్ జగత్కారణత్వం బ్రహ్మణోఽస్య న సంభవేత్॥*

113-115. **పూర్వపక్షం:** ఒకడు ఏవస్తువునైనా సృష్టించాలంటే, అలా సృష్టించడంవల్ల వాడికి ఒక ప్రయోజనం ఉండాలి. పరమాత్మ 'అవాప్తసమస్తకాముడు' (పొందవలసిన సమస్తఫలాలనీ పొందేఉన్నాడు) అని చెప్పబడుతున్నాడు. కనుక జగత్సృష్టిచేసి పొందవలసిన ఫలం ఏమీ పరమాత్మకి లేదుగనుక, అది జగత్సృష్టిని చేసేదిగా ఉండడానికి వీలులేదు. ఒకడేదైనా పనిని మొదలుపెట్టాలంటే, దానివలన తనకిగాని ఇతరులకిగాని ఒక ప్రయోజనం ఉండాలి. సమస్తఫలాలనీ సహజంగానే పొందిఉన్నటువంటి పూర్ణుడైన పరమాత్మ తనకోప్రయోజనాన్ని ఆశించి జగత్తుని సృష్టించడం మొదలైనవాటిని చేస్తున్నాడంటే అదిగూడా కుదరదు. ఎలా అంటే, ఈలోకం అనేది గర్భవాసం, జన్మ, ముసలితనం, మరణం నరకం మొదలైన అనేకములైన దుఃఖాలని తనలో కలిగిఉన్నది. జీవులకి ఈదుఃఖాలనిచ్చే జగత్సృష్టి మొదలైనవాటిని పరమకారుణికుడైన పరమాత్మ చెయ్యవీలుగాదు. అందువల్ల ఇలా తనకిగాని ఇతరులకిగాని ఒకప్రయోజనాన్నాశించి పరమాత్మవస్తువు జగత్సృష్టి మొదలైనవాటిని ప్రారంభించడం వీలుగాదుగనుక బ్రహ్మం జగత్కారణం అవడం కుదరదు.

## సి.సూ. ॥ లోకవత్తు లీలాకైవల్యమ్॥ (2-1-33)

**లోకవత్ తు: లోకంలో (రాజులకి బంతాట మొదలైన లీలలు)లాగ, లీలాకైవల్యం -** కేవలం లీలయే (జగత్సృష్టి మొదలైనవాటికి ప్రయోజనం అవుతుంది).

*116. లీలైవ కేవలాసర్గే బ్రహ్మణోఽస్య ప్రయోజనమ్।*
*భవేత్సంపరిపూర్ణస్య లోకబుద్ధిమతో యథా॥*

*117. రాజ్ఞో లీలైకఫలికా కన్దుకాద్యాశ్చ కేలయః।*
*తథైవ బ్రహ్మణస్సృష్టేః లీలైవ స్యాత్ప్రయోజనమ్॥*

116-117. **సిద్ధాంతం:** పరిపూర్ణమైన బ్రహ్మానికి జగత్సృష్టిమొదలైనవాటిని చేసేటప్పుడు లీలామాత్రమే ప్రయోజనం అవుతుంది. లీల అంటే - అప్పటికి కలిగే రసం. లోకంలో సమస్తసంపదలనీ కలిగిన రాజుకి బంతి ఆడుకోవడం మొదలైన ఆటలు ఎలా ఒకప్రయోజనంలేకుండా అప్పటికి కలిగే ఆనందాన్ని పొందడమే కలిగిఉంటున్నాయో అలాగేపరమాత్మవస్తువు లోకాన్ని సృష్టించడంకోసం లీల ఒక్కటే ప్రయోజనం.

## సి.సూ.॥ వైషమ్యనైర్ఘృణ్యే న సాపేక్షత్వాత్ తథాహి దర్శయతి ॥ (2-1-34)

**వైషమ్యనైర్ఘృణ్యే** - (దేవతలు మొదలైన గొప్పతనం అల్పత్వాలున్న సృష్టిలో)పక్షపాతం, కారుణ్యంలేకపోవడం; **న-** (బ్రహ్మానికి) కలగవు. **సాపేక్షత్వాత్** - (గొప్పతనం, అల్పత్వాలున్న సృష్టి) కర్మాన్ని ఎదురుచూస్తూండడంవల్ల **తథాహి దర్శయతి** - శ్రుతికూడా ఈవిషయాన్ని చూపుతోందిగదా!

*118. దేవాద్యుత్కృష్టాదిసృష్ట్యా వైషమ్యం పరమాత్మనః।*
*దుఃఖాన్వయప్రాపణాచ్చ నైర్ఘృణ్యమపి సంభవేత్॥*

118. **పూర్వపక్షం:** బ్రహ్మం కారణం అనే పక్షంలో పరమాత్మ ఒకడిని దేవుడిగానూ, మరొకడిని మనుష్యుడుగానూ ఇంకామరొకడిని తిర్యక్కుగానూ, వేరొకజీవుడిని స్థావరంగానూ సృష్టించేడు అని అంగీకరించడం అవుతుంది. దీనివల్ల ఆయన పక్షపాతంగలవాడు అనేదోషం వస్తుంది. వీళ్ళు సంసారంలో సామాన్యంగా దుఃఖాన్నే అనుభవించడంవల్ల పరమాత్మ కరుణలేనివాడు, అని అనాల్సివస్తుంది. అందువల్ల బ్రహ్మకారణవాదం కుదరదు.

*119. ఇతి చేత్ తే నహి స్యాతాం సృజ్యమానాఖిలాత్మనామ్।*
*తత్తత్కర్మాపేక్షితత్వాత్తత్తత్సృష్టేః, తథా శ్రుతిః॥*

*120. "సాధుకారీ సాధు"రితి తథా పారాశరరీ స్మృతిః।*
*"నిమిత్తమాత్రమేవాసా"విత్యాద్యాఽర్థం బ్రవీత్యముమ్॥*

119-120. **సిద్ధాంతం:** పక్షపాతం అనే వైషమ్యం, దయారాహిత్యం అనే నైర్ఘృణ్యం పరమాత్మకి కలుగవుగనుక ఈపూర్వపక్షం తప్పు. ఎలా అంటే, పరమాత్మ జీవులని శరీరంతో చేర్చి సృష్టించేటప్పుడు వారువారు ఇదివరకు చేసియున్న పుణ్యపాపాలని చూసి పుణ్యపాపాల ఎక్కువ తక్కువల ప్రకారం దేవశరీరం మొదలైన ఎక్కువతక్కువలున్న శరీరాలతో చేర్చి సృష్టించడంవల్ల పక్షపాతం, వీళ్ళు చేసిన పాపాలకి ఫలంగానే దుఃఖాలని అనుభవింపజేయడంవల్ల దయారాహిత్యమున్నూ ఏర్పడవు. *"సాధుకారీ సాధుర్భవతి. పాపకారీ పాపో భవతి. పుణ్యః పుణ్యేన కర్మణా పాపః పాపేన కర్మణా"* **(బృహ. 6-4-5) (మంచికర్మలు చేసేవాడు మంచి శరీరం గలవాడవుతాడు. చెడ్డపనులని చేసినవాడు తుచ్ఛమైన శరీరంగలవాడవుతాడు. ముందే చేసినమంచికర్మల వల్ల ఇప్పుడు మంచిపనులనీ చెడ్డపనులవల్ల చెడ్డపనులనీ చేస్తాడు) అని శ్రుతికూడా చేతనుడి కర్మలప్రకారమే హెచ్చుతక్కువలున్న** సృష్టి, అది కారణంగా కలిగే దుఃఖానుభవం కలుగుతాయి అని చూపబడింది.

*నిమిత్తమాత్రమేవాసౌ సృజ్యానాం సర్గకర్మణి। ప్రధానకారణీభూతా యతో వై సృజ్యశక్తయః॥*
*నిమిత్తమాత్రం ముక్త్వైవం నాన్యత్ కించిదపేక్షతే।*
*నీయతే తపతాం శ్రేష్ఠ స్వశక్త్యా వస్తు వస్తుతామ్॥* *(వి.పు. 1-4-51,52)*

(సృష్టించబడే వస్తువులని సృష్టించే విషయంలో భగవానుడు కేవలం నిమిత్తమాత్రుడు. సృష్టింపబడే జీవులకర్మవాసనలనే శక్తులు ఈవిషయంలో ముఖ్యకారణాలవుతున్నాయి. దేవతలు మొదలైన కార్యజాతాలు నిమిత్తమాత్రమైన ఈభగవానుడిని తప్పిస్తే మరొక నిమిత్తాన్ని అపేక్షించడంలేదు. ఆపదార్థాలు ఇదివరకు చెప్పిన కర్మవాసనలనే శక్తులవల్లనే ఆయాకార్యజాతాలుగా అయే గుణాన్ని పొందుతున్నాయి.) అని శ్రుతుల అర్థాన్ని ప్రకాశింజేసిన పరాశరులుకూడా ఈవిషయాన్ని తెలియజేసేరు. కనుక, ఈవిధంగా చేతనుడు చేసిన కర్మ కారణంగానే హెచ్చుతగ్గులున్న సృష్టి, దుఃఖానుభవం కలగడంవల్ల పరమాత్మకి వైషమ్యనైర్ఘృణ్యాలు కలుగవు అని స్పష్టం.

*సి.సూ.॥ కర్మావిభాగాదితిచేన్నానాదిత్వాదుపపద్యతే చాప్యుపలభ్యతే చ॥ (2-1-35)*

***న కర్మ*** -(సృష్టికాలంలో) కర్మం లేదు; ***అవిభాగాత్*** -(అప్పుడు) బ్రహ్మంగానిది మరొకటిసేదు అని శ్రుతి చెప్పడాన్నిబట్టి (జీవుడులేడు అని స్పష్టమవడంవల్ల) ***ఇతి చేత్*** - అన్నట్లైతే, ***న*** - అది సరిగాదు. ***అనాదిత్వాత్*** - జీవుడు అనాదిగనుక, ***ఉపపద్యతే చ*** - (అనాదియైనా, బ్రహ్మమొక్కటే ఉండెను అని శ్రుతికూడా) అంగీకరిస్తుంది. ***ఉపలభ్యతే చ*** -(జీవుడు అనాది అని శ్రుతిలోకూడా) కనబడుతోంది.

*121. "సదేవే"త్యాదివాక్యే చావిభాగశ్రవణాత్తదా।*

*జీవ న స్యుః కర్మ కుతః ప్రాక్సృష్టేః కథముచ్యతే॥*

*122. సృష్టివైషమ్యమితిచేన్న జీవానాం చ కర్మణామ్।*

సి. *అనాదిత్వాత్, జీవతత్త్వే తత్కాలే పరమాత్మని॥*

**121-*122 పూర్వపక్షం:** *"సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్"* (ఛాం. 6-2-1) (అబ్బాయీ, ఈలోకం మొదటలో సత్ అనెడి బ్రహ్మముగనే ఉండెను) అనే శ్రుతిలో ఏవకారంవల్ల సృష్టికాలంలో బ్రహ్మం తప్పిస్తే జీవులులేరు అని చెప్పడంవల్ల జీవులగురించి ఉండే కర్మం సృష్టికి ముందు ఉండడానికి సాధ్యంగాదు. అందువల్ల, సృష్ట్యాదిలో కర్మంలేకుండానే జీవులని ఎక్కువతక్కువలతో పరమాత్మ సృష్టించినట్లు అంగీకరించాలిగనుక బ్రహ్మం పక్షపాతం, నైర్ఘృణ్యం గలది అనే ఆక్షేపాన్ని జీవుడి కర్మతో పరిహరించబడుతోంది అని ముందరిసూత్రంలో చెప్పడం కుదరదు.

*123. అవిభక్తం చాతిసూక్ష్మం కర్మాద్యస్తి యతస్తతః।*
*అవిభాగశ్చోపపన్నః న చేదేవం సమాపయేత్॥*

*124. అకృతాభ్యాగమకృతనాశదోషద్వయం స్థిరమ్।*
*"న జాయత" ఇతి శ్రుత్యా లభ్యతే జీవనిత్యతా॥*

**125. తస్మాత్ జగత్కారణం త్ బ్రహ్మైవేతి చ సుస్థితమ్।*

122*-*125. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం దోషభూయిష్ఠం. జీవులు, వాళ్ళ కర్మ అనాదిగనుక, వెనకచెప్పిన ఆక్షేపానికి అవకాశమే లేదు. "**సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్**" (ఛాం. 6-2-1) (అబ్బాయీ, ఈలోకం మొదటలో సత్ అనెడి బ్రహ్మముగనే ఉండెను) అనేవాక్యంవల్ల సృష్టికాలంలో బ్రహ్మంతప్పిస్తే జీవులులేరు అని అవదు. జీవులు నామరూపవిభాగానర్హులై సూక్ష్మరూపాన్ని పొంది బ్రహ్మంతో ఒకటిగా ఉంటారు అనే ఆవాక్యానికి భావం. అందువల్లనే *"తద్ధేదం తర్హ్యవ్యాకృతమాసీత్ తన్నామరూపాభ్యాం వ్యాక్రియత"* **(బృహ. 3-4-7) (** ఈలోకం మొదట నామరూపాలులేని బ్రహ్మముగానే ఉండెను. అది (సృష్టికాలంలో) నామరూపములను పొందినది) అని ఒక వేదవాక్యం ఉన్నది. కనుక, "సదేవ" అన్న శ్రుతిలో చెప్పబడిన జగత్తు బ్రహ్మముల అవిభాగం తగినదే అవుతుంది. కనుక ఈవిధంగా జీవుడు అనాదిగా ఉన్నవాడని స్పష్టమవడంవల్ల వాడి కర్మకూడా అనాదియే అవుతుంది. అందువల్ల, సృష్ట్యాదిలో జీవుడూ, కర్మం లేకుండానే జీవులని హెచ్చుతగ్గులుతో సృష్టించేటప్పుడు వైషమ్యనైర్ఘృణ్యాలు పరమాత్మకి ఉంటాయి అని చెప్పడం కుదరదు. ఇలా జీవుడిని అనాదిగా అంగీకరించకపోతే, 1. ప్రళయకాలంలో జీవుడు నశించేటప్పుడు వాడు చేసిన కర్మలు ఫలాన్నివ్వకుండా నశిస్తాయి. (కృతవిప్రణాశమ్) 2. సృష్టికాలంలో జీవుడు సృష్టింపబడేటప్పుడు వాడికి చెయ్యని కర్మల ఫలం కలుగుతోంది. (అకృతాభ్యాగమమ్) అనే రెండు దోషాలు తప్పించలేకుండా కలుగుతాయి. పైగా, "న జాయతే మ్రియతే వా విపశ్చిత్" (కఠ. 1-2-18) (జ్ఞానంగల జీవుడు పుట్టడం ఉండదు, నశించడం లేదు) అని జీవుడు నిత్యమైనవాడనేది శ్రుతికూడా చెప్తోంది. *'సూర్యాచంద్రమసౌ ధాతా యథా పూర్వమకల్పయత్"* (తై. నారా.1-14) (సర్వేశ్వరుడు సూర్యచంద్రులని వెనుకటికల్పంలోలాగే సృష్టించెను) అని మరొకవేదవాక్యం సృష్టిఅనేది అనాదికాలంగా నడుస్తూ వస్తోంది అని చూపిస్తోంది. *'ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి"* (గీత. 13-19) (ప్రకృతి, పురుషుడు ఇరువురూ అనాది అని తెలుసుకొనవలెను) అని గీత మొదలైన స్మృతులుకూడా ఘోషిస్తున్నాయి. కనుక, అనాదియైన జీవకర్మలప్రకారమే విషమంగా (హెచ్చుతగ్గులతో) సృష్టిచేయబడుతోందిగనుక పరమాత్మకి

వైషమ్యనైర్ఘృణ్యాలు కలగడానికి అవకాశం లేకపోవడంవల్లనూ, లోకసృష్టికి లీలయే ప్రయోజనం అవడంవల్లనూ బ్రహ్మమే జగత్కారణమవడానికి ఎటువంటి ఆటంకం లేదు.

*సి.సూ. ॥ సర్వధర్మోపపత్తేశ్చ॥ (2-1-36)*

***సర్వధర్మోపపత్తేః చ*** - (ప్రధానం, పరమాణు మొదలైనవి జగత్కారణం అనే పక్షాలు కుదరకుండా ఉండే) సమస్తగుణములును (ధర్మములును) (బ్రహ్మవద్ద) తగియుండుటచేత ( బ్రహ్మమే జగత్కారణం అవుతుంది)

*125* ప్రధానపరమాణ్వాదేః హేతుత్వే బాధితాహి యే॥*
*126. తేషాంచ సర్వధర్మాణాం బ్రహ్మణ్యేవోపపత్తితః।*
*నారాయణాఖ్యం బ్రహ్మైవ జగతస్సర్వకారణమ్॥*

*॥ఇతి ప్రయోజనవత్త్వాధికరణమ్॥*

*॥ఇతి ద్వితీయాధ్యాయే ప్రథమః పాదః॥*

॥శ్రీమతే రాఘువార్యమహాదేశికాయ నమః॥

॥శ్రీమతే అప్పలార్యమహాదేశికాయ నమః॥

125*-126. వెనుకటి అధికరణాలలో ప్రధానం పరమాణు మొదలైనవి జగత్కారణం అనే పక్షాలలో చెప్పబడే అమరికలేక(పొందక)పోవడాలు బ్రహ్మకారణపక్షంలో కలగలేదు. జగత్కారణవస్తువుకి ఉండవలసిన ఏయేగుణాలు (ధర్మాలు) ప్రధానం మొదలైనవాటిలో లేవని వెనుకటి సూత్రాలలో నిరూపింపబడుతున్నాయో ఆయాగుణాలు సమస్తమూ బ్రహ్మకే తగియున్నాయి. కనుక బ్రహ్మమనే నారాయణుడే లోకానికి నిమిత్తం, ఉపాదానం మొదలైన సమస్తకారణములు అయినాడు.

ప్రయోజనవత్త్వాధికరణం పూర్తి అయినది

శారీరకకారికావళి వివరణంలో

రెండవఅధ్యాయంలో మొదటిపాదం పూర్తి అయినది.

## *॥ద్వితీయాధ్యాయే ద్వితీయఃపాదః॥*

### ॥రచనానుపపత్త్యధికరణమ్॥(2-2-1)

*సి.సూ.॥రచనానుపపత్తేశ్చ నానుమానం ప్రవృత్తేశ్చ॥ (2-2-1)*

**రచనానుపపత్తేః చ** - (చేతనుడివల్ల అధిష్ఠింపబడకపోతే) జగత్సృష్టి కుదరదుగనుక, **ప్రవృత్తేః (దర్శనాత్) చ** - (చేతనుడివలన అధిష్ఠింపబడడంవల్లనే)అచేతనపదార్థాలు పనిచేయడంవల్లనూ, **అనుమానం న** - అనుమానంచేత తెలియబడే మూలప్రకృతి జగత్కారణం కాలేదు.

*127. బ్రహ్మకారణతాపక్షే దోషాః ప్రాప్తాః పరేరితాః।*
*అత్ర స్వపక్షరక్షార్థమన్యతేఽన్యమతవ్రజః ॥*
*128. సన్మతత్వభ్రామకం సత్కార్యవాదాదిసంగ్రహాత్।*
*ప్రథమం కాపిలమతం దూష్యతే మానయుక్తిభిః॥*

127-128. 'బ్రహ్మం జగత్కారణం' అనే సిద్ధాంతంపేరుతో పూర్వపక్షులుచెప్పే దోషాలు మొదటిపాదంలో నిరసింపబడ్డాయి. ఈపాదంలో వెనుకచెప్పిన సిద్ధాంతాన్ని రక్షించడంకోసం అనేకము లైన ఇతరమతాలు ప్రమాణయుక్తులతో నిరసింపబడుతున్నాయి. ఈమొదటి అధికరణంలో సాంఖ్యమతం నిరసింపబడుతోంది. ఎందుకంటే వేదంలో చెప్పబడినటువంటి సత్కార్యవాదం తత్వసంఖ్య మొదలైనవి

ఇందులో అంగీకరింపబడడంవల్ల 'ఇదే వైదికమతమా' అని కొంతమంది భ్రమించడంవల్ల. మొదట ప్రమాణయుక్తులను చూపి కపిలమునిచేత స్థాపించబడిన సాంఖ్యమతం నిరసింపబడుతోంది. రక్షత్యధికరణం, కారణత్వాధికరణం, ప్రకృత్యధికరణం, మొదలైనవాటిలో ముందుగానే నిరసింపబడిన సాంఖ్యమతాన్ని మరొకసారి ఇక్కడ నిరసించాల్సిన అవసరం ఏమిటంటే, అక్కడ వేదాంతవాక్యాలు సాంఖ్యమతాన్ని చెప్పలేదు అని స్థాపించలేదు అన్నదాంట్లోనే దృష్టి పెట్టడం జరిగింది. ఇక్కడ ఆమతం దోషాలతోకూడుకొన్నది అని నిరూపించంలో దృష్టి పెట్టడం జరుగుతోంది.

*129. తనువిశ్వాదికం కార్యం స్వసజాతీయ హేతుజమ్।*
*కార్యత్వాద్ఘటవల్లోక ఏవమేవ హి దృశ్యతే॥*
*130. ప్రకృతే పక్షతన్వాదేః సుఖదుఃఖాదిరూపతః।*
*తత్సరూపం కారణం తత్ ప్రధానమితి సిద్ధ్యతి॥*
*131. ముఖాద్యాత్మకసత్త్వాదిద్రవ్యసజ్ఞాతరూపిణః।*
*సి. ప్రధానస్యైవ సాజాత్యమితి చేత్తన్న యుక్తిమత్॥*

129-*131. **పూర్వపక్షం:** సాంఖ్యమతం అంటే - ప్రధానం లేక మూలప్రకృతి అనే తత్త్వం సత్వం, రజస్సు, తమస్సు అనే మూడూ చేరియున్నది. ఈమూడూ ద్రవ్యాలేతప్ప గుణాలు కావు.ఈమూడూ వరసగా సుఖం,దుఃఖం, మోహం రూపుదాల్చినవి. ఈమూలప్రకృతి అనేది సత్వరజస్తమస్సులు సమస్థితిలో ఉన్నప్పుడు ఒకటై, అచేతనమై అనేకచేతనుల భోగమోక్షాలకోసం ఏర్పడినదై ఉన్నది. చేతనులైన పురుషులసన్నిధివల్ల ఇది వికారాన్ని పొందుతోంది. అప్పుడు ప్రకృతినుంటి మహత్తు, మహత్తునుండి సాత్త్వికరాజసతామసాలువిడివిడిగాఉన్న అహంకారం, సాత్త్వికాహంకారంలోంచి పదకొండు ఇంద్రియాలు, తామసాహంకారంలోంచి ఐదు తన్మాత్రలు పుట్టేయి. రాజసాహంకారం మిగతా రెండురకాల అహంకారాలకీ ఈవిషయంలో సహాయపడుతుంది. శబ్దతన్మాత్రలోంచి ఆకాశం, శబ్దతన్మాత్రతో కూడిన స్పర్శతన్మాత్రలోంచి వాయువు, ఇదేక్రమంలో వెనుకటి తన్మాత్రలన్నింటితోకూడిన ఆయాతన్మాత్రలలోంచి అగ్ని, జలం, పృథివిఅనే భూతాలు పుట్టేయి. వీటిలో మూలప్రకృతిఅనేది వేరొకదానివికారంకాకుండా మిగతావాటన్నింటికీ కారణం అయిఉండడంవల్ల మూలప్రకృతి అనబడుతోంది.మహత్తు, అహంకారం, ఐదు తన్మాత్రలు అన్న ఏడు కొన్ని తత్త్వాలవికారాలై కొన్ని తత్త్వాలకి కారణం అయిఉండడంవల్ల ప్రకృతివికృతులు ఏర్పడుతున్నాయి. పదకొండు ఇంద్రియాలు, ఐదు భూతాలు మిగతా తత్త్వాల వికారాలై తాము ఒక తత్త్వానికీ కారణం కాకపోవడంవల్ల (కేవల)వికారాలని, వికృతులని చెప్పబడుతున్నాయి. పురుషతత్త్వంమాత్రం పరిణామంలేనిదవడంవల్ల దేనికీ ప్రకృతిగానో వికృతిగానో కాకుండా ఉన్నది. అందువల్లనే గుణాలులేనిది, కేవలచైతన్యస్వరూపమై నిత్యమై క్రియాశూన్యమై సర్వవ్యాపియై ఒక్కొక్కశరీరంలోనూ వేరువేరుగా ఉండింది. వికారంలేనిదై క్రియాశూన్యమవడంచేత పురుషతత్త్వం కర్తగానూ భోక్తగాను కానిదైయున్నది. ఇలాఉండేటప్పుడు అజ్ఞానులు. ప్రకృతిపురుషుల సన్నిధిమాత్రంవల్ల పురుషుడనే చైతన్యాన్ని ప్రకృతిలోనూ, ప్రకృతియొక్క కర్తృత్వాన్ని పురుషుడివద్దా మీదవేసుకొని నేనే కర్తని, భోక్తనీ అని తలుస్తారు. ఈవిధమైన అజ్ఞానంవల్ల సంసారం, వెనుకచెప్పిన తత్త్వాల జ్ఞానంవల్ల మోక్షం కలుగుతున్నాయి. ఈమతం అనుమానానికి తగినదైయున్నది. ఎలా అంటే "శరీరం, లోకం మొదలైన కార్యజాతం తమవంటి అచేతనవస్తువులనే కారణంగా గలవి. కార్యవస్తుజాతం అయిఉండడంవల్ల ఘటంవలె" అన్నది అనుమానం.జగత్తులో ఇలాగే కనబడుతోందిగదా! ఇక్కడ పక్షమైన

(పక్షం సాధ్యం హేతువు మొదలైనవాటి వివరణాన్ని సన్మతకారికావళిలో చూడవచ్చు) శరీరం మొదలైనవి సుఖదుఃఖమయమై ఉండడంవల్ల సుఖాదిరూపమైన సత్త్వాదిద్రవ్యాల సమూహమైఉండడంవల్ల ప్రకృతే వీటికి సజాతీయమైఉండడంవల్ల కారణమైఉండసాధ్యం.

*132. ప్రాజ్ఞానాధిష్ఠితం తన్న ప్రధానం విశ్వకారణం।*
*అచేతనస్య తదభిజ్ఞానాధిష్ఠితవస్తునః॥*

*133. రచనానుపపత్తేస్తదభిజ్ఞాధిష్ఠితస్య చ।*
*తత్ప్రవృత్తేర్దర్శనాచ్చ యథా దార్వాది కేవలమ్॥*

*134. రథాదికార్యనిర్మాణే న సమర్థమిదం తతః।*
*ప్రాజ్ఞానాధిష్ఠితం న స్యాత్ప్రధానం విశ్వకారణమ్॥*

***131*-134.*** సిద్ధాంతం: ***ఈసాంఖ్యపక్షం*** యుక్తులకి కుదరడంలేదు. జ్ఞానంగల చేతనుడివల్ల అధిష్ఠింపబడని మూలప్రకృతి జగత్తుకి కారణం అవడం కుదరదు. జగత్తులో చెట్టు మొదలైనవిమాత్రం తమంతట తాము రథం మొదలైనవాటిని తయారుచెయ్యడంలేదు. దానిని తయారుచేయడం తెలిసిన వడ్రంగి మొదలైనవాళ్లవల్ల పనిచేయబడడంవల్లనే అవి రథం మొదలైనవిగా అవుతున్నాయి. అలాగే, అచేతనమైన ప్రకృతే శరీరం మొదలైనవాటిని సృష్టించలేదు.వాటిని తెలిసిన పరమచేతనుడివల్లనే అధిష్ఠింపబడడంవల్లనే వాటిని సృష్టింపవీలవుతుంది. కనుక సర్వేశ్వరుడివల్ల అధిష్ఠింపబడని ప్రధానం జగత్కారణం అనే సాంఖ్యమతం యుక్తులకి తగినదిగాదు. సాంఖ్యులు చెప్పినప్రకారం సత్వం మొదలైనవి ద్రవ్యాలుగాకుండా గుణాలుగాఉండేవి అని లోకవేదాలలో ప్రసిద్ధాలైఉండడంవల్ల గుణాలైన అవి జగత్తుకి ఉపాదానంగా సాధ్యంగాదు అన్నది సూత్రంలో ఉన్న అనుక్తసముచ్చాయకమైన మొదటి చకారం తెలియజేస్తుంది.

### *సి.సూ.॥ పయోమ్బువచ్చేత్తత్రాపి॥ (2-2-2)*

**పయోమ్బువత్ చేత్** - పాలు, నీరు (చేతనునిచేత అధిష్ఠింపబడకనే పరిణమించడం) వలె (ప్రధానంకూడా తనంతటతానే పరిణమించవచ్చు) అన్నట్లైతే, **తత్ర అపి** - అప్పుడుకూడా (చేతనుడివల్ల అధిష్ఠింపబడే పరిణామం జరుగుతుంది)

*పూ. 135. ప్రాజ్ఞానాధిష్ఠితక్షీరమేఘముక్తామ్బునోర్యథా।*
*దధిభావేన చూతాదిరసరూపేణ చ స్వయమ్॥*

*136. పరిణామస్తథాఽస్యాపి యుజ్యతే కేవలస్య సః।*
*సి. మైవం ప్రాజ్ఞానాధిష్ఠానేప్రవృత్తిర్నోపపద్యతే॥*

135-*136. **పూర్వపక్షం**: వెనుకటి సూత్రంలో చెప్పినది సరిగాదు. ఎందుకంటే, పాలన్నవి ఒకచేతనుడివల్ల అధిష్ఠింపబడకుండానే తనంతటతానే పెరుగుగా మారడం మనం చూస్తున్నాం. మేఘం నుంచి పడ్డవర్షపునారుకూడా తనంతటతనే కొప్పరినీరు, మామిడిరసం, చింతపండురసం మొదలైనవిగా మారడం చూస్తున్నాం. ఇలాగే ప్రధానంకూడా, ఒకచేతనుడివల్లఅధిష్ఠింపబడకుండానే తనంతటతానే పరిణామం చెందడానికి ఏఆటంకమూ లేదు.

*137. యదుక్తం క్షీరవార్యాది సరర్వపక్షీకృతం హి తత్।*
*'యోప్సు తిష్ఠ'న్నితి శ్రుత్యా ప్రాజ్ఞాధిష్ఠితతా మతా॥*

136*-137. **సిద్ధాంతం**: ఈపూర్వపక్షం తప్పు. చెట్టు, మన్ను మొదలైనవి ఒకచేతనుడివల్ల

అధిష్ఠింపబడే రథం, కుండ మొదలైనవాటిగా పరిణమించడం చూస్తున్నాం. వీటిని దృష్టాంతంగా తీసుకొని పరిణామం జరిగే ఇతరవిషయాలలోకూడా ఒకపరమచేతనుడిచేత అధిష్ఠింపబడే ఆపరిణామంకూడా జరుగుతోంది అని అనుమానంచేత వాదింపబడుతోంది. పాలు పెరుగుగా అవడం, వర్షపునీరు కొబ్బరినీరు మొదలైనవిగానూ, అయినప్పుడు ఆపరమచేతనుడివల్లనే అధిష్ఠింపబడియే ఆవిధంగా అవుతున్నాయి అని సాధిస్తోంది ఆఅనుమానం. ఇదేవిధంగా పాలు, వర్షపునీరు మొదలైనవికూడా ఆఅనుమానపక్షం అయినప్పుడు వాటినే దృష్టాంతంగాచేసికొని అనుమానాన్ని ఖండించడం సరిగాదు. "**యోఽప్సు తిష్ఠన్**"(బృహ 5-7-4) మొదలైన శ్రుతులలో నీరు మొదలైనవాటిలోకూడా ఉండి వాటిని పరిణమించేలా చేసేవాడుపరమాత్మయే అని చెప్పబడుతోంది. అందుచేత, నీరు మొదలైనవాటిని దృష్టాంతంగా చెప్పడం వేదవిరుద్ధంగా ఉండడంవల్ల ఒకచేతనుడివల్ల అధిష్ఠింపబడకుండా ప్రకృతి అనేది పరిణమించశక్యంగాదు అని వెనుకటిసూత్రంలో చెప్పినది ఖండించడానికి వీలుగానిదే అవుతుంది.

## *సి.సూ.// వ్యతిరేకానవస్థితేశ్చానపేక్షత్వాత్// (2-2-3)*

**అనపేక్షత్వాత్** - (చేతనుడివల్ల అధిష్ఠింపబడడం)ఎదురుచూడకపోవంవల్ల **వ్యతిరేకానవస్థితేః చ** - సృష్టికంటేకూడా వేరుస్థితియైన లయంలో ఆగకుండా (ప్రకృతికి ఎప్పుడూ సృష్టే జరుగుతూ) ఉండాలని కోరినందువలన (స్వతంత్రప్రకృతి జగత్కారణం అవడానికి సాధ్యంగాదు)

*138. ప్రాజ్ఞాధిష్ఠానానపేక్షపరిణామిత్వముచ్యతే।*
*యది ప్రధానస్య, తర్హి సర్గస్య వ్యతిరేకతః॥*
*139. ప్రతిసర్గావస్థయావస్థిత్యభావః ప్రసజ్యతే॥*
*యస్మాత్ప్రాజ్ఞానపేక్షత్వం ప్రకృతేస్సర్గకర్మణి॥*
*140. ప్రోక్తం తస్మాత్సర్వదైవ సృష్టిర్వ్యస్యాః ప్రసజ్యతే।*
*ప్రాజ్ఞానాధిష్ఠితం నాతః ప్రధానం విశ్వకారణమ్॥*

138-140. **సిద్ధాంతం**: ఒకచేతనుడిచేత అధిష్ఠింపబడకనే ప్రకృతికి పరిణామం కలుగుతోంది అని పూర్వపక్షంలో చెప్పబడింది. ఇలా అంగీకరిస్తే ఎప్పుడూ సృష్టియే జరుగుతూంటుంది తప్ప సృష్టికంటె వేరైన లయం ప్రకృతికి కలుగశక్యంగాదు. ఒకచేతనుడివల్ల అధిష్ఠింపబడిఉంటే వాడు ఒకప్పుడు సృష్టిచేసేటట్లుగాను, మరొకసమయంలో లయంజరిగేటట్లుగానూ చెయ్యవచ్చు. అలాగాకపోతే పరిణామాన్నే స్వభావంగాగలిగిఉన్న ప్రకృతి ఎప్పుడూ సృష్టికార్యంలోనే ఉండాల్సివస్తుందేతప్ప పరిణామస్వభావంఅనే లయస్థితిని పొందసాధ్యంగాదు. పూర్వపక్షిమాత్రం ప్రకృతి లయస్థితినికూడా పొందుతుందని అంగీకరిస్తున్నాడు. ఇది కుదరదు. ఈకారణంచేతనూ, స్వతంత్రప్రకృతి జగత్కారణం కాలేదని తెలుస్తోంది.

## *సి.సూ.//అన్యత్రాభావాచ్చ న తృణాదివత్// (2-2-4)*

**తృణాదివత్ చ** -(పశువుచేత మేయబడే)గడ్డిమొదలైనవి(చేతనుడివలన అధిష్ఠింపబడకనే పాలుగా మారడం)వలెనే ఇదికూడా అని చెప్పడం, **న** - కుదరదు. **అన్యత్ర** -ఎద్దు మొదలైనవాటివలన తినబడు గడ్డి మొదలైనవాటికి **అభావాత్** - (పాలుగా మారడం) కనబడకపోవడంవల్ల (ఇక్కడకూడా చేతనాధిష్ఠానం ఉన్నదని స్పష్టం అవడంవల్ల.)

*141. ధేన్వాదినా చర్వితస్య తృణాదేః క్షీరతా యథా।*
*స్వయం భవతి తద్వచ్చ ప్రధానస్యేతి నోచితమ్॥*

*142. తస్య తత్పరిణామశ్చ ప్రాజ్ఞస్థిత్యైవ జాయతే।*
*తదన్యవృషభుక్తస్య క్షీరభావో న దృశ్యతే॥*

*141. **పూర్వపక్షం**- పశువు మొదలైన వాటిచేత తినబడిన గడ్డి మొదలైనవి తమంతటతాముగా పాలుగా పరిణమించడం చూస్తున్నాం. అదేవిధంగా ప్రకృతికూడా తనంతటతానుగా పరిణమిస్తుంది.

*141-142. **సిద్ధాంతం** - ఈపూర్వపక్షపువాదన తప్పు. *'పయోంబువచ్చేత్ తత్రాపి"* అనే సూత్రంలో చెప్పినట్లుగా ఈగడ్డిమొదలైనవి కూడా పక్షంలో చేరినవే. పైగా గడ్డిమొదలైనవి చేతనుడిచేత అధిష్ఠింపబడక తమంతటతాముగా పాలుగా మారలేదన్నది మరొకకారణంవల్లకూడా స్పష్టం అవుతోంది. అదేమిటంటే ఇదే గడ్డి మొదలైనవాటిని నల్లటి ఎద్దు తిన్నప్పుడు పాలుగా మారలేదు అందువలన ఒక చేతనుడివల్ల అధిష్ఠింపబడే గడ్డి మొదలైనవి పశువుకడుపులో పాలవుతున్నాయి అనితెలుసుకుంటున్నాం. ఈకారణంవల్లకూడా స్వతంత్రప్రకృతి జగత్కారణం కానేరదు అని స్పష్టం అవుతోంది.

*సి.సూ.॥పురుషాశ్మవదితి చేత్తథాపి॥ (2-2-5)*

**పురుషాశ్మవత్ ఇతి చేత్** - కళ్ళున్న మొండివాడి సహాయంతో గ్రుడ్డివాడు పనిచేయడంలాగనూ, అయస్కాంతంముందర ఇనుము పనిచేసినట్టుగానూ (పురుషుడి సన్నిధిలో ప్రకృతి క్రియని చేస్తుంది) అంటే **తథా అపి** - అలాంటప్పుడు కూడా తేడా ఉంటుందిగనుక ( పురుషసన్నిధిమాత్రంచేత స్వతంత్ర ప్రకృతి పరిణామం చెందశక్యంగాదు).

*143. పఙ్గోర్దృక్శక్తియుక్తస్య సాన్నిధ్యాత్తత్ప్రచోదితః।*
*అన్ధః ప్రవృత్తిశక్తోఽన్యః యథా కార్యే ప్రవర్తతే॥*

*144. అయస్కాన్తాశ్మసాన్నిధ్యాత్ యథా చాయః ప్రవర్తతే।*
*ఏవం పురుషసాన్నిధ్యాత్ ప్రకృతిశ్చ ప్రవర్తతే॥*

143-144. **పూర్వపక్షం**: కళ్ళున్న మొండివాడొకడు ఉన్నప్పుడు (వాడు మీదఎక్కికూచున్న) గుడ్డివాడివల్ల దారిచూడబడుతుంది. నడవగలగుడ్డివాడొకడు కావలసిన చోటికివెళ్ళి పనిచేయడం మనం చూస్తున్నాం. అయస్కాంతందగ్గిర ఉన్నప్పుడు ఇనుము పనిచేయడం మనం చూస్తున్నాం. అదేవిధంగా ప్రవృత్తిశక్తిలేని పురుషుడిసన్నిధిఉన్నప్పుడు జ్ఞానంలేని మూలప్రకృతి పనిచేయడానికి ఆటంకంలేదు. పురుషుడు ప్రధానాన్ని అనుభవించడం తగియేఉంటుంది. వాడిమోక్షార్థంకూడా ప్రకృతికి పురుషసన్నిధానం మామతంలో అంగీకరించబడింది. కనుక, స్వతంత్రప్రకృతిఅనేది పురుషసన్నధిమాత్రం చేతనే జగత్కారణం అవుతుంది.

*145. ఇతి చేన్న ప్రధానస్య ప్రవృత్తిర్నోపపద్యతే।*
*పఙ్గోర్మార్గోపదేశాదివ్యాపారస్తత్ర దృశ్యతే॥*

*146. పఙ్గూపదేశగ్రహణమన్ధస్యాపి చ వర్తతే।*
*అయస్సమీపాగమనమయస్కాన్తాశ్మనోఽస్తి హి॥*

*147. పుంసోఽత్రనిష్క్రియత్వాద్ధి వికారో నాస్తి తాదృశః।*
*తతస్తత్సన్నిధానాన్న ప్రవృత్తిః ప్రక-తేర్భవేత్॥*

*148. తత్సాన్నిధ్యస్య నిత్యత్వాత్ నిత్యసర్గః ప్రసజ్యతే।*
*నిత్యముక్తత్వతోఽస్య స్యాదభావో బన్ధమోక్షయోః॥*

145-148. సిద్ధాంతం: ఈపూర్వపక్షం తప్పు. పురుషసన్నిధిని అంగీకరించినా ప్రధానానికి ప్రవృత్తి

**కుదరదు. కుంటివాడు** గుడ్డివాడి దృష్టాంతంకూడా ఇక్కడకుదరదు. కుంటివాడు నడవలేనివాడయినా, దారిచూపడం మొదలైనపనులని చెయ్యగలడు. వాటిని చేస్తేనే గుడ్డివాడు వాడిని పిలిచి వెళ్ళగలడు. గుడ్డివాడికీ, కుంటివాడు చూపించే దారిని తెలుసుకోగలిగిన జ్ఞానం ఉండాలి. ఇక్కడైతే, పురుషుడు క్రియలేనివాడు అని అంగీకరించినందువల్ల కుంటివాడిలాగ ఏపనినీ చెయ్యసాధ్యంగాదు. అచేతనమైన ప్రకృతికూడా గుడ్డివాడిలా జ్ఞానం ఉన్నదీగాదు. అందుచేత ఈదృష్టాంతంలా ఇక్కడ క్రియ జరుగుతుంది అని చెప్పడం కుదరదు. అయస్కాంతంకూడా, ఇనుముకి దగ్గరగా తెస్తేనే ఇనుము కదలడాన్ని మనం చూస్తున్నాం. క్రియాశూన్యుడైన పురుషుడికి సమీపంలో రావడం మొదలైన క్రియలు ఉండకపోవడంవల్ల ఈదృష్టాంతంలాగ పురుషసన్నిధానంవల్ల ప్రకృతి జగత్కారణం కానేరదు. "అయస్కాంతలాగ దగ్గరగా రావడం అన్నది లేదు. ఎప్పుడూకూడా పురుషుడు ప్రకృతికి దగ్గరనే ఉంటాడు అంటే, పురుషసన్నిధి ఎప్పుడూ ఉండడంవల్ల ఎల్లప్పుడూకూడా సృష్టిస్థితిగానే ఉండవలసివస్తుంది. ప్రళయస్థితి అనే ఒకదాన్ని సాంఖ్యులు అంగీకరించడం కుదరకుండాపోతుంది. పురుషుడిని నిత్యముక్తుడిగా అంగీకరించినందువల్ల వాడికి సంసారబంధం కలగడం, మోక్షంరావడం అనే రెండే సాంఖ్యమతంలో కుదరదు.

*సి.సూ.// అఙ్గిత్వానుపపత్తేశ్చ// (2-2-6)*

**అఙ్గిత్వానుపపత్తేః చ** - గుణాలలో ఒకదానియొక్క (గొప్పతనంవల్ల వచ్చే) అంగిత్వం కుదరకపోవడంవల్లనూ (స్వతంత్రప్రకృతి జగత్కారణం కాదు.)

*149. ప్రతిసర్గదశాయాం చ గుణానాం సమతాజుషాం।*
*ఏకస్యోత్కర్షరూపాఙ్గిభావస్యానుపపత్తితః॥*
*150. తదుత్కర్షాపకర్షాత్మాఽఙ్గాఙ్గిత్వోత్థజగత్కృతిః।*
*న సంభవత్యతః ప్రాజ్ఞాసఙ్గి తన్నైవ కారణమ్॥*

149-150.**సిద్ధాంతం:** ప్రళయస్థితిలో సత్వరజస్తమోగుణాలు మూడూ సమంగా ఉంటాయిఅనినీ, వాటిలో హెచ్చుతగ్గులు కలిగినప్పుడు సృష్టి జరుగుతుందనినీ సాంఖ్యులచేత అంగీకరించబడుతోంది. ప్రళయకాలంలో సమస్థితిలో ఉండే మూడుగుణాలలో ఒకటి ఎక్కువై అంగియై మిగతావి తగ్గినవై అంగంగా అవడానికి సాంఖ్యమతంలో ఏదోఒక కారణంకూడా అంగీకరింపబడకపోవడంవల్ల ఆమతంలో సృష్టిస్థితి కలగడానికి అవకాశం లేదు. జ్ఞానశక్తులుగల సర్వేశ్వరుడు ప్రకృతిని అధిష్ఠించినట్లుగా అంగీకరించడం తప్ప మూడు గుణాలలో హెచ్చుతగ్గులు కలగడానికి అవకాశమేలేదు. ఈకారణంవల్లకూడా ప్రాజ్ఞుడు అనబడే సర్వేశ్వరుడితో సంబంధంలేని స్వతంత్రప్రకృతి జగత్కారణం అవడానికే సాధ్యంగాదు.

*సి.సూ.//అన్యథానుమితౌ చ జ్ఞశక్తివియోగాత్// (2-2-7)*

**అన్యథానుమితౌ చ** - (వేరువిధంగా) ప్రధానాన్ని అనుమానించినా, **జ్ఞశక్తివినియోగాత్** - జ్ఞానంకల శక్తి లేకపోవడంచేత (ప్రధానం జగత్కారణం అవడానికి సాధ్యంగాదు.)

*151. ఉక్తరీత్యన్యరీత్యైవ ప్రధానానుమితావపి।*
*జ్ఞాతృత్వశక్తిశూన్యత్వాత్తస్య దోషాస్తథా స్థితాః॥*

151. **సిద్ధాంతం:** వెనకటిసూత్రంలో చెప్పిన దోషాన్ని ఖండించడంకోసం, ఒకసూచించబడిన కాలంలో గుణాల హెచ్చుతక్కువలని కలిగించే శక్తి మూలప్రకృతికే ఉన్నది అని విషమసృష్టి అనబడే కార్యాన్ని చూచి, ఈశక్తిఅనే కారణాన్ని అనుమానంచేత చెప్పవచ్చని సాంఖ్యులు చెప్పినప్పటికీ, జ్ఞానంకలిగిఉండడం అనే జ్ఞశక్తి మూలప్రకృతికి పూర్తిగా లేకపోవడంవల్ల వెనకటి సూత్రాలలో చెప్పబడిన

రచనానుపపత్తి మొదలైన దోషాలు కలిగితీరుతాయి. అంచేత మూలప్రకృతి జగత్కారణంకానేరదు.

*సి.సూ.॥ అభ్యుపగమేప్యర్థభావాత్ ॥ (2-2-8)*

**అభ్యుపగమే అపి** - (అనుమానంచేత ప్రధానం సిద్ధిస్తోంది అనే) అంగీకరించినా, **అర్థాభావాత్** - దానివలన ఎటువంటి ప్రయోజనం కలగలేదుగనుక (దాన్ని అనుమానం చేయకూడదు.)

*152. ప్రధానస్యాభ్యుపగమేప్యర్థాభావవాదేన చ।*
*తన్నానుమేయం భోగాపవర్గరూపప్రయోజనమ్॥*
*153. నిర్వికారస్య పుంసోఽస్తి న భోగః ప్రకృతీక్షణమ్।*
*తద్విసర్జనరూపాపవర్గశ్చ స్యాత్కదాపి న॥*
*154. తత్సాన్నిధ్యాదేవ పుంసః భోగస్సమ్భవతీతి చేత్।*
*తత్సాన్నిధ్యస్య నిత్యత్వాదపవర్గో న సేత్స్యతి॥*

**152-154. సిద్ధాంతం** - ప్రధానాన్ని అనుమానంచేత సాధించవచ్చు అని అంగీకరించినా, అలా సాధింపబడినదానివల్ల సాంఖ్యులు చెప్పినట్టు భోగం, మోక్షం అనే రెండువిధాలైన ప్రయోజనాలున్నూ కలగవుగనుక, అది అనుమానంచేత సాధించతగినదిగాదు. ప్రకృతినిచూడడం పురుషుడికి భోగం అనిన్నీ, దాంట్లోంచి విడివడడం మోక్షం అనిన్నీ సాంఖ్యులు అంగీకరిస్తారు. మార్పులేని పురుషుడికి చూడడం, విడివడడం అనే రెండూ కదరవుగనుక భోగమోక్షాలురెండున్నూ ఎప్పుడూ కుదరవు. ప్రకృతిసన్నిధివల్లనే పురుషుడికి ప్రకృతిపరిణామవిశేషమైన సుఖదుఃఖదర్శనరూపమైన భోగం కలుగుతోంది అంటే, ప్రకృతిసన్నధి అనేది నిత్యంగనక, ఎప్పుడూకూడా భోగమేఅయి మోక్షం కలగడానికి అవకాశమే లేకపోతుంది. కనుక ఈవిధంగా ప్రయోజనంలేకున్నందువల్ల ప్రకృతి అనేది అనుమానంచేత సాధింపతగినదిగాదు.

*సి.సూ.॥విప్రతిషేధాచ్చాసమఞ్జసమ్॥ (2-2-9)*

**విప్రతిషేధాత్ చ** - ఒకదానికొకటి వ్యతిరేకించుతూ చెప్పడంవల్లకూడా, **అసమఞ్జసమ్** - (సాంఖ్యమతం) కుదరనిదే అవుతుంది.

*155. పుంసశ్చ నిర్వికారత్వం ద్రష్టృత్వం భోక్తృతా తథా।*
*బన్ధమోక్షౌ న తస్య స్తః ప్రకృతేరేవ తావుభౌ॥*
*156. పుంసో భోగాపవర్గార్థా ప్రవృత్తిః ప్రకృతేస్తథా।*
*ఏవం మిథో వ్యాహతోక్త్యా తద్దర్శనమసఙ్గతమ్॥*

155-156. సాంఖ్యమతం అనేకవిషయాల్లో వెనుకచెప్పినదాన్ని తర్వాత వ్యతిరేకిస్తూ చెప్పడంవల్ల పొసగనిదే అవుతుంది. ఎలా అంటే, పురుషుడు వికారంలేనివాడు అని చెప్పినవాళ్లే, వాడు ప్రకృతిని చూస్తుంటాడు, అనుభవిస్తుంటాడు అంటూ చెప్తున్నారు. చూడడం, అనుభవించడం, మొదలైనవి వికారాలేగనుక ఇది మొదటచెప్పినదాన్ని వ్యతిరేకిస్తోంది. పైగా, "సంసారబంధం, మోక్షం పురుషుడికి ఉండవు, అవిరెండూ ప్రకృతికే" అని చెప్పేవాళ్ళే "పురుషుడి భోగంకోసమున్నూ, మోక్షంకోసమున్నూ ప్రకృతి వ్యవహరిస్తోంది" అని చెప్తున్నారు. ఇదికూడా ఒకదానికొకటి వ్యతిరేకమే. ఈవిధంగా ఎన్నోవిషయాలలో ముందుచెప్పినదాన్ని తర్వాత వ్యతిరేకించడంవల్ల సాంఖ్యమతం సమంజసమైనది గాదు.

రచనానుపపత్త్యధికరణం పూర్తియైనది.

## *// మహద్దీర్ఘాధికరణమ్ // (2-2-2)*

### *సి.సూ.// మహద్దీర్ఘవద్వా హ్రస్వపరిమణ్డలాభ్యామ్ // (2-2-10)*

**హ్రస్వపరిమణ్డలాభ్యామ్**: ద్వ్యణుక-పరమాణువులనుంచి, **మహద్దీర్ఘవద్వా**: (క్రమంగా) త్ర్యణుకం, ద్వ్యణుకం రెండూకూడా ఉండడం కుదరకపోయినట్లే (**అసమఞ్జసమ్** : నైయాయికవైశేషికుల, ఇతర సిద్ధాంతాలుకూడా అసంజసమైనవే - కుదరనివే.)

*157. ప్రధాన హేతువాదస్య ప్రాగసాఙ్గత్యమీరితమ్।*
*అణుకారణవాదస్యాసామఞ్జస్యమిహోచ్యతే॥*

157. వెనుకటి అధికరణంలో స్వతంత్రప్రధానకారణవాదాన్ని చేసే సాంఖ్యమతం అసమంజసం అని నిరూపింపబడింది. ఈఅధికరణంలో అధిష్ఠాతగా ఈశ్వరుడిని అంగీకరించినా అణుకారణవాదం చేసే నైయాయికవైశేషికులమతాలు కూడా కుదరనివే - అసమంజసమైనవే అని నిరూపింపబడుతున్నాయి.

*పూ. 158. మిథోఽవయవసంయోగాత్ అవయవ్యుద్భవాత్తథా।*
*అంశాల్పత్వబహుత్వాభ్యామంశివైషమ్యదర్శనాత్॥*

*159. తదంశాల్పత్వకాష్ఠా చావశ్యకీత్యణవో మతాః।*
*సి. జగదారంభకాస్తే చ క్రమాత్స్యురితి చేన్నతత్॥*

158-*159 **పూర్వపక్షం**: ఎన్నో అవయవాలని చేర్చితేనే ఒక అవయవిని సృష్టించడం జరుగుతుంది. అవయవాలు తక్కువైతే అవయవి చిన్నదవడం, అవయవాలు ఎక్కువైతే అవయవి పెద్దదిగా ఉండడం మనం చూస్తున్నాం. అవయవిని అవయవాలుగా విభజిస్తూపోతే, ఇక విభజించశక్యంగాదు అనే స్థితివచ్చినప్పుడు ఆఅవయవాలు పరమాణువులనబడుతాయి. ఈపరమాణువులే మొత్తం లోకానికి ఉపాదానకారణం అవుతున్నాయి.

*160. ద్వ్యణుకాశ్చపరమాణోశ్చ త్ర్యణుకాదిజనిర్యథా।*
*తదభ్యుపగతం చాన్యత్ సర్వమప్యసమఞ్జసమ్॥*

*161. తన్త్వాద్యవయవాస్స్వంశైష్షడ్భిః పార్శ్వైర్హి సఙ్గతాః।*
*జనయన్త్యవయవ్యాఖ్యం పృథువస్త్వణవోఽపి తే॥*

*162. తథైవ సంయుజ్యమానాః కల్పేరన్ ద్వ్యణుకాదయే।*
*తదణూనాం నిరంశత్వే పరమాణుశతస్య చ॥*

*163. సంయోగేఽపి న చైకాణుపరిమాణాధికం మహత్।*
*పరిమాణం భవేత్తేషామంశవత్త్వం యదీష్యతే॥*

*164. తేపి సాంశాః స్వకీయాంశైః తే చ స్వాంశైరితి క్వచిత్।*
*కారణత్వస్య న స్యాద్ధి వ్యవస్థితిరతో న సత్॥*

159*-164. **సిద్ధాంతం**: రెండుపరమాణువులు కలవడంవల్ల ద్వ్యణుకం సృష్టింపబడుతోందనిన్నీ, మూడు ద్వ్యణుకాలు కలవడంవల్ల త్ర్యణుకం సృష్టింపబడుతోందనిన్నీ, ఇలాగే ప్రపంచం సృష్టింపబడుతోందనిన్నీ అణుకారణవాదులు చెప్తారు. వాళ్ళమతంప్రకారమైన ఈవాదం ఎలా కుదరడం లేదో, అలాగే మిగతా వాదాలుకూడా కుదరకుండానే ఉన్నాయి. ఈవాదం ఎందుకు కుదరదంటే, బట్ట

(వస్త్రం) మొదలైనవాటి అవయవాలైన నూలు మొదలైనవి ఒకదాంతో ఒకటి చేరినప్పుడు ఆరుగాని అంతకంటేతక్కువైన తమ(భుజాలు) పక్కలు ఒకటిగా చేరుతున్నాయి. ఒకటిగా చేరని పక్కలుగూడా ఉన్నాయి. అందుచేతనే రెండు అవయవాలు ఒకటిగా చేరినప్పుడు వాటికంటె పెద్దదైన అవయవి ఏర్పడుతోంది. ఇదేవిధంగారెండు పరమాణువులు ఒకటిగా చేరినప్పుడు చేరని పక్కలుకూడా కొన్ని ఉండడంవల్ల పరమాణువుకంటే పెద్దదైన ద్వ్యణుకం సృష్టింపబడుతోంది అనిచెప్పాలి. కాని, పరమాణువులు అవయవంలేనివి అని అణుకారణవాదులవల్ల అంగీకరించబడడంవల్ల ఇవి ఒకటిగా చేరినప్పుడు చేరని పక్కలు కొన్ని ఉన్నాయి అని చెప్పడం కుదరదు. అందుచేత అవయవాలులేని పరమాణువులు నూరు ఒకటిగా చేరినా, ఒకపరమాణువుకంటే పెద్దదైన పరిమాణంగలపదార్థం సృష్టింపబడలేదు. ఈదోషాన్ని తప్పించడంకోసం పరమాణువులు అవయవాలుగలవి అని అంగీకరిస్తే, అవి మళ్ళీ ఎన్నో అవయవాలుగా విభజింపతగినవి అనిన్నీ, ఆవిభజింపబడినవి ఇంకా ఎన్నో అవయవాలుగా విభజించడానికి తగినవనీ ఇలా ఒక స్థిరమైన స్థితిని పొందడానికి లేకుండా ఉంటాయి అని అంగీకరించాల్సివస్తుంది. కనక, విభజించడానికి వీలులేని పరమాణువు అనే మూలకారణంఒకటి లేకుండా పోతుంది. కనుక, పరిమండలం అనే పరమాణువునుంచి హ్రస్వం అనబడే ద్వ్యణుకం సృష్టింపబడడం, ఆద్వ్యణుకంలోంచి దానికంటే పెద్దదవడంవల్ల మహద్దీర్ఘం అనబడే త్ర్యణుకం సృష్టింపబడుతుందనిన్నీ చెప్పే అణుకారణవాదుల మూలానికి వ్యతిరేకమైన వాదం కుదరదు అని స్పష్టం. ఇలాగే వాళ్ళ ఇతరవాదాలుకూడా కుదరనివే. ఇది ఇకపైన వివరింపబడుతోంది. సూత్రంలో 'హ్రస్వపరిమండలాభ్యాం' అని ద్వ్యణుకపరమాణువులైన రెండుకారణాలని ఎత్తుకొని కార్యాన్ని ఎత్తుకొనేటప్పుడు మహద్దీర్ఘం అనే ద్వ్యణుకకార్యమైన త్ర్యణుకాన్నిమాత్రం ఎత్తుకోవడం పరమాణుకార్యమైన ద్వ్యణుకానికి ఉపలక్షణం. సూత్రంలో వాశబ్దం చకారార్థం అయి మిగతా వాదాలని సూచిస్తోంది.

### *సి.సూ.॥ ఉభయథాపి న కర్మాతస్తదభావః ॥ (2-2-11)*

**ఉభయథా అపి** - (అణువుతాలూకు మొదటిక్రియకి కారణమైన అదృష్టం అణువులోగాని, జీవుడిలోగాని) రెండింటిలోనూ ఏవిధంగా ఉన్నప్పటికీ, **న కర్మ** - ఆకర్మ లేదు (సంభవించడానికి సాధ్యంగాదు). **అతః** - అందువలన, **తదభావః** - అణువులు రెండు చేరడం అనేది కుదరదు.

*165. పరమాణుష్వాద్యకర్మాదృష్టకారితముచ్యతే।*
*తదదృష్టం చాణుగతమథవాఽఽత్మగతం భవేత్॥*
*166. ద్వేధాప్యకదాచిత్కత్వదాదృష్టస్యాస్య సర్వదా।*
*ఉత్పాదకత్వాపత్తిః స్యాత్కాదాచిత్కం భవేన్న తత్॥*
*167. తతశ్చ కర్మణాణూనాం సంయోగాభావ ఆగతః।*
*విపాకాపేక్షయా నాస్య సదోత్పాదకతేతి చేత్॥*
*168. నానాప్రకారాదృష్టానామేకదైవైకరూపతః।*
*న విపాకస్సంభవేద్ధి తథేశస్యానుమానతః॥*
*169. అసిద్ధేరీశసఙ్కల్పాత్ నియమోఽత్ర న సంభవేత్।*
*అతో జగత్కారణత్వం పరమాణోరసఙ్గతమ్॥*

165-169. **సిద్ధాంతం:** అణుకారణవాదపక్షంలో మాత్రం ఎన్నో అసంగతాలు ఉండడాన్ని వెనుకటి సూత్రంలో 'వా' శబ్దంవల్ల తెలియజేయబడ్డది. ఈసూత్రం మొదలుగా అవి వివరింపబడుతున్నాయి.

పరమాణువులో మొదట్లో ఒకక్రియ ఉన్నట్టుగాను, దానివల్ల రెండు పరమాణువులు కలిసి ద్వ్యణుకం సృష్టింపబడుతుందనీ, మూడు ద్వ్యణుకాలు చేరి ఒక త్రసరేణు సృష్టింపబడుతుందనీ, ఇలాగే ఒకదానితో మరొకటిగా ప్రపంచం సృష్టింపబడుతుందనీ అణుకారణవాదులు చెప్పుతున్నారు. అందులో సమస్త ప్రపంచం సృష్టింపబడడానికి మూలకారణంగా పరమాణువులో కలిగే మొదటి క్రియ పుణ్యపాపాలవల్ల కలిగే అదృష్టంవల్ల కలుగుతుందనీ అంగీకరిస్తున్నారు. "అగ్నేరూర్ధ్వజ్వలనం వాయోస్తిర్యగ్గమనం (పవనం) అణుమనసోశ్చాద్యం కర్మేత్యేతదదృష్టకారితాని" (వైశేషికదర్శనం 5-2-13) (మొదటమొదట్లో అగ్ని మీదికి మండడం ప్రారంభించడం, మొట్టమొదట వాయువు పక్కలకి వీచడం, అణువు, మనస్సు మొదలైనవాటి ప్రథమక్రియలున్నూ అదృష్టంవల్ల కలిగినవి.) అనే వాశేషికదర్శనసూత్రం గమనించతగినది. పరమాణువులో ఏర్పడే ఈమొదటిక్రియకి కారణమైన అదృష్టం పరమాణువులో ఉన్నదా లేక జీవుడికి ఉన్నదా అనే ప్రశ్న వస్తుంది. ఎలా అంగీకరించినా, కుదరదు. జీవుడు చేసిన పుణ్యపాపకార్యాలవల్ల కలిగే అదృష్టం పరమాణువులో ఉండడం కుదరదుగనుక, మొదటిపక్షం కుదరదు. ఉన్నదని అంగీకరించినా, ఎప్పుడూ ఉండాల్సిరావడంవల్ల ఎల్లప్పుడూ క్రియజరిగి సృష్టిజరగవలసివస్తుంది. జీవుడికి ఉన్న అదృష్టం పరమాణువులో క్రియగా జరగడం కుదరదుగనుక, రెండోపక్షంకూడా కుదరదు. అదృష్టం ఉన్న జీవుడి సంయోగంచేత పరమాణువులో క్రియ జరగవచ్చుగదా అంటే, జీవుడి అదృష్టప్రవాహం నిత్యంగనుక, ఎప్పుడూకూడాసృష్టి జరుగుతూనే ఉండాల్సివస్తుంది. ఇప్పుడు "అదృష్టం నిత్యమైనప్పటికీ, విభాజనం పొందడంవల్లనే ఫలం ఇస్తుంది. కొన్ని అదృష్టాలు వెంటనే ఫలాన్నిస్తుంది. మరికొన్ని వేరేజన్మలో ఫలాన్నిస్తాయి. మరికొన్ని వేరుకల్పంలో ఫలాన్నిస్తాయి. కనక, ఇలా విభాజనాన్ని ఎదురుచూడడంతో సృష్టికాలంలో విభాజనాన్నిపొందే అదృష్టాలవల్ల సృష్టి జరుగుతుందనీ అంగీకరించడంవల్ల ఎప్పుడూ కూడా సృష్టిజరగవలసిరాదుకదా" అంటే, ఇదికూడా కుదరదు. ఎందుకంటే, లెక్కలేనన్ని ఆత్మలు ఒకదానికొకటి సంకేతం (పూర్వపు ఏర్పాటు) లేకుండా ఎన్నోసమయాల్లో చేసిన ఎన్నోరకాలైన కర్మలవల్ల కలిగిన అదృష్టాలు సృష్టికాలంలో ఒకేవిధంగా విభాజనం చెందుతాయి అని చెప్పడానికి ప్రమాణం ఏదీలేదు. కనక ఇలా ఒకేసమయంలో సమస్తపదార్థాల సృష్టి జరగడం ఎలా అసంభవమో, అలాగే ఒకేసమయంలో సమస్తపదార్థాల సంహారమూ కురదు. సృష్టింపబడ్డ పదార్థాలు రెండుపరార్థకాలం సంసారమండలంలో ఉన్నాయి అనడంకూడా కుదరదు. ఇక ఈశ్వరుడి సంకల్పంవల్ల అణువులలో క్రియ ఏర్పడుతుందని అంగీకరిస్తే, ఒకే సమయంలో సృష్టింపబడడం మొదలైనవి కుదురుతాయిగదా అంటే, అనుమానంవల్ల మీరు సర్వేశ్వరుడిని సాధించడం కుదరదు అనేది శాస్త్రయోనిత్వాధికరణంలోనే నిరూపించబడిందిగనుక మీమతప్రకారం ఈశ్వరుడు సిద్ధించడం సాధ్యంగాదు. అందుచేత మీరు ఈశ్వరుడితో పరిహారాన్ని చెప్పడం కుదరదు. అందువల్లఎలాచూసినా, పరమాణువులో మొదటిక్రియ జరిగి, పరమాణువులు చేరడం కుదరదుగనుక యుక్తితో పరమాణువులు జగత్కారణం అని చెప్పడం కుదరదు. శాస్త్రంలో చెప్పినప్రకారం లోకాన్ని శరీరంగా గల సర్వేశ్వరుడే జగత్తుకి ఉపాదానకారణం అయినాడు అన్నదే అంగీకరించితీరాలి.

### *సి.సూ.।।సమవాయాభ్యుపగమాచ్చ సామ్యాదనవస్థితేః ।। (2-2-12)*

**సమవాయాభ్యుపగమాత్ చ** - (పరమాణుకారణవాదులు జాతిమొదలైనవాటిని పదార్థాలతో ఒకటిగా కుదర్చడంకోసం) సమవాయం అనే సంబంధాన్ని అంగీకరించడంచేతనున్నూ, **సామ్యాత్** - (ఈ సమవాయం పదార్థంతో ఒకటిగా ఉంటుందనడానికి మరోదాన్ని అంగీకరించవలసిరావడం అనే)

సామ్యంచేత **అనవస్థితేః** - ఒకస్థితిలో ఉండడం అనేది లేకపోతుందిగనుక (**అసమంజసమ్** - అణుకారణవాదం కుదరదు)

*170. సమవాయాభ్యుపగమాచ్ఛేదం మతమసఙ్గతం।*
*ద్రవ్యాపృథక్సిద్ధి హేతుతయా జాత్యాదికస్య చ॥*

*171. ఇష్యతే సమవాయోఽయం తథాభావేప్యముష్య చ।*
*సామ్యాచ్చ హేత్వపేక్షాయాః అనవస్థా ప్రసజ్యతే॥*

*172. స్వాభావికస్తథాభావస్సంబంధస్యేతి చేత్తదా।*
*ఏష స్వభావో జాత్యాదేరేవ యుక్తః కిమన్యతః॥*

170-172. **సిద్ధాంతం.** సమవాయం అనే సంబంధాన్ని అంగీకరించినా అణుకారణవాదం కుదరదు. ఘటత్వంవంటి జాతి మొదలైనవి ఘటం మొదలైన ద్రవ్యంతో వేరుచేయలేనట్లుగా ఒకటిగా ఉండడానికి కారణంగా సమవాయం అనే సంబంధాన్ని నైయాయిక వైశేషికులు అంగీకరిస్తున్నారు. ఇలా అంగీకరించినా, ఈసమవాయసంబంధం, ఆద్రవ్యంతో అపృథక్స్థితిగాఉండడానికి కారణంగా మరో సంబంధాన్ని అంగీకరించాలి. దానికి మరో సంబంధాన్ని అంగీకరించాలి. ఇలా సామ్యంవల్లే ఒకస్థితిలేకుండా రావడం అనే అనవస్థాదోషం ఏర్పడుతోంది. ఇక సమవాయసంబంధం ద్రవ్యంతో ఒకటిగా ఉండడం దాని సహజగుణం అనిఅంగీకరించి ఉండడంవల్ల దానికోసం మరో సంబంధాన్ని అంగీకరించ నవసరంలేదు కనుక అనవస్థాదోషం రాదుగదా అంటే జాతిమొదలైనవి ద్రవ్యంతో కలిసే ఉండడం సహజం అనే అంగీకరించి ఉండడంవల్ల సమవాయసంబంధాన్ని కల్పించవలసిన అవసరమేలేదు. అంచేత సమవాయాన్ని కల్పించినా ఈమతం కుదరదు.

*సి.సూ. ॥ నిత్యమేవ చ భావాత్॥ (2-2-13) (187)*

**నిత్యం ఏవ భావాత్ చ** - (సమవాయాన్ని నిత్యంగా అంగీకరిస్తే దానినిగల పదార్థాలుకూడా) ఎప్పుడూ ఉండవలసిరావడంవల్లకూడా - (నిత్యములై ఉండవలసిరావడంవల్లకూడా) (అణుకారమవాదం కుదరదు)

*173. సంబంధస్యాస్య నిత్యత్వే సంబంధ్యాఖిలవస్తునః।*
*నిత్యమేవచ భావాద్ధి మతమేతదసంగతమ్॥*

173. **సిద్ధాంతం**: వెనకటిసూత్రంలో చెప్పబడిన దోషం సమవాయసంబంధం అనిత్యమైనా, వస్తుంది. నైయాయికవైశేషికులు సమవాయసంబంధాన్ని నిత్యంగానే అంగీకరిస్తున్నారు. సంబంధం అనేది రెండు సంబంధివస్తువులులేకపోతే సిద్ధించదుగనుక సంబంధమైన ఇది నిత్యమైతే, ఈసంబంధంఉన్న ఘటత్వం మొదలైన జాతి నిత్యమైనట్లుగానే ఘటంమొదలైన పదార్థాలుకూడా నిత్యాలవాలి. ఇది ప్రత్యక్షవిరుద్ధం. ఈకారణంవల్లకూడా ఈమతం కుదరదు.

*సి.సూ.॥రూపాదిమత్వాచ్చ విపర్యయో దర్శనాత్॥ (2-2-14) (188)*

**రూపాదిమత్వాత్** : (పరమాణువులు) రూపం మొదలైనవాటిని కలిగిఉండడంవల్ల, **విపర్యయః చ**- (అణుకారణవాదులు పరమాణువులకు అంగీకరించే నిత్యత్వం నిరవయవత్వం మొదలైన గుణాలకి) వ్యతిరేకమైనదే సిద్ధిస్తుంది. **దర్శనాత్** - (ఘటం మొదలైన వాటిలో) ఆవిధంగా కనబడడంవల్ల; (దీనివల్లకూడా కుదరదు).

*174. పార్థివాద్యణుసంఘానామేషాం రూపాదిమత్త్వతః।*

*స్యాత్స్వాభిమతనిత్యత్వాऽనంశిత్వాదివిపర్యయః॥*

*175. ఘటాదికేషు రూపాదిమత్స్వేవం దర్శనాన్న హి।*

*దృష్టానుసారాత్కల్ప్యోఽర్థః స్వాభిష్టే పర్యవస్యతి॥*

174-175. **సిద్ధాంతం:** కార్యమైన భూతాలలో స్పర్శరూపరసగంధాలనే గుణాలు ప్రత్యక్షంగా కనబడుతూండడంవల్ల వాయువు, తేజస్సు, జలం, భూమి అనే నాలుగు భూతపరమాణువులనే కారణవస్తువులలోకూడా, ఆగుణాలు ఉంటున్నాయని అణుకారణవాదులు అంగీకరిస్తున్నారు. కారణవస్తువులలో ఉంటేనే కార్యవస్తువులలో కనబడుతాయని వాళ్ళభావం. ఇదేవరసలో, ఘటం మొదలైన కార్యవస్తువుల్లో కనబడే అనిత్యత్వం, అవయవాలతో ఉండడం, స్థూలాలైఉండడం, మొదలైనగుణాలుకూడా కారణపదార్థాలైన పరమాణువులలో వాళ్ళు అంగీకరించితీరాలి. వాళ్ళైతే, పరమాణువులని నిత్యాలుగానూ, నిరవయవాలుగాను, సూక్ష్మాలుగాను చెప్తారు. కార్యజాతాల్లో కనబడడంతప్పిస్తే కారణపదార్థాలలో రూపం మొదలైనవాటిని కల్పించే వాళ్ళసిద్ధాంతప్రకారం చూస్తే, వెనకచెప్పినట్లుగా పరమాణువులలో నిత్యత్వం, నిరవయవత్వం, సూక్ష్మత్వం మొదలైనవాటికి వ్యతిరేకమైన అనిత్యత్వం, అవయవత్వం, స్థూలత్వం మొదలైనవే సిద్ధిస్తాయి. కార్యమైన ఘటం మొదలైనవి అనిత్యాలుగానూ, అవయవాలుకలిగినవిగానూ, స్థూలాలుగానూ కదా కనబడుతున్నాయి. కార్యజాతాల్లో కనబడడాన్ననుసరించి కారణాన్ని కల్పించేటప్పుడు "కొన్నిగుణాలనిమాత్రమే కల్పిస్తున్నాం, మిగతవాటిని కల్పించం" అని చెప్పడం కుదరదుగా! ఈకారణంవల్లకూడా, అణుకారణవాదం కుదరదు.

*సి.సూ.॥ ఉభయథా చ దోషాత్॥ (2-2-15) (189)*

**ఉభయథా దోషాత్ చ** - (పరమాణువులలో రూపం మొదలైనవి లేవు అన్నా, ఉంటాయన్నా,) రెండుపక్షాలలోనూ, దోషం సంభవించడంవల్లనూ (అణుకారణమతం కుదరనిది.)

*176. ఉక్తానిత్యత్వాదిదోషభయాత్ రూపాదిశూన్యతా।*
*అణుసజ్జే స్వీకృతా చేత్కార్యం స్యాద్రూపవర్జితమ్॥*

*177. స్వహేతుగుణపూర్వత్వాత్ గుణానాం కార్యవర్తినామ్।*
*ఏతద్దోషభయాత్తేషు రూపవత్త్వం యదీష్యతే॥*

*178. తర్హ్యనిత్యత్వాదిదోషః పూర్వోక్తః ప్రసజేత్తతః।*
*దోషాదుభయథా చైవమసమఞ్జసమేవ తత్॥*

176-178. **సిద్ధాంతం:** వెనకటిసూత్రంలో చెప్పినప్రకారం, కార్యాల్లో కనబడడాన్ననుసరించి కారణమైన పరమాణువులలోకూడా రూపం మొదలైనవాటిని అంగీకరిస్తే అనిత్యత్వం మొదలైనవికూడా వస్తాయే అనే భయంవల్ల కారమవస్తువులైన పరమాణువుల్లో రూపంమొదలైనవి లేవనుకుంటే, కారణాల్లోఉన్న గుణాలే కార్యపదార్థాల్లో అంగీకరించాల్సిఉంటుందనే నియమంప్రకారం, కారణంలో లేని రూపం మొదలైనవి కార్యాలైన ఘటంమొదలైనవాటిలో లేకపోవాల్సివస్తుంది. ప్రత్యక్షవిరుద్ధమైన దీన్ని తప్పించడంకోసం కారణమైన పరమాణువుల్లో కార్యాలననుసరించి రూపం మొదలైనవాటిని అంగీకరిస్తే వెనకటి సూత్రంలో చెప్పినప్రకారం, వాటిలో అనిత్యత్వం మొదలైనవి ఏర్పడతాయి. ఈవిధంగా రెండు పక్షాల్లోనూ, దోషం కలగడంవల్ల అణుకారణవాదం కుదరనిదే.

*సి.సూ.॥ అపరిగ్రహాచ్చాత్యన్తమనపేక్షా॥ (2-2-16) (190)*

**అపరిగ్రహాత్ చ** - (వైదికులవల్ల) స్వీకరించకపోవడంవల్లకూడా, కుదరకపోవడంవల్లనున్నూ,

**అత్యన్తం అనపేక్షా** - మిక్కిలి అనాదరింపతగినది.

*179. శ్రుతిన్యాయవిరుద్ధేపి కపిలస్యమతే క్వచిత్।*
*సత్కార్యవాదముఖ్యేఽస్తి వైదికానాం పరిగ్రహః॥*

*180. కేనాప్యంశేన కాణాదపక్షస్యాస్యాపరిగ్రహాత్।*
*అనపేక్షైవ కార్యాఽత్రాత్యన్తం మోక్షఫలేప్సుభిః॥*

179-180. కపిలుడి సాంఖ్యమతం స్వతంత్రప్రధానకారణవాదం మొదలైన కొన్నివిషయాల్లో శ్రుతులకి, న్యాయాలకీ వ్యతిరేకంగాఉన్నప్పటికీ, లేనిపదార్థం సృష్టింపబడసాధ్యంకాదు అనే సత్కార్యవాదం, ప్రకృతి మహత్తు మొదలైన ఇరవైనాలుగు అచేతనతత్త్వాల లెక్కమొదలైన కొన్ని విషయాలలో వైదికులు ఆమతాన్ని ఎత్తుకొన్నారు. సత్కార్యవాదం మొదలైనవాటిని అంగీకరించని వైశేషికమతంలోఏఅంశాన్నీ వైదికులు పరిగ్రహించకపోవడంవల్ల, వెనకచెప్పిన ఆమతం పూర్తిగా కుదరనిదవడంవల్లనూ, మోక్షఫలాన్ని ఆశించేవారికి ఆమతం అత్యనాదరించతగినదే అయింది. సూత్రంలోఉన్న చకారం వెనుకటిసూత్రాల్లో చెప్పిన అసమంజసాలని సముచ్చయిస్తోంది.

మహద్దీర్ఘాధికరణం పూర్తి అయినది.

## సముదాయాధికరణం.(2-2-3)

*సి.సూ.॥ సముదాయ ఉభయహేతుకేఽపి తదప్రాప్తిః॥ (2-2-17) (191)*

**ఉభయహేతుకే సముదాయే అపి** - పరమాణువుని కారణంగాగల భూమి మొదలైనవాటి సముదాయంలోనూ, భూమిమొదలైన భూతాలని కారణంగాగల శరీరేంద్రియసముదాయంలోనూ, **తత్ప్రాప్తిః** - సముదాయంగుణం చేరదు.

*181. అణుకారణతావాదిపక్షే పూర్వనిరాకృతే।*
*తత్సామ్యోపస్థితః పక్షః సౌగతానాం నిరస్యతే॥*

*182. చతుర్విధాస్సౌగతాస్తేష్వాద్యా వైభాషికాఖ్యకాః।*
*ద్వితీయాస్సౌత్రాంతికాఖ్యా ఏషాం దర్శనమీదృశమ్॥*

181-182. వెనుకటి అధికరణంలో పరమాణువులు లోకానికి ఉపదానకారణం అని చెప్పే నైయాయికవైశేషికులమతం నిరసింపబడింది. ఈఅణుకారణవాదం చేసేవిషయంలో వీళ్ళని అనుసరించడంవల్ల తరువాతివాళ్ళైన బౌద్ధుల మతం నిరసింపబడుతోంది. 1. వైభాషికులు, 2. సౌత్రాంతికులు, 3. యోగాచారులు, 4. మాధ్యమికులు అని బౌద్ధులలో నాలుగువిధాలైనవాళ్ళున్నారు. నలుగురూ బుద్ధశిష్యులే అయినా, మొదటవచ్చినమతంకంటే తరువాతవచ్చినమతం అధికదోషభూయిష్ఠం.

*"యోగాచారే జగదపలపత్యత్రసౌత్రాంతికస్తత్ ధీవైచిత్ర్యాత్ అనుమితిపదం వక్తి వైభాషికస్తు।*
*ప్రత్యక్షం తత్ క్షణికయతి తే రంగనాథ త్రయోపి జ్ఞానాత్మత్వక్షణభిదురతే చక్షతే తాన్ క్షిపామః॥*

(శ్రీరంగరాజస్తవం)

(రంగనాథా! ఈబౌద్ధులలో యోగాచారుడు బాహ్యలోకాన్ని లేదంటున్నాడు. సౌత్రాంతికుడు అనేకవిధాలైన జ్ఞానం ఉండడం అనే హేతువుతో అనుమానంవల్ల లోకం తెలియబడి క్షణికమైనది అంటాడు. వైభాషికుడు, లోకం ప్రత్యక్షంగానూ, క్షణికంగాను ఉన్నది అంటాడు. ఈమూడువిధాలైనవాళ్ళే జ్ఞానమే ఆత్మ అనిన్నీ, అది క్షణంలో నశించేది అనిన్నీ చెప్తున్నారు. వాళ్ళని నిరసిస్తాము.) అని చెప్పబడినవాళ్ళలో క్షణికమైన బాహ్యప్రపంచాన్ని అంగీకరించినా, వైభాషికుడూ, సౌత్రాంతికుడూ ఈఅధికరణంలో నిరసింపబడు

తున్నారు. "ప్రపంచం లేదు, క్షణికమైన జ్ఞానమే ఉన్నది" అనే యోగాచారులూ, తర్వాతి అధికరణంలోనూ, "ఏదీ లేదు" అనే మాధ్యమికులు దానితర్వాతి అధికరణంలోనూ నిరసింపబడుతున్నారు.

పూ. 183. *గన్ధాదిసఙ్ఘైరణుభిః పార్థివాద్యైశ్చతుర్విధైః।*
*ఉత్పాద్యంతే పృథివ్యాదిసఙ్ఘాతాస్తైశ్చ భౌతికాః॥*

184. *ఉత్పాద్యన్తే చ సఙ్ఘాతాః బాహ్యార్థా ఏతఏవ హి।*
*ఆన్తరో జ్ఞానసన్తాపరూపో దేహాన్తరాస్థితః॥*

185. *అహంప్రతీతివిషయః ఆత్మాస్త్యర్థేష్వమీష్వపి।*
*క్షణికేషు స్థిరత్వాదిబుద్ధ్యాఖ్యావిద్యయాఽఖిలమ్॥*

186. *ఉపపద్యత ఏవాతః జగదుత్పత్తిరప్యథ।*
సి. *యుజ్యతే వ్యవహారశ్చేత్యేతన్మతమసఙ్గతమ్॥*

183-186. **పూర్వపక్షం:** రూపం, రసం, స్పర్శం, గంధం అనే స్వభావాలుగల భూపరమాణువులు రూపరసస్పర్శ స్వభావులుగల జలపరమాణువులు, రూపస్పర్శస్వభావాలుగల తేజఃపరమాణువులు, స్పర్శస్వభావంగల వాయుపరమాణువులు ఎన్నో భూపరమాణువులుచేరి భూమి, ఎన్నో జలపరమాణువులుచేరి జలం, ఎన్నో తేజఃపరమాణువులు చేరి తేదస్సనే అగ్నితత్త్వం, ఎన్నో వాయుపరమాణువులు చేరి వాయువు సృష్టింపబడుతున్నాయి. భూమి మొదలైన నాలుగు భూతాలూ ఒకదాంతోఒకటి కలవడంవల్ల దేహం ఇంద్రియాలు మొదలైన భౌతికపదార్థాలు సృష్టింపబడుతున్నాయి. మనం బాహ్యప్రపంచంలో చూసే పదార్థాలు ఇలా సృష్టింపబడినవే. దేహంలోపలఉండే పదార్థాల్ని తరిచిచూస్తే జ్ఞానసంబంధం గలిగినదై, 'అహం' అనే జ్ఞానానికి విషయమైయున్నదే అంతఃపదార్థమైన ఆత్మ అనబడుతోంది. బాహ్యపదార్థాలైతేనేమి, అంతఃపదార్థమైన జ్ఞానమైతేనేమి, ఏవిధమైన భేదంలేకుండా ఇవన్నీ క్షణమాత్రమే ఉండేవి. వీటిని స్థిరమైనవిగా భావించడం అనేభ్రమే అజ్ఞానం. ఇలా క్షణికమైన నాలుగు పరమాణువుల్లోంచీ క్షణికాలైన నాలుగుభూతాలూ, వాట్లోంచి క్షణికాలైన దేహేంద్రియాలూ సృష్టింపబడడమే లోకసృష్టి అవుతుంది. లోపలుండే క్షణికజ్ఞానసంబంధియైన ఆత్మ వీటిని స్థిరమనే జ్ఞానంవల్ల లోకవ్యవహారం జరుగుతోంది. కనుక జగదుత్పత్తికి, లోకవ్యవహారానికీ వేరేదాన్ని దేన్నీ అంగీకరించవలసిన అవసరం లేదు.

187. *అణుహేతుకపృథ్వ్యాదిసఙ్ఘే పృథ్వ్యాదిహేతుకే।*
*దేహేన్ద్రియాదిసఙ్ఘే చ సఙ్ఘోత్పత్తిర్న యుజ్యతే॥*

188. *క్షణికత్వాభ్యుపగమాత్ అణుపృథ్వ్యాదికస్య చ।*
*కదాఽణవః క్షణధ్వస్తాః వ్యాప్రియన్తే చ సంహతౌ॥*

189. *భూతానిచకదా వాతే సంహన్యన్తేఽథ తాని చ।*
*కదా తే జ్ఞానవిషయాః యాన్తి వా వ్యవహార్యతామ్॥*

190. *సర్వే విశిష్టాశ్చేత్ పదార్థా, నహి యుజ్యతే।*
*జగదుత్పత్తిరపి చ వ్యవహారశ్చ లౌకికః॥*

186*-190. **సిద్ధాంతం:** ఈమతం కుదరదు. అణువుల్లోంచి భూమి మొదలైన భూతసముదాయం సృష్టింపబడుతున్నాయని చెప్పినప్పుడు, భూమిమొదలైనవాట్లోంచి దేహం ఇంద్రియం మొదలైన భౌతికసముదాయం సృష్టింపబడతాయని చెప్పినప్పుడు, ఆరెండు సముదాయాలూ సృష్టింపబడడం

కుదరదు. ఎందుకంటే, అణువు, భూమి మొదలైనవన్నీ క్షణికాలనిగదా అంగీకరింపబడుతున్నాయి. ఒకపదార్థం మరోపదార్థంతో కలిసినప్పుడు మొదటిక్షణంలో దానిలో క్రియ జరగాలి. తరువాతిక్షణంలో ఇతరపదార్థంతో కలవడం జరగాలి. మూడో క్షణంలో సముదాయస్థితిని పొందాలి. అణువులు ఒకదానితో ఒకటి కలిసినప్పుడు మొదటిక్షణంలోనే నశించడంవల్ల కలవడానికి అవి ఎప్పుడుంటాయి? భూతాలుకూడా ఒకదానితో మరొకటి కలిసినప్పుడు మొదటిక్షణంలోనే నశిస్తే అవి కలవడం ఎప్పుడు? ఒకక్షణంలోనే నశించే అవి ఏక్షణంలో క్షణికమైన జ్ఞానానికి విషయం అయి లోకవ్యవహారాన్ని జరిపిస్తాయి? కనుక ఇలా సమస్తపదార్థాలూ, క్షణంలోనే నశించేవాటిగా ఒప్పుకున్నందువల్ల ఈమతంలో లోకోత్పత్తికూడా కుదరదు, లోకవ్యవహారమూ కుదరదు. కనుక లోకోత్పత్తి, లోకవ్యవహారం కుదరడానికీ బ్రహ్మకారణవాదాన్నే అంగీకరించాలి.

*సి.సూ.// ఇతరేతరప్రత్యయత్వాదుపపన్నమితి చేన్న సఙ్ఘాతభావానిమిత్తత్వాత్// (2-2-18) (192)*

**ఇతరేతర*ప్రత్యయత్వాత్** - (అవిద్య మొదలైనవిన్నీ, భూమి మొదలైనవిన్నీ చక్రంలా తిరుగుతూ) ఒకదానికొకటి *కారణమై ఉండడంవల్ల, **ఉపపన్నం** - (సముదాయం అయే స్వభావం) కుదురుతుంది. **ఇతిచేత్** - అన్నట్లయితే, **న** - కుదరదు. **సఙ్ఘాతభావానిమిత్తత్వాత్** - (అవిద్యమొదలైనవి భూమి మొదలైనవాటి) సముదాయం అయే స్వభావానికి కారణం కాలేనివవడంవల్ల. {*బౌద్ధమతంలో ప్రత్యయశబ్దం కారణాన్ని చెప్తుంది}

*191. అవిద్యా విపరీతా ధీః తయా సంస్కారశబ్దితాః।*
*రాగద్వేషాదయశ్చైవమవిద్యాదిపరంపరా॥*
*192. అన్యోన్యమూలాఽనాదిశ్చ చక్రవత్పరివర్తతే।*
*భూతభౌతికసఙ్ఘాతం వినైతన్నోపపద్యతే॥*
*193. అతస్సఙ్ఘాతభావాద్యముపపన్నమిహేతి చేత్।*
*సి. నైవమేతదవిద్యాదేః సఙ్ఘాతత్వాదికం ప్రతి॥*

191-*193. **పూర్వపక్షం:** అనాదిగా వస్తున్న కార్యకారణపరంపరని పరిశీలించి చూస్తే వెనుకటి సూత్రంలో చెప్పిన దోషం ఏర్పడదు. క్షణికపదార్థాలని స్థిరమైనవాటిగా భావింపచేసే అవిద్య అనే విపరీతజ్ఞానంలోంచి సంస్కారాలు అనబడే రాగం, ద్వేషం మొదలైనవి ఏర్పడుతున్నాయి. శరీరం మొదలైనవి స్థిరమైనవి అనే భావనవల్ల వాటిమీద అనురాగం, వాటికి చెరుపుచేసేవాటిమీద ద్వేషం కలగడం చూస్తున్నాంగదా! ఆఅనురాగంమొదలుకావడంవల్ల చిత్తరూపమైన ఆత్మ దాయిగర్భంలో ప్రవేశించి అక్కడ 'నేను' అనే అహంకారాన్ని పొంది, కొత్తగా సృష్టింపబడిన శరీరానికి కావలసిన శ్రద్ధ, వీర్యం, స్మృతి, ప్రీతి మొదలైన చైతన్యాలని పొంది, దానివల్ల భూమి మొదలైన ధాతువులని చేరి, ఆరు ఇంద్రియాలని పొంది, ప్రాణం, దేహం, ఇంద్రియం, మొదలైనవాటిసముదాయమై స్పర్శం అనే శరీరమై, మళ్ళీ అవిద్యనిపొంది, ఇలా చక్రంలా ఒకదానికొకటి కారణంఅవుతూ భ్రమిస్తూ భ్రమిస్తూ వస్తోంది. భూతసముదాయంకూడా భౌతికమైన శరీరేంద్రియసముదాయం ఏర్పడకుండా ఈచక్రం నడవదు. కనుక, భూతభౌతికసముదాయం ఏర్పడడం లోకవ్యవహారం జరగడం అవుతాయి. కనుక, వెనకటిసూత్రంలో చెప్పిన దోషం బౌద్ధమతంలో రాదు.

*194. అనిమిత్తత్వతోఽవిద్యా స్థిరతాబుద్ధిరస్థిరే।*
*క్షణికస్య హి నార్థస్య భజేత్ సంహితహేతుతామ్॥*

*195. శుక్తిరూప్యస్యబుద్ధిర్హి న శుక్త్యాద్యర్థసంహతేః।*
*హేతుస్స్యాత్ కిఞ్చ యస్యస్యాత్ క్షణికే స్థిరతామతిః॥*

*196. స తదైవ ధ్వస్త ఇతి కస్యరాగాదికం భవేత్।*

193*-*196. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం తప్పు. అవిద్యమొదలైనవి భూతభౌతికాలసముదాయాల వడానికి కారణాలు కానేరవు. స్థిరత్వంలేని పదార్థాలని స్థిరాలనితలపింపచేసే విపరీతజ్ఞానం క్షణికమైన పదార్థాలని ఒకదానితోఒకదాన్ని చేర్చడానికి ఎలా కారణం అవుతాయి? ముత్యపుచిప్పని వెండిఅని అనుకొనే భ్రమ ముత్యపుచిప్ప మొదలైన పదార్థాలచేరికకికారణం అవుతాయా? పైగా, ఎవడు క్షణికమైన పదార్థాన్ని స్థిరమైనదిగా భావిస్తాడో, వాడు ఆక్షణంలోనే నశించిపోయేవాడుగనుక రాగం మొదలైనవి వాడికి ఎలా ఏర్పడుతాయి? అంచేత బౌద్ధమతం కుదరదు.

*సి.సూ॥ ఉత్తరోత్పాదే చ పూర్వనిరోధాత్ ॥(2-2-19) (193)*

**ఉత్తరోత్పాదే** - తరువాతి క్షణం ఉండినప్పుడు, **పూర్వనిరోధాత్ చ** - ముందరి క్షణం నశించిపోయినందువలన (బౌద్ధమతం కుదరనిదే).

196*. *పరక్షణోత్పత్తికాలే పూర్వక్షణవినాశతః॥*

*197. పరక్షణం ప్రత్యేతస్య హేతుత్వానుపపత్తితః।*
*న స్యాద్విశ్వోత్పత్తిరస్మిన్ క్షణికత్వమతే ధ్రువమ్॥*

*198. అభావస్యైవ హేతుత్వే సర్వం సర్వత్ర సర్వదా।*
*ఉత్పత్త్యేతాఽథ పూర్వత్ర వర్తినోఽస్యైవ హేతుతా॥*

**199. కశ్చిత్ ఘటక్షణో హేతుః స్యాన్నానోత్తరభావినామ్।*

**196*-*199.** తరువాతి క్షణంలో ముందరిక్షణం నశించిపోతుందిగనుక, ముందరిక్షణం తరువాతి క్షణానికి కారణం కాలేదు. కనుక, అంతా క్షణికం అనే బౌద్ధమతంలో లోకోత్పత్తి కుదరదు. ముందరిక్షణపు అభావమే తరువాతి క్షణానికి కారణం అంటే, ఆముందరిక్షణపుఅభావం ఆక్షణం అక్కడతప్ప సమస్తకాలాల్లోనూ సమస్తప్రదేశాల్లోనూ ఉంటుందిగనుక, సమస్తపదార్థాలు, సమస్తప్రదేశాల్లోనూ, సమస్తకాలాల్లోనూ ఉండవలసివస్తుంది. దీన్ని ఖండించడంకోసం కార్యానికి ముందరక్షణంలో ఉన్నదిమాత్రమే దానికి కారణం అంటే, ఒకఘటక్షణం దానికి తరువాతిక్షణంలో ఉన్న ఆవు, ఎద్దు, రాయి మొదలైన సమస్తపదార్థాలకీ కారణం అవాలి. దీన్ని తప్పించడంకోసం ముందరిక్షణంలో ఉన్నదై కార్యంతోబాటు ఒకే జాతినిగలదే దానికి కారణం అవడానికి వీలు అంటే, ఒకక్షణంలో ఉన్నఘటం మరుక్షణంలో ఉన్న సమస్తఘటాలకీ కారణం అయి ఉండవలసివస్తుంది. దీన్ని ఖండించడంకోసం ఒక ఉత్తరఘటక్షణానికి ఒకపూర్వఘటక్షణమే కారణం అంటే, అప్పుడుకూడా, ఏఘటానికి ఏఘటం కారణం అనేది నిర్ణయించడానికి వీలుగాదుగనుక, ఇది కుదరదు. దీన్ని తప్పించడానికి, ఏదేశంలో ఒకఘటక్షణం ఉన్నదో, అది అదేదేశంలో ఉన్న తరువాతి ఘటక్షణానికి కారణం అంటే, ఇలా తీసుకుంటే దేశం స్థిరమైనది అని అంగీకరించాల్సిరావడంవల్ల సమస్తం క్షణికం అనే బౌద్ధమతమే నశించిపోతుంది. కనుక, ఎలాచూసినా, బౌద్ధమతం కుదరనిదే.

*సి.సూ.॥అసతి ప్రతిజ్ఞోపరోధో యౌగపద్యమన్యథా॥ (2-2-20) (194)*

**అసతి** - (కారణం) లేకపోయినప్పుడు (కార్యం ఉండాలి అంటే) **ప్రతిజ్ఞోపరోధః** - (అధిపతి మొదలైనవి జ్ఞానం ఉండడానికి కారణం అవుతున్నాయి.)అనే బౌద్ధమతప్రతిజ్ఞ విరోధిస్తుంది. **అన్యథా** -

ఈప్రతిజ్ఞ విరోధించకుండా ఉండడానికి కారణం ఉన్నప్పుడే కార్యం ఉంటుంది అంటే, **యౌగపద్యం** - కార్యకారణాలు ఒకేసమయంలో ఉత్పన్నం అవాలి.

*199*. అసత్యపి చ హేతౌ తత్ కార్యముత్పద్యతే యది॥*

*200. జ్ఞానోత్పత్తావధిపతిసహకార్యాదికస్య చ।*
*కారణత్వప్రతిజ్ఞాయాః విరోధశ్చాపి సంభవేత్॥*

*201. ప్రతిజ్ఞాఽనుపరోధాయ తిష్ఠత్యేకఘటక్షణే।*
*ఘటక్షణాంతరోత్పత్తిః ఇష్యతే భవతా యది॥*

*202. యౌగపద్యేనోపలబ్ధిః కార్యకారణయోర్భవేత్।*

199* - *202. వెనుకటి సూత్రాలలో చెప్పిన దోషాలని తప్పించడానికి కారణంలేకనే కార్యం ఉంటుంది అని అంగీకరిస్తే, అధిపతి సహకారి మొదలైనవాటిని జ్ఞానం కలగానికి కారణంగా బౌద్ధమతంలో ప్రతిజ్ఞచేయడం కుదరకుండాపోతుంది. ఈప్రతిజ్ఞ వ్యతిరేకించకుండా ఉండడానికి, కారణం ఉండే కార్యం ఉంటోంది అంటే, ఉన్నది నశించడానికి అవకాశంలేకపోవడంవల్ల కార్యం, కారణం ఐన రెండు ఘటాలు ఒకే సమయంలో కనబడాల్సివస్తుంది. కాని ఇలా మనకి కనబడదు. కనుక బౌద్ధమతం కుదరని మతం.

*సి.సూ.॥ ప్రతిసంఖ్యాఽప్రతిసంఖ్యానిరోధాప్రాప్తిరవిచ్ఛేదాత్॥(2-2-21) (195)*

**ప్రతిసంఖ్యాఽప్రతిసంఖ్యానిరోధాప్రాప్తిః** - కనబడే (స్థూల)వినాశము, కనబడని (సూక్ష్మ) వినాశం (లోకానికి) కలగవు. **అవిచ్ఛేదాత్** - (ఉండిన పదార్థం పూర్తిగా) లేకపోవడం కుదరకపోవడంవల్ల.

*202* వినాశశ్చ ద్విధా ప్రోక్తః స్థూలసూక్ష్మప్రభేదతః॥*

*203. ఆద్యోఽయముపలబ్ధ్యర్హః ఘటాదౌ దండతాడితే।*
*అన్త్యః ప్రతిక్షణోద్భావీ తదనర్హో నిరన్వయౌ॥*

*204. న స్యాతాం తౌ వినాశాదిధర్మభాగ్వస్తునస్సదా।*
*అవిచ్ఛేదాత్ ఘటాదౌ చావస్థాన్తరసమన్వితే॥*

*205. నిరన్వయవినాశస్యాదర్శనాదేవమేవ తు।*
*దీపనిర్వాణేఽపి సూక్ష్మావస్థాసంప్రాప్తిరిష్యతే॥*

***202****-*205.* వెనకటి సూత్రానికి అనుబంధంగా లేనటువంటిపదార్థంనుంచి ఉండేపదార్థాన్ని సృష్టించడం అనే అసత్కార్యవాదం నిరసించబడింది. ఉంటున్న పదార్థం పూర్తిగా లేకపోవడం కుదరదు అని ఈసూత్రంలో నిరూపించబడుతోంది. సంఖ్యాశబ్దం జ్ఞానాన్ని సూచిస్తుంది. ఇక్కడ ప్రత్యక్షాన్ని సూచిస్తోంది. ప్రతిశబ్దం వ్యతిరేకాన్ని చెప్తుంది. నిరోధశబ్దం వినాశాన్ని చెప్తుంది. కనుక, ప్రతిసంఖ్యానిరోధ శబ్దం ఉన్నపదార్థాన్ని ప్రత్యక్షంగా చూసినప్పుడు పూర్తిగా లేకపోవడంఅనే నిరన్వయవినాశాన్ని బౌద్ధమతంలో చెప్తుంది. ప్రత్యక్షంగా చూడశక్యంగానిదిగాఉండే నిరన్వయవినాశం అప్రతిసంఖ్యానిరోధశబ్దం వల్ల చెప్పబడుతోంది. ఈరెండింటికీ ఉదాహరణం - ఘటం మొదలైనవాటిని రోకలితో కొట్టినప్పుడు జరిగే వినాశం స్థూలమైనదవడంచేత ప్రత్యక్షంగా కనబడుతోంది. ఇది ప్రతిసంఖ్యానిరోధానికి ఉదాహరణం. రెండోదానికి ఉదాహరణం - ఆఘటం ఇలా రోకలివల్ల కొట్టబడడానికి పూర్వమే ప్రతిక్షణం నశిస్తూ అలాంటిదే మరో ఘటం మరుక్షణంలో సృష్టింపబడుతూండడం. ఈవినాశం సూక్ష్మమైనదవడంవల్ల ప్రత్యక్షంగా చూడశక్యంగానిది అనే క్షణికత్వాదులవల్ల అంగీకరించబడేదే అవుతుంది. ఈరెండువిధాలైన నిరన్వయవినాశం కలగడానికి సాధ్యంగాదు. ఘటం మొదలైనపదార్థాలు నశించిపోయినప్పుడు ఎప్పుడూ

అవి కపాలం(చట్టి) మొదలైన వేరురూపాలని పొందుతున్నవే తప్ప పూర్తిగా నశించడంలేదు. అంచేత ఎక్కడనశించినా, ఒకపదార్థం వేరొకస్థితిని పొందడం అనే సాన్వయవినాశాన్ని అంగీకరించడమేతప్ప ఆపదార్థం పూర్తిగా నశించడం అనే నిరన్వయవినాశాన్ని అంగీకరించడం కుదరదు. ఈవిషయం వెనుకటి పాదంలో ఆరంభణాధికరణంలో నిరూపించబడింది. ఇక "దీపం ఆరిపోయినప్పుడు ఉన్నదీపం పూర్తిగా నశించడాన్ని చూస్తున్నామే పాతవేడిఇనుంమీద నీళ్ళు జల్లితే ఆనీళ్ళుకూడా పూర్తిగా నశించిపోవడం చూస్తున్నాం. వీటితో మిగతా పదార్థాలుకూడా ప్రతిక్షణం పూర్తిగా నశించిపోతున్నాయి అని అనుమానం చేయవచ్చును." అని క్షణికత్వవాదులు చెప్తున్నారుగాని, "ఘటం, బంగారుకుండలం మొదలైనవి నశించినప్పుడు ఆరూపాలని పోగొట్టుకోవడమేగాని బొచ్చె, బంగారపు కడ్డీ మొదలైనవాటిగా అవడాన్ని చూస్తున్నాంతప్ప పూర్తిగా నశించిపోవడాన్ని చూడడంలేదు. అలాగే దీపం ఆరిపోయినప్పుడుకూడా అది సూక్ష్మతేజస్సుగా మారుతుందనీ, పాతవేడిఇనుంమీద జల్లిన నీటిబొట్టు సూక్ష్మమైన నీటి ఆవిరిగా మారుతోందనీ అనుమానించవచ్చు. కనుక నిరన్వయవినాశాన్ని అంగీకరించాల్సిన అవసరంలేదు" అని సమాధానం చెప్తున్నాం. చూస్తున్నదాన్నిబట్టి చూడనిదాన్ని కల్పించవచ్చు. కనబడనిదాన్నిపట్టి కనబడుతున్నదాన్ని ఖండించడం తగదు. పైగా, ఘటం, కుండలం మొదలైన వేలకొద్దీ పదార్థాలు నశించిపోయినప్పుడు అవి వేరొకస్థితిని పొందడం చూస్తున్నాంగనుక, దాన్నిబట్టి, ఆవిధంగా కనబడని కొన్నిసమయాల్లోకూడా అనుమానంచేయడం న్యాయమేతప్ప కనబడని కొన్నిసందర్భాలనిబట్టి కంటికి కనబడుతూండే వేలకొద్దీ ఉన్న సమయాలని వేరుగా చూడడంవల్ల న్యాయవిరోధం, గౌరవం అనే దోషం కలుగుతాయి. కనుక బౌద్ధులచేత కల్పింపబడే ప్రతిసంఖ్యానిరోధం, అప్రతిసంఖ్యానిరోధం అనబడే రెండువిధాలైన నిరన్వయవినాశాలు కుదరనివిగనుక ఉన్నపదార్థం పూర్తిగా నశించవీలులేదు అని నిరూపించబడింది.

### *సి.సూ.॥ ఉభయథా చ దోషాత్ ॥ (2-2-22) (196)*

**ఉభయథా** - లేనివస్తువునుండి వస్తువు సృష్టింపబడిందనిన్నీ, ఉన్నవస్తువు లేనిదవుతుందనిన్నీ చెప్పే రెండు వాదాలలో, **దోషాత్ చ** - దోషం ఏర్పడడంచేత (బౌద్ధమతం కుదరనిది)

**206.** *జాతస్య తుచ్ఛతాపత్తౌ తుచ్ఛాచ్చోత్పత్తివర్ణనే।*
*దోషాపత్తేరుభయథా తే న స్యాతాం హి సర్వథా॥*

**207.** *తుచ్ఛాదుత్పత్తివాదే హి కార్యం తుచ్ఛాత్మకం భవేత్।*
*యస్మాదుత్పద్యతే యచ్చ తత్ తదాత్మకమేవ హి॥*

**208.** *మృత్సువర్ణాదికార్యం హి దృశ్యతే తన్మయం యథా।*
*జాతస్య తుచ్ఛతాపత్తౌ జగత్తచ్ఛాత్మకం భవేత్॥*

**209.** *తచ్చ తుచ్ఛాత్మకం నాఙ్గీక్రియతే న ప్రమీయతే।*
*తస్మాఽుభయథా దోషాదిదం మతమసఙ్గతమ్॥*

206-209. బౌద్ధమతంలో ఉన్నటువంటి పదార్థాలు లేనిదిగా అయిపోతుందనిన్నీ, లేనిదాంట్లోంచి ఉన్నపదార్థం సృష్టింపబడుతుందనిన్నీ అంగీకరించే రెండు వాదాలలోనూ దోషంవస్తోందిగనుక, ఆవాదాలు ఏవిధంగానూ కుదరవు. ఎలా అంటే, శూన్యంలోంచి ఒకవస్తువు సృష్టింపబడుతోంది అంటే, సృష్టింపబడిన ఆపదార్థంకూడా, శూన్యంగానే ఉండాల్సివస్తుంది. ఎందుకంటే, లోకంలో కారణవస్తువు ఏరూపంలో ఉన్నదో, ఆరూపంగానే కార్యవస్తువుకూడా ఉండడాన్ని మనం చూస్తున్నాం. మట్టితో చేయబడ్డ

కుండ మట్టిరూపంగానే ఉండడం, బంగారంతో చేసిన కుండలం బంగారుమయంగానే ఉండడాన్నీ చూస్తున్నాంగదా! కనుక, శూన్యంలోంచి సృష్టింపబడిన లోకం శూన్యమనే తీసుకోవాల్సివస్తుంది. కాని లోకం శూన్యంగా కనబడంలేదు. మాధ్యమికులుకాని బౌద్ధులు లోకం శూన్యం అని అంగీకరించడంకూడా లేదు. (అంతా శూన్యమే అనే మాధ్యమికపక్షం తరువాతితరువాతి అధికరణంలో నిరసింపబడుతుంది.) ఉన్నపదార్థం పూర్తిగా నశిస్తోంది అనే వాదంలోనూ, ఒకక్షణంతర్వాత సమస్తలోకం పూర్తిగా నశించిపోవలసి రావడంచేత శూన్యంగానే అంగీకరించాల్సివస్తోంది. కనుక, ఈరెండువాదాల్లోనూ లోకాన్ని శూన్యంగా అంగీకరించాల్సిరావడంచేత బౌద్ధమతం అసంగతమైనదే.

**సి.సూ.॥ ఆకాశే చా విశేషాత్॥ (2-2-23) (197)**

**ఆకాశే చ** - ఆకాశవిషయంలోకూడా (శూన్యం అనే వాదం కుదరదు) **అవిశేషాత్** - (భూమి మొదలైనవాటిలాగ ప్రత్యక్షంగా కనబడుతుండడంవల్ల) భేదంలేకపోవడంవల్ల.

*210. తుచ్ఛస్వరూపతాఽఽకాశే న సంభవతి తత్ర చ।*
*అబాధితప్రతీతిర్యత్ పృథివ్యాదావివాస్తి నః॥*

*211. పతత్యత్ర శ్యేన ఇతి తదాధారత్వతోఽనిశమ్।*

210-*211. కనబడుతూన్న భూమి మొదలైనవి శూన్యంకాలేవు అని వెనుకటి సూత్రంలో నిరూపించబడింది. భూమిమొదలైనవాటిలాగే మరోప్రమాణంవల్ల నిరసింపబడకుండా ప్రత్యక్షంగా కనబడుతూండడంవల్ల ఆకాశంకూడా శూన్యంకాదు అని ఇక్కడ నిరూపించబడుతోంది. ఆకాశం ప్రత్యక్షంగా కనబడుతోందా అంటే, ఇక్కడ గద్ద ఎగురుతోంది, ఇక్కడ రాబందు ఎగురుతోంది అని గద్ద, రాబందు మొదలైనవి ఎగిరేస్థలంగా ఆకాశం ప్రత్యక్షంగా కనబడుతోందిగదా! భూమిమొదలైనవాటి అభావమే (లేకపోవడం) ఆకాశం అని చెప్పసాధ్యంగాదు. ఎలా అంటే, అభావం అనేది 1. ప్రాగభావం, 2. ప్రధ్వంసాభావం, 3. అన్యోన్యాభావం, 4. అత్యంతాభావం అని నాలుగురకాలు. ఒకవస్తువుకి ప్రాగభావం అంటే ఆవస్తువు ఉండడానికి పూర్వం ఉండకపోవడం, దాని ప్రధ్వంసాభావం అన్నది ఆవస్తువు నశించినతర్వాత ఉండకపోవడం. ఆవస్తువు ఉన్నప్పుడు ఈరెండు అభావాలూ ఉండడానికి వీల్లేదు. ఆకాశాన్ని భూమిమొదలైనవాటి ప్రాగభావంగానో, ప్రధ్వంసాభావంగానో అనుకుంటే, భూమిమొదలైనవి ఉంటున్నప్పుడు ఆకాశం లేకుండాపోవాలి. ఇది ప్రత్యక్షవిరుద్ధం. కనుక ఆకాశాన్ని భూమిమొదలైనవాటి ప్రాగభావప్రధ్వంసాభావాలుగా అనుకుందికి వీలులేదు. ఇక ఘటం పటం అనే రెండు వస్తువులమధ్యని అన్యోన్యాభావాన్ని తీసుకుంటే, ఘటంతాలూకు అన్యోన్యాభావం పటంలోనూ, పటంతాలూకు అన్యోన్యాభావం పటంలోనూ ఉన్నాయి. వేరేచోట్ల ఈఅభావం ఉండలేదు. ఆకాశాన్ని రెండువస్తువుల అన్యోన్యాభావంగా అనుకుంటే, ఆరెండింటిమధ్యనీ ఆకాశం ఉండవీల్లేదు. ిదికూడా ప్రత్యక్షవిరుద్ధమే. చివరిగా, అత్యంతాభావం అన్నది ఒకవస్తువుపూర్తిగా నశించిపోయినప్పుడు కలిగేది. భూమిమొదలైనవి ఉన్నప్పుడు, అవి ఉన్నసమయంలోనే మనం ఆకాశాన్ని చూడడంవల్ల ఆకాశమనేది వాటి అత్యంతాభావంగాఉండడానికీ సాధ్యంగాదు. ఈవిధంగా, నైయాయికమతరీతిలో అభావాన్ని అంగీకరించినా, ఆకాశం భూమి మొదలైనవాటి అభావంగా కాలేదని తెలుస్తోంది. యథార్థంగా ఒకవస్తువుతాలూకు అభావం ్నేది ఉన్నటువంటి వస్తువొకదానితాలూకు స్థితిగానే నిరూపించబడుతోంది. ఉదాహరణంగా, ఘటంతాలూకు ప్రాగభావం అన్నది దాని పూర్వస్థితియైన మట్టిగడ్డగానూ, ప్రధ్వంసాభావం అనేది తరువాతి స్థితియైన కుండపెంకులుగానూ, ఘటంతాలూకు అన్యోన్యాభావం పటం(వస్త్రం)గానూ, పటంతాలూకు అన్యోన్యా

భావం ఘటంగానూ, "భూమిలో ఘటం పూర్తిగా లేదు" అన్నప్పుడు ఘటం తాలూకు అత్యంతాభావం భూమిగానూ, తెలియబడుతోంది. కనుక, భూమి మొదలైనవాటి అభావంగానే ఆకాశం అయినప్పటికీ, అది ప్రత్యక్షంగా కనబడే ఒకవస్తువుగానే కుదురుతుంది. కనుక, ఈవిధంగా, భూమిమొదలైనవాటిలాగే, ప్రత్యక్షమైనదిగా కనబడడంలో భేదంలేకపోవడంవల్ల ఆకాశంకూడా శూన్యం కానేరదు.

### *సి.సూ.॥ అనుస్మృతేశ్చ॥ (2-2-24) (198)*

**అనుస్మృతేః చ** :- (వెనుక అనుభవించబడిన వస్తువులు) తిరిగీ అనుభవించబడడంవల్లకూడా. (వస్తువులు క్షణికాలు కానేరవు.)

*211* ప్రత్యభిజ్ఞానతోప్యేవమర్థక్షణికతా న హి॥*

*212. తదేవేదమితి జ్ఞానమతీతాద్యవగాహనాత్।*
*కాలద్వయవిశిష్టం చ వస్త్వేకం సూచయత్యతః॥*

*213. అస్థిరత్వే పదార్థస్య ప్రత్యభిజ్ఞా న సఙ్గతా।*
*సమానం దూషణం ప్రోక్తం బాహ్యార్థాస్తిత్వవాదినోః॥*

211*-213. భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్కాలం అని కాలం మూడువిధాలైనది. అందులో " ఆనాడు చూసినదాన్ని ఇవాళ చూస్తున్నాను" వంటివి చెప్పినప్పుడు ఒకకాలంలో ఉన్నదాన్ని మరొక కాలంలో అనుభవించడం అనే ప్రత్యభిజ్ఞారూపమైన జ్ఞానం కనబడుతుంది. ఈప్రత్యభిజ్ఞవల్ల రెండు భిన్నకాలాల్లో ఉన్న వస్తువు ఒకటే అని నిరూపించబడుతోంది. వస్తువులు క్షణికమైతే, ప్రతీక్షణంలోనూ వేరువేరు వస్తువులు సృష్టింపబడవలసిరావడంవల్ల రెండు వేర్వేరుకాలాల్లో ఉన్న వస్తువు ఒక్కటే అనితెలిపే ఈప్రత్యభిజ్ఞ కుదరకపోతుంది. అందువల్ల ఇంతవరకూ బాహ్యపదార్థాలు క్షణికంగా ఉన్నాయి అని చెప్పే వైభాషికసౌత్రాంతికులకి ఇద్దరికీ వర్తించే సామాన్యమైన దూషణాలు నిరూపించబడినాయి. తరువాతి సూత్రంలో "బాహ్యపదార్థాలు అనుమానంచేతనే తెలియబడేవి" అని చెప్పే సౌత్రాంతికులకే చెందిన దూషణ నిరూపించబడుతోంది.

### *సి.సూ.॥ నాసతోఽదృష్టత్వాత్ ॥ (2-2-25) (199)*

**అసతః న** - (జ్ఞానంలోఉన్న నీలం మొదలైన స్వభావం) నశించిన పదార్థంలో ఉండశక్యంగాదు. **అదృష్టత్వాత్** - (పదార్థం నశించినతర్వాత దాని స్వభావం వేరొకపదార్థంలో సంక్రమిస్తుంది) అని ఎక్కడా కనబడలేదుగనుక.

*214. జ్ఞానోత్పత్తిక్షణేఽర్థస్యానవస్థానాన్న కస్యచిత్।*
*అర్థస్య ధీవిషయతా స్యాదితి ప్రాక్ యదీరితమ్॥*

*215. తత్రానుమేయార్థవాదీ ప్రాహ సౌత్రాంతికః పరః।*
*న జ్ఞానవిషయత్వేఽత్ర వస్తుసత్తైవ కారణమ్॥*

*216. వస్తునో ధీవిషయతా యతస్తద్ధేతుతాత్మికా।*
*విజ్ఞానే నీలపీతాదివిచిత్రాకారదర్శనాత్॥*

*217. పూర్వసమర్ప్య స్వాకారం విజ్ఞానే తదనన్తరమ్।*
*స్వయం వినష్టో నీలాదిరర్థః పుంసాఽనుమీయతే॥*

214-217. **పూర్వపక్షం:** వస్తువులని క్షణికాలుగాతీసుకుంటే, ఏవస్తువూ దాన్నిగురించిన జ్ఞానంఉన్న మరుక్షణంలో ఉండలేకపోవడంవల్ల ఏవస్తువూ జ్ఞానానికి విషయంకాలేదు అని బౌద్ధమతానికి ఒకదోషం

చెప్పబడుతోందిగదా! దానికి సౌత్రాంతికులనబడే మేము క్రిందివిధంగా సమాధానం చెప్తాం - జ్ఞానంఉన్నక్షణంలో ఒకవస్తువు లేకపోయినట్లైతే ఆవస్తువు జ్ఞానానికి విషయంకాలేదు అని చెప్పడానికి వీలులేదు. ఒకవస్తువు ఉండడంవల్లే అది జ్ఞానానికి విషయం అయిపోదు. జ్ఞానానికి విషయం అవడం అంటే, జ్ఞానంఉండడానికి కారణం అయేఉంటుంది. జ్ఞానంఉండడానికి విషయమైన వస్తువుజ్ఞానాన్ని కలిగించినతర్వాత నశించిపోవడానికి అడ్డేమీ లేదుగదా! జ్ఞానంకలిగంచడానికి కారణమవడమే జ్ఞానానికి విషయంకావడం అంటే, జ్ఞానం కలగడానికి కారణమైన కన్నుమొదలైన ఇంద్రియాలుకూడా జ్ఞానానికి విషయాలుకావాల్సివస్తుందే అంటే, తనఆకారాన్ని జ్ఞానంలో సమర్పించుకోవడంద్వారా ఏది జ్ఞానం కలగడానికి కారణంఅవుతోందో, అదే జ్ఞానానికి విషయం అవుతుంది అని అంగీకరిస్తున్నాంగనుక, కన్ను మొదలైనవి జ్ఞానానికి విషయాలుకాకపోవడానికి అడ్డేమీలేదు. కనుక, జ్ఞానంలో నీలం, పసుపు మొదలైన ఆకారాలని సమర్పించి నశించిపోయిన నీలఘటం మొదలైనవి జ్ఞానంలోఉన్నదిగా కనబడుతున్న విచిత్రమైన ఆఆకారాలని అనుమానించి తెలుసుకుంటాంగనుక క్షణికమైన వస్తువులుకూడా జ్ఞానానికి విషయాలవడంలో ఏమీ ఆటంకంలేదు. నీలం మొదలైన ఆకారాలులేని జ్ఞానంలో కనబడే నీలం మొదలైన విచిత్రమైన ఆకారాలు ఆయాఆకారాలతోనున్నవస్తువులవల్ల సమర్పించబడుతోందని అనుకుంటేనే కుదురుతుందిగనుక మామతమే సరియైనది.

*218. యతోఽర్థకృతమేవైతత్ జ్ఞానవైచిత్ర్యమిత్యసత్।*
*జ్ఞానే నీలాదిరాకారః లభ్యతే యః స నార్హతి॥*
*219. ఆకారో భవితుం నష్టస్యార్థస్యైవమపి క్వచిత్।*
*నష్టే ధర్మిణ్యదృష్టత్వాత్ ధర్మస్యాన్యత్ర సఙ్గతేః॥*
*220. జపాపుష్పే వినష్టే హి లౌహిత్యం స్ఫటికే కుతః।*
*ధీవైచిత్ర్యమతోఽర్థస్యక్షణికత్వే న సంభవేత్॥*

*218-220. **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం తప్పు. జ్ఞానంలో కనబడే నీలం మొదలైన విచిత్రమైన ఆకారాలు మొదటినుంచీ నశించిపోయిన వస్తువుల ఆకారాలే అని చెప్పడం ఎలాచూసినా కుదరదు. ఒకవస్తువు నశించిపోయినతర్వాత దాని ధర్మం వేరొకవస్తువులో చేరి కనబడుతున్నదనేది లోకంలో ఎక్కడా లేదు. జపాకుసుమం అనే ఎర్రనిపువ్వు స్ఫటికంలో ప్రతిఫలించడం అద్దంలో ముఖం ప్రతిఫలించడం మనం చూస్తున్నాం. ఆపువ్వో, ఆముఖమో ఆస్ఫటికానికో, లేక ఆఅద్దానికో ఎదురుగా ఉన్నప్పుడే వాటిలో అవి ప్రతిఫలిస్తున్నాయి. తొలగిపోయినతర్వాతనో, నశించిపోయిన తర్వాతనో అవి ప్రతిఫలించడంలేదు. ఆఆకారాలతోఉన్న పువ్వు మొదలైన వస్తువులే అవిఉన్నప్పుడు ప్రతిఫలిస్తున్నాయి. కనుక, వస్తువు నశించినతర్వాత వాటి ఆకారాలు మాత్రం జ్ఞానంలో సమర్పించబడి ప్రకాశిస్తున్నాయి అని చెప్పడం కుదరదు. అందువల్ల వస్తువులు క్షణికం అనే బౌద్ధమతంలో విచిత్రమైన జ్ఞానాలు కలగడం కుదరదు.

*సి.సూ.॥ ఉదాసీనానామపి చైవం సిద్ధిః ॥ (2-2-26) (200)*

**ఏవం** - ఈవిధంగా వస్తువులు క్షణికాలు అని అనుకుంటే, **ఉదాసీనానాం అపి** - ప్రయత్నం చెయ్యనివాళ్ళకికూడా **సిద్ధిః** - సమస్తపదార్థాలూ సిద్ధించవలసివస్తుంది (అనే దోషం ఏర్పడుతుంది.)

*221. క్షణికత్వే పదార్థానాం నిష్ప్రయత్ననృణామపి।*
*సర్వార్థసిద్ధిస్స్యాదేవ ప్రయత్నాద్యనుతిష్ఠతః॥*
*222. తదానీమేవ నష్టత్వాత్ తత్సంస్కారాదికస్య చ।*

*స్థిరస్యైకస్యానువర్తమానస్యాసంమతత్వతః॥*

223. *భవేదహైతుకీ సిద్ధిః అప్రయత్నవతామపి।*
*ఉభయోరప్యయం దోషః సమోఽతో దర్శనం న సత్॥*

*॥ఇతి సముదాయాధికరణమ్॥*

221-223. **సిద్ధాంతం:** మరోహేతువువల్లకూడా బౌద్ధమతం కుదరనిదే. అదేమిటంటే, లోకంలో మనుష్యులు భవిష్యత్తులో కొన్ని ప్రయోజనాలు కలగాలి అనే ఆశతో వర్తమానంలో కొన్ని ప్రయత్నాలు చెయ్యడం మనం చూస్తున్నాం. బౌద్ధమతంప్రకారం ప్రయత్నాలు చేసేవాళ్ళు ఆక్షణంలోనే నశించిపోయినందువల్ల వాళ్ళకి భవిష్యత్తులో ఏప్రయోజనమూ లేదు. అటువంటి ప్రయత్నాలేమీ చెయ్యని వేరెవరికో ప్రయత్నం లేకుండానే అన్నిప్రయోజనాలూ కలుగుతున్నాయి అని చెప్పాల్సివస్తుంది. ప్రయత్నం చేసిన మనుష్యులు నశించినతర్వాతకూడా వాళ్ళ సంస్కారం మొదలైనవాటిలో ఏదోఒకటిస్థిరంగాఉండి ఫలాన్ని ఇస్తోంది అని అంగీకరిస్తేనే ఈదోషాన్ని కొంతవరకూ ఖండించవచ్చు. అటువంటి స్థిరమైన పదార్థాలనే బౌద్ధులు అంగీకరించకపోవడంవల్ల ప్రయత్నం చెయ్యనివాళ్ళకి భోగం మోక్షం మొదలైన సమస్తలాభాలూ లభిస్తున్నాయి అనే దోషం వాళ్ళవల్ల ఖండించలేనిదే అవుతుంది. వైభాషికుడు, సౌత్రాంతికులైన ఇద్దరికీ సామాన్యమైన దోషం ఇది. కనుక, వాళ్ళమతం కుదరనిది.

సముదాయాధికరణం పూర్తి అయినది.

## ॥ఉపలబ్ధ్యాధికరణమ్॥ (2-2-4)

### సి.సూ.॥ నాభావ ఉపలబ్ధేః॥ (2-2-27) (201)

**అభావః** - (జ్ఞానం లేని బాహ్యపదార్థాలు) లేవు అన్నది, **న** - తప్పు. **ఉపలబ్ధేః** - (ఆజ్ఞానానికి విషయంగా ఆపదార్థాలు) కనబడడంవల్ల.

224. *చతుర్విధేషు బౌద్ధేషు ప్రాఙ్నిరస్తం ద్వయోర్మతం।*
*యోగాచారస్యాత్ర మతం తృతీయస్య నిరస్యతే॥*

224. నాలుగురకాల బౌద్ధుల్లోనూ క్షణికమైనజ్ఞానంతో క్షణికమైన బాహ్యవస్తువులుకూడా ఉన్నాయి అనిచెప్పే వైభాషికసౌత్రాంతికుల మతం వెనుకటి అధికరణంలో ఖండించబడింది. క్షణికమైన జ్ఞానమే ఉన్నదితప్ప బాహ్యవస్తువులూలేవు అని చెప్పే యోగాచారుడనబడే బౌద్ధుడిమతం ఈఅధికరణంలో నిరసింపబడుతోంది.

225. *యద్ధీవిచిత్రత్వమర్థవైచిత్ర్యకృతముచ్యతే।*
*తన్నార్థవన్మతేరేవ విచిత్రత్వాచ్చ సాకృతేః॥*

226. *నిరాకారధియాం కుత్రాప్యప్రకాశో హి సంమతః।*
*తతః ప్రకాశమానాయాః ధియస్సాకారతా భవేత్॥*

227. *జ్ఞాయమానో య ఆకారః స జ్ఞానస్యేతి నిశ్చయః।*
*బహిర్వదవభాసోఽపి తస్య విభ్రమమూలకః॥*

228. *సహోపలమ్భనియమాదపి జ్ఞానార్థయోస్తథా।*
*జ్ఞానాదవ్యతిరిక్తోఽర్థః, కిఞ్చ బాహ్యార్థవాదిభిః॥*

229. *జ్ఞానేప్యర్థసరూపం చ రూపమాస్థేయమన్యథా।*
*జ్ఞానస్య తత్తదర్థం ప్రత్యసాధారణతా కథమ్॥*

*230. తావన్మాత్రేణైవ సర్వవ్యవహారోపపత్తితః।*
*విజ్ఞానేతరబాహ్యార్థకల్పనం నైవ యుక్తిమత్॥*

225-230. **పూర్వపక్షం:** బాహ్యపదార్థాలల్లో కనబడే విచిత్రమైనఆకారాలే జ్ఞానంలో ప్రతిఫలిస్తున్నాయని వైభాషికసౌత్రాంతికులు చెప్పినదితగదు. విచిత్రమైనఆకారాలుగల జ్ఞానాన్నిమాత్రం అంగీకరిస్తేనే సరిపోతుంది. బాహ్యపదార్థాలని అంగీకరించాల్సిన అవసరంలేదు. జ్ఞానం ఎక్కడైనా ఆకారంలేనిదిగా ప్రకాశించలేదు అని అందరూ అంగీకరించినదే. కనుక, ప్రకాశించేదిగా ఉండే జ్ఞానం సమస్తం సహజంగానే ఆకారంగలదిగానే ఉన్నదని నిశ్చయించాలి. తెలియబడే ఆకారాన్ని జ్ఞానంగలదిగానే తీసుకుంటే, ఆఆకారమున్న బాహ్యపదార్థాన్ని కల్పించవలసిన అవసరంలేదు. లోపలుండే జ్ఞానంతాలూకు ఆఆకారం బైటఉన్నదిలా అనిపించడం భ్రమచేత కలిగినది. జ్ఞానం, తెలుసుకొనబడేవస్తువుకూడా ఎప్పుడూ కలిసే తెలియడంవల్ల తెలుసుకొనబడే వస్తువు జ్ఞానంకంటే వేరైనదిగాదని తెలుస్తోంది. పైగా, బాహ్యవస్తువుఉన్నది అనిచెప్పేవాళ్లు జ్ఞానంలోకూడా ఆబాహ్యపదార్థంలాంటి ఆకారాన్ని అంగీకరించాలి. లేకపోతే, ఘటాన్నిగురించిన జ్ఞానం పటాన్నిగురించిన జ్ఞానం అని ప్రతి బాహ్యపదార్థాన్నిగురించిన వేర్వేరు జ్ఞానాలని నిరూపించసాధ్యంగాదు.జ్ఞానంలోఉన్న ఆఆకారాలతోటే వెనకచెప్పిన సమస్తజాతులని గురించీ అంగీకరించాల్సిఉంటే, జ్ఞానంతప్పించిన బాహ్యపదార్థాలని అంగీకరిస్తే యుక్తికి కుదరదు. కనుక క్షణికమైన జ్ఞానం ఒక్కటే ఉన్నది అనే యోగాచారమతమే అంగీకరించదగినది.

*231. ఇతి యోగాచారమతంన్యాయేఽముష్మిన్నరస్యతే।*
*విజ్ఞానవ్యతిరిక్తార్థాభావో వక్తుం న శక్యతే॥*
*232. జానామ్యహం ఘటమితి నిరాబాధోపలబ్ధితః।*
*జ్ఞాతృజ్ఞానార్థేషు తుల్యం స్ఫురస్త్వత్ర పృథక్ త్రిషు॥*
*233. జ్ఞానస్యైకస్య సత్యత్వమసత్యత్వంతదన్యయోః।*
*వదతోఽస్య మతం నూనంహాస్యం నిర్యుక్తికత్వతః॥*
*234. సహోపలమ్భనియమాత్ అభేద ఇతి తద్వచః।*
*విరుద్ధమర్థభేదస్య సాహిత్యం సాధకం యతః॥*
*235. తదర్థవ్యవహారానుగుణ్యాపాదకతైవ హి।*
*తద్జ్ఞానస్యాకార ఇతి ఘటాదిర్న తథాభవేత్॥*
*236. జ్ఞానస్య యస్య యేనాస్తి సమ్బన్ధో విషయేణ తత్।*
*జ్ఞానం తద్విషయాసాధారణమీదృగ్వ్యవస్థయా॥*
*237. ఘటాద్యసాధారణత్వం తద్జ్ఞానస్య హి కీర్త్యతే।*

231-*237. **సిద్ధాంతం:** ఈయోగాచారమతం సరిగాదు. జ్ఞానవ్యతిరిక్తమైన బాహ్యవిషయాలు లేనివస్తువులే అని అనడం కుదరదు. "నేను ఘటాన్ని తెలుసుకున్నాను" అని తెలుసుకున్నవాడు, జ్ఞానం, జ్ఞాత, జ్ఞేయం - తెలివి, తెలుసుకునేవాడు, తెలియబడేది - అనే మూడూ ఒక్కొక్కటే ఒకేవిధంగా నిరాటంకంగా ప్రకాశించడంలో జ్ఞానం మాత్రమే ఉన్నది, మిగతా రెండూ లేవు అని చెప్పే యోగాచారుడి మతం యుక్తికి కుదరనిదవడంవల్ల జ్ఞానులవల్ల పరిహరించతగినదే అవుతుంది."జ్ఞానం, జ్ఞేయం ఎప్పుడూ కలిసే తెలుసుకోబడడంవల్ల తెలుసుకోబడేవస్తువు జ్ఞానంకంటే వేరైనదికాదు అని స్పష్టం అవుతోంది" అని చెప్పడంకూడా కుదరదు. రెండు పదార్థాలు ఎప్పుడూ కలిసే తెలియబడుతున్నాయి అని చెప్తే, అవి

రెండూ వేర్వేరైనవే అని సిద్ధిస్తుందే తప్ప రెండిట్లో ఒక్కటే ఉన్నది అనిసిద్ధించదు. ఇక్కడకూడా జ్ఞానం, జ్ఞేయం అనే రెండూ ఎప్పుడూ కలిసే తెలియబడడంవల్ల రెండూ ఉన్న వస్తువులే అని సిద్ధిస్తుందే తప్ప ఒకటిమాత్రం -- అందులోనూ జ్ఞానంమాత్రమే -- ఉన్నది, అని సిద్ధించనే సిద్ధించదు. ఘటం మొదలైనవి జ్ఞానాకారాలని చెప్పడం తప్పే. ఘటం మొదలైనవాటినిగురించి వ్యవహారాలని (లోకంలో వాడుకని) చెయ్యడంకోసంతగిఉండడం అన్నదే ఘటం మొదలైనవాటినిగురించిన జ్ఞానాకారం. ఏజ్ఞానంఅన్నది ఏఘటం మొదలైన వస్తువులతో సంయోగసంబంధాన్ని పొందుతోందో ఆజ్ఞానం ఘటం మొదలైన ఆయావస్తువులనిగురించినదే అవడంవల్ల ఘటజ్ఞానం అనబడుతోంది. అందువల్ల ఈవిధంగా ఘటపటాదులైన వస్తువులని తెలియజేసేవిగానే జ్ఞానాలు కనబడడంవల్ల జ్ఞానంలేని బాహ్యవస్తువులు లేవు అనే యోగాచారమతం దోషభూయిష్ఠమే.

*సి.సూ.// వైధర్మ్యాచ్చ న స్వప్నాదివత్ // (2-2-28) (202)*

**వైధర్మ్యాత్ చ** -- (స్వప్నజ్ఞానం మొదలైనవాటికంటే, బాహ్యవస్తువులనిగురించిన జ్ఞానం) వేరురకమైనదవడంవల్లకూడా, **స్వప్నాదివత్--** స్వప్నజ్ఞానం మొదలైనవాటిలాగే **న--** లేనివస్తువులని గురించినది గాదు.

*237* స్వాప్నజ్ఞానస్యైవ బాహ్యఘటాద్యర్థాధియామపి//*
*238. అర్థశూన్యత్వసిద్ధ్యా చ బాహ్యార్థా నేతి చేన్నతత్/*
*జాగ్రద్దశాధియాం స్వప్నజ్ఞానవైధర్మ్యతో భృశమ్//*

237*-*238. **పూర్వపక్షం:** ఘటం మొదలైనవిషయాలుకూడా, వాటిని తెలియజేసేవిగానే జ్ఞానాలుగూడా కనబడడంవల్ల మాత్రంబాహ్యవస్తువులు ఉన్నాయి అని చెప్పసాధ్యంగాదు. అలా నిర్బంధిస్తే, కనబడే శుక్తిరజతం (ముత్యపుచిప్పలో వెండి), రజ్జుసర్పం(తాడులో పాము) మొదలైనవాటిని కూడా యథార్థ(ఉన్న)వస్తువులుగా అంగీకరించాల్సివస్తుంది. అందువల్ల "తెలివిగాఉన్నప్పుడు కనబడే జ్ఞానాలు యథార్థవస్తువులని గురించినవిగావు. జ్ఞానాలైయున్నందువల్ల స్వప్నంలో కనబడే జ్ఞానాలవంటివే" అనే అనుమానంచేతనే బాహ్యవస్తువులని లేనివస్తువులుగా గ్రహించే యోగాచారమతం కుదరనిది.

239. *అర్థశూన్యత్వవాదో న యుజ్యతే, స్వప్నగా ధియః/*
*నిద్రాదుష్టేన్ద్రియాజ్జన్యా బాధితాశ్చ భవన్తిహి//*
*240. జాగృద్దశాధియశ్చైతద్విపరీతా న తత్సమాః/*
*వస్తుతస్స్వాప్నికే జ్ఞానేప్యర్థసత్యత్వమిష్యతే//*
*241. జ్ఞానానామర్థశూన్యత్వే సాధ్యోప్యర్థో న సిద్ధ్యతి/*
*నిరాలమ్బానుమానస్యాప్యర్థశూన్యతస్తవ//*
*242. తస్యార్థవత్త్వే జ్ఞానత్వమనేకాన్తం భవేత్ ఖలు/*

***238*-*242.*** **సిద్ధాంతం:** ఈపూర్వపక్షం సరిగాదు. స్వప్నంలో కనబడే జ్ఞానాలకంటే, మెలకువగా ఉన్నప్పుడు కనబడే జ్ఞానాలు చాలాభిన్నంగా ఉండడంవల్ల, ఆజ్ఞానాలతో ఈజ్ఞానాలని అబద్ధపుజ్ఞానాలని చెప్పడానికి వీలుగాదు. స్వప్నంలో కనబడేజ్ఞానాలు నిద్రవల్ల మొద్దుబారిన ఇంద్రియాలవల్ల కలిగినవిగానూ, తెలివిరాగానే చెరిగిపోయేవిగాను కదా ఉంటాయి, దీనికి బదులుగా తెలివిగా ఉండడంవల్ల చురుకుగానున్న ఇంద్రియాలవల్ల కలిగినవై, చెరగనివైయున్న తెలివిగాఉన్నప్పటి

జ్ఞానాలు వాటిలా ఎలా చెరిగిపోసాధ్యం? యథార్థంగా స్వప్నాల్లో కలిగే జ్ఞానంలో ఉత్పన్నమయ్యే వస్తువులుకూడా యథార్థమైనవే అని గ్రహించబడుతున్నాయి. *"స రథాన్ రథయోగాన్ పథః సృజతే ... సహి కర్తా* (బృహ. 6-3-10) మొదలైన శ్రుతులలో పరమాత్మ స్వప్నం చూసేవాడివల్లమాత్రమే అనుభవించబడే యథార్థవస్తువులనే సృష్టిస్తాడని చెప్పబడడంవల్ల స్వప్నజ్ఞానాన్ని దృష్టాంతంగా చెయ్యసాధ్యంగాదు. పైగా, "మేలుకొనిఉన్నప్పుడు కనబడే జ్ఞానాలు జ్ఞానం కలిగినవైయుండడంవల్ల, యథార్థమైన వస్తువులని గురించినవికావు" అనే అనుమానంచేతకలిగే జ్ఞానంఉన్న వస్తువులని గురించినదా కాదా అనే ప్రశ్న వస్తుంది. యథార్థవస్తువుల గురించినది అంటే, ఈఅనుమానంవల్ల కలిగే జ్ఞానం యథార్థంగా ఉన్న వస్తువులనిగురించినదిగనుకనే. సాధ్యం (యథార్థవస్తువులని గురించినదికాక పోవడం) కాని ఈఅనుమానంలో జ్ఞానమైఉండడంఅనే హేతువు ఉండడంవల్ల వ్యభిచారం అనే దోషం కలుగుతోంది. ఆజ్ఞానంఉన్నవస్తువులనిగురించినదిగాదు అంటే ఆఅనుమానమే యథార్థవస్తువుని తెలియజేయలేదని స్పష్టం అవడంవల్ల "జ్ఞానాలున్న వస్తువులని గురించినవిగావు"అనే సాధ్యం సిద్ధించదు.

## *సి.సూ.॥న భావోఽనుపలబ్ధేః ॥ (2-2-29) 203)*

**అనుపలబ్ధేః** - (తెలియజేసేవాడును, తెలియజేయబడే వస్తువున్నూ లేనటువంటి జ్ఞానం ఏదీ లోకంలో) కనబడకపోవడంవల్ల, **భావః** - (ఉన్నవస్తువుగురించిలేని జ్ఞానంతాలూకు) సద్భావం (ఉండడం) **న**- సిద్ధించదు.

*242* భావోఽర్థశూన్యజ్ఞానస్య న సంభవతి చ క్వచిత్॥*

*243. అకర్తృకాకర్మకస్య జ్ఞానస్యానుపలబ్ధితః।*
*అతో యోగాచారమతం సర్వమప్యమఞ్జసమ్॥*

*॥ఇత్యుపలబ్ధ్యధికరణమ్॥*

242*-243. లోకంలో అన్నిచోట్లా కలిగే జ్ఞానాలు పరిశీలించిచూస్తే, తెలుసుకొనేవాడు(జ్ఞాత), తెలియబడేవస్తువు(జ్ఞేయం) లేనటువంటి జ్ఞానం ఎక్కడా కలగలేదు అని చూస్తున్నాం. కనుక, ఎక్కడైనా ఉన్న వస్తువునిగురించినదికాని జ్ఞానం అంటూ ఒకటి సిద్ధించనేసిద్ధించదు. కనుక, యోగాచారమతం పూర్తిగా కుదరనిదే అవుతుంది.

ఉపలబ్ధ్యధికరణం పూర్తి అయినది.

## *॥సర్వథానుపపత్త్యధికరణమ్॥ 2-2-5॥*

## *సి.సూ.॥ సర్వథానుపపత్తేశ్చ॥ (2-2-30) (204)*

**సర్వథా** - అన్నివిధాలుగాను, **అనుపపత్తేః చ** - కుదరకపోవడంవల్ల (సర్వశూన్యవాదం కుదరదు)

*244. బౌద్ధైకదేశినాం పక్షాః త్రివిధానాం నిరాకృతాః।*
*అథ మాధ్యమికస్సర్వశూన్యవాది నరస్యతే॥*

244. ఇంతవరకూ బౌద్ధుల్లో వైభాషికులు, సౌత్రాంతికులు, యోగాచారులు అనే మూడు రకాలవాళ్ళు నిరసింపబడ్డారు. వీళ్ళందరూ క్షణికంగా కొన్నిపదార్థాలని చెప్పేరు. ఇక క్షణికంగాకూడా ఏపదార్థమూ ఉండదు అని చెప్పే సర్వశూన్యవాది అయినమాధ్యమికుడిని (నాలుగవరకం) ఈఅధికరణంలో నిరసిస్తున్నారు.

*245. ఉత్పత్తిర్దుర్నిరూపైవ భావతోఽభావతస్తథా।*

*ఘటాదిశ్చోత్పద్యమానః మృదాదేరుపమర్దితాత్॥*

**246.** *ఉత్పద్యతే చోపమర్దః నాశస్తస్యాऽऽకృతేస్స చ।*
*అభావ ఏవ తస్మాన్న భావాదుత్పత్తిరిష్యతే॥*

**247.** *నాన్త్యః పక్షోఽప్యభావాచ్చ భావోత్పత్తేరసంభవాత్।*
*ఇత్థం చ దుర్నిరూపత్వాదుత్పత్తేస్తదనన్తరాః॥*

**248.** *వికారాశ్చ న సన్త్యేవాऽతస్తత్త్వం శూన్యముచ్యతే।*
*మతం మాధ్యమికస్యేదం సర్వథా నోపపద్యతే॥*

245-*248. **పూర్వపక్షం**: "జ్ఞానం, బాహ్యపదార్థాలు అన్నభేదం లేకుండా సమస్తమూ శూన్యమే నిజం. కనబడుతున్నదంతా అబద్ధం. ఈఉత్పత్తి అంతా నశించి లేకపోవడమే మోక్షం" అన్నదే బుద్ధులవారి మనఃపూర్వకమైన భావం. ఈ అయథార్థమైన పదార్థాలన్నీ వాటికి తగిన వికసించనివాళ్ళకోసమే. బాహ్యపదార్థాలూ, జ్ఞానం క్షణికమై ఉన్నాయి అని వైభాషికులు మొదలైనవాళ్ళకి వరసగా శూన్యవాదాన్ని వారివారి maturityకి (తెలివికి) తగినట్లుగా వారు ఉపదేశించేరు. అందువల్ల శూన్యమే తత్త్వం అన్నదే కుదురుతుంది. ఎలా అంటే, పదార్థాలున్నాయి అని సాధించగోరినవాళ్ళే దానికి ప్రమాణాన్ని వెదుక్కోవాలి. పదార్థాలు లేవన్నది ఒక ప్రమాణాపేక్ష అవసరంలేకుండానే దానంతట అదే స్పష్టం అవుతోంది. ఇక పదార్థాలని ఉన్నాయి అని సాధించాలని అనుకొనేవాళ్ళు మొట్టమొదట అవి ఎలా సృష్టించబడ్డాయో నిరూపించాలి. ఆలా నిరూపిద్దామనుకుంటే ఉన్నపదార్థాలలోంచో, లేని పదార్థాల్లోంచో ఏపదార్థమైనా పుట్టిందని వాళ్ళవల్ల నిరూపించసాధ్యంగాదు. మొదట, ఉన్నపదార్థాల్లోంచి అవి పుట్టేయి అని నిరూపిద్దామనుకుంటే, మట్టిబెడ్డ మొదలైన కారణవస్తువులు నశించినతరువాతే ఘటంమొదలైన కార్యవస్తుజాతం సృష్టింపబడ్డాయి అని చూస్తున్నాం. మట్టిబెడ్డ ఆకారం నశించిపోవడమే దానినాశం. ఇది మట్టిబెడ్డతాలూకు అభావమే అవుతుంది. అంచేత అభావంలోంచి (లేనిపదార్థంలోంచి) కుండ పుట్టిందని తెలుస్తోందే తప్ప ఉన్నపదార్థం అయిన భావంనుంచి పుట్టిందని అనిపించదు. ఇక అభావంఅనే లేనిపదార్థంనుంచి భావం అనే ఉన్నపదార్థం పుట్టడానికి వీలవుతుందా అని పరిశీలిస్తే ఉన్న పదార్థం మరో పదార్థాన్నిసృష్టించడమే తప్ప లేని పదార్థంలోంచి సృష్టించలేదు. అలా సృష్టిస్తే అదికూడా లేనిపదార్థమే అవాల్సివస్తుంది. అంచేత ఇలా ఉన్న పదార్థంలోంచో, లేనిపదార్థంలోంచో ఏపదార్థంకూడా సృష్టింపబడుతుందని నిరూపించసాధ్యంగాదుగనుక, పదార్థోత్పత్తిని ఎలాగూకూడా నిరూపించలేమని స్పష్టం అవుతోంది. పదార్థోత్పత్తినేనిరూపించలేకపోయినప్పుడు ఆతర్వాత వాటికి కలిగే పెరగడం, నశించడం మొదలైన ఇతరవికారాలని నిరూపించడం కుదరదని దానికదే సిద్ధిస్తోంది. కనుక, శూన్యమే తత్త్వం.

**249.** *సర్వం సదితి వా సర్వమసదిత్యేవ వాన్యథా॥*
*శూన్యవాదీ ప్రతిజ్ఞాయ యతేత స్వేష్టసాధనే॥*

**250.** *సర్వథానుపపత్తేశ్చ తదిష్టం తు న సంభవేత్।*
*వస్తునో విద్యమానస్య సదసచ్ఛబ్దతద్ధియోః॥*

**251.** *అవస్థాగోచరత్వం హి ప్రోక్తం తస్మాన్న తుచ్ఛతా।*
*కుతశ్చిదపి సిద్ధయేత్తదభిప్రేతా హి సర్వథా॥*

*252. ఇష్యతే యది నాస్తిత్వం అఖిలం శూన్యమిత్యతః।*
*తర్హి రూపాన్తరేణైవాస్తిత్వం ప్రోక్తం భవేత్, యతః॥*
*253. రూపాన్తరాపత్తిరేవ నాస్తిశబ్దార్థ ఉచ్యతే।*
*తతో మృత్పిణ్డోపమర్దః ఘటత్వోత్పత్తిరూపకః॥*
*254. మృద్ద్రవ్యం పిణ్డతావస్థాయుక్తముత్పాదకం, తథా।*
*తదేవ ఘటతావస్థాయుక్తముత్పాద్యమిష్యతే॥*
*255. తస్మాదభావాద్భావస్య నోత్పత్తిః క్వచిదిష్యతే।*
*తస్మాన్మాధ్యమికస్యేదం మతం సర్వమసఙ్గతమ్॥*

248*- 255. **సిద్ధాంతం**: సర్వశూన్యవాది ఐన మాధ్యమికుడి ఈమతం ఎలాచూసినా కుదరదు. "సమస్తపదార్థాలూ యథార్థమైనవే" అనో, "సమస్తపదార్థాలు లేనివే" అనో లేకపోతే మరోవిధంగానో ప్రతిజ్ఞచేసి మాధ్యమికుడు తన కోరికని సాధించుకోవాలి. ఎలా ప్రతిజ్ఞచేసినా, కుదరదుగనుక అంతా శూన్యమే అని స్పష్టంగాదు. లోకంలో "కుండ లేదు" అంటే, కుండ ఏర్పాటుతో లేదు" "ముద్దలు అంటించిన ఏర్పాటుతో ఉన్నది" అనే స్పష్టం అవుతోంది. అలాగే తెలియబడుతోంది. "కుండ ఉన్నది" అంటే, "కుండ ఆకారంలో అమిరి ఉన్నది" అనే స్పష్టం. అలా తెలియడంలాగే, 'కుండ లేదు' అన్నా వేరొకఏర్పాటుతో ఉన్నది అనే స్పష్టం. అదేవిధంగా తెలుస్తోందన్నది అంతటా చూస్తున్నాం. అందువల్ల ఉన్నది అన్నప్పుడూ లేదు అన్నప్పుడూకూడా తేడాలేకుండా ఒక్కొక్క ఆకారంతో పదార్థం ఉన్నదనే స్పష్టం అవుతోందిగనుక, మాధ్యమికుడు భావించే శూన్యస్థితి ఏవిధంగా ప్రతిజ్ఞచేసినా ఎలాగూకూడా కుదరనిదే. ఇక పూర్వపక్షంలో చెప్పిన యుక్తులు ఖండింపబడుతున్నాయి. "అంతా శూన్యమే" అన్నప్రతిజ్ఞవల్ల "సమస్త పదార్థాలూ లేవు" అని భావించినట్లైతే, వెనుక చెప్పినప్రకారం, సమస్తపదార్థాలూ మరొకలా(వేరేస్థితిలో) ఉన్నాయి" అనే స్పష్టం అవుతుంది. ఒకస్థితిలో ఉన్నపదార్థం వేరొకస్థితిని పొందడమే లోకంలో 'లేదు' అనే మాటకి అర్థంగా కనబడడంవల్ల మట్టిబెడ్డ నాశనమే ఘటం ఉత్పత్తి అని గ్రహించాలి. బెడ్డరూపంలో ఉన్న మట్టి అనే ద్రవ్యమే కారణంగానూ, ఘటస్థితిలో ఉన్న ఆమట్టే దానికి కార్యంగానూ గ్రహించబడుతోంది. అందుచేత ఈవిధంగా ఎక్కడాకూడా, శూన్యపదార్థంలోంచి ఒక పదార్థం సృష్టింపబడుతోందని గ్రహింపబడలేదుగనుక మాధ్యమికుడిసర్వశూన్యవాదం పూర్తిగా కుదరనిదే. ఈవిషయాన్నే నమ్మాళ్వారు

*ఉళ్ళ ఎనిల్ ఉళ్ళ అవన్ ఉరువం ఇవ్వురువుగళ్*
*ఉళనలన్ ఎనిల్ అవన్ అరువం ఇవ్వరువుగళ్*
*ఉళన్ ఎన ఇలన్ ఎన ఇవై కుణముడైమైయిల్*
*ఉళన్ ఇరుతగమైయోడు ఒழివిలన్ పరన్దే* *(తి.వా.మొ. 1-1-9)*

అని తిరువాయ్‌మొழிలో సాయించేరు. ఈపాశురానికి ఇరుబత్తునాలాయిరప్పడి వ్యాఖ్యానంలో "(ఉళనెనిల్) - ఉన్నాడు అనే ప్రతిజ్ఞవల్ల, (ఉళన్) - అస్తిత్వవిశిష్టుడిగా ఉన్నాడు. ఈశ్వరుడు ఉన్నప్పుడు ఐశ్వర్యంతప్పిస్తే ఉన్నవాడిగా కూడదుగనుక, విభూతియైన జగత్తుకూడా ఉన్నదే. (అవనురువం ఇవ్వురువుగళ్) ఉన్నాయి అన్నప్పుడు ప్రమాణం చూపిస్తున్నట్టుగానే శరీరంగా ఉన్నాయి 'లేకపోవడాన్ని సాధించిన నేను అస్తిశబ్దంవల్ల ప్రతిజ్ఞచేస్తానా? అంటే, 'ఉన్నాడు' అన్న శబ్దం లేకపోవడాన్ని చూపనట్లుగానే 'లేదు'అనే శబ్దంకూడా, నువ్వు అనుకున్నట్లుగా అత్యంతాభావాన్ని చూపించదన్నమాట. (ఉళనలనెనిల్) -

నాస్తిశబ్దంవల్ల ఆయనలేకపోవడాన్ని ప్రతిజ్ఞచేస్తే, లోకంలో నాస్తి శబ్దార్థమే నీకుకూడా అర్థం అవాలి. "ఘటో నాస్తి" అంటే, ఇక్కడలేదు అన్నమాట. ఇప్పుడు లేదు అన్నమాట. మృత్పిండంగా ఉత్పత్త్యభావంవల్ల లేదన్నమాట. కపాలావస్థలోదిగా, లేదు అన్నమాట. వీట్లోనే ఒకటి నాస్తిశబ్దార్థంగా చూస్తున్నాం. అంచేత ఒకవిధంగా లేదన్నది ప్రకారాంతరంలో ఉండడంవల్ల ఈశ్వరుడుకూడా నాస్తిత్వవిశిష్టుడిగా ఉన్నాడు. (అవనరువం ఇవ్వరువుగళ్) ఆయన విభూతికూడా ఒకవిధంగా లేదన్నట్లుగానే ప్రకారాంతరంగా ఉండడంవల్ల అభావవిశిష్టంగా ఉన్నది. (ఉళనెన ఇలనెన ఇవై కుణముడైమైయిల్) అస్తిత్వ నాస్తిత్వాలున్న వస్తువుకి రెండూ గుణంగా ఉండవచ్చుగనుక (ఉళనిరుతగమైయోడు) ఈశ్వరుడు ఉన్నాడన్నాగాని, లేడన్నాగాని రెండువిధాలుగానూ ఉన్నవాడే. (ఒఴివిలన్ పరన్దే) ఈప్రకారమే విభూతినిగూడా వ్యాపించే నాశం లేనివాడు." అని పెరియవాచ్చాన్పిళ్ళై సాయించినది ఇక్కడ అనుసంధానం చేసుకోతగినది. "సర్వథా అనుపపత్తేశ్చ" అనే సూత్రానికి మరో విధంగా అర్థం చెప్పవచ్చు. అంటే, 'సమస్తం శూన్యం' అని సాధింపజూసే మాధ్యమికుడు ఏదోఒక ప్రమాణం తీసికొని దానిమూలంగా సాధించాలి. అలా సాధించేటప్పుడు ఆప్రమాణం సత్యమైనది అని అంగీకరించితీరాలి. అలా అంగీకరిస్తే ప్రమాణం ఒకటి నిజమైనది అయిపోతుంది. అందువల్ల 'అంతాశూన్యం' అన్నది అబద్ధం అయికూచుంటుంది. దీన్ని తప్పించుకుందికి ఆప్రమాణం సరిగాదు అని అనాల్సివస్తుంది. అప్పుడు అంతా శూన్యమే అని సాధించడానికి ఉపయోగించిన ప్రమాణం అసత్యప్రమాణం అయి అసలుకే మోసం వస్తుంది. అప్పుడు అంతా సత్యమే అని సిద్ధించినట్లే. ఈవిధంగా చూసినా, సర్వశూన్యవాదం ఎలా చూసినా కుదరనిదే అని స్పష్టం అయింది.

సర్వథానుపపత్త్యధికరణం పూర్తి అయినది.

## ॥ఏకస్మిన్నసంభావాధికరణమ్॥ (2-2-6)

## సి.సూ.॥ నైకస్మిన్నసంభవాత్ (2-2-31) (205)

**ఏకస్మిన్ - ఒక పదార్థంలో,** అసంభవాత్ - (ఒకదానినొకటి వ్యతిరేకిస్తున్న అస్తిత్వం, నాస్తిత్వం మొదలైన స్వభావాలు ఒకే సమయంలో) కుదరకపోవడంవల్ల, **న** - (ఒకే పదార్థంలో ఒకే కాలంలో విరుద్ధధర్మాలని అంగీకరించే) జైనమతం కుదరనిది.

***256.*** *నిరస్యైవం సౌగతోక్తిమార్హతస్య మతం త్విహ।*
*అణుకారణతావాదసామ్యోపస్థితమస్యతే॥*

256. వెనుకటి మూడు అధికరణాల్లో నాలుగురకాలైన బౌద్ధులనీ నిరసించి, అణుకారణవాదాన్ని చేసేవాళ్లనే అంశంలో వాళ్ళని అనుసరించడంవల్ల ఈఅధికరణంలో జైనమతానికి చెందినవారు నిరసింపబడుతున్నారు.

***257.*** *జగజ్జీవాదిభేదేన షడ్ద్రవ్యాత్మకమీశ్వరః।*
*న కశ్చిదస్త్యత్ర జీవః దేహతుల్యప్రమాణవాన్॥*

***258.*** *సదేవేత్యాదినియమశూన్యం వస్త్వఖిలం చ తత్।*
*సర్వం చ సదసద్రూపం నిత్యానిత్యాత్మకం తథా ॥*

***259.*** *భిన్నాభిన్నాత్మకమపీత్యేవం జైనమతం న సత్।*
*సత్త్వాసత్త్వాదిధర్మాణాం తేజస్తిమిరవన్మిథః॥*

257-*259. **పూర్వపక్షం: జైనమతం ఈవిధంగా ఉన్నది:-**

"**లోకాన్ని నియమించే ఈశ్వరుడు**" అంటూ ఒకడు లేడు. లోకం మాత్రమే ఉన్నది. ఆలోకం ఆరు ద్రవ్యాలుగా ఉన్నది. అవి 1. జీవుడు (Self), 2. ధర్మం(the cause of motion), 3. అధర్మం (the cause of Inertia), 4. పుద్గలం(the matter), 5. కాలం(time), 6. ఆకాశం(space). వీటిలో జీవతత్త్వం బద్ధుడు, యోగసిద్ధుడు, ముక్తుడు అని మూడు విధాలు. ఈలోకంలో ఉన్నంతవరకూ, జీవుడు తానుండే దేహాన్ని అనుసరించిన పరిమాణాన్ని గలిగినవాడై ఉంటాడు. రెండో తత్త్వం అయిన ధర్మం సంచరించే (జంగమం) జీవులకి ఆసంచారానికి కారణమైనదై, లోకం అంతటా వ్యాపించిఉన్న ఒక ద్రవ్యం. మూడో తత్త్వమైన అధర్మం (స్థావరం) జీవుల సంచరించడం అనేదిలేకపోవడానికి కారణమైనది. లోకం అంతటా వ్యాపించి ఉన్న మరో ద్రవ్యం. నాలుగో తత్త్వమైన పుద్గలం అన్నది - రంగు, రుచి, వాసన, స్పర్శం మొదలైనవి ఉన్న ఒక ద్రవ్యం. అది పరమాణువనీ. వాటి కలయికే అయిన గాలి, నిప్పు, నీరు, భూమి, శరీరం, లోకాలు మొదలైనవని రెండువిధాలు. ఐదవతత్త్వం కాలం అంటే 'భూతకాలం, వర్తమానం, భవిష్యత్తు" అనే లోకవ్యవహారానికి కారణమైనదైన అణుస్వరూపమైన ఒకద్రవ్యం. ఆరోతత్త్వం ఆకాశం ఒకటే అయిన అంతులేని ప్రదేశరూపమై ఉన్నది. వీటిలో అణువైన కాలం, పుద్గలంలోని అణువున్నూ తప్పించి మిగతా వన్నీ అస్తికాయాలు అని అనబడుతున్నాయి. ఈతత్త్వాలన్నీ సప్తభంగీన్యాయంవల్ల ఉన్నాయనో, లేవనో చెప్పడానికివీలులేకుండా ఒకేవిధంగాలేకుండా ఉన్నాయి అని నిరూపించబడుతోంది.ఒకేరకంగా ఉండడాన్ని భంగపరిచే సప్తభంగీన్యాయం అంటే లోకంలో పదార్థాలు ఒకేవిధంగా లేకుండా అనేకరకాలుగాఉన్నాయి అని చూపే ఏడురకాలైన లోకరీతులు. అవేమిటంటే, 1. (వస్తువు)ఉన్నదిగా ఉండడం. 2. లేనిదిగా ఉండడం, 3. ఉన్నదిగానూ, లేనిదిగానూ ఉండడం, 4. ఉన్నదనో, లేదనో చెప్పశక్యంగాకుండా ఉండడం, 5. ఉన్నదిగా ఉండడం. ఉన్నదనో, లేదనో చెప్పడానికి వీలులేకుండాకూడా ఉండడం. 6. లేనిదిగా ఉండడం, అన్నదనో, లేదనో చెప్పడానికి వీలులేకుండా ఉండడం. 7. ఉన్నదిగానూ, లేనిదిగానూ ఉండడం. ఉన్నదనో, లేనిదనో చెప్పడానికి వీలులేకుండా ఉండడం. ఈసప్తభంగివల్లనే సమస్తపదార్థాలూ ఉన్నవిగానూ, లేనివిగానూ ఉంటున్నాయని స్పష్టం. ఇదేవిధంగా పదార్థాలు నిత్యమైనవిగానూ, అనత్యమైనవిగానూకూడా ఉన్నాయి అని చెప్పే సప్తభంగివల్ల సమస్తపదార్థాలూ నిత్యాలుగానూ, అనిత్యాలుగానూకూడా ఉన్నవని స్పష్టం. ఇదేవిధంగా పదార్థాలు భిన్నంగానూ, అభిన్నంగానూ ఉండవచ్చు అని చెప్పే సప్తభంగివల్ల సమస్తపదార్థాలూ భిన్నాలుగానూ, అభిన్నాలుగానూ ఉంటాయి అని స్పష్టం అవుతోంది. కనుక, ఈసప్తభంగీన్యాయంవల్ల సమస్తపదార్థాలూ ఉన్నవిగానూ, లేనివిగానూ, నిత్యాలుగానూ, అనిత్యాలుగానూ, భిన్నాలుగానూ, అభిన్నాలుగానూ ఉండడంవల్ల ఒకేరకమైనవికాకుడా ఉన్నాయి.

***260.*** *విరుద్ధానామేకదైవాసంభవాదేకవస్తుని।*
*నైతన్మతం సఙ్గతం స్యాత్, అశ్వత్వమహిషత్వయోః॥*
***261.*** *కథం యుగపదేకస్మిన్ సమావేశస్యం సంభవః।*
*ఈశానధిష్ఠితాణోశ్చ కారణత్వే య ఈరితాః॥*
***262.*** *దోషాస్తే తదవస్థాశ్చేత్యయుక్తం జైనజల్పనమ్।*

259*-*262. **సిద్ధాంతం:** ఈజైనమతం దోషాలతో కూడి ఉన్నది. వెలుగూ, చీకటీలాగ ఉన్నదిగానుండడం, లేనిదిగా ఉండడం మొదలైన ఒకదానికొకటి వ్యతిరేకించే గుణాలు ఒకే సమయంలో ఒకే పదార్థంలో ఉండసాధ్యంకాదుగదా! ఒకే పదార్థంలో గుర్రం అయే స్వభావం, ఎద్దుగా అయే స్వభావం

ఎలా కలిసి ఉంటాయి? సర్వేశ్వరుడివల్ల అధిష్టింపబడని పరమాణువులని కారణంగా గ్రహించే పక్షంలో వెనుకటి అధికరణాల్లో చెప్పబడిన దోషాలు సర్వేశ్వరుడివల్ల అధిష్ఠింపబడని పరమాణువులని అంగీకరించే జైనమతంలోకూడా కలుగుతాయి. కనక, జైనమతం కుదరనిదే అవుతుంది.

సి.సూ.// ఏవం చాత్మాऽకార్త్స్న్యమ్// (2-2-32) (206)

ఏవమ్ - ఈవిధంగా (దేహానికి తగిన పరిమాణంఉన్నవాడిగా ఉన్న జీవుడిని) అంగీకరిస్తే, **ఆత్మా కార్త్స్న్యం** - ఆత్మకి పూర్తిలేకపోవడం అనే దోషం కలుగుతుంది.

*262* జీవస్యైవం వపుస్తుల్యమానాభ్యుపగమే సతి//*
*263. హస్తిదేహస్థితస్యాస్య మశకాదిప్రవేశనే।*
*అల్పదేశవ్యాపతయా భవేదపరిపూర్ణతా//*
**264. బృహద్దేహప్రవేశేऽపి కృత్స్నవ్యాప్తిః న తత్ర చ।*

262*-*264 - దేహాన్ని నియమించేవాడవడంకోసం, జీవుడికి దేహానికి తగిన ప్రమాణం జైనులవల్ల అంగీకరింపబడింది. ఇలా అంగీకరించితే పెద్దదైన ఏనుగు శరీరంలో ఉండే జీవుడు మరుజన్మలో చిన్నదైన దోమశరీరంలో ప్రవేశించేటప్పుడు ఆత్మస్వరూపానికి దోమశరీరంలో అపూర్తి ఏర్పడుతుంది. ఇదేవిధంగా, చిన్న దోమశరీరంలో ఉన్న ఆత్మ మరుజన్మలో పెద్దదైన ఏనుగుశరీరంలో ప్రవేశించినప్పుడు పూర్తిదేహాన్ని వ్యాపించలేకపోయింది అనే దోషం కలుగుతోంది. జైనపక్షప్రకారం, ఇవి దోషాలుకావా!

సి.సూ.// న చ పర్యాయాదప్యవిరోధో వికారాదిభ్యః// (2-2-33) (207)

**పర్యాయాత్ అపి** - (సంకోచవికారాలనే) వేరువేరు స్థితులని పొందడంకూడా, **న చ అవిరోధః** - విరోధంలేకపోవడం సాధించవీలుగాదు. **వికారాదిభ్యః** - వికారం, దానివల్ల వచ్చే అనిత్యత్వం మొదలైన దోషాలు రావడంవల్ల.

*264* న చ సఙ్కోచాదిరూపావస్థాభ్యుపనయేన చ//*
*265. పరిహర్తుం విరోధోऽస్య శక్యతే ఘటతుల్యతా।*
*వికారిత్వానిత్యతాదిదోషాస్పదతయా భవేత్//*

264*-265. పెద్దశరీరంలోంచి చిన్న శరీరానికి వెళ్ళేటప్పుడు జీవస్వరూపానికి సూక్ష్మత్వం, చిన్న శరీరంలోంచి పెద్దశరీరంలోకి వెళ్ళేటప్పుడు దానికి వ్యాప్తిత్వం (స్థూలత్వం) అనే భిన్నస్థితులు కలుగుతున్నాయని ఒప్పుకొని వెనుకటి సూత్రంలో చెప్పిన దోషాన్ని పోగొట్టుకుందాం అని అనుకుంటే అదికూడా కుదరదు. ఎందువల్లంటే, అలా సంకోచవ్యాకోచాలని జీవస్వరూపానికి అంగీకరిస్తే, వికారంకలిగినదిగానూ, దానివల్లవచ్చే అనిత్యత్వం మొదలైనవికూడా కలగడంవల్ల జీవస్వరూపం ఘటం మొదలైన అనిత్యపదార్థాలకి తగినదవుతుంది. కనుక వెనుకటి సూత్రంలో చెప్పిన దోషం తప్పించలేనిదే.

సి.సూ.// అన్త్యావస్థితేశ్చోభయనిత్యత్వాదవిశేషః// (2-2-34) (208)

**అన్త్యావస్థితేః** - చివరకి (మోక్షస్థితిలో) (ఆత్మకి) కలిగే పరిమాణం సహజమైనదిగనుక, **ఉభయనిత్యత్వాత్** - (ఆస్థితిలో) ఆత్మ, దానిపరిమాణం నిత్యాలుగనుక **అవిశేషః** - () ఆపరిమాణంకంటే వేరైన దేహసమానపరిమాణం వీలుగాదు.

*266. ఆత్మనో మోక్షకాలే యత్పరిమాణం తదేవ చ।*
*స్వాభావికం తతశ్చాత్మస్వరూపవదముష్య చ//*
*267. మోక్షకాలికమానస్యనిత్యత్వాత్పూర్వమప్యదః।*

*మానమేవేతి వక్తవ్యతయా తస్యాత్మవస్తునః॥*

*268. పూర్వం వపుస్తుల్యమానవాదోఽతీవాసమఞ్జసః।*

*తస్మాన్మిథో విరుద్ధత్వాత్ మతమేతదసఙ్గతమ్॥*

॥ఇత్యేకస్మిన్నసంభవాధికరణమ్॥

**266-268.** ఆత్మకి మోక్షస్థితిలో కలిగే పరిమాణమే సహజమైనది. దానితర్వాత వేరు దేహాన్ని పొందడం అనేదిలేదుగనుక, ఆస్థితిలో ఆత్మ, దాని పరిమాణం నిత్యమైనవి. కనుక, సంసారదశలోకూడా ఆత్మకి సహజమైన ఆపరిమాణాన్ని గ్రహించాలేతప్ప మరోదారిలేదు. అంతే తప్ప దేహానికి తగిన పరిమాణాన్ని పొందడం అన్నది కుదరదు. ఈవిధంగా ముందువెనుకలకి వ్యతిరేకంగా చెప్పే ఈమతం కుదరనిదే అవుతుంది.

వేదవిరుద్ధమైన మిగతా జైనమతసిద్ధాంతాలని పూర్వపక్షంలో చెప్పేరు. పూర్వమీమాంసలో వేదవిరుద్ధమైన ఆగమాల అప్రామాణ్యం నిరూపించబడిఉన్నదిగనుక ఆసిద్ధాంతాలు నిరసింపబడినాయి అనే కారణంవల్ల వాటిని ఇక్కడ వేరుగా నిరసించడంలేదని గ్రహించాలి.

*ఏకస్మిన్నసంభవాధికరణం పూర్తి అయినది.*

## ॥పశుపత్యధికరణమ్॥ (2-2-7)

### సి.సూ.॥ పత్యురసామఞ్జస్యాత్ ॥ (2-2-35) (209)

**పత్యుః** - పశుపతిమతం (ఆదరించతగినదిగాదు) **అసామఞ్జస్యాత్** - అసమంజసమైనదికావడం వల్ల.

*269. కాపిలాదిమతేష్వస్తు వేదబాహ్యేషు మాదరః।*

*సర్వజ్ఞరుద్రసంప్రోక్తే మతే పాశుపతే భృశమ్॥*

*270. ఆదరః కార్య ఏవేతి వాదోఽత్ర వినివార్యతే।*

*ఈశస్సిద్ధోఽనుమానేన స ఔపనిషదో న చ॥*

269-*270. వేదానికి వెలుపలనున్న కపిలమతం మొదలైనవాటిని తప్పించేసి నిరసించడం సరియైనదే. "సర్వజ్ఞుడు" (అన్నీ తెలిసినవాడు) అని ప్రశంసించబడిన రుద్రుడివల్ల చెప్పబడిన పాశుపతమతంలో అత్యాదరించతగినదేగదా అనే వాదం ఈఅధికరణంలో త్రోసివేయబడుతోంది.

*271. నిమిత్తోపాదానయోశ్చ భేదః పశుపతిస్తథా।*

*నిమిత్తహేతుర్విశ్వోపాదానమవ్యాకృతం భవేత్॥*

*272. జగత్పశుపతిస్సర్వం కులాలాదిర్ఘటాదివత్।*

*సృజత్యేవం ముక్తిహేతుః ముద్రికాషట్కధారణమ్॥*

*273. సురాకుమ్భే దేవపూజా చాత్మధ్యానం భగే తథా।*

*ఇతి వేదవిరుద్ధార్థాన్ శైవా ఆహుశ్చతుర్విధాః॥*

270*-273 - **పూర్వపక్షం**: కాపాలికులు, కాళాముఖులు, పాశుపతులు, శైవులు అని శైవమతానికి చెందినవాళ్ళు నాలుగురకాలవాళ్ళు. వీళ్ళందరూ వేదానికి వ్యతిరేకమైన శైవాగమాల్లో చెప్పబడ్డ తత్త్వహితపురుషార్థ సిద్ధాంతాలని అనుసరించేవాళ్ళు. ఆసిద్ధాంతాలు ఏవిటంటే - ఈశ్వరుడు అనుమానంవల్ల సాధింపబడేవాడేతప్ప ఉపనిషత్తులవల్ల తెలుసుకోబడేవాడుగాడు. లోకానికి నిమిత్తకారణం, ఉపాదానకారణం వేరైనవి. పశుపతే నిమిత్తకారణం, మూలప్రకృతే ఉపాదానకారణం.

కుమ్మరి మట్టిని కుండవంటి వస్తువులని తయారుచేసినట్లుగా, పశుపతి మూలప్రకృతిని మనకి కనబడు తున్న లోకంగా సృష్టిస్తున్నాడని శైవులు అందరూ చెప్తున్నారు.

"ముద్రికాషట్క తత్వజ్ఞః పరముద్రావిశారదః। భగాసనస్థమాత్మానం ధ్యాత్వా నిర్వాణం రుచ్ఛతి॥
కణ్ఠికా రుచకం చైవ కుణ్డలం చ శిఖామణిః। భస్మ యజ్ఞోపవీతం చ ముద్రాషట్కం ప్రచక్షతే॥
ఆభిర్ముద్రితదేహస్తు న భూయ ఇహ జాయతే॥

( ఆరుముద్రల యథార్థాన్ని తెలిసినవాడై, పరముద్రలో జ్ఞానిగా ఉండి స్త్రీకలయికమీదఉన్నవాడుగా తనని ధ్యానించి మోక్షాన్ని పొందుతాడు. 1. కంఠిక, 2. రుచికం అనే మరో కంఠాభరణం, 3. కుండలం, 4. శిఖామణి (తలమీద అలంకరించే ఆభరణం - నాగరం వంటిది) 5. భస్మం, 6. యజ్ఞోపవీతం అనే ఆరు ముద్రలని ధరించేవాడు ఈలోకంలో జన్మించడు) అని కాపాలికులు ఆరు ముద్రలని ధరించడం, స్త్రీమీదనున్నవాడుగా తనని(రుద్రుడిని) ధ్యానంచడం మోక్షహేతువుగా చెప్తున్నారు. కాలాముఖులు కపాల(మనుష్యుల కపాలం)పాత్రభోజనం, శవాలభస్మంలో స్నానం, దాన్ని తినడం కర్రని పట్టుకోవడం, కుండని స్థాపించి దానిలో దేవపూజ చెయ్యడం మొదలైన కార్యాలవల్ల ఈజన్మ, పైజన్మ ప్రయోజనాలని పొందవచ్చని చెప్పుతున్నారు.

"రుద్రాక్షకఙ్కణం హస్తే జటాచైకా చమస్తకే కపాలం భస్మనా స్నానం" (చేతిలో రుద్రాక్షకంకణం, తలమీద ఒకటిగా ముడివేయబడిన జట, కపాలం, భస్మంలో స్నానంచేయడం, (మోక్షసాధనాలు)) అని సైవాగమాల్లో చెప్పబడిఉండడం ప్రసిద్ధం.

" దీక్షాప్రవేశమాత్రేణ బ్రాహ్మణో భవతి క్షణాత్। కాపాలం వ్రతమాస్థాయ యతిర్భవతి మానవః॥

(శివదీక్ష పొందడంవల్లనే (వేరు జాతికి చెందినమనుష్యుడు) ఒకక్షణంలో బ్రాహ్మణుడౌతాడు. కాపాలికవ్రతాన్ని అనుష్ఠించడంవల్ల (ఇతర ఆశ్రమాలకి చెందిన) మనుష్యుడు ఒక క్షణంలో సన్యాసి అవుతాడు.) అని శైవులందరూ ఒక క్రియన చెయ్యడంవల్లనే వర్ణాశ్రమాలు మారిపోతాయిఅని అంగీకరిస్తున్నారు.

*274. ఇదం మతం పశుపతేః వ్యాఘాతాచ్ఛ పరస్పరమ్।*
*శ్రుతేశ్చైవం విరుద్ధత్వాత్ అసామఞ్జస్యతో భృశమ్॥*

*275. నిశ్రేయసార్థిభిర్నైవాऽऽదరణీయం వివేకిభిః।*
*వేదా జగన్నిమిత్తం చోపాదానం చ పునఃపునః॥*

*276. నారాయణం వదన్త్యస్య బ్రహ్మణో వేదనాత్మికా।*
*ఉపాస్తిర్ముక్తిదా చేతి తత్ర తత్ర శ్రుతా అపి॥*

*277. శివాదిశబ్దా నారాయణానువాకానుసారతః।*
*నారాయణపరా ఏవ శ్రుతం తత్ర తథైవ హి॥*

*278. అయం చార్థః పూర్వమేవ సుస్పష్టం ప్రతిపాదితః।*
*అతో వేదవిరుద్ధత్వాత్ మతమేతదసంగతమ్॥*

274-278. **సిద్ధాంతం:** ముందువెనకలు వ్యతిరేకిస్తూంటే, వేదవిరుద్ధమైఉండడం, మొదలైన కారణాలవల్ల చాలా అసమంజసంగా (కుదరకుండా) ఉండడంవల్ల ఈపశుపతిమతం మోక్షాన్ని కోరే వివేకులవల్ల కొంచెంకూడా ఆదరించతగినదిగాదు. వేదాలు లోకానికి నిమిత్తకారణంగాను, ఉపాదానకారణం గానూ నారాయణుడినే నూటికిపైగా స్థలాల్లో ఉదాహరించేయి. బ్రహ్మమైన ఈయనని ధ్యానించడం అనే

ఉపాసనాన్నే మోక్షకారణంగా చెప్తున్నాయి. పరమాత్మవస్తువుని చెప్పినప్పుడల్లా అక్కడక్కడ కనబడే శివుడు, రుద్రుడు మొదలైన శబ్దాలు ఆయాచోట్లకి తగినట్టుగా కనబడే ఆకాశం ఇంద్రుడు మొదలైన శబ్దాలలాగే నారాయణానువాకాన్ని అనుసరించి నారాయణుడినే చెప్తున్నాయని స్పష్టం. నారాయణానువాకం నారాయణుడే పరబ్రహ్మం, పరతత్త్వం పరంజ్యోతి పరమాత్మ అని నిస్సందేహంగా చెప్పింది. ఈవిషయం సర్వవ్యాఖ్యానాధికరణంలోనే చాలస్పష్టంగా చెప్పబడింది. కనుక, ఈవిధంగా వేదానికి వ్యతిరేకం అయినందువల్ల పశుపతిమతం కుదరనిదే అవుతుంది.

*సి.సూ.॥ అధిష్ఠానానుపపత్తేశ్చ॥ (2-2-36) (210)*

**అధిష్ఠానానుపపత్తేః చ** -- ఉపాదానకారణం మొదలైనవాటిని అధిష్ఠించి నిలిపేది (శరీరంలేని) శివుడికి కుదరదుగనుకకూడా (పశుపతిమతం కుదరనిది.)

*279. నిమిత్తమాత్రేశ్వరస్య కల్పనాదనుమానతః।*
*దృష్టానుసారాత్కర్తవ్యమధిష్ఠానం కులాలవత్॥*
*280. న యుజ్యతే పశుపతేః ప్రధానాధిష్ఠితిః క్వచిత్।*
*అదేహత్వాత్సదేహానాం హ్యేవాధిష్ఠితిరిష్యతే॥*
*281. న శరీరిత్వమస్య స్యాత్తస్య సావయవస్య చ।*
*నిత్యత్వేఽనిత్యతాయాం చ ప్రాక్ దోషాః పరికీర్తితాః॥*

279-281. **సిద్ధాంతం:** శైవమతంలో అనుమానంతో కుండ మొదలైనవాటికి కుమ్మరిలాగ, లోకానికి నిమిత్తకారణంగా శివుడిని సాధిస్తున్నారు. ఇలా సాధించినప్పుడు దృష్టాంతమైన కుమ్మరి ఉపాదానకారణమైన మట్టినీ, సహకారి కారణమైన కర్రా, సారె (చక్రం) మొదలైనవాటినికూడా, అధిష్ఠించినట్లే శివుడుకూడా ఉపాదానకారణమైన ప్రకృతి మొదలైనవాటిని అధిష్ఠించి లోకాన్ని సృష్టించినట్లుగా గ్రహించాల్సివస్తుంది. పశుపతిని దేహంలేనివాడుగా పాశుపతులు చెప్పడంవల్ల దేహంతోఉన్న కుమ్మరి మన్ను మొదలైనవాటిని అధిష్ఠించి కుండమొదలైనవాటిని చేసినట్లుగా, శివుడు ప్రధానాన్ని అధిష్ఠించి లోకాన్ని సృష్టించడం ఏవిధంగానూ వీలుగాదు. లోకంలో శరీరంతోఉన్న కుమ్మరివంటివాళ్ళే ఉపాదానకారణాన్ని అధిష్ఠించడానికి వీలవుతుంది. శివుడికికూడా శరీరం ఉన్నదని చెప్పవచ్చుగదా అంటే, అవయవంగలిగిన ఆయనశరీరాన్ని నిత్యం అని అంగీకరిస్తే, అవయవంఉన్న లోకాన్నే నిత్యమని అంగీకరించాల్సిరావడంవల్ల దాన్ని సృష్టించినవాడిగా ఒకడిని అనుమానంవల్ల సాధించవలసిన అవశ్యంలేదు. ఆశరీరాన్ని అనిత్యమని అనుకుంటే ఆశరీరాన్ని సృష్టించినవాడు వేరొకశరీరాన్ని కలిగినవాడైయుండాలి, ఆశరీరాన్ని సృష్టించేటప్పుడు మరో శరీరాన్ని కలిగినవాడుగానూ, ఇలా అంతులేకుండా ఎన్నో శరీరాలనిగలవాడైఉండాల్సిరావడంవల్ల అనవస్థాదోషం ఏర్పడుతుంది. ఆనుమానికేశ్వరవాదంలో ఈదోషం వస్తుందనీ ఈదోషం రాకుండా ఉండాలంటే వేదాంతులైన మనం శాస్త్రంవల్లనే ఈశ్వరుడిని అంగీకరించాలి అనేది శ్రీభాష్యకారులు శాస్త్రయోనిత్వాధికరణంలో వివరించేరు. కనుక, అనుమానంవల్ల సర్వేశ్వరుడిని సాధించే శైవమతంలో ఈలోటు తీర్చలేనిదే అవుతుంది.

*సి.సూ. ॥ కరణవచ్చేన్న భోగాదిభ్యః ॥ (2-2-37) (211)*

**కరణవత్ చేత్** -- (శరీరంలేని జీవుడు) ఇంద్రియాలు, శరీరం మొదలైనవాటిని అధిష్ఠంచడంలాగ (శరీరంలేని పశుపతికూడా ప్రకృతిని అధిష్ఠించవచ్చుగదా) అంటే, **భోగాదిభ్యః** -- (అప్పుడు జీవుడిలాగే) పుణ్యపాపకర్మఫలభోగం మొదలైనవిగూడా కలగడంవల్ల, **న**-- (ఈ దృష్టాంతం) కుదరనిది.

*282. అశరీరస్య జీవస్య కరణాదిపరిగ్రహః।*
*యథోపపద్యతే తద్వదీశ్వరస్యాప్యదేహినః॥*
*283. ప్రకృత్యధిష్ఠానమితి చేన్న పుణ్యాదికర్మణామ్।*
*ఫలభోగాయ హి వపురాద్యధిష్ఠానమాత్మనః॥*
*284. తద్వదస్యాపి సర్వం స్యాత్ఫలభోగాద్యపేశితుః।*
*తస్మాత్ప్రధానాధిష్ఠానసంభవో నేశ్వరస్య హి॥*

282-284. **సిద్ధాంతం: శరీరంలేని జీవుడు** ఎలా తనఇంద్రియాలనీ శరీరాన్నీ మరో శరీరంతాలూకు సహాయంలేకుండా తనంతటతానే అధిష్ఠించి ఉంటాడో, అలాగే శరీరంలేని శివుడుకూడా మూలప్రకృతిని అధిష్ఠించి ఉండడానికి అభ్యంతరం లేదు - అని శైవులు చెప్పినప్పటికీ, జీవుడికి పుణ్యపాపకర్మల అనుభవానికే అటువంటి అధిష్ఠానం ఏర్పడినట్టుగానే, ఈశ్వరుడైన పశుపతికికూడా పుణ్యపాపకర్మానుభవానికే శరీరాధిష్ఠానం అని అంగీకరించాల్సివస్తుంది. ఈశ్వరుడికి పుణ్యపాపకర్మలనీ, దానివల్ల వచ్చే సుఖదుఃఖాలు మొదలైనవాటినీ, అంగీకరించవీలులేకపోవడంవల్ల పశుపతిమతంలో ఈశ్వరుడు ప్రకృతిని అధిష్ఠించి ఉండడం ఎలాచూసినా కుదరనిదే.

*సి.సూ.॥ అన్తవత్త్వమసర్వజ్ఞతా వా॥ (2-2-38) (212)*

**అన్తవత్త్వం** - (పుణ్యపాపాలని అంగీకరిస్తే జీవుడిలాగే శివుడికికూడా) సృష్టింపబడి సంహరింపబడడంవల్ల కలిగే అనిత్యత్వం అనే నీచత్వం, **అసర్వజ్ఞతా వా--** ఏమీ తెలియనివాడని తక్కువతనంకూడా కలుగుతుంది. (కనుక పశుపతిమతం కదరనిదే అవుతుంది.)

*285. పుణ్యాపుణ్యాత్మకాదృష్టవత్త్వే పశుపతేస్తదా।*
*అన్తవత్త్వం జీవవచ్చ సృష్టిసంహార్యతా తథా॥*
*286. అసర్వజ్ఞత్వం చ భవేత్ తస్మాత్సర్వప్రకారతః।*
*ఇదం నాదరణీయం స్యాత్ మతం ముక్తిఫలేప్సుభిః॥*

*॥ ఇతి పశుపత్యధికరణమ్॥*

285-286. శరీరాధిష్ఠానాన్ని శివుడికి కట్టబెట్టడానికి జీవుడికిలాగే ఆతడికికూడా పుణ్యపాపాలని ఎత్తుకుంటే, జీవుడిలాగ పుణ్యపాపానుగుణంగా సృష్టింపబడి నశించిపోయే అనిత్యపదార్థంగానూ, పుణ్యపాపాలకి తగిన జ్ఞానంలో హెచ్చుతగ్గులు ఉన్నవాడిగా అవవలసివస్తుందిగనుక, సర్వజ్ఞుడుకాని వాడిగానూ, (అన్నిటినీ తెలియనివాడిగా) ఆయనని గ్రహించాల్సివస్తుంది. జన్మలేనటివంటి గొప్పవాడిగాను, అందరినీ సంహరించేవాడిగా ఉంటూ తాను ఎవరివల్లా సంహరింపబడనివాడై, సర్వజ్ఞుడని పేరుపొందిన ఈశ్వరుడిగా అభిమానింపబడుతున్నవాడికి ఇవి తగినవిగాలేవు. అందుచేత మోక్షఫలాన్ని కోరుకొంటున్నవాళ్ళచేత శైవమతం అన్నివిధాలుగానూ అనాదరింపబడవలసినదే అగును.

పశుపత్యధికరణం పూర్తి అయినది.

## ॥ఉత్పత్త్యసమ్భవాధికరణమ్॥(2-2-8)

## (పాంచరాత్రాధికరణమ్)

*పూ.సూ.॥ ఉత్పత్త్యసంభవాత్॥ (2-2-39) (213)*

**ఉత్పత్త్యసంభవాత్** -- (జీవుడికి పాంచరాత్రాగమంలో చెప్పబడే) ఉత్పత్తి కుదరదుగనుక (ఈ

ఆగమం అప్రమాణం)

*287. సాంఖ్యాది తంత్రసామాన్యాత్పాంచరాత్రాగమోపి చ।*
*సాక్షాద్భగవతా ప్రోక్తే మోక్షసాధనబోధిని॥*

*288. అప్రామాణ్యాశఙ్కిపరపక్షోఽత్ర క్షిప్యతే నయైః।*

287-*288. వేదవిరుద్ధపక్షాలని నిరసించే ఈపాదంచివరి అధికరణమైన ఈపాంచరాత్రాధికరణంలో భగవానుడైన నారాయణుడివల్ల ప్రత్యక్షంగా సాయించబడినదై మోక్షసాధనాలని చెప్పేదైనపాంచరాత్రాగమంలోనూ, సాంఖ్యం మొదలైన అవైదికశాస్త్రాల్లోలాగ అప్రామాణ్యం ఉన్నది అని చెప్పే అవైదికపక్షం యుక్తులవల్ల నిలసింపబడుతోంది.

*288* అసంభవన్త్యా జీవానాముత్పత్తేరభిధానతః॥*

*289. న ప్రమాణం పాఞ్చరాత్రాగమస్తన్త్రేఽత్ర కథ్యతే।*
*సఙ్కర్షణో నామ జీవః వాసుదేవాత్ప్రజాయతే॥*

*290. సఙ్కర్షణాచ్చ ప్రద్యుమ్నసంజ్ఞముత్పద్యతే మనః।*
*అహఙ్కారోఽనిరుద్ధాఖ్యః తస్మాజ్జాయత ఇత్యపి॥*

*291. అత్ర శ్రుతివిరుద్ధాహి జీవోత్పత్తిః ప్రతీయతే।*
*శ్రుతౌ "న జాయత" ఇతి తదనాదిత్వముచ్యతే॥*

288*- 291. **పూర్వపక్షం:** ఈ పాంచరాత్రశాస్త్రంలో " వాసుదేవాత్ సంకర్షణో నామ జీవో జాయతే సంకర్షణాత్ ప్రద్యుమ్నసంజ్ఞాం మనః జాయతే॥ తస్మాదనిరుద్ధసంజ్ఞోఽహంకారో జాయతే। వాసుదేవునివద్దనుండి సంకర్షణుడు అను జీవుడు సృష్టింపబడినాడు. సంకర్షణుడినుండి ప్రద్యుమ్నుడు అనే పేరుగల మనస్సు సృష్టింపబడింది. ఆప్రద్యుమ్నుడినుండి అనిరుద్ధుడనే పేరుగల అహంకారం సృష్టింపబడినది. అని చెప్పబడుతోంది. "సంకర్షణో నామ జీవః" "ప్రద్యుమ్న సంజ్ఞాం మనః" "అనిరుద్ధసంజ్ఞోఽహంకారః" అని "జీవః", "మనః", "అహంకారః" అనే విశేష్యపదాలవల్ల జీవాదులనెత్తుకొని, ***"సంకర్షణో నామ -- ప్రద్యుమ్న సంజ్ఞాం -- అనిరుద్ధ సంజ్ఞః"*** అనే విశేషణపదాలవల్ల ఆజీవుడు మొదలైనవాటికి సంకర్షణుడు మొదలైన పేర్లతో సంబంధం ఉన్నట్టుగా తెలియడంవల్ల, ఈశాస్త్రంలో జీవుడు మొదలైనవారికి ఉత్పత్తి చెప్పబడుతోందన్నది దాచలేనిది. వీటిలో జీవుడికి ఉత్పత్తిని చెప్పడం, వేదాల్లో "న జాయతే మ్రియతే వా విపశ్చిత్" (కఠ. 2-18)" (జ్ఞానంకలిగిన జీవుడు పుట్టడంలేదు, చనిపోవడంలేదు.) మొదలైన చోట్ల జీవుడు ఉత్పత్తి లేనివాడని చెప్పినదానికి విరుద్ధంగా ఉన్నది. ఈవిధంగా శ్రుతివిరుద్ధమై యుక్తులకి కుదరనిదైన జీవోత్పత్తిని చెప్పడంవల్ల ఈపాంచరాత్రాగమం ప్రమాణం కానేరదు.

## *పూ,సూ. ॥ న చ కర్తుః కరణమ్ ॥ 2-2-40 ॥ (214)*

**కర్తుః: కర్తయైన జీవుడినుండి కరణం చ** : కరణం అయిన మనస్సు (సృష్టింపబడ్డది అని చెప్పడం) **న:** కుదరదు.

*292. సఙ్కర్షణాన్మనోజాతమితి కర్తుశ్చ జీవతః।*
*మనసః కరణస్యైవముత్పత్తిశ్చ న సంభవేత్॥*

*293. "ఏతస్మాజ్జాయతే ప్రాణః మనస్సర్వేన్ద్రియాణి చ"।*
*ఇత్యుత్పత్తిశ్రుతేర్బ్రహ్మసకాశాన్మనసోఽపిచ॥*

292-293. పూర్వపక్షం: ఈపాంచరాత్రాగమంలో "సంకర్షణాత్ ప్రద్యుమ్న సంజ్ఞాం మనః జాయతే" (సంకర్షణుడు అనబడే జీవుడినుండి ప్రద్యుమ్నం అనబడే మనస్సు సృష్టింపబడింది) అని కర్తైన జీవుడినుంచి కరణమైన మనస్సు సృష్టింపబడిందని చెప్పడం, "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనస్సర్వేన్ద్రియాణి చ" (ముండక. 2-1-3) (ఈపరమాత్మనుండే ప్రాణం, మనస్సు సమస్త ఇంద్రియాలూ సృష్టింపబడ్డాయి) అని మనస్సు పరమాత్మనుంచి సృష్టింపబడిందని శ్రుతిలో చెప్పబడినదానికి విరుద్ధంగా ఉన్నది. కనుక ఈవిధంగా ఇదికూడా కదరనిదే అవడంవల్ల పాంచరాత్రమతం శ్రుతివిరుద్ధమే అవుతుంది.

### *సి.సూ.॥ విజ్ఞాపనాదిభావే వా తదప్రతిషేధః ॥ 2-2-41 ॥ (215)*

**విజ్ఞాపనాదిభావే వా:** (సంకర్షణుడు మొదలైనవి) విశేషజ్ఞానస్వరూపమై ఆదియైనటువంటి పరమాత్మవస్తువే అని అంగీకరించడంలో, **తదప్రతిషేధః:** పాంచరాత్రం ప్రామాణ్యం నిరసింపవీలుకానిది అవుతుంది.

*294. ఏవం సూత్రద్వయేనైతదాగమస్యాప్రమాణతామ్।*
*ఆశఙ్క్య తస్య ప్రామాణ్యం సాధ్యతే సూత్రయుగ్మతః॥*
*295. అత్రవిజ్ఞానాదిశబ్దాత్ పరబ్రహ్మాభిధీయతే।*
*సంకర్షణాదిమూర్తీనాం బ్రహ్మత్వే తిసృణాం సతి॥*
*296. తదర్థబోధనపరశాస్త్రస్యాస్య ప్రమాణతా।*
*నిషిధ్యతే నైవ, వాసుదేవాఖ్యం బ్రహ్మ తత్పరమ్॥*
*297. ఆశ్రితాశ్రయణీయత్వసిద్ధయే శ్రితవత్సలమ్।*
*చతుర్ధా స్వేచ్ఛయైవావిర్భవతీతి చ కథ్యతే॥*
*298. చాతురాత్మోపాసనం తత్ బ్రహ్మోపాసనమిత్యపి।*
*అతస్సంకర్షణాదీనాం పరబ్రహ్మణ ఏవ హి॥*
*299. స్వేచ్ఛావిగ్రహరూపత్వాత్ తాదృగర్థావబోధినః।*
*శాస్త్రస్యాస్య ప్రమాణత్వాప్రతిషేధో హి యుజ్యతే॥*
*300. తత్రజీవమనోఽహంకారతత్త్వానాం క్రమాత్తథా।*
*అధిష్ఠాతార ఉచ్యన్తే త్రయస్సఙ్కర్షణాదయః॥*
*301. తేషాం జీవాదిశబ్దైశ్చ భాషణం న విరుధ్యతే।*
*ప్రాణాకాశశబ్దైశ్చ యథా బ్రహ్మావబోధనమ్॥*

**294-301. సిద్ధాంతం:** వెనుకటి రెండు సూత్రాలవల్లా ఇదివరకు చెప్పినట్లుగా పాంచరాత్రశాస్త్రం ప్రమాణం కాదని పూర్వపక్షం చేసి, ఈసూత్రంవల్లా, తరువాతిసూత్రంవల్లనూ, అది ప్రమాణమే అని నిరూపించబడుతోంది. ఈసూత్రంలో విజ్ఞానాదిశబ్దంవల్ల విజ్ఞానస్వరూపమై మూలకారణమైన పరమాత్మ-వస్తువు చెప్పబడుతోంది. జీవాదిశబ్దాలతోబాటు సమానాధికరణంగా (ఒకే రకంగా) చెప్పబడిన సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అనబడే మూడుపదాలున్నూ పరమాత్మయొక్క మూడు (వ్యూహ) మూర్తులనీ సూచించినట్లుగా గ్రహించడంలో జీవాదులకి ఉత్పత్తిని చెప్పకుండా, వాసుదేవమూర్తియైనటువంటి మూలమూర్తినుంచి సంకర్షణుడూ, ఆసంకర్షణుడినుంచి ప్రద్యుమ్నుడున్నూ, వానినుంచి అనిరుద్ధుడున్నూ సృష్టింపబడడమే ఈశాస్త్రం చెప్తూండడంవల్ల శాస్త్రప్రామాణ్యం ఖండింపబడదు. ఈపాంచరాత్రశాస్త్రాన్ని

తెలియనివాళ్ళే ఇందులో సంకర్షణుడు మొదలైన శబ్దాలవల్ల జీవుడు మొదలైనవాటిని ఎత్తుకొని వాటికి ఉత్పత్తి చెప్పబడ్డదని చెప్తారు. ఈశాస్త్రాన్ని పరిశీలిస్తే అందులో ఎన్నో చోట్ల ఆశ్రితవత్సలుడైన వాసుదేవడనబడే పరమాత్మవస్తువు ఆశ్రితులని(దాసులని) తనని ఆశ్రయించడానికి వాసుదేవుడు, సంకర్షణుడు ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడుఅని నాలుగు మూర్తులుగా తానే తన ఇచ్ఛచేత అవతరించి నట్లుగా చెప్పబడుతోంది. ఈనాలుగుమూర్తులనీ ఉపాసించాలనే చెప్పబడుతోంది.

" కర్తవ్యత్వేన వై యత్ర చాతురాత్మ్యముపాస్యతే।
క్రమాగతైఃస్వసంజ్ఞాభిఃబ్రాహ్మణైరాగమం తు తత్॥

(వంశపరంపరగా వచ్చిన బ్రాహ్మణులవల్ల (సంకర్షణుడు మొదలైన) పేర్లని ముందుబెట్టుకొని భగవానుడి నాలుగు వ్యూహమూర్తులున్నూ పాంచరాత్రాగమప్రకారం కైంకర్యబుద్ధితో ఉపాసంపబడుతున్నారు.) అని పౌష్కరసంహితలోనూ,

బ్రాహ్మణానాం హి సద్బ్రహ్మవాసుదేవాఖ్యయాజినామ్।
వివేకదం పరం శాస్త్రం బ్రహ్మోపనిషదం మహత్॥

(సత్, బ్రహ్మం అని ఉపనిషత్తులలోచెప్పబడే వాసుదేవుడిని తిరువారాధనం చేసే బ్రాహ్మణులకి పరమాత్మజ్ఞానాన్నిచ్చేదై గొప్పదైనశాస్త్రమై మేలైనబ్రహ్మోపనిషత్తుగా పాంచరాత్రం ఉన్నది) అని సాత్వతసంహితలోనూ చెప్పబడడం మనం చూడవచ్చు. కనుక పరమాత్మయైన వాసుదేవుడే, "అజాయమానో బహుధా విజాయతే" (పు.సూ.) (జన్మలేనివాడైకూడా అనేకవిధములుగా పరమపురుషుడు జన్మిస్తున్నాడు) అని శ్రుతిలో చెప్పినట్లుగానే సంకర్షణుడు మొదలైనవ్యూహరూపాలనీ, రామకృష్ణాది విభవరూపాలనీ, అంతర్యామిరూపాలనీ అర్చారూపాలనీ తన ఇచ్ఛచేతనే ఎత్తుతాడని ఈశాస్త్రంలో చెప్పబడడంవల్ల ఆసంకర్షణాదులకి జన్మని చెప్పడం ఈశాస్త్రానికి ప్రామాణ్యతని తోసిపుచ్చడం ఎంతమాత్రం కుదరదు. సంకర్షణం ప్రద్యుమ్నం అనిరుద్ధుడు అనే మూడు వ్యూహమూర్తులూ, వరసగా జీవుడు మనస్సు అహంకారం, అనే తత్త్వాలని అధిష్ఠించి ఉండే అభిమానిదేవతలు గనుక సంకర్షణాది పదాలకి జీవుడు మొదలైనపదాలతో ఏకంగా వేరుపాటుని ఈశాస్త్రానికిచెందిన పరమసంహితావచనాలు చెప్తున్నాయి. కనుక, ఆవచనాలతో జీవుడు మొదలైనవాటికి ఉత్పత్తి చెప్పబడుతోందని చెప్పడం కుదరదు. ప్రాణం, ఆకాశంమొదలైనవాటిని అధిష్ఠించిఉన్న పరమాత్మని ప్రాణాకాశాదిశబ్దాలవల్ల శ్రుతి చెప్పినట్లుగానే ఈశాస్త్రం అధిష్ఠింపబడేవాటిని చెప్పే జీవుడు మొదలైన శబ్దాలచేత అధిష్ఠాతలైన సంకర్షణుడు మొదలైన వారినికూడా చెప్తోంది. లెక్కలేనన్నిచోట్ల ఈశాస్త్రంలో సంకర్షణాదులని పరమాత్మ తాలూకు వ్యూహమూర్తులుగానే సూచించడాన్ననుసరించి "సంకర్షణో నామ జీవో జాయతే"అని ఒక మూలనున్న ప్రయోగంలో విశేషణవిశేష్యాలని మార్చి "జీవుడికి అభిమానియైన సంకర్షణుడు జన్మించేడు" అని తాత్పర్యార్థాన్ని తీసుకోవాలి. *"జీవః - జాయతే"* అన్నదానితో ***జీవాత్ ప్రద్యుమ్నసంజ్ఞం మనః*** అని చెప్పకుండా, ***సంకర్షణాత్ ప్రద్యుమ్నసంజ్ఞం మనః*** అని చెప్పడాన్నిబట్టి సంకర్షణశబ్దమే విశేష్యపదం అని స్పష్టం అవుతోంది. కనుక ఈవిధంగా పాంచరాత్రశాస్త్రప్రామాణ్యం తోసిపుచ్చడానికి కుదరనిదే అవుతోంది.

### *సి.సూ.॥ విప్రతిషేధాచ్చ ॥ 2-2-42 ॥ (216)*

**విప్రతిషేధాత్ చ:** (ఈపాంచరాత్రశాస్త్రంలోనే జీవోత్పత్తివాదం) ఖండించబడిఉండడంవల్లకూడా (దీని ప్రామాణ్యత త్రోసివేయదగినది కాదు)

***302.*** *"స హ్యనాదిరనన్తశ్చ పరమార్థేన నిశ్చితః।*

*ఇత్యస్మిన్నపి తన్త్రేచ జీవోత్పత్తినిషేధతః॥*

303. *అవిరుద్ధమిదం తన్త్రం ప్రమాణతమముచ్యతే।*
*తస్మాన్మహాభారతే చ సూత్రకృద్బాదరాయణః॥*

304. *"పఞ్చరాత్రస్య కృత్స్నస్య వక్తా నారాయణస్స్వయమ్।*
*ఇత్యుక్త్యైతద్వక్తురాప్తతమత్వం చాస్య కృత్స్నశః॥*

305. *ప్రామాణ్యం బోధయాఞ్చక్రే సుస్పష్టం తత్త్వవిత్తమః।*
*తస్మాద్విలక్షణం శాస్త్రం నిస్సమాభ్యధికం మతమ్॥*

306. *పఞ్చరాత్రస్య పూర్వోక్తాగమవచ్చాప్రమాణతామ్।*
*అనిచ్ఛతస్సూత్రకృతస్తదప్రమాణ్యవాదినామ్॥*

307. *పక్షస్య పరపక్షత్వాత్ పాదేఽస్మిన్ తన్నిరాకృతిః।*
*యుక్తాఽతోఽస్యా అధికృతేః పాదసఙ్గతిరక్షతా॥*

308. *"ఇదం శతసహస్రాద్ధి"త్యాది భారతసూక్తిభిః।*
*ఆశయస్సూత్రకారస్య సుస్పష్టంహి ప్రతీయతే॥*

॥ఇతి ఉత్పత్త్యసమ్భవాద్యధికరణమ్॥

॥ఇతి ద్వితీయాధ్యాయే ద్వితీయః పాదః॥

॥శ్రీమతే రాఘవార్యమహాదేశికాయ నమః॥

॥శ్రీమతే అప్పలార్యమహాదేశికాయ నమః॥

302-308. సిద్ధాంతం. -- ఏపరమసంహితలో వెనుకచెప్పినట్లుగా "సంకర్షణో నామ జీవో జాయతే' అని చెప్పబడునదో, అదే పరమసంహితలో "సహ్యనాదిరనన్తశ్చ పరమార్థేన నిశ్చితః" (ఆజీవుడు ఆద్యంతాలులేని సత్పదార్థంగా(నిజమైన పదార్థంగా) నిశ్చయింపబడిఉన్నాడు)అని జీవుడికి ఉత్పత్తి, అంతం లేవు అని స్పష్టంగా చెప్పబడిఉన్నది. కనుక "జీవో జాయతే" అనే వాక్యంలో దీనికి విరుద్ధంగా జీవోత్పత్తి చెప్పబడినట్లుగా చెప్పడం తగదు. సంకర్షణుడనే వ్యూహమూర్తితాలూకు ఉత్పత్తి (అవతారం) చెప్పబడుతున్నట్టుగానే తీసుకోవాలి. కనుక, ఈపాంచరాత్రాగమం శ్రుతివిరోధం కొంచెంకూడా లేనిదై అతివిశిష్టమైన ప్రమాణంగానే జ్ఞానులచేత ప్రశంసింపబడుతోంది. అందువల్లనే తత్త్వవేత్తలలో విశిష్టులైన సూత్రకారులు బాదరాయణులనబడే వ్యాసులవారు తమ మహాభారతంలో "పాఞ్చరాత్రస్య కృత్స్నస్య వక్తా నారాయణః స్వయమ్" (పాంచరాత్రం పూర్తిగా ఉపదేశించినవారు సాక్షాత్తూ నారాయణుడే) అని చెప్పడంద్వారా ఈపాంచరాత్రాన్ని ఉపదేశించినవారు చాలావిశేషమైన ఆప్తులనిన్నీ, ఈశాస్త్రం పూర్తిగా ప్రమాణం అనిన్నీ అతిస్పష్టంగా చూపించేరు. అందువల్ల, ఈశాస్త్రం అతి విశిష్టమై సాటిలేనిదై, ఇంతకంటే గొప్పదిలేనిదిగా ప్రశంసింపబడుతోంది. ఇక్కడ ఒక ఆక్షేపం వస్తోంది. "ఈపాదంలో వేదవిరుద్ధమైన పరపక్షాలనే ప్రతి అధికరణంలోనూ నిరసించడాన్ని చూస్తాం. దాన్ననుసరించి చూసినప్పుడు ఈపాదంలో త్రోసిపుచ్చబడినసాంఖ్య యోగ తార్కిక జైన బౌద్ధపాశుపతమతాలలాగే ఈపాంచరాత్రమతంకూడా త్రోసివేయదగిన అవైదికమతం అనిగదా గ్రహించాలి అన్నది ఆఆక్షేపం. దీనికి సమాధానం ఈప్రకారంగా ఉన్నది: సూత్రకారులు పాంచరాత్రాన్ని పరమప్రమాణంగా భారతంలో ఉద్ఘోషించేరు. అందువల్ల ఈపాదంలో నిరసింపబడిన ఇతరమతాల్లాగే దీన్నికూడా అప్రమాణంగా వారు భావిస్తున్నారని చెప్పడానికి వీలుగాదు. కనుక, "జీవోత్పత్తిని చెప్పే ఈపాంచరాత్రం అప్రమాణం"అని చెప్పే అవైదికులపక్షాన్ని మొదటి రెండు సూత్రాలవల్లా ఎత్తుకొని తరువాతి రెండుసూత్రాలవల్లా దానిని నిరసించి తన మతం

పాంచరాత్రమతమే అని సూత్రకూరులు చూపిస్తున్నారనే గ్రహించాలి. ఇలా గ్రహిస్తే పరపక్షాలని నిరసించే పాదంలో ఈఅధికరణం చోటు చేసుకోవడంకూడా లోటులేకుండా తగి ఉంటోంది. "సాఙ్గేషు వేదేషు నిష్ఠామలభమానః శాణ్డిల్యః పఞ్చరాత్రశాస్త్రం అధీతవాన్" (పాంచరాత్రం) (అంగాలతో వేదాలలో పురుషార్థనిష్ఠని పొందకుండనే శాండిల్యులు (దాన్ని పొందడంకోసం) పాంచరాత్రశాస్త్రాన్ని అభ్యసించేరు.) అని వేదనిందచెయ్యడంవల్ల ఈశాస్త్రం అప్రమాణం అనిభావించి "విప్రతిషేధాచ్చ" అనే సూత్రానికి "(వేదాన్ని) విశేషంగా ప్రతిషేధం చెయ్యడంవల్ల (పాంచరాత్రం అప్రమాణం) అని కొంతమంది వ్యాఖ్యానం చేసేరు. ఇది సామంజస్యం లేనిది. "న హి నిందా నింద్యం నిందితుం ప్రవర్తతే అపితు ఇతరం ప్రశంసితుమ్" (నిందింపబడేదాన్ని నిందించడం నిందకి ఉద్దేశ్యంగాదు. (ప్రశంసింపబడవలసిన) మరొకదాన్ని ప్రశంసిండమే దానిఉద్దేశ్యం) అనే న హి నిన్దాన్యాయంవల్ల వెనుక చెప్పిన పాంచరాత్ర వచనం పాంచరాత్రశాస్త్రాన్ని ప్రశంసించడానికి ఏర్పడ్డదే తప్ప వేదాన్ని నిందించడంకోసం ఏర్పడినదిగాదు. "ప్రాతః ప్రాతరనృతంతే వదన్తి పురోదయాత్ జుహ్వతి యేऽగ్నిహోత్రమ్" (సూర్యోదయానికి పూర్వం అగ్నిహోత్రం చేసేవాళ్ళు ప్రతిరోజూ ఉదయం అబద్ధం చెప్పేవాళ్ళు) అని వేదోక్తమైన అనుదితహోమాన్ని వేదమే నిందించడం న హి నిన్దాన్యాయంవల్ల ఉదితహోమాన్ని ప్రశంసించడంకోసమే అని మీమాంసకులు తీర్మానించేరు.

భూమవిద్యాప్రకరణంలో(ఛాం.7) నారదులు "ఋగ్వేదం భగవోऽధ్యేమి యజుర్వేదం సామవేద మాథర్వణం చతుర్థమిహాస పురాణం పఞ్చమమ్" (ఓ భగవన్! ఋగ్యజుస్సామాథర్వణాలనే నాలుగు వేదాలనీ పంచమవేదమైన ఇతిహాసపురాణఆలనీ అధ్యయనం చేస్తున్నాను) అని ప్రారంభించి సమస్త విద్యాస్థానాలనీ తాను నేర్చుకోవడాన్ని చెప్పి *"సోహం భగవో మంత్రవిదేవాస్మి నాత్మవిత్"* (ఇంతమాత్రమే అభ్యసించిన నేను మంత్రాన్ని తెలుసుకున్నవాడినైనాను తప్ప ఆత్మని తెలుసుకున్నవాడిని కాలేదు) అని భూమవిద్యతప్ప మిగతా విద్యలన్నింటిలోనూ ఆత్మజ్ఞానాన్ని పొందలేదని చెప్పినది ఇక్కడ చెప్పబడిన భూమవిద్యతాలూకు గొప్పదనాన్ని చూపించడానికే అని వేదాంతులు తీర్మానించేరు. అదేవిధంగా ఇక్కడకూడావెనుక చెప్పిన పాంచరాత్రవచనం పాంచరాత్రశాస్త్రాన్ని ప్రశంసించడమనే ఉద్దేశ్యమేతప్ప వేదాలని నిందించడం ఉద్దేశ్యం గాదు అని నిర్ణయించాలి. యథార్థాన్ని పరిశీలిస్తే ఇక్కడ వేదనిందే లేదనేది తెలుస్తుంది. ఎలా అంటే, భూమవిద్యాప్రకరణంలో నారదులకి, మిగతా విద్యలని అభ్యసించినందువల్ల ఆత్మజ్ఞానం కలగలేదని అనడంవల్ల ఆవిద్యలలో చెప్పబడిన ఆత్మతత్త్వం నారదులకి స్పష్టంగాలేదని అర్థం అవుతుంది. ఇది నారదుల బుద్ధిదోషాన్ని చెప్పుతుందే తప్ప ఆయా విద్యలని చిన్నవిగా చేసి చెప్పడంగాదు. అదేవిధంగా ఇక్కడకూడా శాండిల్యులు వేదాలనుంచి తాము పరతత్త్వాన్ని తెలుసుకోలేకపోయినారంటే తమ బుద్ధిలోని లోటుని చెప్పినట్లే అవుతుందితప్ప, వేదాలని తక్కువచేసినట్లుకాదు. "అటువంటి మందబుద్ధిగల నాకుకూడా ఆత్మతత్త్వాన్ని భూమవిద్య తెలియజేసింది" అని నారదులు చెప్పినట్లుగా, "అటువంటి బుద్ధిమాంద్యంకలిగిన నాకుకూడా పాంచరాత్రం వేదాంతవేద్యుడైన వాసుదేవుడనే పరతత్త్వాన్ని తెలియజేసింది" అని శాండిల్యులు చెప్పేరే తప్ప వేరు భావం అందులో లేదు. అందువల్ల ఇక్కడ వేదనిందకి అవకాశమే లేదు. వేదాల అర్థాలు తెలుసుకోవడానికి చాలా కష్టమైనపని అనిన్నీ, వాటి అర్థాన్ని పరమపురుషుడు సరళమైన పద్ధతిలో పాంచరాత్రశాస్త్రంలో సాయించేరనీ అర్థం.

" అధీతా భగవన్ వేదాః సాంగోపాంగాః సవిస్తారః।

శ్రుతానిచ మయాఽఙ్గాని వాకోవాక్యయుతానిచ ॥
న చైతేషు సమస్తేషు సంశయేన వినా క్వచిత్।
శ్రేయోమార్గం ప్రపశ్యామి యేన సిద్ధిర్భవిష్యతి॥ (పరమసంహిత 1-3,4)

(హే భగవన్! అంగాలతోబాటు ఉపాంగాలతోనూ వివరణలతో ఉన్న వేదాలన్నీ నావల్ల అభ్యసింపబడినాయి. ఏకాయనశాఖలో ఉన్న వాకోవాక్యాలున్నూ దాని అంగాలున్నూ నావల్ల వల్లెవేయబడ్డాయి. వీటన్నింట్లోనూ మోక్షసిద్ధిని ఇవ్వగల సందేహాలులేని విశేషమార్గాన్ని ఎందులోనూ చూడలేదు.) అనిన్నీ,

" వేదాంతేషు యథాసారం సంగృహ్య భగవాన్ హరిః।
భక్తానుకంపయా విద్వాన్సంచిక్షేప యథాసుఖమ్॥

(వేదాంతాలనుంచి సారాన్ని ఎత్తుకొని సర్వజ్ఞుడైన భగవంతుడు హరి భక్తులకోసం దిగివచ్చి పాంచరాత్రశాస్త్రంగా కటాక్షించేడు) అని పరమసంహితలో చెప్పబడినది ఇక్కడ గుర్తించతగినది.

కనుక, వేదంవల్లనే తెలుసుకోబడేవాడై పరబ్రహ్మం అనబడేవాడై, భగవానుడనబడేవాడవడంవల్ల దోషాలన్నిటికీ ఎదిరైనవాడై, కల్యాణగుణాలన్నిటికీ అద్వితీయస్థానమైనవాడై, అంతులేని జ్ఞానం, ఆనందం మొదలైన అనంతంగా వృద్ధిచెందే గుణాలకి ఆకరమైనవాడై, అవిచ్ఛిన్న సంకల్పుడైన వాసుదేవుడు నాలుగు వర్ణాలనీ, నాలుగు ఆశ్రమాలనీ, నిలిపే ధర్మార్థం మోక్షానందాలైన పురుషార్థాలని కోరుకొనే భక్తులని కటాక్షించి అంతులేని కరుణ, సౌశీల్యం, వాత్సల్యం, ఔదార్యం మొదలైన గుణాలకి సముద్రంవంటివాడవడంవల్లనే తన స్వరూపం, తన విభూతి, తన ఆరాధనం, దానిఫలం మొదలైనవాటిని యథాతథంగా తెలియజేసే ఋుగ్యజుస్సామాథర్వమవేదాలు లెక్కలేని శాఖలుగలవిగానూ, (అందువల్లనే) తననితప్ప ఇతరదేవమనుష్యాదులవల్ల అర్థాన్ని తెలుసుకుందికి అరుదైనవిగా ఉండడాన్ని గమనించి వాటి అర్థాన్ని యథాతథంగా తెలియజేసే పాంచరాత్రశాస్త్రాన్ని తానే కటాక్షించినవాడుగనుక ఏలోటూ లేదు.

ఇలా ఉన్నప్పుడు, నాలుగు సూత్రాల్లోనూ, పాంచరాత్రం అప్రమాణంఅనే వ్యాసులవారు నిర్ణయించినట్లు శంకరులు మొదలైనవారు వ్యాఖ్యానించడం, మూడోసూత్రంలో పూర్వపక్షవ్యావృత్తిని చూపించే వాశబ్దం అప్రతిషేధపదం, మొదలైనవాటికి తగినదికాకుండా ఉండడం సూత్రకారుల అభిప్రాయానికి విరుద్ధమే అవుతుంది. ఎందుకంటే, వల్లెవేయబడే వేదాంతవాక్యాల అర్థాన్ని నిష్కర్షించడానికి బ్రహ్మసూత్రాలనిచ్చిన వ్యాసులవారు అధ్యయనవృత్తిననుసరించిన వేదయాగాల అర్థాన్ని చూపించి వేదాన్ని ఉపబృంహణం చెయ్యడంకోసం రచించిన బృహద్గ్రంథమైన మహాభారతంలో మోక్షధర్మంలో జ్ఞానకాండలో

" గృహస్థో బ్రహ్మచారీచ వానప్రస్థోఽథభిక్షుకః।
య ఇచ్ఛేత్ సిద్ధిమాస్థాతుమ్ దేవతాం కాం యజేత సః॥ (మహా భార. శాంతి. 342-1)

(గృహస్థుడు, బ్రహ్మచారి, వానప్రస్థుడు, సన్యాసి, అనే నాలుగు ఆశ్రమాలవాళ్ళూ మోక్షసిద్ధిని పొందడానికి ఏదేవతని ఉపాసించాలి?) అని ప్రారంభించి అతివిస్తారంగా పాంచరాత్రశాస్త్రప్రక్రియని చెప్పి,

"ఇదం శతసహస్రాద్ధి భారతాఖ్యాన విస్తరాత్। ఆవిధ్య మతిమన్థానం దధ్నో ఘృతమివోద్ధృతం॥
నవనీతం యథా దధ్నో ద్విపదాం బ్రాహ్మణో యథా । ఆరణ్యకంచ వేదేభ్యః ఓషధీభ్యో యథాఽమృతమ్॥
(మహా. భార. శాంతి. 353-11,12)

(పెద్దగ్రంధమైన మహాభారతసముద్రాన్ని బుద్ధి అనే కవ్వంతో చిలికి పెరుగులోంచి నేతిని తీసినట్లుగా ఈపాంచరాత్రశాస్త్రం తియ్యబడింది. పెరుగులోని వెన్నలాగ, మనుష్యుల్లో బ్రాహ్మణుడిలాగ, వేదాల్లో ఆరణ్యకంలాగ, ఓషధుల్లో అమృతంలాంటి భారతంలోని సారంగా పాంచరాత్రం తీసుకోబడింది.)

"ఇదం మహోపనిషదం చతుర్వేదసమన్వితం। సాంఖ్యయోగకృతాంతేన పంచరాత్రానుశబ్దితమ్॥

(మహా. భార. శాంతి. 348-62)

(ఈపాంచరాత్రం అనబడే శాస్త్రం నాలుగువేదాలతో కుడుకున్న మహా ఉపనిషత్తు. కర్మజ్ఞానయోగాలతో కూడినది. (దీన్ని నారదులు బదరికాశ్రమంలో నారాయణుడి దివ్యముఖంనుంచి విన్నారు))

"ఇదం శ్రేయ ఇదం బ్రాహ్మ ఇదం హితమనుత్తమమ్।
ఋగ్యజుస్సామభిర్జుష్టం అథర్వాంగిరసైస్తథా॥
భవిష్యతి ప్రమాణం వై ఏతదేవానుశాసనమ్॥

(ఇదే శ్రేయస్సు, ఇదే గొప్పది, ఇదే శ్రేష్ఠమైన హితం, ఋగ్యజుస్సామాధర్వణవేదాలతోకూడిన ఇదే ప్రమాణం. ఇదే భగవదాజ్ఞ.)

"బ్రాహ్మణైః క్షత్రియై ర్వైశ్యైః శూద్రైశ్చ కృతలక్షణైః।
అర్చనీయశ్చ సేవ్యశ్చ పూజనీయశ్చ మాధవః॥
సాత్వతం విధిమాస్థాయ గీతః సంకర్షణేన యః॥ (మహా. భార. భీష్మపర్వం.)

(పంచసంస్కారం పొందిన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులవల్లా, శూద్రులవల్లా సంకర్షణుడిచేత కటాక్షింపబడిన పాంచరాత్రంప్రకారం మాధవుడే అర్చింప, సేవింప, పూజింప తగినవాడు.) అని సాయించేరు. ఈవిధంగా పాంచరాత్రాన్ని పరమప్రమాణంగా చెప్పినవారై, వేదవిత్తులలో శ్రేష్ఠులైన వ్యాసులవారు వేదాంతాల్లో తెలియబడే పరమాత్మవస్తువైన వాసుదేవుడిని ఉపాసించాలనీ, పూజించాలనీ, చెప్పే పాంచరాత్ర శాస్త్రాన్ని బ్రహ్మసూత్రంలో ఎలా అప్రమాణంగా చెప్పిఉండడం సాధ్యం అవుతుంది? దీనిమీద ఒక ప్రశ్న ఉదయిస్తోంది. ఇదే మోక్షధర్మంలో,

సాంఖ్యం యోగః పంచరాత్రం వేదాః పాశుపతం తథా।
జ్ఞానాన్యేతాని బ్రహ్మర్షే లోకేషు ప్రచరన్తి హి॥
కిమేతాన్యేగనిష్ఠాని పృథఙ్నిష్ఠాని వా మునే॥ (మహా. భార. శాంతి. 359-1)

(ఓ బ్రహ్మర్షి! సాంఖ్యం, యోగం, పంచరాత్రం, వేదం, పాశుపతం వంటి ఈమతాలు లోకంలో వ్యవహారంలో ఉన్నాయి. ఇవన్నీ ఒక్కటే చెప్తున్నాయా లేక వేరువేరుగా చెప్తున్నాయా?) అని ప్రశ్నవిని ఈఐదుమతాలనీ వివరించి వీటన్నిటికీ గమ్యమైన అర్థం నారాయణుడే అని చెప్పడంద్వారా అన్నీ ఆదరించతగినవే అని చూపేరు వ్యాసులవారు.

సాంఖ్యం యోగః పంచరాత్రం వేదాః పాశుపతం తథా।
ఆత్మప్రమాణాన్యేతాని న హన్తవ్యాని హేతుభిః॥

(సాంఖ్యం, యోగం, పంచరాత్రం, వేదం, పాశుపతం, అనే ఐదే పరమాత్మవిషయంలో ప్రమాణాలు. కారణాలతో వీటిని అణగతొక్కకూడదు. ) అని ఒక వచనంకూడా ఉన్నది. వీటిలో ఈఐదుమతాలు మాత్రమే ఆదరింపతగినవి అని చెప్పడం శారీరకసూత్రాలలో సాంఖ్యాదులని ఖండించడంతో ఎలా సరిపోతుంది? సాంఖ్యాదులు త్రోసిపుచ్చబడినట్లే పాంచరాత్రంకూడా త్రోసిపుచ్చబడుతోందని ఎందుకు గ్రహించకూడదు? అన్నది ఆప్రశ్న. ఇకపైన దీనికి సమాధానం:

ఈమహాభారతప్రకరణం పూర్తిగా పరిశీలిస్తే, శారీరకానికీ, దీనికీ ఏవిధమైన విరోధంకూడా లేదని స్పష్టం అవుతుంది. ఎలా అంటే, ఈఐదు మతాలూ ఒకటే చెప్తున్నాయా లేక వేరువేరుగా చెప్తున్నాయా అనే ప్రశ్న అంటే, ఇవి ఒకే పరమాత్మవస్తువుని చెప్తున్నాయా లేక వేరువేరు పదార్థాలని చెప్తున్నాయా? ఒకే పరమపురుషపదార్థాన్ని చెప్తున్నట్లయితే, ఆఒకపదార్థం ఏది? వేరువేరుపదార్థాలని చెప్తున్నట్లయితే, ఒకదానికొకటి విరుద్ధమైన వేరువేరు పదార్థాలు పరమాత్మవస్తువు కాజాలవుగనుక, ఈమతాల్లో ఒకటే ప్రమాణంగా పర్యవసిస్తుందిగనుక, ఆఒకమతం ఏది?

సాంఖ్యం యోగః పంచరాత్రం వేదాః పాశుపతం తథా।
జ్ఞానాన్యేతాని రాజర్షే విద్ధి నానామతాని వై॥
సాంఖ్యస్య వక్తా కపిలః పరమర్షి స ఉచ్యతే।
హిరణ్యగర్భో యోగస్య వేత్తా నాన్యః పురాతనః॥
అపాన్తరతపా నామ వేదాచార్యః సఉచ్యతే।
ఉమాపతిర్భూతపతిః శ్రీకణ్ఠో బ్రహ్మణస్సుతః॥
ఉక్తవానిదమవ్యగ్రః జ్ఞానం పాశుపతం శివః।
పఞ్చరాత్రస్య కృత్స్నస్య వక్తా నారాయణః స్వయమ్॥ (మహా. భార. శాంతి. 359-64-67)

(హే రాజర్షీ! సాంఖ్యం, యోగం, పంచరాత్రం వేదం పాశుపతం అన్న ఇవి వేర్వేరు మతాలనే తెలుసుకో. సాంఖ్యాన్ని చెప్పినవారు కపిలులు. యోగాన్ని తెలియచెప్పినవారు (జీవులలో)చాలా ప్రాచీనులైన బ్రహ్మగారే. వేదానికి ఆచార్యులు అపాంతరతపస్ అనే మహర్షి. ఉమకి భర్తగా భూతాలకి నాయకుడై, శ్రీకంఠుడు అనబడేవారై, బ్రహ్మకి కుమారుడైన శివుడు పాశుపతమతాన్ని గమ్యంగా చెప్పేరు. నారాయణుడే పంచరాత్రంపూర్తిగా ఉపదేశించేరు.) అని చెప్పేరు వ్యాసులవారు. దీని అర్థం ఏమిటంటే, "ప్రతీ మనిషీ, చేసిన శాస్త్రాలు ఒకదానికొకటి విరుద్ధం అవడంవల్ల ఒకమనిషివల్లనూ రచింపబడనిద వడంవల్లనూ, అజ్ఞానం, మోహం, మరుపు లేనటువంటి వేదంలో చెప్పబడిన పరతత్త్వానికి విరుద్ధంగా పరతత్త్వాన్ని చెప్పడం వల్లనూ, అవి యథార్థంగా పరతత్త్వాన్ని తెలియపరచడంలో ప్రమాణాలుకాలేవు. వేదంలో తెలియబడే పరమాత్మవస్తువు నారాయణుడే. అందువలన సాంఖ్యమతంలో చెప్పబడిన ప్రధానంపురుషులు, పాశుపతాదుల్లో చెప్పబడిన పశుపతి మొదలైనవాళ్ళు వేదాంతంలో చెప్పబడిన నారాయణుడిని అంతర్యామిగా గ్రహించే ఒక వస్తువుగా అయినారు" అన్నదే అని తీసుకోవాలి. దీన్నే వెనుకచెప్పిన వాక్యాలప్రకారం "సర్వేషు చ నృపశ్రేష్ఠ జ్ఞానేష్వేదేషు దృశ్యతే। యథాగమం యథాన్యాయం నిష్ఠా నారాయణః ప్రభుః॥ (రాజశ్రేష్ఠుడా! వేదాన్నీ, న్యాయాలనీ అనుసరించి చూసినట్లైతే, ఈమతాలన్నింటిలోనూ నారాయణుడొక్కడే పరమాత్మవస్తువుగా చెప్పబడుతున్నాడు అని స్పష్టం అవుతోంది) అని వేదవ్యాసులవారు వివరించేరు. "సర్వం ఖల్విదం బ్రహ్మ"(ఛాం. 3-14-1)"విశ్వం నారాయణమ్"(తై. నా) అన్న వేదాంత వాక్యాలని సామాన్యవిశేషాది న్యాయాలతోటీ చూసినట్లైతే అబ్రహ్మాత్మకంగా ఆయాతంత్రాల్లో చెప్పబడిన తత్త్వాలు నారాయణాత్మకంగానే ఉన్నాయి అని స్పష్టం అవడంవల్ల సమస్తమతాల్లోనూ నారాయణుడే పరమాత్మవస్తువుగా ప్రకాశిస్తున్నాడని భావం.

అందువలన, వేదాంతవేద్యుడైన పరమాత్మయైన నారాయణుడు తానే పంచరాత్రం పూర్తిగా కటాక్షించేడు అని చెప్పడంవల్లా, ఆయనస్వరూపాన్నీ, ఆయనని ఉపాసించడమే ఆశాస్త్రం చెప్పడంవల్లా, అది ఇతరతంత్రాలతో సమమైనదని ఎవళ్ళూ చెప్పడానికి సాధ్యంగాదు. ఈకారణంవల్లనే,

"ఏవమేకం సాంఖ్యయోగం వేదారణ్యకమేవచ। పరస్పరాంగాన్యేతాని పంచరాత్రం తు కథ్యతే॥
(భార.శాంతి. 358-81)

(ఈవిధంగా సాంఖ్యం, యోగం, వేదం, ఆరణ్యకం అనేవి ఒకదానికొకటి అంగాలుగా ఉంటూ ఒకే తత్త్వాన్ని చెప్పడంవల్ల ఒకటే అయిఉన్నాయి. పంచరాత్రం ఒక్కటే వీటన్నిటిగానూ చెప్పబడుతోంది. ) అని ఈప్రకరణంలో వ్యాసులవారిచేత చెప్పబడింది. దీని భావం ఏమిటంటే, "సాంఖ్యమతంలో చెప్పబడిన ఇరవైయైదు తత్త్వాలనీ యోగమతంలో టెప్పబడిన యమనియమం మొదలైన అష్టాంగయోగాన్నీ వేదపూర్వభాగంలో చెప్పబడిన కర్మలనీ, అంగీకరించి, ఆతత్త్వాలు బ్రహ్మాత్మకమైనవని, ఆఅష్టాంగయోగం బ్రహ్మోపాసనమార్గంగా ఉన్నదనీ బ్రహ్మస్వరూపాన్ని చెప్పే వేదాంతభాగాలైన ఆరణ్యకాలు చెప్తున్నాయి. ఈవిషయం అంతా పరమాత్మవస్తువైన నారాయణుడు తనచేతపంచరాత్రం ఒక్కదానిలోనే స్పష్టపరచడం జరిగింది" అని. కనుక, సాంఖ్యం, యోగం, పాశుపతం, అన్నవి ఒక్కొక్క అంశంలో ప్రమామం అనీ, వేదవేదాంతాలు, పంచరాత్రం పూర్తిగానూ, ప్రమాణం అనిన్నీ. అందువల్లనే సాంఖ్యయోగపాశుపతపాంచరాత్రాలని పౌరుషేయత్వం -- కొన్ని అంశాలలోప్రమాణాలు కాకపోవడం మొదలైన కారణాలని చూపి పూర్తిగా వదిలివేయకూడదని వ్యాసులవారి అభిప్రాయంగా స్పష్టం అవుతోంది. "సాంఖ్యం యోగం.... న హన్తవ్యాని హేతుభిః" అన్న వచనం ఈభావాన్నికలిగినదే అని తెలుస్తోంది.

శారీరకంలోనూ, సాంఖ్యమతంలో చెప్పబడిన తత్త్వాలు అబ్రహ్మాత్మకంకావు అని చూపించబడిదే తప్ప ఆత్త్వాలు ఖండింపబడలేదు; యోగపాశుపతాల్లోకూడా, ఈశ్వరుడిని (ఉపాదానమై ఉండలేని) నిమిత్తకారణమాత్రం అని చెప్పడాన్నీ, జీవుడైన శివుడిని పరమాత్మవస్తువుగా చెప్పడం, పరమాత్మవస్తువైన నారాయణుడిని జీవుడుగా చెప్పడం, వేదానికి విరుద్ధమైన ఆచారాలని చెప్పడమున్నూ శారీరకం ఖండించిందితప్ప యోగస్వరూపాన్నిగాని పశుపతిస్వరూపాన్నిగాని ఖండించలేదు. కనుక, శ్రుతిన్యాయాలననుసరించి చూసినప్పుడు, వేదాన్ని ప్రమాణంగా గ్రహించే వీటన్నింటికీ నారాయణుడే చివరి పదార్థంగా (పరమాత్మవస్తువుగా) అవడంవల్ల సాంఖ్యయోగపాశుపతాలుకూడా ఒక్కొక్కఅంశంలో ప్రమాణాలే అవుతున్నాయి. వేదాన్ని ఖండించే బౌద్ధజైనాదులలా పూర్తిగా అప్రమాణాలు గావు. పాంచరాత్రంమాత్రం, పూర్తిగా వేదాన్ననుసరించి ఉండడంవల్ల పూర్తిగా ప్రమాణం అయింది." అని స్పష్టంగా నిల్చింది. సాంఖ్యయోగపాశుపతాలు కొన్ని అంశాల్లో అప్రమాణాలుగానూ ఉండడంవల్ల సూత్రకారులు వాటిని త్రోసిపుచ్చడం తగినదిగానే ఉన్నది. కనుక, పాంచరాత్రం పూర్తిగా ప్రమాణం అనే సూత్రకారుల హృదయం అవుతుంది.

శారీరకకారికావళి వివరణంలో
ఉత్పత్త్యసంభవాధికరణం పూర్తి అయినది.
రెండవ అధ్యాయంలో రెండవపాదం పూర్తి చెందినది.

శ్రీః

## అథ ద్వితీయాధ్యాయే తృతీయః పాదః

### ॥వియదధికరణమ్॥ (2-3-1)

*పూ.సూ. ॥న వియదశ్రుతేః॥ (2-3-1) (217)*

**వియత్:** ఆకాశము, **న:** ఉత్పత్తి అవడం లేదు. **అశ్రుతేః:** (ఉత్పత్తిని తెలియజేసే) శ్రుతి లేకపోవడంవల్ల).

*309. సాంఖ్యాది బాహ్యతన్త్రాణాం న్యాయాభాసాశ్రయత్వతః।*
*తథా విప్రతిషేధాచ్చాసాఙ్గత్యం పూర్వమీరితమ్॥*

*310. దోషాభావఖ్యాపనాయ నిజపక్షస్య సర్వథా।*
*బ్రహ్మకార్యతయేష్టస్య చిదచిత్సర్వ వస్తునః॥*

*311. తత్కార్యతాప్రకారోఽథ శోధ్యతే పాదయుగ్మతః ।*
*తత్రాదౌ వియదుత్పత్తిరాక్షిప్య స్థాప్యతే నయైః॥*

309-311. సాంఖ్యమతం, యోగమతం, న్యాయమతం, బౌద్ధమతం, జైనమతం, పాశుపతమతం అనే బాహ్యమతాలు యుక్తికి బాహ్యమైనవి కావడంచేతా, వ్యతిరేకించినవి కావడంవల్లా, కుదరనివి అని వెనుకటి పాదంలో చెప్పబడింది. తాము ఆదరించే వేదాంతమతంలో ఇటువంటి దోషాలు లేవు అని చూపడానికి ఈఅధ్యాయంలో ఇక వచ్చే రెండు పాదాలవల్లా సర్వజగత్కారణమైన బ్రహ్మయొక్క కార్యవస్తువుగా భావింపబడే సమస్త చేతనాచేతనవస్తువులూబ్రహ్మ్కి కార్యం అయే పద్ధతి విచారించ బడుతోంది. అందులో ఈమొదటి అధికరణంతో "ఆకాసం ఒక కార్యవస్తువుగా కానేరదు"అనే పూర్వపక్షం యుక్తులని చూపించి ఖండింపబడుతోంది.

పూ. *312. వియన్నోత్పద్యతే తస్యోత్పత్తేరశ్రవణాత్ శ్రుతౌ।*
*నిరంశస్యాత్మన ఇవ వియతస్తాదృశస్య హి॥*

*313. నోత్పత్తిశ్శక్యతే వక్తుం చ్ఛాన్దోగ్యోపనిషద్యతః।*
*"తత్తేజోఽసృజత"త్యేవ తేజఆదేః శ్రుతా జనిః॥*

*314. శ్రుతాన్యత్ర తదుత్పత్తిర్బాధ్యతేఽర్థవిరోధతః।*

312-*314. **పూర్వపక్షం:-** ఆకాశం దేనివల్లా సృష్టింపబడలేదు. శ్రుతిలో అటువంటి ఉత్పత్తి చెప్పబడడం మనకి కనబడలేదుగదా! పరిశీలించిచూస్తే, నిరవయవమైన ఆత్మకిలాగే నిరవయవమైన ఆకాశానికికూడా ఉత్పత్తి లేదుగనుక ఇలా అసంభావితమైన ఉత్పత్తిని శ్రుతికూడా ఆకాశానికి చెప్పడానికి వీల్లేదు. ఇలా ఆకాశానికి ఉత్పత్తి కుదరదుగనుకనే ఛాందోగ్యోపనిషత్తు "తదైక్షత బహుస్యామ్ ప్రజాయేయ" (6-2-3) (ఆబ్రహ్మం 'నేనే అనేకంగా అవుగాక, దానికోసం జన్మించుగాక' అని సంకల్పించింది) అని సృష్టిసంకల్పాన్ని చెప్పడంతో ఆకాశంనుంచి మొదలుబెట్టి, ఉత్పత్తిని చెప్పకుండా, తేజస్సునుంచి మొదలుబెట్టి ఉత్పత్తిని చెప్పింది. "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః (తై. ఆనం1)(అటువంటి ఈపరమాత్మనుండి ఆకాశం సృష్టించబడింది), "ఏతస్మాజ్జాయతే ప్రాణః మనః సర్వేన్ద్రియాణిచ। ఖం వాయుః జ్యోతిరాపః పృథివీ విశ్వస్య ధారిణీ"।(ముండ.2-1-3) (ఈపరమాత్మనుండి ప్రాణం, మనస్సు, సమస్తమైన ఇంద్రియాలూ, ఆకాశం, వాయువు, అగ్ని, జలం సమస్తాన్నీ ధరించే భూమి మొదలైనవి సృష్టింపబడ్డాయి) అని ఆకాశానికి కొన్ని వేదవాక్యాల్లో సృష్టి చెప్పబడింది. వెనుకచెప్పిన శ్రుతియుక్తుల ప్రకారం కుదరకపోవడంవల్ల, వేరువిధంగా నిర్వహించతగినది.

*సి.సూ. ॥ అస్తి తు ॥ (2-3-2) (218)*

**అస్తి తు:** ఆకాశానికి ఉత్పత్తి ఉన్నది.

*314* ఉత్పత్తిర్వియతోఽస్త్యేవా"ఽఽకాశస్సమ్భూత" ఇత్యతః।*

*315. మానాన్తరప్రతీతామప్యుత్పత్తి తస్య హి శ్రుతిః।*

*అతీన్ద్రియార్థవిషయా వక్తుం శక్తైవ సర్వథా॥*

*316. నిరంశద్రవ్యతా హ్యస్య నోత్పత్తిం వినివారయేత్।*

*అనుత్పత్తేరప్రయోజకత్వాత్తస్యాస్తథాత్మనః॥*

*317. నానుత్పత్తినిరంకుశత్వప్రయుక్తా కిన్తు సా శ్రుతేః।*

314*-*317. **సిద్ధాంతం:** "ఆత్మన ఆకాశః సంభూతః" (తై.ఆనం.-1) (పరమాత్మనుండి ఆకాశం సృష్టింపబడింది) అని శ్రుతి చెప్పడంవల్ల ఆకాశానికి సృష్టి ఉన్నదనే చెప్పుకోవాలి. ఇంద్రియాలకి తెలియనటువంటి అర్థాలని చెప్పడానికే ఏర్పడిన శ్రుతి, ఇతర ప్రమాణాలవల్ల తెలుసుకోబడని ఆకాశోత్పత్తికూడా అన్నివిధాలుగానూ బలమైన శక్తిగలదే అవుతుంది. అవయవాల్లేని ఆత్మకిలాగే అవయవాల్లేని ఆకాశానికికూడా సృష్టి కుదరదు అని చెప్పడం తగదు. అవయవాలులేకుండా ఉండడం అన్నది ఉత్పత్తిలేకుండా ఉండడానికి కారణంకాదు. ఆత్మ ఉత్పత్తిలేనిది అన్నది శ్రుతినుంచి మనం నిశ్చయిస్తున్నామే తప్ప అది అవయవాలులేనిది అన్నదానివల్ల అనుమానించలేదు. కనుక ఇలా ఆకాశం అవయవాల్లేకుండాఉండడంవల్ల మాత్రం సృష్టిలేనిది అని స్పష్టతలేకపోవడంవల్ల శ్రుతిననుసరించి ఆకాశానికి ఉత్పత్తి ఉన్నదనే తీసుకోవాలి.

*పూ.సూ. ॥ గౌణ్యసంభవాత్ శబ్దాచ్చ॥ (2-3-3) (219)*

**అసంభవాత్** - (అగ్నిని మొదట సృష్టించినట్లుగా చెప్పడం) కుదరదుగనుకనూ, **శబ్దాత్ చ** - (ఆకాశం నాశంలేనిది అనే) శ్రుతివల్లనూ, **గౌణీ** - (ఆకాశానికి సృష్టిని చెప్పే శ్రుతి) అముఖ్యమైనది.

*317* "తత్తేజోऽసృజత"త్యత్రోత్పత్తి స్తేజస ఏవ హి॥*

*318. ప్రథమం శ్రూయతే తస్మాత్ వ్యోమోత్పత్త్యుక్త్యసంభవాత్।*

*తైత్తిరీయశ్రుతిగౌణ్యా"ऽऽకాశస్సంభూత"ఇత్యసౌ॥*

*319. "వాయుశ్చే"తి శ్రుతౌ వ్యోమ్నోऽమృతత్వశ్రవణాత్తథా।*

317*-*319. **పూర్వపక్షం:** - *"తత్తేజోऽసృజత"* (ఛాం. 3-2-3) (ఆపరమాత్మవస్తువు తేజస్సును సృష్టించెను) అని పరమాత్మ లోకాన్ని సృష్టించేటప్పుడు మొదట అగ్నిని సృష్టించినట్లు చెప్పడంవల్ల, ఆకాశానికి ఉత్పత్తిని చెప్పడం ఈశ్రుతివాక్యానికి విరుద్ధం అవుతుంది. *"వాయుశ్చ అన్తరిక్షం చ ఏతదమృతమ్"* (బృహ.4-3-3) (వాయువు, ఆకాశము అనే రెండూ వినాశములేనివి) అనే శ్రుతి ఆకాశానికి నాశంలేదని అంటోంది. ఉత్పత్తి నాశం అనే రెండింటిలో ఏదో ఒకటుంటే, రెండోది ఉండేతీరాలి. ఒకటి లేదంటే రెండోదికూడా లేదనే అనుమాన సిద్ధం. కనుక, ఈశ్రుతివల్ల ఆకాశానికి ఉత్పత్తిని చెప్పడం అగ్నిని ముందర సృష్టించినట్లుగా చెప్పే శ్రుతితో వ్యతిరేకించడంవల్ల దానికి (ఉత్పత్తి) వినాశం లేవని శ్రుతే చెప్పడంవల్ల ఆకాశానికి ఉత్పత్తిని చెప్పేదిగా కనబడే శ్రుతివాక్యాన్ని ముఖ్యంగానిదిగానే గ్రహించాలి.

*పూ.సూ. ॥స్యాచ్చైకస్య బ్రహ్మశబ్దవత్ ॥ (2-3-4) (220)*

ఏకస్య-- (ఆకాశవిషయంలో అముఖ్యంగా ప్రయోగించబడిన '**సమ్భూతః**' అన్న శబ్దం) ఒక్కటికే, **స్యాత్**-- (అగ్ని మొదలైన విషయాల్లో అనుషంగం చేసేటప్పుడు ముఖ్యప్రయోగంకూడా) కావచ్చు. **బ్రహ్మశబ్దవత్** -- (ఒకే ప్రకరణంలో అముఖ్యంగానూ, ముఖ్యంగానూ ప్రయోగింపబడే) బ్రహ్మశబ్దంవలే.

*319* వ్యోమ్ని సమ్భూతశబ్దస్య ప్రయుక్తత్వేऽపి గౌణతః॥*

*320. అనుషక్తస్యోపరిష్టాత్ వాయోరిత్యాదికే స్థలే।*

*స్యాదేవ ముఖ్యతా బ్రహ్మశబ్దవత్, శబ్ద ఏష హి॥*

*321. గౌణవృత్త్యా ప్రధానేచ "తస్మాది"త్యత్ర పఠ్యతే।*
*ముఖ్యవృత్త్యా బ్రహ్మమిచ తత్రైవ 'తప సే'తి చ॥*

319*-321. **పూర్వపక్షం:** "ఆకాశః సమ్భూతః" (ఆకాశం సృష్టింపబడింది) అనే వాక్యంలో ఆకాశానికి ఉత్పత్తిని చెప్పే సంభూతశబ్దాన్ని గౌణంగా తీసుకోవాలి అంటే, మీద "వాయోరగ్నిః" (వాయువునుంచి అగ్ని (సృష్టింపబడింది)) మొదలైన వాక్యాల్లో ఆశబ్దాన్నే అనుషంగంచేసి అర్థం గ్రహించవలసినందువల్ల అగ్నికి ఉత్పత్తిని అంగీకరించినందువల్లా, అక్కడ సంభూతశబ్దాన్ని ఎలా ముఖ్యంగా గ్రహించడం? అంటే, ఒకశబ్దమే ఒకే ప్రకరణంలో ముఖ్యంగానూ, అముఖ్యంగానూ కూడా ప్రయోగించబడినట్లుగానే ఇక్కడ ఆకాశవిషయంలోకూడా అముఖ్యంగానే గ్రహించవలసిన సంభూతశబ్దాన్ని అగ్నివిషయంలో ముఖ్యంగా గ్రహించాలి. అలాంటి ప్రయోగం ఎక్కడ అంటే, *"తస్మాదేతత్ బ్రహ్మనామ రూపమన్నం చ జాయతే"* (ముణ్డక 1-1-10) (ఆపరమాత్మనుంచి బ్రహ్మంఅనబడే ఈప్రకృతి నామరూపాలతో కార్యవస్తుజాతంగా పుడుతోంది.) అని అముఖ్యమైనదిగా బ్రహ్మశబ్దం మూలప్రకృతినిగురించి ప్రయోగింపబడింది. అదే ప్రకరణంలో *"తపసా చీయతే బ్రహ్మ"*(ముండక 1-1-9) (బ్రహ్మం సంకల్పంతోకూడినదైనది) అని ముఖ్యమైనదిగా బ్రహ్మశబ్దం పరమాత్మనిగురించే ప్రయోగింపబడింది. అదేవిధంగా ఇక్కడకూడా సంభూతశబ్దం ఆకాశవిషయంలో అముఖ్యంగానూ, అగ్నివిషయంలో ముఖ్యంగానూ గ్రహించాలి.

*సి.సూ.॥ ప్రతిజ్ఞాఽహానిరవ్యతిరేకాత్ ॥ (2-3-5) (221)*

**ప్రతిజ్ఞాఽహానిః** -- (బ్రహ్మాన్ని తెలుసుకుంటే అన్నింటినీ తెలుసుకున్నట్టే అవుతుంది అనే)ప్రతిజ్ఞకి లోటులేకపోవడం, **అవ్యతిరేకాత్**-- (ఆకాశంకూడా, బ్రహ్మకార్యం కావడానికి అంగంగా బ్రహ్మంకంటే) భిన్నంకాకుండా ఉండడంవల్లనే అయింది.

*322. యేనాశ్రుతం శ్రుతమితి చ్ఛాన్దోగ్యే ప్రతిపాదితమ్।*
*వ్యోమాది సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞానం యదస్య చ॥*
*323. బ్రహ్మకార్యత్వేన తదవ్యతిరేకాద్విహాయసః।*
*భవత్యహానిస్తస్మాత్సా గౌణీ నోదాహృతా శ్రుతిః॥*

322-323. **సిద్ధాంతం:** *"తత్ తేజోఽసృజత"* (ఛాం. 3-2-3) (ఆపరమాత్మవస్తువు తేజస్సుని సృష్టించింది) అని పరమాత్మ లోకాన్ని సృష్టించేటప్పుడు ముందుగా అగ్నిని సృష్టించినట్లుగా చెప్పే ఛాందోగ్యవాక్యాన్ననుసరిస్తూ ఆకాశానికి ఉత్పత్తిని చెప్పే తైత్తిరీయవాక్యం మొదలైనవి గౌణంగా తీసుకోవాలని పూర్వపక్షంలో చెప్పినది కుదరదు. ఎందుచేతంటే, ఛాందోగ్యశ్రుతిలోనే ఆకాశానికి ఉత్పత్తిని అంగీకరించడం జరిగింది. ఎక్కడంటే, *"యేనాఽశ్రుతం శ్రుతం భవతి"* (ఛాం. 6-1-3)((మట్టిగడ్డని తెలుసుకున్నట్లైతే మట్టితో చెయ్యబడినవన్నింటినీ తెలుసుకున్నట్లే.) ఏబ్రహ్మాన్ని తెలుసుకుంటే (దాని కార్యమైన) తెలుసుకోబడనిదంతా తెలుసుకున్నదే అవుతుందో) అనే వాక్యంలో బ్రహ్మాన్ని తెలుసుకున్నట్లైతే దాని కార్యవస్తువైన ఆకాశం మొదలైన సమస్తం తెలుసుకోబడినదే ఔతుందని ప్రతిజ్ఞావాక్యం చెప్పింది. ఈప్రతిజ్ఞకి లోటులేకపోవడం - ఆకాశం బ్రహ్మకార్యం అవడానికి అంగంగా బ్రహ్మంకంటే భిన్నంకాని వస్తువుగా ఉంటేనే జరుగుతుంది. కనుక, ఈవిధంగా ఆకాశం బ్రహ్మకార్యంగా ఉండడం అనేది ఛాందోగ్యశ్రుతినుంచే సిద్ధిస్తోందిగనుక, ఆకాశానికి ఉత్పత్తిని చెప్పే తైత్తిరీయాదివాక్యం గౌణం కానేరదు.

*సి.సూ.॥ శబ్దేభ్యః॥ (2-3-6) (222)*

**శబ్దేభ్యః** -- (సృష్టికి ముందర బ్రహ్మం ఒక్కటే ఉన్నది అని చెప్పే) వేదశబ్దాలవల్లకూడా (ఆకాశానికి ఉత్పత్తి ఉండెను అని స్పష్టం అవుతోంది).

*324. పరాత్మైకత్వావధృతివాదిభ్యః ప్రళయేపి చ।*
*"సదేవే"త్యాదిశబ్దేభ్యోఽవగతా వియతే జనిః॥*

*325. "తత్తేజ"ఇత్యత్ర తేజస్సృష్టిమాత్రం ప్రకాశితమ్।*
*నతు ప్రథమసృష్టత్వం తస్మాత్తస్య జనిః స్థిరా॥*

324-325. **సిద్ధాంతం:** ఛాందోగ్యోపనిషత్తులో ఇంకా కొన్ని వాక్యాలవల్లకూడా ాకాశానికి ఉత్పత్తి ఉన్నదని స్పష్టం అవుతోంది. - "***సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్ ఏకమేవ అద్వితీయమ్***"(ఛాం. 6-2-1) (అబ్బాయి! ఈలోకం మొదట సత్ అనబడే బ్రహ్మంగానే ఉండెను. ఒక్కటిగానే ఉండెను, రెండవది లేకనే ఉండెను.) మొదలైన వాక్యాల్లో సృష్టికి ముందర ప్రళయకాలంలో బ్రహ్మం ఒక్కటే ఉన్నదని చెప్పడంవల్ల ాకాశంకూడా తర్వాత సృష్టింపబడింది అని స్పష్టం అవుతోంది. "***ఐతదాత్మ్యమిదం సర్వం*** (ఛాం. 6-8-7) (ఈలోకం అంతా బ్రహ్మాత్మకంగానే ఉన్నది) మొదలైన వాక్యాల్లో ఆకాశం మొదలైన సమస్తం బ్రహ్మకార్యమై ఉండడానికి అంగంగా బ్రహ్మాత్మకమైనవి అని చెప్పబడింది. ఇందువల్లకూడా ఆకాశానికి ఉత్పత్తి ఉన్నదని స్పష్టం అవుతోంది. కనుక "***తత్ తేజోఽసృజత***" (ఛాం. 3-2-3) (ఆపరమాత్మవస్తువు తేజస్సుని సృష్టించింది) అనే వాక్యం తేజస్సుని పరమాత్మవస్తువు సృష్టించినట్లుగా మాత్రమే చెప్తోంది. మొదట సృష్టించినది అని చెప్పలేదనే గ్రహించాలి. కనుక, ఈవాక్యం, మిగతావాక్యాల్లో చెప్పబడే ఆకాశానికి ఉత్పత్తిని అడ్డుకోగలిగినదిగాదు. కనుక, ఆకాశానికి ఉత్పత్తి కదల్చలేనిదే అయింది.

*సి.సూ.॥ యావద్వికారం తు విభాగో లోకవత్ ॥ (2-3-7) (223)*

**యావత్ వికారం తు** -- (ఆకాశం మొదలైన) సమస్త కార్యవస్తువులకీ, **విభాగః**-- ఉత్పత్తి(శ్రుతిలో చెప్పబడే ఉన్నది) **లోకవత్**-- (తేజస్సు మొదలైన కొన్నింటిని సూచించి చెప్పినది) లోకంలోలాగే.

*326. "ఐతదాత్మ్య"మితి శ్రుత్యా వ్యోమాదేరఖిలస్యచ।*
*బ్రహ్మకార్యత్వవచనాత్ వికారాణాం హి యావతామ్॥*

*327. ఉత్పత్తిరుక్తప్రాయైవ దేవదత్తసుతా ఇమే।*
*ఇత్యుక్త్వా తేషు కేషాఞ్చిత్ ఉత్పత్తివచనే యథా॥*

**328 వ్యోమ్నోఽమృతత్వోక్తిరపి చిరస్థాయిత్వసూచికా।*

326-*328--**సిద్ధాంతం.** "***ఐతదాత్మ్యమిదం సర్వం*** (ఛాం. 6-8-7) (ఈలోకం అంతా బ్రహ్మాత్మకంగా ఉన్నది) అనే వాక్యంలో ఆకాశం మొదలైనవన్నీ వికారాలుగానే (కార్యవస్తువులుగానే) బ్రహ్మాత్మకం అని చెప్పడంద్వారా, బ్రహ్మకార్యం అని చెప్పబడి ఉండడంవల్ల, వాటికి విభాగం అనబడే ఉత్పత్తిని చెప్పినట్లే అవుతుంది. తత్తేజోఽసృజత అని తేజస్సు మొదలైన కొన్నింటి ఉత్పత్తినిమాత్రమే సూచించి చెప్పడం లోకదృష్టాంతంతో నిర్వహించడం అయింది. అంటే - లోకంలో "***ఏతే సర్వే దేవదత్త పుత్రాః***" (వీళ్ళందరూ దేవదత్తుని కుమారులు) అని చెప్పి, ప్రాధాన్యతతో కొంతమంది ఉత్పత్తిని మాత్రం వివరిస్తే దానివల్ల మిగతావాళ్ళకి ఉత్పత్తిలేదని ఎలా తెలియదో, అదేవిధంగా, ఇక్కడ ఆకాశం మొదలైనసమస్తాన్నీ బ్రహ్మకార్యంగా చూపించి, కంటికి తెలియడం మొదలైన కొన్ని ప్రాధాన్యాలతో తేజస్సు మొదలైన కొన్నింటి ఉత్పత్తిని వివరించబడింది అనే గ్రహించాలిగనక, ఆకాశానికి ఉత్పత్తి లేదు అని దీన్నించి

చెప్పడానికి వీలులేదు. *"వాయుశ్చ అన్తరిక్షం చ ఏతదమృతమ్"* (బృహ.4-3-3) (వాయువు, ఆకాశము అనే రెండూ వినాశములేనివి) అనే శ్రుతి ఆకాశాన్ని అమృతం అనడం, అమరులు అనబడే దేవతలలాగే ఇదికూడా (ఇతరభూతాలకి ముందర పుట్టి తర్వాత నశించడంద్వారా) చాలకాలం ఉన్నది అని చెప్పడానికే తప్ప దీనికి నాశమే లేదని చూపడానికి కాదు.

### సి.సూ.॥ ఏతేన మాతరిశ్వా వ్యాఖ్యాతః॥ (2-3-8) (224)

**ఏతేన**--దీనివల్ల, **మాతరిశ్వా**--గాలికూడా(ఉత్పత్తి గలదని) **వ్యాఖ్యాతః**-- వివరించబడింది.

*328* న్యాయేనైతేనైవ వాయోరప్యుత్పత్తిశ్చ భాషితా॥*

*329. ఉత్తరాధికృతౌ వాయోః పరామర్శప్రయోజనా।*
*వాయోరత్ర పృథగ్యోగకృతిర్నైవాతిదేశనమ్॥*

328*-329. **సిద్ధాంతం**-- ఇంతవరకూ ఆకాశానికి చెప్పిన న్యాయంతోటే, వాయువుకూడా ఉత్పత్తిని గలది అని చెప్పబడిందైంది. వాయువిషయంలో అధికమైన ఆశంకలేకుండాఉండగా, అర్థసిద్ధమైన ఈవిషయాన్ని తెలపడానికి ఒక అతిదేశసూత్రం అవసరమా అంటే, తరువాతి అధికరణంలో తేజోఽతః అనే మొదటిసూత్రంలో అతఃశబ్దంవల్ల వాయువుని ఎత్తుకోవలసిరావడంతో ిక్కడ వేరే సూత్రంతో దాన్ని ప్రస్తావించలేదేతప్ప ఇది అతిదేశసూత్రంగాదు.

### సి.సూ.॥ అసంభవస్తు సతోఽనుపపత్తేః ॥ (2-3-9) (225)

**అసంభవః**-- ఉత్పత్తిలేకపోవడం, **సతః తు**-- బ్రహ్మానికే (కుదురుతుంది, బ్రహ్మకార్యవస్తువైన దేనికీ కుదరదు.) **అనుపపత్తేః**-- (అలా తీసుకుంటే, "బ్రహ్మాన్ని తెలుసుకుంటే, అంతా తెలిసినదే అవుతుంది'అనే ప్రతిజ్ఞ) కుదరనిది అవుతుందిగనుక.

*330. పరస్య బ్రహ్మణస్సర్వకారణస్యైవ సర్వథా।*
*ఉత్పత్త్యసంభవో యుక్తస్తదన్యస్యాఖిలస్య చ॥*

*331. ఏకజ్ఞానాధీనసర్వవిజ్ఞానానుపపత్తితః।*
*విజ్ఞాతకార్యభావస్యానుత్పత్తిర్నైవ సంభవేత్॥*

*॥ఇతి వియదధికరణమ్॥*

330-331. **సిద్ధాంతం:** సర్వకారణుడైసచ్ఛబ్దవాచ్యుడైన పరమాత్మకే అన్నివిధాలుగానూ (స్వరూపంవల్ల) ఉత్పత్తి లేకపోవడం కుదురుతుంది. మిగతాసమస్తపదార్థాలకీ - "ఒకటైన అతనిని తెలుసుకుంటే సమస్తం తెలియబడినదే అవుతుంది" అని శ్రుతిచెప్పినదాన్నించి కార్యవస్తువైఉండే స్వభావం తెలియబడేదౌతోందికనుక -- ఉత్పత్తిరాహిత్యం ఏవిదంగానూ కుదరదు.

కనుక, ఇంతవరకూ విచారించినదానివల్ల బ్రహ్మం ఆకాశంమొదలైన అచేతనపదార్థాలన్నింటికీ కారణవస్తువుగా ఉన్నదని నిర్ణయింపబడినదైంది.

వియదధికరణం పూర్తి అయినది.

## ॥తేజోఽధికరణమ్॥ (2-3-2)

### పూ.సూ.॥ తేజోఽతస్తథా హ్యాహ॥ (2-3-10) (226)

**తేజః**--అగ్ని తత్త్వం అనేది, **అతః**-- ముందరి వాయువులోంచే(సృష్టింపబడింది) **తథా ఆహ హి**-- (శ్రుతి) అలాగే చెప్పిందిగదా!

*332. సర్వస్య బ్రహ్మకార్యత్వాత్ జగత్కారణతా పురా।*

*పరస్యోక్తా, న సాక్షాత్సా ద్వారేణేత్యేతదస్యతే॥*

332. సమస్త అచేతనపదార్థాలూ బ్రహ్మానికి కార్యమై ఉన్నాయిగనుక, పరమాత్మ జగత్కారణమైంది అని వెనుకటి అధికరణంలో చెప్పడం జరిగింది. సమస్తపదార్థాలకీ బ్రహ్మం ప్రత్యక్షంగా కారణం అయిందా, లేక ముత్తాత తాతకి ప్రత్యక్షంగా కారణమై తండ్రికీ, తనకీ (క్రమంగా) తాతగారి ద్వారా, తండ్రిగారిద్వారాను పరంపరయా కారణం అయినట్లుగా బ్రహ్మంకూడా వ్యవహితకార్యవస్తువులకి ముందరి కారణవస్తువులమూలంగా పరంపరయా కారణం అయిందా అనే విచారం లేవడంతో తేజస్సు మొదలైన అటువంటి పదార్థాలకి బ్రహ్మం ప్రత్యక్షంగా కారణంకాలేదు, వాయువు మొదలైన ముందరి కారణ వస్తువులద్వారా పరంపరాకారణంగానే అయింది అనే పూర్వపక్షాన్ని ఖండించి అలాంటివిషయాల్లోకూడా ఆయాకారణవస్తువులని శరీరంగా గ్రహించి బ్రహ్మం ప్రత్యక్షంగా కారణంగా అయింది అని ఈ అధికరణంలో సిద్ధాంతీకరించబడుతోంది.

*333. అస్మాద్వాయోః కేవలాద్వై తేజ ఉత్పద్యతే తథా।*
*తైత్తిరీయశ్రుతి "ర్వాయోరగ్ని "రిత్యేవ వక్తి హి॥*

**333.-- పూర్వపక్షం.** మొదట తేజస్ అనబడే అగ్నితత్త్వాన్ని తీసుకుంటే, అది దానికి ముందరి వాయు అనబడే గాలినుండే సృష్టింపబడిందే తప్ప బ్రహ్మనుండి తిన్నగా సృష్టింపబడలేదు. ఎంచేతంటే, *"వాయోరగ్నిః"* (తై- ఆనం. 1-2) (వాయువునుంచి అగ్ని సృష్టింపబడింది) అనిగదా శ్రుతి చెప్తోంది. కనుక ఇలా శ్రుతి చెప్పడంవల్ల బ్రహ్మనుంచి పరంపరగా పుట్టిన వాయువునుండే అగ్ని సృష్టింపబడింది అని తీసుకోవాలే తప్ప బ్రహ్మంనుంచి తిన్నగా అగ్ని పుట్టిందని చెప్పడానికి వీలులేదు.

*పూ.సూ.॥ ఆపః ॥ (2-3-11) (227)*

**ఆపః**--జలతత్త్వంకూడా, (**అతః**-- ముందరి అగ్ని తత్త్వంనుంచే (సృష్టింపబడింది) **తథా ఆహ హి**-- (శ్రుతి) అలాగే చెప్తోందిగదా)

*334. ఆపోఽపి తేజశ్చాతః ఉత్పద్యన్తే తథా శ్రుతిః।*
*"తదపోఽసృజతే"త్య "గ్నేరాప " ఇత్యాదికాఽఽహ హి॥*

334. **పూర్వపక్షం--** తరువాతిదిగా అప్-లైన జలతత్త్వాన్ని ఎత్తుకున్నట్లైతే, అదికూడా దానికి ముందరిదైన అగ్నినుండే సృష్టింపబడినదేతప్ప బ్రహ్మనుంచి తిన్నగా సృష్టింపబడలేదు. ఎందువల్లంటే, "తదపోఽసృజత" (ఛాం. 6-2-3) (అగ్ని జలములను సృష్టించినది) "అగ్నేరాపః" (తై. ఆనం. 1-2) (అగ్నినుండి జలములు సృష్టింపబడినవి) అనిగదా శ్రుతి చెప్పింది.

*పు.సూ. ॥ పృథివీ ॥ (2-3-12) (228)*

**పృథివీ**-- పృథ్వి తత్త్వంకూడా. (**అతః**-- ముందరి జలతత్త్వంనుంచే (సృష్టింపబడింది) **తథా ఆహ హి**-- (శ్రుతి) అలాగే చెప్పిందిగదా)

*335. అద్భ్య ఉత్పద్యతే పృథ్వీ తథైవ శ్రుతిరాహ హి।*
*"తా అన్నమసృజన్తే"తి తథా"ఽద్భ్యః పృథివీ"తి చ॥*

***335.*** **పూర్వపక్షం--** తరువాతిదిగా పృథివి అనబడే తత్త్వాన్ని ఎత్తుకుంటే, అదికూడా దానికి ముందరి జలతత్త్వంనుంచే సృష్టింపబడిందేతప్ప బ్రహ్మనుంచి తిన్నగా సృష్టింపబడలేదు. ఎంచేతంటే, "తా అన్నమసృజన్త" (ఛాం. 6-2-4) (అప్పులు(జలములు) అన్నం అనబడే మట్టిని సృష్టించేయి) "అద్భ్యః పృథివీ"(తై. ఆనం. 1-2) (జలతత్త్వంనుంచి పృథివీతత్త్వం సృష్టింపబడింది) అనిగదా శ్రుతి

చెప్తోంది.

### పూ.సూ.॥ అధికారరూపశబ్దాన్తరేభ్యః ॥ (2-3-13) (229)

***అధికార రూప శబ్దాంతరేభ్యః*** -- (పంచభూతసృష్టిని) ప్రస్తావించినందువల్లనూ, (అన్నానికి నల్లదనం) రూపాన్ని చెప్పడంవల్లనూ, మరో శ్రుతి వాక్యంవల్లకూడా (పృథ్వియే అన్నం అనబడుతోంది అని తెలుస్తోంది).

*336. భూతసృష్ట్యాధికారాద్ధి పృథివ్యేవాన్నశబ్దతః।*
*ఉక్తేతి జ్ఞాయతేఽత్రాదనీయస్య నిఖిలస్య చ॥*
*337. పృథ్వీవికారత్వాద్ధేతౌ కార్యశబ్దః ప్రయుజ్యతే।*
*వాక్యశేషే చ భూతానాం రూపసంశబ్దనే తథా॥*
*338. అప్తేజోభ్యాం సహోక్త్యైవ "తదన్నస్యే"తి చ శ్రుతౌ।*
*స్పష్టం ప్రతీయతే హ్యన్నశబ్దవాచ్యా మహీతి చ॥*
*339. శబ్దాన్తరం ప్రకరణే తుల్యేఽ"ద్భ్యఃపృథివీ"తి చ।*
*తస్మాత్పృథ్వ్యేవాన్నశబ్దవాచ్యేతి జ్ఞాయతే దృఢమ్॥*
*340. "ఏతస్మాజ్జాయతే ప్రాణః" ఇత్యాద్యాః బ్రహ్మణస్తతః।*
*పారంపర్యేణ హేతుత్వేప్యుపపద్యన్త ఏవ హి॥*

336-340. పూర్వపక్షం:- "తా అన్నమసృజన్త" (ఛాం. 6-2-4)అనే ఛాందోగ్యశ్రుతిప్రకరణంలో కంటికి కనబడే మూడు మహాభూతాల సృష్టిని చెప్పప్రారంభించి ***"తత్ తేజోఽసృజత"*** (ఛాం. 3-2-3) "తదపోఽసృజత" (ఛాం. 6-2-3) అని అగ్ని, జలం మొదలైన మహాభూతాలసృష్టినిగురించి అధికారం (ప్రస్తావం) ఉండడంచేత జలాలు అన్నాన్ని సృష్టించేయి అన్నప్పుడు, అన్నశబ్దంచేత తరువాతి మహాభూతమైన పృథివియే చెప్పబడుతోంది అని స్పష్టం అవుతోంది. ***"అద్యత ఇత్యన్నమ్"*** (తినబడేదిగనుక, 'అన్నమ్' అనబడుతోంది) అనే వ్యుత్పత్తివల్ల తినబడే పదార్థాన్ని సూచించే అన్నశబ్దం పృథివిని ఎలా సూచిస్తోంది? అంటే, తినబడే అన్నం పూర్తిగా పృథివివికారమే అవడంచేత కార్యాన్ని చెప్పే అన్నశబ్దంచేత కారణమైన పృథివిని సూచిస్తోంది అని గ్రహించాలి. పైగా, "/యదగ్నేః రోహితం రూపం తేజస స్తద్రూపం; యచ్ఛుక్లం తదపామ్ ; యత్ కృష్ణం తదన్నస్య" (ఛాం. 6-4-1)(మండే నిప్పులో కనబడే ఎర్రదనం తేజస్సురంగు. తెల్లరంగు జలములది, నల్లరంగు అన్నం అనబడే పృథివిది.) అని పంచీకరణప్రక్రియవల్ల అగ్నిలో ఉన్న ఆయాభూతాల రంగును చూపించే వాక్యశేషంలో నల్లరంగుని అన్నపు రంగుగా చూపడం చేతనూ, అన్నం అనబడేది పృథివియే అని స్పష్టం అవుతోంది. ఎందుచేతనంటే, తినబడే అన్నపు రంగు ఎప్పుడూ నల్లగా ఉంటుందని కనబడకపోవడంచేత ఆఅన్నపు కారణమైన సమష్టిపృథివీతత్త్వం రంగు నలుపు అని శాస్త్రాల్లో చెప్పబడడంవల్ల కారణమైన అదే కార్యాన్ని చెప్పే అన్నశబ్దంవల్ల చెప్పబడుతోంది అని స్పష్టం అవుతోంది. ఇక్కడకూడా మొదట అగ్నివర్ణాన్నీ, తర్వాత జలాలరంగునీ చెప్పిన ఆతర్వాత చూపబడే రంగు పృథివిదిగానే ఉండాలిగనుక అన్నం పృథివియే అని స్పష్టం అవుతోంది. తైత్తిరీయ ఆనందవల్లిలో ఇలాగే భూతసృష్టిని చెప్పే ప్రకరణంలో "అగ్నేరాపః అద్భ్యః పృథివీ' (తై. ఆనం. 1-2) (అగ్నినించి జలం, జలాలనుంచి పృథివి (సృష్టింపబడుతున్నాయి)) అనే శబ్దాంతర(వేరు శ్రుతివాక్య)మన్నది జలాలనుంచి అవతరించినది పృథివియే అని చెప్పడంనించి ఇక్కడ నీటినించి వచ్చినదిగా చూపబడే అన్నం పృథివియే అని స్పష్టం అవుతోంది. కనుక, అధికారం(ప్రస్తావం) రూపం(రంగు), శబ్దాన్తరం(వేరు శ్రుతివాక్యం) ్నే

మూడింటినించీ పృథివే అన్నశబ్దంవల్ల చెప్పబడుతోంది అని నిశ్చయంగా స్పష్టం అవుతోంది.

*ఏతస్మా జ్జాయతేప్రాణః మనః సర్వేన్ద్రియాణిచ।*

*ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్య ధారిణీ॥*

***(ఈపరమాత్మవస్తువునుండి ప్రాణం, మనస్సు, సమస్త ఇంద్రియాలు, ఆకాశం, వాయువు, అగ్ని,నీరు, సమస్తాన్నీ ధరించేటటువంటి పృథివి అనబడే పంచభూతాలూ, సృష్టింపబడ్డాయి) అని*** పరమాత్మనుంచి ఈభూతాలన్నీ సృష్టింపబడినట్లుగా మరో శ్రుతివాక్యం చెప్పడం -ముత్తాతదగ్గరనుంచి మనం పుట్టినట్లుగానే ఆభూతాలుకూడా బ్రహ్మంనుండే పరంపరగా సృష్టింపబడుతున్నాయని చెప్పినదాన్నిబట్టి అని నిర్వహించవచ్చుగనుక ఎటువంటి విరోధమూ లేదు. ***కనుక*** అగ్ని, నీరు, భూమి అనబడే భూతాలకి కూడా, వీటివల్ల ఉపలక్షింపబడిన "మహత్తు" మొదలైన కార్యవస్తువులకిగూడా బ్రహ్మం పరంపరాకారణం అయిందేతప్ప తిన్నగా కారణం కాలేదు అని తేలిపోయింది.

*సి.సూ.॥ తదభిధ్యానాదేవ తు తల్లిఙ్గాత్సః ॥ (2-3-14) (230)*

**తదభిధ్యానాత్ తు --** తానే అనేకంగా అవాలని సంకల్పించడం అనే పరమాత్మకిచెందిన చిహ్నంవల్లనే, **సః--** (తరువాత సృష్టింపబడే మహత్తు మొదలైన కార్యవస్తువులకికూడా తిన్నగా కారణమైనవాడు) పరమాత్మయే.

***341.*** *కార్యాణాం మహదాదీనాం తత్తద్వస్తుశరీరకః।*
*కారణం పరమాత్మైవ తదభిధ్యానలిఙ్గతః॥*

***342.*** *"బహుస్యామి"తి సంకల్పరూపేక్షాపూర్వికైవ హి।*
*తత్కార్యసృష్టిస్సర్వత్ర శ్రూయతే తాదృగీక్షణమ్॥*

***343.*** *తత్తచ్ఛరీరకస్యాస్య పరస్యైవోపపద్యతే।*
*"యః పృథివ్యాం, యోఽప్సు తిష్ఠన్" ఇత్యాదౌహి పృథక్పృథక్॥*

***344.*** *తత్తచ్ఛరీరకత్వేన తత్తదాత్మత్వమస్య చ।*
*అన్తర్యామిబ్రాహ్మణే హి శ్రూయతే పరమాత్మనః॥*

341-344. **సిద్ధాంతం:** మహత్ మొదలైన తరువాత సృష్టింపబడిన కార్యపదార్థాలకీ పరమాత్మ తిన్నని కారణం అయినాడే తప్ప, ముత్తాత మనకి కారణం అయినట్లుగా పరంపరాకారణంకాదు. తానే అనేకంగా కావాలని సంకల్పించడం అనే పరమాత్మకే చెందిన చిహ్నంవల్ల దీన్ని మనం తెలుసుకోవచ్చు. ఎలా అంటే, "తత్ తేజ ఐక్షత, బహుస్యాం ప్రజాయేయేతి ... తా ఆప ఐక్షత, బహ్వ్యః స్యామ్, ప్రజాయేమహి" ((ఛాం. 6-2-3,4) ( నేను అనేకముగా అగుదునుగాక, అందుకొఅకు జన్మించెదనుగాక... అని ఆతేజస్సు సంకల్పించెను. ... మేము అనేకములుగా అగుగాక, అందుకొరకు జన్మింతుముగాక అని ఆజలములు సంకల్పించినవి) అని తేజస్సు మొదలైనవి తామే అనేకాలుగాఅవాలని సంకల్పించినట్లుగా శ్రుతి చెప్తోంది. ఈసంకల్పం మహత్తు మొదలైనవాటికి కూడా ఉన్నదని గ్రహించాలి. అచేతనపదార్థాలకి ఇలాంటిసంకల్పం కుదరదుగనుక, ముందరి కారణపదార్థాలని శరీరంగా గలిగిన పరమాత్మే ఇలా సంకల్పించి ప్రతీ కార్యవస్తువునీ ప్రత్యక్షంగా సృష్టించేడనే ఈవాక్యానికి అర్థంచెప్పుకోవాలి. ఇలా పరమాత్మ సమసత్పదార్థాలనీ శరీరంగా గ్రహించి ఉన్నాడు అనడానికి ప్రమాణం ఉన్నదా? అంటే, ***"యః పృథివ్యాం తిష్ఠన్ ... యోప్సు తిష్ఠన్.... యస్తేజసి తిష్ఠన్... యో వాయౌ తిష్ఠన్... య ఆకాశే తిష్ఠన్"***అని అంతర్యామి బ్రాహ్మణంలో సర్వేశ్వరుడు పంచభూతాలనీ శరీరంగాతీసుకుని ప్రతీదాంట్లోనూ అంతర్యామిగా

ఉన్నాడు, అని చెప్పబడుతోంది. సుబాలోపనిషత్తులో *"యస్య పృథివీ శరీరం"*అని మొదలుపెట్టి సమస్త కార్యపదార్థాలూ పరమాత్మకి శరీరం అని ఘోషించబడింది. కనుక, ముందరి కారణవస్తువులని శరీరంగా గలిగిన పరమాత్మ నుంచి ప్రతీ కార్యవస్తువూ ప్రత్యక్షంగా పరమాత్మనుండే సృష్టించబడింది అని తేరుతోంది.

### *సి.సూ. ॥ విపర్యయేణ తు క్రమోఽత ఉపపద్యతే చ॥ (2-3-15) (231)*

**విపర్యయేణ--** ("ఏతస్మాజ్జాయతే ప్రాణః" అని మొదలయ్యే వేదవాక్యంలో -- వాక్యాంతరాల్లో అవ్యక్తం, మహత్తు, అహంకారం, ఆకాశం అని పరంపరగా సృష్టింపబడ్డాయని చెప్పిన క్రమానికి) వ్యతిరేకంగా, **క్రమః చ--** (బ్రహ్మంనుంచి సమస్తం ప్రత్యక్షంగా సృష్టింపబడ్డాయి అని చెప్పబడే) క్రమమూ, **అతః తు--** తర్వాతి తత్త్వాలని శరీరంగా గల బ్రహ్మంనుంచే ప్రత్యక్షంగా సృష్టింపబడ్డాయని తీసుకుంటేనే **ఉపపద్యతే--** కుదురుతుంది.

***345.*** *"ఆకాశాద్వాయు"రిత్యాది పారంపర్యక్రమాదతః।*
*విపర్యయేణ సర్వేషాం బ్రహ్మవ్యవహితక్రమః॥*

***346.*** *"ఏతస్మాజ్జాయతే ప్రాణః" ఇత్యాదిభిరుదాహృతః।*
*తత్తద్రూపాత్ బ్రహ్మణోఽతః సృష్టేరేవోపపద్యతే॥*

345-346. **సిద్ధాంతం:** పూర్వపక్షంలో *'ఏతస్మాజ్జాయతే ప్రాణః"* అని భూతాలుకూడా పరమాత్మ నుంచి సృష్టింపబడ్డాయని చెప్పడం --ఆభూతాలుకూడా బ్రహ్మంనుంచి పరంపరగా సృష్టింపబడ్డవిగా చెప్పినట్లే అని నిర్వహిద్దాం అని చెప్పినది కుదరదు. ఎందుకంటే, ఇతరవేదవాక్యాల్లో చూపించబడే -- అవ్యక్తం, మహత్తు, అహంకారం, ఆకాశం అనే పరంపరాక్రమానికి వ్యతిరేకంగా ప్రాణం, మనస్సు, సమస్త ఇంద్రియాలూ పంచభూతాలూ అనబడే ఒక్కొక్కటీ బ్రహ్మంనుంచి ప్రత్యక్షంగా సృష్టింపబడినట్లుగా ఈమంత్రంలో చెప్పబడడం, వెనక చెప్పిన ముందరి తత్త్వాన్ని శరీరంగాగల బ్రహ్మనుండే ప్రత్యక్షంగా ప్రతీ తత్త్వంకూడా సృష్టింపబడిందని తీసుకుంటేనే కుదురుతుంది. కనుక, వెనక చెప్పిన పూర్వపక్షం సమంజసం కాలేదు.

### *సి.సూ.॥ అన్తరా విజ్ఞానమనసీ క్రమేణ తల్లిఙ్గాదితి చేన్నావిశేషాత్ ॥ (2-3-16) (232)*

**అన్తరా--**(భూతప్రాణాలకి) మధ్యను, **విజ్ఞానమనసీ--** ఇంద్రియాలూ, మనస్సు, **క్రమేణ--** వరుసగా, (సృష్టింపబడ్డాయి) **తల్లింగాత్--**పంచభూతాలూ వరసగా సృష్టింపబడడాన్ని చూపించిన చిహ్నాలుండడంవల్ల **ఇతి చేత్--** అనినట్లైతే, **న--**ఇది కుదరదు. **అవిశేషాత్--**("ఏతస్మాజ్జాయతే"అనే పదాలు, "ప్రాణః" మొదలైన ఒక్కొక్క పదంతోనూ అన్వయించడంలో) తేడా లేకపోవడంవల్ల.

***347.*** *మధ్యే భూతప్రాణయోశ్చేన్ద్రియౌఘమనసీ క్రమాత్।*
*ఉత్పద్యేతే ఈదృశార్థపరం పూర్వముదాహృతమ్॥*

***348.*** *'ఏతస్మా"దిత్యాదివాక్యం "ఖం వాయు"రితిలిఙ్గతః।*

***347-*348*** -- పూర్వపక్షం: **వెనకచెప్పిన పూర్వపక్షం** కుదురుతుంది. ఎలా అంటే, "ఏతస్మాత్"అని మొదలయ్యే మంత్రం, అన్ని తత్త్వాలూ పరమాత్మనుంచి ప్రత్యక్షంగా పుట్టినవే అని చెప్పడంకోసం వచ్చినవిగావు. *"ప్రాణః మనః సర్వేన్ద్రియాణి , ఖం వాయుః ..."* అని ప్రాణానికీ, పంచభూతాలకీ మధ్య మనస్సు, జ్ఞానానికి సాధనం కావడంవల్లవిజ్ఞానం అనతగిన సమస్త ఇంద్రియాలూ పుట్టేయి అనే క్రమాన్ని (వరసని) చూపించడానికే వచ్చినవి. *'ఖం వాయుః జ్యోతిః ఆపః పృథివీ"* అన్న క్రమంలో వేరే శ్రుతుల్లో

చూపబడిన పంచభూతోత్పత్తి క్రమం ఇక్కడకూడా చూపబడడం చూస్తున్నాం. ఈగుర్తులవల్లనే ఇదివరలో చెప్పబడ్డ ప్రాణం మనస్సు, ఇంద్రియాలనేవి పంచభూతాలకి ముందరిక్రమంగా సృష్టింపబడ్డాయని తెలుస్తోంది. ఇది చూపించడానికే ఈశ్రుతి వచ్చింది అని స్పష్టం అవుతోంది. అంచేత ఇలా తత్త్వాల ముందువెనకల వరసని చూపడంకోసమే ఈవాక్యం ఏర్పడ్డదని స్పష్టంగనుక, "ఏతస్మాత్' అని చెప్పబడిన బ్రహ్మంనుంచే ప్రతీ తత్త్వమున్నూ ప్రత్యక్షంగా సృష్టింపబడ్డాయని చూపడానికి ఉన్నదికాదని స్పష్టం అవుతోంది. కనుక, బ్రహ్మనుండి ఇవన్నీ సృష్టింపబడ్డాయని చెప్పడం మిగతావాక్యాల్లో చెప్పినట్లుగా పరంపరయా సృష్టినిచూపించడమే అని నిర్వాహం చెయ్యాలి.

*348* అతః పారంపర్యపరమేవేదమితి చేన్న తత్॥*

*349. "ఏతస్మాజ్జాయత" ఇతి ప్రాణాదిషు పృథక్ పృథక్।*
*పృథ్వ్యన్తేష్వప్యన్వయావిశేషాత్తస్మాత్పరః పుమాన్॥*

*350. తేజఆదిసమస్తానాంసాక్షాదేవహి కారణమ్।*
*తత్తచ్ఛరీరకబ్రహ్మవాచకాస్తేజ ఆదయః॥*

*351. లోకే తత్తద్వస్తువాచితయా సిద్ధైః పదవ్రజైః।*
*బ్రహ్మాభిధానం భాక్తం స్యాదిత్యాశంక్యాహ చోత్తరమ్॥*

**348*-350. సిద్ధాంతం-** ఈపూర్వపక్షం తప్పు. *"ఏతస్మాజ్జాయతే"* (పరమాత్మనుండి సృష్టింపబడింది) అనే పదాలు ప్రాణః, మనః, సర్వేన్ద్రియాణి, ఖం, వాయుః జ్యోతిః ఆపః పృథివీ అనబడే ఒక్కొక్కపదంతోటీ తేడాలేకుండా ఒక్కొక్కటిగా అన్వయించబడడంవల్ల పరమాత్మ తేజస్సు మొదలైన ప్రతీవస్తువుకీ సాక్షాత్తూ కారణం అనే ఈశ్రుతిలో చెప్పబడుతున్నట్టుగానే మనం గ్రహించాలి. *"పృథివ్యప్సు ప్రలీయతే"* (సుబాల2)( భూమి నీటిలో లీనమైపోతుంది.) అని మొదలుబెట్టి, *" తమః పరే దేవ ఏకీ భవతి"* (తమస్సు పరమాత్మలో ఒకటిగా అగును.)అన్నది చివరిదిగా లయక్రమాన్ని చెప్పే సుబాలోపనిషద్వాక్యాల్లో ప్రాణానికీ పంచభూతాలకీ మధ్యని మనస్సు, ఇంద్రియాలూ కనబడకపోవడంచేత దానికి విరుద్ధంగా ఈశ్రుతిలో క్రమం విధించబడుతోంది అని చెప్పడం కుదరదు. కనుక, అవ్యక్తం మొదలైనవాటిని శరీరంగాగల బ్రహ్మనించే సాక్షాత్తూ సమస్తకార్యాలూ సృష్టింపబడ్డాయి అనే గ్రహించాలి. "అగ్నేరాపః" మొదలైన వాక్యాలు తేజస్సనే అగ్నిమొదలైనవాటినించే జలం మొదలైనవి సృష్టింపబడ్డాయి అని చెప్తున్నాయే అంటే, అక్కడ అగ్నిశబ్దం మొదలైనవి అగ్ని మొదలైనవాటిని శరీరంగాగల బ్రహ్మన్నే సూచిస్తున్నాయిగనుక విరోధంలేదు.

351. **అవతారిక:** లోకంలో అగ్నిమొదలైన శబ్దాలు అగ్ని మొదలైన ఆయాపదార్థాలని చెప్తాయని ప్రసిద్ధికాగా, ఆశబ్దాలవల్ల బ్రహ్మన్ని సూచించినట్లుగా అముఖ్యంఅవుతుందే అనే ఆక్షేపానికి తర్వాతి సూత్రం సమాధానం చెప్తోంది.

*సి.సూ.॥ చరాచరవ్యపాశ్రయస్తు స్యాత్తద్వ్యపదేశోభాక్తస్తద్భావభావిత్వాత్॥ (2-3-17) (213)*

1. **తద్భావభావిత్వాత్--** బ్రహ్మం (అంతర్యామిగా) ఉండడానికి తర్వాత ఏర్పడడంవల్ల, **చరాచరవ్యపాశ్రయః తద్వ్యపదేశః తు--** చరాచరాలనిగురించిన పదాలు పరమాత్మపర్యంతంగా (వేదాంతజ్ఞానులు) నిశ్చయించిచెప్పడం, **అభాక్తః స్యాత్--** ముఖ్యంగానే అవుతుంది.

2. **తద్భావభావిత్వాత్--** ప్రకారిని తెలుసుకున్న తర్వాతే, ప్రకారాన్ని చెప్పే పదం ప్రకారిని నిశ్చయించి చెప్పేది కాలేదుగనుక, **చరాచరవ్యపాశ్రయః తద్వ్యపదేశః తు--** చరాచరాలనిగురించిన

(లౌకికుల) ఆయా వ్యవహారపు అలవాటు, **భాక్తః స్యాత్**-- అముఖ్యమే అగును.

*352. చరాచరాశ్రయాశ్శబ్దాః ముఖ్యా ఏవ పరాత్మని।*
*ఆత్మత్వేన బ్రహ్మభావభావిత్వాత్తేజఆదిషు॥*

*353. సర్వస్య బ్రహ్మదేహత్వాత్తత్ప్రకారత్వతస్తతః।*
*తత్తద్వాచకశబ్దాస్తే పర్యవస్యన్తి తత్ర హి॥*

*354. ప్రకారవాచిశబ్దానాం ప్రకారిణ్యవసానతః।*
*అభాక్తత్వం గవాదౌ తు సిద్ధం తస్మాద్ధి లౌకికాః॥*

*355. వ్యుత్పత్తిశూన్యా వేదాన్త ఏకదేశే ప్రయుజ్యతే।*
*తస్మాద్విశిష్టం బ్రహ్మైవ సర్వకారణముచ్యతే॥*

***352-355.*** **సిద్ధాంతం:** వెనక వచ్చిన సందేహానికి ప్రతిపదార్థంలో చూపించిన ప్రకారం, సమాధానం రెండురకాలుగా ఉంటుంది. 1. కదిలేవి, కదలనివి అయిన పదార్థాలని సూచించే శబ్దాలు పరమాత్మవి,యంలో ముఖ్యమైనవిగానే ప్రయోగించబడుతున్నాయి. ఎలా అంటే, "తదనుప్రవిశ్య సచ్చ త్యచ్చాభవతి" (అది వ్యాపించి చేతనాచేతనాలుగా బ్రహ్మం అయినది) అన్నప్రకారం, బ్రహ్మం అంతర్యామిగా ఉన్నతర్వాత నామరూపవ్యాకరణం చెయ్యబడిందిగనుక, "తేజస్" మొదలైన చరాచరాలనిచెప్పే శబ్దాలు పరమాత్మవిషయంలో ముఖ్యమైనవే. అది ఎలా ముఖ్యం అవుతుంది అంటే, సమస్తపదార్థాలూ బ్రహ్మనికి దేహంగా ఉండి, ఆబ్రహ్మనికి ప్రకారంగా ఉండడంవల్ల ఆపదార్థాలని చెప్పే "తేజస్" మొదలైన పదాలు ప్రకారి అయిన బ్రహ్మన్ని చెప్పినట్లుగానే నిశ్చయమైనదిగనుక ముఖ్యం అవుతాయి. 'గో"మొదలైన శబ్దాలు గోత్వం అనే ప్రకారాన్ని చెప్పి, దాంతో ఉన్నదై, ఆవిధంగా తెలిసేదై, ప్రకారిఅయిన, గోవ్యక్తినికూడా ముఖ్యంగానే చెప్పడం లోకంలో మనం చూస్తున్నదే.

2. వెనక చెప్పిన గోదృష్టాంతంలాగే, ఇక్కడ ప్రకారిఅయిన బ్రహ్మం కంటికి కనబడేది కాకపోవడంచేత, వేదాంతాన్ని విన్నతర్వాతే తెలియడంచేతనూ, వేదాంతజ్ఞానం ఉన్నవాళ్ళే అన్ని శబ్దాలూ వాటికి ప్రకారియైన బ్రహ్మన్ని చెప్పేవే అని తెలిసినవాళ్లవడంవల్లా, అటువంటి వేదాంతజ్ఞానంలేని లౌకికులు ప్రకారియైన బ్రహ్మన్ని తెలుసుకోలేరుగనుక, తేజస్" మొదలైన ప్రకారవస్తువులని మాత్రమే సూచించి, తేజస్" మొదలైన ఆయా శబ్దాలని ఉపయోగించడం అముఖ్యమే అవుతుంది. కనుక, సూక్ష్మచేతనాచేతనవిశిష్టమైన బ్రహ్మమే సర్వజగత్కారణం అనబడుతోంది.

తేజోధికరణం పూర్తి అయినది.

## ॥ఆత్మాధికరణమ్॥ (2-3-3)

*సి.సూ.॥ నాత్మా శ్రుతేర్నిత్యత్వాచ్చ తాభ్యః॥ (2-3-18) (215)*

**ఆత్మా**-- అత్మఅన్నది, **న**-- సృష్టింపబడలేదు, **శ్రుతేః**--శ్రుతి అలా చెప్పడంచేతనూ, **తాభ్యః**--ఆశ్రుతులనించే, **నిత్యత్వాత్ చ**-- ఆత్మ నిత్యమైనది అని ఏర్పడడంవల్లనూ.

*356. స్వరూపపరిణామాఖ్యవికారకతయేరితమ్।*
*వియదాద్యచితాం బ్రహ్మకార్యత్వం న్యాయోఃపురా॥*

*357. ఉత్పత్తిం ప్రతిషిధ్యాత్ర ప్రసక్తాం వియదాదివత్।*
*జీవానాం బ్రహ్మకార్యత్వముచ్యతేఽన్యప్రకారతః॥*

***356-357.అవతారిక-*** ఆకాశం తేజస్సు మొదలైన అచేతనపదార్థాలు స్వరూపపరిణామమనే వికారాన్ని కలిగినవవడంవల్ల బ్రహ్మానికి కార్యమైనాయి అని వెనకటి రెండు అధికరణాలవల్లా స్థాపించబడింది. ఆకాశం మొదలైనవాటిలా, జీవుడుకూడా బ్రహ్మానికి కార్యమవడంవల్ల వాటిలాగే జీవుడికికూడా ఉత్పత్తిని అంగీకరించాల్సివస్తుంది అనే అనుమానాన్ని పోగొట్టి, జీవనిత్యత్వాన్ని స్థాపించి స్వభావపరిణామాన్ని అంగీకరించి మరోవిధంగా జీవులుకూడా బ్రహ్మకార్యమైనవాళ్ళు అని ఈఅధికరణంలో చెప్పబడుతోంది.

***358.*** *ఏకవిజ్ఞానేన సర్వధీప్రతిజ్ఞానతస్తథా।*
*సృష్టేః ప్రాక్ పరమాత్మైకత్వావధారణతోఽపి చ।*

***359.*** *"తోయేన జీవా"నిత్యాదిజీవోత్పత్తిశ్రుతేరపి।*
*జీవస్యోత్పత్తిరస్తీతి చేన్న నాత్మా ప్రజాయతే॥*

***358-*359 . పూర్వపక్షం:*** బ్రహ్మానొక్కదాన్ని తెలిసికొన్నట్లైతే, చేతనాచేతనాలు సమస్తాన్నీ తెలిసికొన్నట్లే అని శ్రుతులు చెప్పడంనించీ, "***సదేవ సోమ్య***" అన్న శ్రుతిలో సృష్టికి ముందర బ్రహ్మం ఒక్కటే ఉన్నదని చెప్పడంవల్లనూ, '***తోయేన జీవాన్ వ్యససర్జ భూమ్యామ్***" (త్రై.నా.1-4) (పంచభూతాలతో జీవులని పరమాత్మ సృష్టించేడు), "***ప్రజాపతిః ప్రజా అసృజత***" (యజు-అష్టక-2) (ప్రజాపతిఅనేవారు ప్రజలని సృష్టించేరు), "***యతో వా ఇమాని భూతాని జాయన్తే***" (త్రై.భృ.) ( ఏపరమాత్మవస్తువునుంచి ఈభూతాలు సృష్టింపబడ్డాయో) మొదలైన శ్రుతులలో జీవుడికి సాక్షాత్తూ ఉత్పత్తి చెప్పబడడంవల్లనూ, ఆకాశం మొదలైన అచేతనపదార్థాలకిలాగే, జీవుడికికూడా ఉత్పత్తి ఉంటుంది అని స్పష్టం అవుతోంది.

***360.*** *శ్రుతే"ర్న జాయతే, జ్ఞాజ్ఞా"విత్యాదేర్నిత్యతాఽస్య చ।*
*"నిత్యోఽజో నిత్య" ఇత్యాదిశ్రుతిభ్యశ్చావగమ్యతే॥*

***361.*** *కార్యహేత్వోరనన్యత్వాత్కార్యత్వాదాత్మనోఽపి చ।*
*ఏకవిజ్ఞానేన సర్వధీప్రతిజ్ఞోపపద్యతే॥*

***362.*** *కార్యత్వమేకద్రవ్యస్యాన్యావస్థాపత్తిరేవ హి।*
*తద్ధీసఙ్కోచాదిరూపావస్థాన్తరమముష్య చ॥*

***363.*** *జీవస్యాప్యస్తి యోత్పత్తిర్వియదాదిషు దృశ్యతే।*
*సా స్వరూపాన్యథాత్వాఖ్యా జీవేహి వినివార్యతే॥*

***364.*** *ఈశస్యైకత్వావధృతిః ప్రాక్ సృష్టేశ్చిదచిత్తనోః।*
*నామరూపవిభాగస్యాభావాదేవోపపద్యతే॥*

***365.*** *ఉత్పత్తిమృతివాదిన్యః శ్రుతయః ప్రత్యగాత్మనః।*
*జ్ఞానసఙ్కోచాదికరదేహయోగాదిబోధికాః॥*

*॥ఇత్యాత్మాధికరణమ్॥*

**359*-365. సిద్ధాన్తం**: ఈపూర్వపక్షం తప్పు. జీవుడు సృష్టింపబడడంలేదు, శ్రుతి అలా చెప్పడం చేత. ఎక్కడ అలా చెప్పింది అంటే, "న జాయతే మ్రియతే వా విపశ్చిత్" (కఠ 2-1-8) (చైతన్యంగల జీవుడు జన్మించడంలేదు, మరణించడంలేదు), "జ్ఞాజ్ఞౌద్వావజౌ" (శ్వే.1-9) (సర్వజ్ఞుడైన సర్వేశ్వరుడును, అజ్ఞుడైన జీవుడును జన్మ లేనివాళ్ళు) మొదలైన శ్రుతులు జీవుడికి పుట్టుక లేదని స్పష్టంగా

చెప్పున్నాయిగదా! పైగా, "నిత్యో నిత్యానాం చేతనశ్చేతనానాం ఏకో బహూనాం యో విదధాతి కామాన్"(శ్వే. 6-13) (నిత్యులైన అనేకచేతనులకి నిత్యుడైన ఒకచేతనుడు కోరికలని తీరుస్తున్నాడు) "అజో నిత్యః శాశ్వతోయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే"(కఠ. 2-18) (జన్మలేనివాడై, నిత్యుడై, శాశ్వతుడై, పురాతనమైనవాడైనా, నూతనుడిగానున్న ఈజీవుడు శరీరం నశించేటప్పుడు తాను నశించడం లేదు) మొదలైన శ్రుతులవల్ల ఆత్మ నిత్యమైనది అని శాబ్దంగానే ఏర్పడుతోంది. ఈవిధంగా జీవుడు బ్రహ్మకార్యంగాకపోయినప్పుడు బ్రహ్మాన్ని ఒక్కటినీ తెలిస్తే జీవుడు మొదలైన సమస్తం తెలిసినట్టే అవుతుందని చెప్పడం ఎలా కుదురుతుంది అంటే, జీవుడికి ఉత్పత్తి లేకపోయినా, జీవుడు బ్రహ్మకార్యం అవడానికి ఏమీ ఆటంకంలేదుగనుక కారణమైన బ్రహ్మాన్ని తెలుసుకున్నట్లైతే, కార్యమైన జీవుడు మొదలైన సమస్తప్రపంచాన్నీ తెలిసినదని చెప్పడానికి ఆటంకంలేదు. పుట్టుకలేని జీవుడు ఎలా బ్రహ్మకార్యం అవగలడు? అంటే, కార్యత్వం అనేది ఒక ద్రవ్యం మరో స్థితిని పొందడమే అవుతుంది. సృష్టిలో అది జీవుడికికూడా ఉంటుంది. అయినప్పటికీ, ఆకాశం మొదలైన అచిత్తులకీ జీవుడికీ కార్యం అవడంలో ఒక భేదం ఉన్నది. ఆఅచేతనపదార్థాలు కార్యమైనప్పుడు, స్వరూపమే (అంటే స్వరూప నిరూపకధర్మమే) మారిపోతుంది. జీవుడికి అంటే, జ్ఞానానందాదిస్వరూపంలో ఏమీ మార్పులేకుండా ధర్మభూతజ్ఞానంలో సంకోచవికాసాలు (సూక్ష్మతస్థూలతలు) అనే స్వభావం మారడమే కలుగుతుంది. కనుక ఇలా స్వభావంమార్పు అనే స్థితి జీవుడికికూడా సృష్టిలో కలగడంచేత జీవతత్త్వంకూడా బ్రహ్మ కార్యం అవుతోంది. కాని, ఆకాశాదులకిలా స్వరూపంలో మార్పు జీవుడికి లేకపోవడంవల్ల జీవుడికి పుట్టుక లేదని చెప్పడం జరిగింది. సృష్టికి ముందర బ్రహ్మం ఒక్కటే ఉన్నదని చెప్పడంవల్ల, అప్పుడు జీవుడు లేడనీ, సృష్టికాలంలో పుట్టేడని చెప్పడానికి లేదా అంటే, అలా కుదరదు. ఎలా అంటే, బ్రహ్మం ఎప్పుడూ చేతనాచేతనాలని శరీరంగాగలిగే ప్రకాశిస్తూంటుంది. కాని, సృష్టితర్వాత నామరూపవిభాగంఉన్న చేతనాచేతనాలని శరీరంగాగలిగిన స్థూలచిదచిద్విశిష్టబ్రహ్మంగా ఉన్నట్లు సృష్టికి ముందర లేకుండా నామరూపవిభాగాల్లేని చేతనాచేతనాలని శరీరంగాగల సూక్ష్మచేతనాచేతనవిశిష్టబ్రహ్మంగా ప్రకాశించడం వల్ల సృష్టికి ముందు బ్రహ్మం ఒకటే ఉన్నది అని చెప్పడం జరిగింది. కనుక, దాన్నించి సృష్టికాలంలో జీవుడు సృష్టింపబడుతున్నాడని చెప్పడానికి వీల్లేదు. జీవుడికి పుట్టుకనీ, వినాశాన్నీ చెప్పే శ్రుతులు వాడికి ధర్మభూతజ్ఞానసంకోచవికాసాలని కలిగించే దేహంతో కలిసిఉండడం అనే పుట్టుకనీ, ఆదేహం నశించేటప్పుడు కలిగే దేహవియోగమనే మరణాన్నే చెప్పుతున్నాయి గనుక, వాటివల్లకూడా జీవుడికి పుట్టుక సిద్ధించదు. కనుక, అచేతనపదార్థాల్లా జీవుడికి పుట్టుక లేదు.

ఆత్మాధికరణం ముగిసింది.

## ॥జ్ఞాధికరణమ్॥ (2-3-4)

### సి.సూ.॥ జ్ఞోऽత ఏవ॥ (2-3-19) (216)

**అతః**-- శ్రుతులవల్ల, **జ్ఞః ఏవ**-- (ఆత్మ) జ్ఞానంగలదిగానే ఉన్నది.

*366. జీవస్య బ్రహ్మకార్యత్వం ప్రాగిష్టం జ్ఞానధర్మతః।*
*తద్ధర్మభూతజ్ఞానం వై నాస్త్యేత్యుక్తిరిహాస్యతే॥*

***366. అవతారిక:*** ధర్మభూతజ్ఞానంతాలూకు సంకోచవికాసాలనే స్థితులని పొందడంద్వారా జీవుడు బ్రహ్మానికి కార్యపదార్థంగా అవుతున్నాడని వెనుకటి అధికరణంలో నిరూపించబడింది. ఆధర్మభూతజ్ఞానమే వీడికి లభించదు అనేవాదం ఈఅధికరణంలో నిరసింపబడుతోంది.

367. "విజ్ఞానం యజ్ఞ"మిత్యాది శ్రుతేశ్చిన్మాత్రమాత్మనః।
స్వరూపమథవాఽఽత్మాయమాగన్తుకమతిర్జడః॥

**367-369. పూర్వపక్షం**: (1) "విజ్ఞానం యజ్ఞం తనుతే" (తై. ఆనం. 5) (జ్ఞానస్వరూపుడైన జీవుడు యజ్ఞం చేస్తున్నాడు), "యో విజ్ఞానే తిష్ఠన్" (బృహ-కాణ్వ 5-7)(ఎవడు జ్ఞానస్వరూపుడైన జీవుడివద్ద ఉన్నాడో) అని శ్రుతులు చెప్పడంవల్ల ఆత్మ జ్ఞానస్వరూపమైఉన్నదే తప్ప జ్ఞానాన్ని గుణంగా కలిగినదిగాదు. ***పూర్వపక్షం 2-*** ఆత్మ జడస్వరూపంగానూ సృష్టింపబడి నశించేదైన జ్ఞానాన్ని గుణంగా గలదిగానూ ఉన్నది. ఎంచేతంటే, దుఃఖం, మూర్ఛమొదలైనసమయాల్లో, ఈఆత్మకి జ్ఞానం ఉన్నట్టుగా కనబడలేదు మేలుకొని ఉన్నప్పుడుకూడా, ఇంద్రియాల అధీనంలోనే (ఔపాధికంగా) దీనికి జ్ఞానం కలుగుతోంది. కనుక, దీనికి సహజంగా జ్ఞానం లేదు. "న ప్రేత్య సంజ్ఞా అస్తి" (బృహ-6-5-13) (ముక్తస్థితిలో జీవుడికి జ్ఞానం లేదు.) అని శ్రుతికూడా దీనికి ముక్తస్థితిలో జ్ఞానం నశించిపోతుంది అని చెప్తోంది. పైగా, జీవుడికి సంబంధించిన కార్యాలు లోకంలో అంతటా కనబడడంవల్ల జీవుడుకూడా అంతటా ఉన్నాడని తెలుస్తోంది. ఇటువంటివాడిని సహజంగా జ్ఞానస్వరూపుడిగా అంగీకరించినా, సహజజ్ఞానాన్ని గలవాడిగా అంగీకరించినా, అన్నిసమయాల్లోనూ అంతటా వాడు పుట్టవలసివస్తుంది. ఇంద్రియాలూ, అవసరంలేనివే అవుతాయి. ఈదోషాలు రాకుండా ఉండడంకోసం, జీవుడిని రాయిలాగ జడస్వరూపుడిగానూ, పుట్టి కప్పబడే జ్ఞానంగలవాడిగానూ అంగీకరించాలి.

*సి.సూ.॥ ఉత్క్రాన్తిగత్యాగతీనామ్ ॥ (2-3-20) (217)*

**ఉత్క్రాన్తి గత్యాగతీనామ్**-- (శరీరంనుంచి) బైటికిరావడం, (లోకాంతరానికి) వెళ్ళడం, (లోకాంతరంనుంచి) తిరిగిరావడమున్నూ, (జీవుడికి శ్రుతిలో) చెప్పబడడంవల్ల (ఆత్మ అణువే).

373. ఉత్క్రాన్త్యాదిశ్రుతేరాత్మాఽణురేవాయం న సర్వగః।
ఉత్క్రాన్తిశ్చై"ష ఆత్మా నిష్క్రామతీ"త్యుచ్యతే శ్రుతౌ॥
374. గతిశ్చ పఠ్యతే "యే వై కేచాస్మా"దితి వాక్యతః।
ఆగతిః "పునరేత్యస్మై లోకాయే"తి చ పఠ్యతే॥
375. విభుత్వ ఏతా ఉత్క్రాన్తిముఖాస్స్యుర్బాధితా భృశమ్।

***373-*375- సిద్ధాంతం:*** ఈఆత్మ అంతటా వ్యాపించి ఉండేదిగాదు. అణువుగా ఉండేదే. ఎందువల్ల అంటే, శ్రుతిలో దీనికి ఉత్క్రాంతీ, గతీ, ఆగతీ చెప్పబడడంవల్ల. అంటే, "ఏష ఆత్మా నిష్క్రామతి. చక్షుషోవా మూర్ధ్నోవా అన్యేభ్యోవా శరీరదేశేభ్యః"(బృహ 6-4-2) (ఈజీవుడు కన్నుద్వారానో, తలద్వారానో, ఇతరశరీరభాగాలద్వారానో బైటికి వెళ్ళుతున్నాడు) అన్న శ్రుతివల్ల జీవుడికి దేహాన్ని వదిలి ఉత్క్రాన్తి (బైటికివెళ్ళడం) చెప్పబడింది. "యే వై కేచాస్మాల్లోకాత్ ప్రయన్తి చన్ద్రమసమేవ తే సర్వే గచ్ఛన్తి" (కౌషీతకీ 1-2) (ఈలోకంనుంచి మరణించినవాళ్ళందరూ చంద్రలోకానికే వెళ్తున్నారు) అని లోకాంతరానికి జీవుడికి వెళ్ళడం అనే గతికూడా చెప్పబడింది. "తస్మాల్లోకాత్ పునరేత్యస్మై లోకాయ కర్మణే" (బృహ 6-4-6) జ్ఞానం (ఆలోకంనించి కర్మచేయడానికి ఈలోకానికి తిరిగీ వస్తున్నాడు) అని లోకాంతరంనుంచి ఇక్కడికి లేదు) తిరిగిరావడం అనే ఆగతికూడా చెప్పబడింది. జీవుడు అంతటా ఉండే విభువైఉన్నట్లయితే, ఈమూడూ, పూర్తిగా కుదరవుగదా! అందువల్ల జీవుడు అణువే.

*సి.సూ.॥ స్వాత్మనా చోత్తరయోః॥ (2-3-21) (218)*

**ఉత్తరయోః**-- గతి, ఆగతి మొదలైన తరువాతి రెండూ, **స్వాత్మనా చ**-- తన ఆత్మస్వరూపంవల్లనే

(జరిగేవిగనుక ఆత్మ అణువని నిశ్చయం.)

*375* స్థితస్యాప్యాత్మస్తస్య కథఇచ్ఛేదుపపద్యతే॥*

*376. ఉత్క్రాన్తిస్తనువిశ్లేషాత్ న తు గత్యాగతీ ఉభే।*

*స్వాత్మనైవ తయోస్స్వార్యాద్యత్వాదుత్తరయోర్ద్వయోః॥*

**377. తస్మాదస్యాత్మవర్గస్యాఽణుత్వం నిశ్చితమేవ తత్।*

***375*-*377-*** జీవుడు విభువై కదలకుండా ఉన్నా, వాడికి శరీరవియోగం కలగడమే ఉత్క్రాన్తి అని చెప్పడంగా ఒకవిధంగా నిర్వహించినా లోకాంతరానికి వెళ్ళడమనే గతి, అక్కడినుండి తిరిగిరావడం అనే ఆగతి అనే తరువాతిరెండూ ఆత్మస్వరూపం పోకపోవడంవల్లనే జరగవలసినదిగనుక జీవసమూహం అణువుగానే ఉండాలి అని నిశ్చయం.

## *సి.సూ.॥ నాణురతచ్ఛ్రుతేరితి చేన్నేతరాధికారాత్ ॥ (2-3-22) (219)*

**అతచ్ఛ్రుతేః**--అణుత్వంకంటే భిన్నమైన విభుత్వం శ్రుతిలో (జీవుడికి) చెప్పబడడంవల్ల, **అణుః న**- (జీవుడు అణువుగాడు, **ఇతిచేత్**- అన్నట్లైతే, **ఇతరాధికారాత్**- జీవుడికంటేభిన్నమైన పరమాత్మ గురించిన ప్రస్తావం ఉండడంవల్ల, **న**- ఆవిభుత్వం జీవుడిదిగాదు.

*377* "యోఽయమి"త్యాదినా జీవం ప్రస్తుత్యై"ష మహానజః"॥*

*378. ఇతి తస్య మహత్త్వోక్త్యా నాణురాత్మేతి చేన్న తత్।*

*"యస్యానువిత్త" ఇత్యాదిశ్రుతౌ జీవేతరస్యవై॥*

*379. ప్రాజ్ఞస్యాధికృతేస్తస్మాన్మహత్త్వం తత్స్థమేనహి।*

***377*-*378.*** **పూర్వపక్షం**: బృహదారణ్యకంలో "యోఽయం విజ్ఞానమయః" (6-3-3) అని జీవుడిని ప్రస్తావించి "స వా ఏష మహాన్ అజ ఆత్మా" (6-4-25)(అటువంటి ఈఆత్మ జన్మలేనిదై పెద్దదై (విభువై) ఉన్నది) అని వీడికి అణుత్వంకంటే వేరైన విభుత్వాన్ని శ్రుతే చెప్పడంవల్ల జీవుడు అణువనడం తప్పు.

378*-*379. **సిద్ధాంతం**: ఈపూర్వపక్షం తప్పు. ఈప్రకరణంలో మొదట జీవుడినిగురించి చెప్పినప్పటికీ, "యస్యానువిత్తః ప్రతిబుద్ధ ఆత్మా అస్మిన్ దేహే గహనే ప్రవిష్టః। స విశ్వకృత్ స హి సర్వస్య కర్తా (బృహ 6-4-13) (సర్వజ్ఞుడై అతిసంకటమైన ఈదేహంలో ప్రవేశించినవాడిగా పరమాత్మ ఆజీవుడికి ఆత్మఅయి ఉపాస్యుడైయున్నాడు. ఆపరమాత్మ సర్వజగత్కారణుడైయున్నాడుగదా) అని మధ్యలో పరమాత్మనిగురించి చెప్పడం మొదలుపెట్టబడడంవల్ల "మహాన్ అజ ఆత్మా" (6-4-25)అని ఆపరమాత్మకి విభుత్వాన్ని చెప్తున్నదేతప్ప జీవుడికి విభుత్వాన్ని చెప్పలేదు. అంచేత, జీవుడు అణువుగానే ఉన్నాడు.

## *సి.సూ.॥ స్వశబ్దోన్మానాభ్యాం చ ॥ (2-3-23) (220)*

**స్వశబ్దోన్మానాభ్యాం చ**-- (జీవుడినిగురించి) అణుశబ్దమున్నూ, (అణువస్తువుని) ఎత్తుకొని దాని పరిమాణాన్నిగూడా (శ్రుతిలో) చెప్పడంవల్ల (జీవుడు అణువే).

*379* సాక్షాదేవ శ్రూయతేఽణుశబ్ద "ఏషోఽణురి"త్యపి॥*

*380. "వాలాగ్రశతభాగస్యే"త్యాదౌ జీవస్య కథ్యతే।*

*అణువస్తూద్ధృత్య తత్స్థమానత్వం, తత ఏవచ॥*

**381. బద్ధముక్తోభయావస్థో జీవోఽణుపరిమాణవాన్।*

*(అవ) అస్యాణుత్వే సర్వదేహవ్యాపినీ స్యాన్నవేదనా॥*

***379*-*381.*** ***సిద్ధాంతం:*** "ఏషోఽణురాత్మా.... సా వేదితవ్యో యస్మిన్ ప్రాణః పఞ్చధా సంవివేశ" (ముండక 3-1-9)(ఐదురాళ్లబరువుగల ప్రాణం ఎవనికి (ఉపకరణంగా)ఉన్నదో, ఆజీవాత్మ అణుస్వరూపు డైనాడు.) అని శ్రుతి సాక్షాత్తూ జీవుడిని అణువుఅని చెప్తోంది. పైగా ""వాలాగ్రశతభాగస్య శతధా కల్పితస్యచ । భాగో జీవః స విజ్ఞేయః"(శ్వే. 5-9)(ధాన్యపుగింజమొనని నూరుభాగాలుగా చేసి అందులో ఒకభాగాన్ని తిరిగీ నూరుభాగాలుగా చేస్తే ఆనూరవభాగంగా ఉన్నవాడు జీవుడు అని తెలుసుకోవలెను) అని అణువుగానున్న వస్తువునొకదానిని ఎత్తుకొని అదే పరిమాణంగలవాడు జీవుడు అని మరో శ్రుతిలో చెప్పబడుతోంది. ఈరెండుకారణాలవల్లా సంసారస్థితిలోనూ, ముక్తస్థితిలోనూ స్వరూపంలో జీవుడు అణువేనని తెలుస్తోంది.

***382.*** *ఇత్యత్ర పరిహారోఽన్యమతరీత్యా ప్రదర్శ్యతే।*

381*-*382. **అవతారిక**: ఈవిధంగా జీవుడు అణువైఉన్నప్పటికీ, దేహం అంతట్లోనూ ఉన్న జ్ఞానం వాడికి తెలియకూడదనే ఆక్షేపాన్ననుసరించి పరిహారం చెప్పబడుతోంది.

***సి.సూ.// అవిరోధశ్చన్దనవత్ // (2-3-24) (221)***

**చన్దనవత్**-- (దేహంతాలూకు ఒకభాగంలో ఉన్న) చందనం (దేహం పూర్తిగా తెలుసుకుంటుంది) వలె, **అవిరోధః**-- విరోధం లేదు.

***382**** *యథా దేహైకదేశస్థోఽప్యాహ్లాదం సర్వవర్ష్మసు॥*

***383.*** *బిన్దురుత్పాదయత్యాశు చన్దనస్య, తథైవ హి।*

*ఆత్మా దేహైకదేశస్థోప్యఖిలాఙ్గోత్థవేదనామ్॥*

***384.*** *తదైవానుభవత్యేషః న విరోధోఽత ఏవ హి।*

***382*-*384.*** ***సిద్ధాంతం:*** దేహంలో ఒకభాగంలో రాసిన చందనపొడి, వెంటనే శరీరపు అన్ని భాగాలకీ ఆనందాన్నికలిగించినట్లుగా ఈఆత్మ, దేహంలోఒకభాగంలో ఉన్నప్పటికీ, సమస్తమైన అవయవా లలోనూ జ్ఞానాన్ని అనుభవిస్తోంది. కనుక, జీవాత్మ అణువైఉండడంలో విరోధం లేదు.

***సి.సూ.// అవస్థితి వైశేష్యాదితి చేన్నాభ్యుపగమాద్ధృది హి // (2-3-25) (222)***

**అవస్థితి వైశేష్యాత్**-- (చందనపొడి)శరీరంలో ఒకభాగంలో ఉన్నట్లైతే, (దేహం అంతటిలోనూ ఆనందం కలగడంలో లోటులేదు; జీవుడు అలాలేడుగదా!), **ఇతి చేత్**--అన్నట్లైతే, **న**-- ఈఆక్షేపం పొసగదు. **అభ్యుపగమాత్**-- (జీవుడికీ దేహంలో ఒకభాగంలో ఉండడం) అంగీకరిస్తే, **హృది హి**-- హృదయంలోనే గదా! (జీవుడికి ఉండడం చెప్పబడుతోంది.)

***384**** *దేహదేశవిశేషావస్థితివైశేష్యతోఽస్య హి॥*

***385.*** *చన్దనస్య తథాభావః, ఆత్మనస్తన్న విద్యతే।*

*ఇతి చేన్నాత్మనోప్యస్య "హృది హ్యేష"మితి శ్రుతేః॥*

***386.*** *దేహదేశవిశేషాన్తర్హృద్గతత్వావబోధనాత్।*

*(అవ)* *సర్వదేహవ్యాపికార్యకరత్వం కుత్రచిత్స్థలే॥*

***387.*** *వర్తమానస్య జీవస్య స్వమతేన బ్రవీత్యథ।*

***384*-*385.*** **పూర్వపక్షం**: చందనపొడిఅనేది శరీరంలో ఒకభాగంలో ఉంటే, శరీరం అంతా ఆనందాన్ని పొందుతుంది. జీవాత్మ అదేవిధంగా శరీరంలో ఒకభాగంలో ఉన్నట్టుగా కనబడలేదుగదా! కనుక, చందనదృష్టాంతంతో జీవుడు శరీరంఅంతటిలోనూ ఉన్న అనుభవా(జ్ఞానా)న్ని తెలుసుకొంటుందని

చెప్పడం కుదరదు.

385*-*386. **సిద్ధాంతం:** జీవుడికికూడా శరీరంలో ఒకభాగంలో ఉండడాన్ని అంగీకరిస్తున్నాం గనుక, ఈపూర్వపక్షం కుదరదు. అలా ఎక్కడ అంగీకరిస్తున్నాం అంటే, "హృది హ్యయమాత్మా। తత్రైక శతం నాడీనామ్" (బృహ 6-3) (ఈఆత్మహృదయంలో కదా ఉన్నది., అక్కడ నూటొక్కనాడులు ఉన్నాయి) అనే ఉపనిషద్వాక్యంలో దేహంలోఒకభాగమైన హృదయంలో జీవుడుండడం అంగీకరించబడుతోంది గదా! అందుచేత పూర్వపక్షంలో చెప్పిన విరోధం లేదు.

386*-*387. **అవతారిక:** శరీరపు ఒకభాగంలో ఉండే జీవుడు శరీరం అంతటా ఉన్న కార్యాలని చెయ్యడం ఎలా అన్నదాన్ని తనమతరీతిలోనే సూత్రకారులు తరువాతి సూత్రంలో చెప్తున్నారు.

*సి.సూ.॥ గుణాద్వాఽఽలోకవత్ ॥ (2-3-26) (223)*

**ఆలోకవత్**-- (సూర్యుడు మొదలైనవాటి) కిరణాలలాగే, **గుణాత్ వా**-- గుణమైన జ్ఞానంద్వారా (దేహం అంతా జీవుడు వ్యాపిస్తున్నాడు)

*387* జ్ఞానేన స్వగుణేనాత్మా హృత్స్థోవ్యాప్యాఖిలాం తనుమ్॥*

*388. వర్తతే యద్వదాలోకః దేశే క్వాపి సతో మణేః।*

*(అవ) ధియస్స్వరూపాతిరిక్తగుణత్వం కథముచ్యతే॥*

*389. విజ్ఞానమాత్రమేవాత్మేత్యుక్తం హీత్యత్ర కథ్యతే।*

***387*-*388.*** **సిద్ధాంతం:** సూర్యుడు, దీపం,రత్నం మొదలైనవాటి కిరణాలు అవి ఉండే స్థలాన్ని వదిలి బైటికి వ్యాపించివెళ్ళి ఎలా ప్రకాశాన్ని కలిగిస్తున్నాయో, అదేవిధంగా, హృదయంలో ఉండే జీవుడి గుణమైన జ్ఞానం (ధర్మభూతజ్ఞానం) దేహం అంతటా వ్యాపించి సమస్తకార్యాలనీ చెయ్యడానికి ఆటంకంలేదు.

388*-*389. **అవతారిక:** "విజ్ఞానం యజ్ఞం తనుతే" (తై. ఆనం. 5) (జ్ఞానస్వరూపుడైన జీవుడు యజ్ఞం చేస్తున్నాడు) మొదలైన శ్రుతుల్లో జీవుడిని జ్ఞానాన్ని స్వరూపంగా మాత్రం గలవాడని చెప్పిఉండగా, జ్ఞానాన్ని గుణంగాకూడా గలవాడిగా వాడిని చెప్పడం ఎలా కుదురుతుంది?అనే ఆక్షేపానికి తరువాతి సూత్రం సమాధానాన్ని ఇస్తోంది.

*సి.సూ.॥ వ్యతిరేకో గన్ధవత్తథా చ దర్శయతి ॥ (2-3-27) (224)*

***గన్ధవత్***-- వాసనకి (దానినిగల పృథ్వీకంటే భేదం సిద్ధించడం)వలెనే, **వ్యతిరేకః**-- (ధర్మభూత జ్ఞానానికి దానిని గల ఆత్మకంటే) భేదం (సిద్ధిస్తోంది) **తథా చ దర్శయతి**-- (శ్రుతికూడా) అలాగే చూపుతోంది.

*389* వ్యతిరేకస్సిద్ధ ఏవ జానామీతి ప్రతీతితః॥*

*390. జీవస్వరూపాత్ జ్ఞానస్య, యథా గన్ధవతీ మహీ।*

*ఇతి ప్రతీతౌ గన్ధస్య మహ్యా భేదః ప్రతీయతే॥*

*391. శ్రుతిశ్చ దర్శయత్యేవం "జానాత్యేవాయ"మిత్యసౌ।*

***389*-*391.*** సిద్ధాంతం: "పృథ్వీతత్త్వం వాసన కలిగినది" అనే జ్ఞానంలో గుణమైన వాసనకి, దానిని గల భూమికంటే భిన్నత్వం సిద్ధించడంలాగే, "నేను తెలుసుకుంటున్నాను" అనే జ్ఞానంలో జీవస్వరూపంకంటే దానిలో గుణంగా ఉండే జ్ఞానానికి భేదం సిద్ధించడాన్నే చేస్తుంది. "జానాత్యేవాయమ్ పురుషః" (బృహ 6-3-30) (ఈపురుషుడు తెలుసుకోవడమే చేస్తున్నాడు) అనే శ్రుతికూడా

ఆత్మస్వరూపంకంటే, దాని గుణమైన జ్ఞానాన్ని వేరుగానే చూపుతోంది.

*సి.సూ.॥ పృథగుపదేశాత్ ॥ (2-3-28) (225)*

***పృథగుపదేశాత్***-- (ఆత్మకంటే జ్ఞానాన్ని) భిన్నంగా ఉపదేశించడంవల్ల (జ్ఞానానికి ఆత్మకంటే భిన్నత్వం సిద్ధం)

*391* "నహి విజ్ఞాతు"రిత్యాదిశ్రుత్యా విజ్ఞాతురాత్మనః॥*

*392. పృథక్త్వేన విజ్ఞానముపదిశ్యత ఏవహి।*

*(అవ) కథం "విజ్ఞానమాత్మే"తి వచ ఇత్యత్ర కథ్యతే॥*

**391*-*392. సిద్ధాంతం:** "నహి విజ్ఞాతు ర్విజ్ఞాతే ర్విపరిలోపో విద్యతే" (బృహ 6-3-30) (తెలియ జేసేద్దైన ఆత్మతాలూకు జ్ఞానానికి నాశం లేదు) అని తెలియజేసేఆత్మకంటే ఆత్మయొక్క జ్ఞానం భిన్నమైనదిగానే శ్రుతిలో ఉపదేశించబడడంవల్ల రెండింటికీ భేదం సిద్ధం.

392* **అవతారిక:** "ఆత్మ జ్ఞానమైఉన్నది" అని శ్రుతి స్మృతుల్లోచెప్పబడడం ఎలా? అనే ప్రశ్నకి సమాధానం చెప్తోంది తరువాతి సూత్రం.

*సి.సూ.॥ తద్గుణసారత్వాత్తు తద్వ్యపదేశః ప్రాజ్ఞవత్ ॥ (2-3-29) (226)*

***తద్గుణసారత్వాత్ తు***--జ్ఞానగుణాన్ని సారంగా తీసుకోవడంవల్లనే, **తద్వ్యపదేశః**--(ఆత్మ) జ్ఞానం అని చెప్పబడుతోంది. **ప్రాజ్ఞవత్**-- సర్వజ్ఞుడైన పరమాత్మ (ఆనందగుణాన్ని సారంగా గలవాడుగా ఉండడంవల్ల అనందం అని చెప్పబడడం)వలె.

*393. విజ్ఞానగుణసారత్వాదాత్మా విజ్ఞానశబ్దతః।*

*కథ్యతే యద్వదానన్దగుణసారత్వతః పరః॥*

*394. "ఏష ఆకాశ ఆనన్ద" ఇత్యానన్దపదేరితః।*

**393-*394. సిద్ధాంతం:** "యో విజ్ఞానే తిష్ఠన్" (బృహ-కాణ్వ 5-7)(ఎవడు జ్ఞానస్వరూపుడైన జీవుడివద్ద ఉన్నాడో) "విజ్ఞానం యజ్ఞం తనుతే" (తై. ఆనం. 5) (జ్ఞానస్వరూపుడైన జీవుడు యజ్ఞం చేస్తున్నాడు) మొదలైన శ్రుతుల్లోనూ, "జ్ఞానస్వరూపం" (వి.పు. 1-2-6) మొదలైన స్మృతుల్లోనూ ఆత్మ జ్ఞానమనే చెప్పబడడం ఆజ్ఞానమనే గుణాన్ని సారంగా కలిగిఉండడంవల్ల. "ఏష ఆకాశ ఆనన్దః" (తై. ఆనం. 7-1) "ఆనన్దో బ్రహ్మ" (తై. భృ. 6-1) అని సర్వజ్ఞుడైన పరమాత్మ ఆనందమనే వ్యవహరించడంలాగే, జీవుడుకూడా జ్ఞానగుణాన్ని సారంగాగలవాడుగనుకనే జ్ఞానం అని వ్యవహరించబడుతున్నాడు.

*సి.సూ.॥ యావదాత్మభావిత్వాచ్చ న దోషస్తద్దర్శనాత్ ॥ (2-3-30) (227)*

***యావదాత్మభావిత్వాత్ చ***--ఆత్మ ఉండేంతవరకూ, (నిత్యంగా జ్ఞానంకూడా) ఉండడంవల్లనూ, ***న దోషః***--(ఆత్మని జ్ఞానమని అనడంలో) దోషం లేదు. ***తద్దర్శనాత్***--(నిత్యధర్మమైన గోత్వాదులతో గోవు మొదలైనవాటిని గో మొదలైన శబ్దంవల్ల) వ్యవహరించడం కనబడడంవల్ల.

*394* జ్ఞానస్యాత్మస్వరూపానుబన్ధిత్వాత్ జ్ఞానశబ్దతః॥*

*395. ఉక్తిర్నదోషో గోత్వాదేర్నిత్యధర్మత్వకారణాత్।*

*గౌరిత్యుక్తిర్హి ఖణ్డాదౌ దృశ్యతేఽత్ర చకారతః॥*

*396. ఆత్మనః స్వప్రకాశత్వాత్ విజ్ఞానమితి భాషణే।*

*న దోష ఇత్యుచ్యతేఽతః జ్ఞానం జ్ఞానగుణశ్చ సః॥*

**394*-396. సిద్ధాంతం:** జ్ఞానం అనే గుణం ఆత్మస్వరూపంతో ఎప్పుడూ కలిసే ఉంటుంది.

ఈకారణంవల్లకూడా, దానిని జ్ఞానం అనడంలో దోషంలేదు. ఎలా అంటే, గోవు మొదలైనవాటికి అవిఉన్నంతవరకూ "గోత్వం" మొదలైన అమరికలు ధర్మమై ఉంటుందనే కారణంవల్ల వాటితో (ఆఅమరికలతో) ఎన్నోరకాలగోవులని 'గో' మొదలైన వ్యవహారాలు కలిగినట్లుగానే నిత్యమైన ఆత్మకి జ్ఞానం నిత్యధర్మమై ఉండడంవల్ల అది జ్ఞానం అని చెప్పబడుతోంది అని గ్రహించాలి. సూత్రంలో చకారం అనుక్తసముచ్చయమై, మరో హేతువునికూడా కలుపుకుంటోంది. అంటే, ధర్మభూతజ్ఞానంలాగే, ఆత్మకూడా స్వయంప్రకాశమై ఉండడంవల్లకూడా "జ్ఞానం" అనే వ్యవహరించబడడానికి ఆటంకంలేదు అనే హేతువుని కలుపుకుంటోంది. కనుక, ఆత్మ అనేది జ్ఞానస్వరూపం అయిఉండడమేకాకుండా, జ్ఞానాన్ని గుణంగా కలిగినదిగాకూడా ఉన్నది.

*(అవ)* *397. ధియస్స్వరూపానుబన్ధిధర్మత్వం కథముచ్యతే*
*సుషుప్త్యాదిష్వప్రతీతేరిత్యాశఙ్కాత్ర వార్యతే॥*

**397. అవతారిక:** నిద్ర, మూర్ఛ మొదలైన సమయాల్లో కనబడకపోవడంచేత జ్ఞానాన్ని ఆత్మస్వరూపంలో చేరిన నిత్యధర్మంగా చెప్పడం ఎలా కుదురుతుంది? అనే ఆక్షేపానికి తరువాతి సూత్రం సమాధానం చెప్తోంది.

*సి.సూ.॥ పుంస్త్వాదివత్త్వస్య సతోఽభివ్యక్తియోగాత్ ॥ (2-3-31) (228)*

***సతః అస్య***-- (ఎప్పుడూ ఆత్మలో) ఉన్న ఈధర్మభూతజ్ఞానానికి, ***పుంస్త్వాదివత్***-- పుంస్త్వం మొదలైనవి (మనుష్యుడికి ఒకప్పుడు బహిర్గతం అవడం)వలెనే, ***అభివ్యక్తియోగాత్***-- (మేలుకొని ఉండడం వంటి సమయాల్లో) దట్టమైన కాంతి కలిగినట్టుగా తీసుకోవడంవల్ల (ఆత్మకి జ్ఞానం నిత్యధర్మం కావచ్చు)

*398. సుషుప్త్యాదావస్ఫురతః సతశ్చ జ్ఞానవస్తునః।*
*జాగర్యాదిష్వభివ్యక్తేర్యావదాత్మానుబన్ధి తత్॥*
*399. బాల్యే సతోఽపిపుంస్త్వస్థానభివ్యక్తస్య వర్ష్మణః।*
*యథా యువత్వేఽభివ్యక్త్యా కాదాచిత్కం న తద్భవేత్॥*
*400. "న ప్రేత్యే"తి శ్రుతిర్ముక్తే జ్ఞానాభావం న వక్తి హి।*
*పూర్వానుభూతజన్మాదిజ్ఞానమేవ నిషేధతి॥*

**398-400. సిద్ధాంతం:** నిద్ర మొదలైనసమయాల్లో కనబడకపోయినా, ఎప్పుడూ ఉండే ఈధర్మభూతజ్ఞానానికి మేలుకొని ఉన్నసమయాల్లోనే బహిర్గతం అవడంవల్ల అది ఆత్మతో కలిసే ఉన్న నిత్యధర్మమే అవుతుంది. మనుష్యుడికి చిన్నవయస్సులో పుంస్త్వం మొదలైన కొన్ని ధర్మాలు కనబడకుండా, తగిన వయస్సులో బహిర్గతం అవడంవల్ల అవి వాడికి స్వరూపంతోకూడిన నిత్యధర్మంకాక మీదబెట్టుకున్నది ఎలా కాదో, అదేవిధంగా, ఇక్కడకుడా గ్రహించతగినది. "న ప్రేత్య సంజ్ఞాఽస్తి" (బృహ 4-4-12) అనే శ్రుతిలో ముక్తుడికి జ్ఞానంలేదు అని చెప్పబడినట్లుగా చెప్పడం తప్పు. ఆశ్రుతి సంసారదశలో వాడు అనుభవించినదానివంటి ప్రాకృతమైన జన్మ, మరణం మొదలైనవాటి జ్ఞానం వాడికి ముక్తస్థితిలో లేదనే చెప్తోంది.

*(అవ)* *401. చిన్మాత్రం చ విభుశ్చాత్మేత్యత్ర దోషః ప్రదర్శ్యతే।*

*401. **అవతారిక:** ఆత్మ అనేది జ్ఞానస్వరూపంగానూ, అంతటా నిండినదిగానూ, ఉన్నదని చెప్పే కపిల(సాంఖ్య) బౌద్ధ పక్షాల్లో దోషాన్ని (2-3-32)సూత్రంలో చూపుతున్నారు)

*సి.సూ.॥ నిత్యోపలబ్ధ్యనుపలబ్ధిప్రసఙ్గోఽన్యతరనియమో వాన్యథా॥ (2-3-32) (229)*

**అన్యథా--** ఆత్మని అంతటా నిండిఉన్నదిగానూ, జ్ఞానమాత్రంగానూ,అంగీకరించే పక్షంలో, **నిత్యోపలబ్ధ్యనుపలబ్ధిప్రసఙ్గః--** ఆత్మతాలూకు పుట్టుక, పుట్టుకలేకపోవడమూ, ఎప్పుడూ జరగవలసివస్తుంది. **అన్యతరనియమః వా--** లేక ఆపుట్టుక, పుట్టుకలేకపోవడమూ, అనే ఈరెండింటిలో ఏదో ఒకటి ఎప్పుడూ జరగవలసి వస్తుంది.

*401* ఆత్మనస్సర్వగత్వే చ చిన్మాత్రత్వే చ సర్వదా॥*

*402. స్యతాం సహైవోపలమ్భానుపలమ్భావథాపి వా।*
*సదోపలబ్ధిరేవ స్యాత్ తద్విపర్యయ ఏవ వా॥*

*403. సర్వగశ్చిత్స్వరూపోఽసౌ హేతురస్యాల్లోకవర్తినోః।*
*ఆత్మోపలబ్ధ్యన్యయోశ్చోపలబ్ధేరేవ వా తథా॥*

*404. తదన్యస్యైవ హేతుర్వా హేతుశ్చేదుభయస్య సః।*
*సర్వత్ర సర్వదా తస్యోభయం తద్వర్తతామథ॥*

*405. ఉపలబ్ధేరేవ తదాఽనుపలమ్భో భవేన్నహి।*
*కేవలానుపలబ్ధేశ్చేదుపలబ్ధిర్న తు క్వచిత్॥*

*406. శరీరస్యాన్తరేవావస్థితత్వాన్మన్మతే సదా।*
*తత్రైవాత్మోపలబ్ధిస్స్యాత్ న చాన్యత్రేతి సిధ్యతి॥*

**401*-408. సిద్ధాంతం:** ఆత్మని మనం అంగీకరించినట్లే అణువుగానూ, జ్ఞాతగానూ అంగీకరించకుండా, అంతటా ఉన్నదిగానూ, జ్ఞానాన్ని స్వరూపంగామాత్రమే కలదిగానూ అంగీకరించే సాంఖ్య, బౌద్ధపక్షాల్లో ఆత్మని గురించిన పుట్టుక, పుట్టుకలేకపోవడం ఎప్పుడూ జరుగుతూండవలసి వస్తుంది. లేదా, జన్మ, జన్మలేకపోవడం అనే రెండింటిలో ఏదోఒకటి ఎప్పుడూ జరుగుతూండవలసివస్తుంది. ఎలా అంటే, లోకంలో ఆత్మ అనేది పుట్టడం చూస్తున్నాం, పుట్టకుండా ఉండడాన్నీ చూస్తున్నాం. ఆత్మని జ్ఞానస్వరూపమైనదిగానూ, అంతటా ఉండేదిగానూ అంగీకరించే పక్షంలో అటువంటి ఆత్మే వెనక చెప్పిన తనపుట్టుకకీ, పుట్టకలేకపోవడానికీ కారణం అని చెప్పాలి. ఆఆత్మ అనేది జ్ఞానస్వరూపంగానే ఎప్పుడూ అంతటా ఉండడంవల్ల వెనకచెప్పిన జన్మ, జన్మరాహిత్యం ఒకే సమయంలో ఒకేచోట జరగవలసిరావడం అనే ఈదోషాన్ని తప్పించడంకోసం ఆత్మఅనేది అంతటా, ఎల్లప్పుడూ తన పుట్టుకకే కారణం అయింది అని అంగీకరిస్తే, లోకంలో కనిపించే (ఆత్మతాలూకు) జన్మరాహిత్యం కుదరకుండా పోతుంది. అదేవిధంగా, ఆత్మ అనేది అంతటా ఎప్పుడూ తన జన్మరాహిత్యానికే కారణం అయిందని అంగీకరిస్తే లోకంలో కనిపించే ఆత్మతాలూకు జన్మ కుదరకుండా పోతుంది. మనమతంలో, ఆత్మ అనేది అంతటా ఉన్నది అని అంగీకరించకుండా, శరీరంలో ఒకచోట మాత్రం ఉన్నదని అంగీకరించడంవల్ల అక్కడ మాత్రమే ఆత్మ ఆవిర్భవించడం, వేరేచోట్ల ఆవిర్భవించకుండా ఉండడం చక్కగా కుదురుతుంది. "అంతటా ఉండే ఆత్మ అనేది జడస్వరూపంగా ఉంటూ, ఇంద్రియాలు మొదలైన కరణసంయోగంవల్ల అప్పుడప్పుడు కలిగే జ్ఞానాన్ని కలిగిఉంటుంది." అని అంగీకరించే నైయాయికపక్షంలోకూడా, అన్ని ఆత్మలూ, ఎప్పుడూ, అంతటా ఉన్నా, సమస్తకరణాలతో కూడిన సమస్త ఆత్మలతోనూ అదృష్టం మొదలైన హేతువులు చేరిఉండడంవల్లనూ, వెనుకటిపక్షంలో

చెప్పిన ఉపలబ్ధ్యనుపలబ్ధిప్రసంగం, అన్యతరనియమమనే దోషాలు వచ్చితీరుతాయి. ఇందువల్ల ఆత్మ అనేది అణువై, జ్ఞానస్వరూపమై, జ్ఞానాన్ని ఎప్పుడూ గుణంగాకూడా కలిగినదై ఉంటుంది అన్న పక్షమే ఈఅధికరణంలో ప్రమాణాలు, యుక్తులవల్లా స్థాపించబడినది.

జ్ఞాధికరణం పూర్తి అయింది.

## *॥కర్త్రధికరణమ్॥ (2-3-5)*

## *సి.సూ.॥ కర్తా శాస్త్రార్థవత్త్వాత్॥ (2-3-33) (230)*

**శాస్త్రార్థవత్త్వాత్--** శాస్త్రం ప్రయోజనమున్నదిగా కావలసిరావడంవల్ల, **కర్తా--**ఆత్మ కర్తగాకూడా అయినది.

*409. జీవస్య పూర్వజ్ఞాతృత్వమణుత్వం చ సమర్థితం।*
*కర్తృత్వమపి తస్యైవ స్థాప్యతేఽధికృతావిహ॥*

**409. అవతారిక:** వెనుకటి అధికరణంలో జీవస్వరూపానికి జ్ఞాతృత్వం, అణుత్వం నిరూపించబడ్డాయి. ఈఅధికరణంలో ఆజీవుడికే కర్తృత్వంకూడా ఉంది అని స్థాపించబడుతోంది.

*410.పూ. ప్రధానస్యైవ కర్తృత్వమాత్మనస్తన్న సంభవేత్।*
*"హన్తా చేన్మన్యతే హన్తు"మిత్యాదికఠవాక్యతః॥*

*411. హననాదిక్రియాస్వస్య కర్తృత్వం ప్రతిషిధ్యతే।*
*"అహఙ్కారవిమూఢాత్మా కర్తాహమితి మన్యతే"॥*

*412. "నాన్యం గుణేభ్యః కర్తార"మిత్యాదిభగవద్వచః।*
*స్వరూపమస్యాఽకర్తృత్వం వ్యామోహః కర్తృతాత్మని॥*

*413. భోక్తృత్వమేవ జీవస్యేత్యేవం వక్తి స్ఫుటం హ్యతః.*
*ప్రకృతేరేవ కర్తృత్వం భోక్తృత్వేవాత్మనో భవేత్॥*

***410-413. పూర్వపక్షం:*** జీవుడు తానే కర్తయై (కార్యాలని చేసేవాడై) ఉన్నాడా, లేకఅతను అకర్తగా(కార్యాలని చెయ్యనివాడిగా) ఉంటూనే అచేతనాలైన ప్రకృతిగుణాల కర్తృత్వాన్ని (కార్యాలని చేసేగుణం) తనకి తెచ్చిపెట్టుకుంటున్నాడా అని పరిశీలిస్తే, ఆత్మ అకర్తగాఉన్నాడనే రెండవ పక్షమే తగినదిగా తెలుస్తుంది. ఎందుచేతనంటే, ఆత్మ అకర్తగానే ఉన్నాడని, ప్రకృతిగుణాలకే కర్తృత్వం ఉన్నదనీ అధ్యాత్మశాస్త్రాల్లో చెప్పబడుతోంది. ఉదాహరణంగా కఠవల్లిలో " న జాయతే మ్రియతే" (2-18) అని ప్రారంభించి ప్రకృతివికారమైన దేహంతాలూకు గుణాలైన జన్మ, మరణం మొదలైనవన్నీ జీవుడికి లేవు అని చెప్పి, "హన్తా చేన్మన్యేత హన్తుం హతశ్చేన్మన్యతే హతమ్। ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే॥"(కఠ 2-19) (హింసించేవాడు శత్రువుని తాను హింసిస్తున్నట్లు తలంచినా, హింసింపబడేవాడు, తనని హింసింపబడుతున్నవాడిగా తలంచినా, ఆఇద్దరూ నిజాన్ని తెలియనివాళ్ళు. ముందరివాడు హింసించడమూ లేదు, రెండోవాడు హింసింపబడడమూలేదు) అనే మంత్రంలో హననం (హింసించడం) మొదలైన క్రియల్లో జీవుడికి నిజంగా కర్తృత్వం లేదు అని త్రోసివేయబడుతోంది.

"ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః।
అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే" (గీత 3-27)

(అహంకారంవల్ల కప్పబడిన ఆత్మస్వరూపంగలవాడు ప్రకృతిగుణాలైన సత్త్వరజస్తమస్సులవల్ల అనేక

విధాలైన కర్మలని తానే చేస్తున్నానని భ్రమిస్తున్నాడు)

నాన్యం గుణేభ్యః కర్తారం యథా ద్రష్టాऽనుపశ్యతి (గీత 14-19)

(జ్ఞానవంతుడైనవాడు గుణాలకంటే వేరు కర్త లేడని ఎప్పుడు చూస్తాడో (అప్పుడు నాస్థితిని చేరుతాడు))

"కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే।

పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే॥ (గీత 13-20)

(శరీరేంద్రియాలు కర్మచెయ్యడంలో ప్రకృతే కారణంగా చెప్పబడుతోంది. సుఖదుఃఖాలని అనుభవించడంలో పురుషుడే కారణంగా చెప్పబడుతున్నాడు) అని గీతలో భగవానుడే-- అకర్తగా ఉండడమే జీవుడి స్వరూపమనిన్నీ, తనని కర్తగా తలంచడం భ్రమించడమేననిన్నీ, కర్తృత్వం సత్త్వరజస్తమోగుణాలతోనున్న ప్రకృతిదేననీ, జీవుడికి సుఖదుఃఖాలని అనుభవించడమే ఉన్నదనిన్నీ స్పష్టంగా చెప్పేడు. కనుక, కర్తృత్వం ప్రకృతితాలూకు గుణమేననిన్నీ, జీవాత్మకి అది తగదు, భోక్తృత్వమే తగిఉంటుందనిన్నీ స్పష్టం అవుతోంది.

*సి. 414. ఇత్యసన్మతమాత్మైవ కర్తా శాస్త్రార్థవత్త్వతః।*
*శాస్నాదేవ శాస్త్రం తత్ శాసనం చ ప్రవర్తనమ్॥*
*415. ప్రవర్తకత్వం శాస్త్రస్య బోధోత్పాదనమార్గతః।*
*అచేతనం ప్రధానం న శక్యం బోధయితుం తతః॥*
*416. శాస్త్రాణాం అర్థవత్తాస్య భోక్తుశ్చైతన్యయోగినః।*
*కర్తృత్వం ఏవ హి ఫలం ప్రయోక్తర్యేవ సంభవేత్॥*
*417. యదకర్తృత్వమస్యోక్తం హననాఖ్యకృతౌ చ తత్।*
*హన్తవ్యత్వాభావతోऽస్య నిత్యత్వాదుపపద్యతే॥*
*418. ప్రవృత్తస్యాస్య సంసారే కర్తృతా గుణయోగతః।*
*అతో గుణానాం కర్తృత్వవచనం చోపపద్యతే॥*
*419. "కారణం గుణసఙ్గోऽస్యే"త్యత్రైవార్థోऽయముచ్యతే।*
*"అధిష్ఠానం తథా కర్తే"త్యత్రైవోక్తాऽస్య కర్తృతా॥*
*420. అతః కర్తాచ భోక్తా చ జీవాత్మైవేతి సిద్ధ్యతి।*

***414-*420. సిద్ధాంతం:*** ఈపూర్వపక్షం తప్పు. శాస్త్రం ప్రయోజనమున్నదిగా ఉండాలిగనుక, ఆత్మే కర్తగా అయినాడు. "శాసనాత్ శాస్త్రమ్" అన్న వ్యుత్పత్తిప్రకారం శాసించడంవల్లనే వేదం మొదలైనవి శాస్త్రం అనబడుతున్నాయి. "యజేత" (యాగం చెయ్యవలెను), ఉపాసీత" (ఉపాసించవలెను) అని ఒక్కొక్క కార్యంలోనూ జీవుడిని అధ్యవసాయంగలవాడిగా చెయ్యడమే శాసించడం అవుతుంది.జీవుడికి జ్ఞానాన్ని కల్పించే వాడిని ఆయాకార్యాల్లో వ్యవహరింపచేయసాధ్యం. జ్ఞానంలేని ప్రకృతికి జ్ఞానాన్ని కలిగించి దానిని కార్యాలలో వ్యవహరింపజేయడం సాధ్యంగాదు. కనుక, ఒకకార్యఫలాన్ని అనుభవించే జీవుడికే ఆకార్యంలో కర్తృత్వంకూడా ఉంటేనే శాస్త్రాలు ప్రయోజనంగలవి అవుతాయి. దీన్నే "శాస్త్రఫలం ప్రయోక్తరి"( కార్యాన్ని చేసేవాడిదగ్గిరే శాస్త్రప్రయోజనం ఏర్పడుతుంది) అని పూర్వమీమాంసకులు చెప్పేరు. 'హన్తా చేత్" అని ప్రారంభంఅయే మంత్రం ఆత్మ నిత్యంగనుక, అది చంపబడలేనిది అని భావిస్తోందే తప్ప జీవుడికి హననక్రియలో కర్తృత్వం లేదని భావించినదిగాదు. "ప్రకృతే క్రియమాణాని గుణైః" అన్న గీతాశ్లోకంలో ప్రకృతిగుణాలకి కర్తృత్వం చెప్పబడడం ఈసంసారదశలో జీవుడు ఎన్నో

ప్రయత్నాల్లో వ్యవహరించడం ప్రకృతికార్యమైన తనశరీరంలోఉన్న సత్వాదిగుణాలచేరికచేతనే అనే భావంకలిగినదవుతుంది. గీతలోనే "కారణం గుణసంగోస్య సదసద్యోనిజన్మసు" (గీత 13-21) (ఈజీవుడికి సత్వాదిగుణాల్లోనూ, వాటికార్యమైన సుఖదుఃఖాల్లోనూ ఉన్న సంగం(పట్టు) పుణ్యపాపకర్మలని చేయించి, మంచిజన్మలకీ, చెడ్డజన్మలకీ కారణం అయింది) అన్నశ్లోకంలో గుణాల్లో సంగం వీడిచేత కర్మలని చేయించుతోందని చూపడంద్వారా కర్తృత్వం గుణసంబంధంవల్ల జీవుడికే కలుగుతోందని బలిష్ఠంగా చెప్తోంది.

"అధిష్ఠానం తథా కర్తా కరణంచ పృథగ్విధం।
వివిధా చ పృథక్చేష్టా దైవంచైవాత్ర పఞ్చమమ్॥ (గీత 18-14)

( 1. శరీరం, 2. కర్తైన జీవుడు, 3. మనస్సుతోకూడిన అనేక ఇంద్రియాలు, 4. పంచవృత్తిప్రాణాలు, 5. పరమాత్మ అనే ఐదూ కర్మలకి కారణాలవుతున్నాయి) అన్న గీతాశ్లోకంలో జీవుడిని కర్తా అనే ఎత్తుకొని ఉండడం ఇక్కడ గుర్తించతగినది.కనుక, జీవుడే కర్మలకి కర్తగానూ, వాటి ఫలాన్ని అనుభవించే భోక్తగానూ, అయినాడని స్పష్టం అవుతోంది.

*సి.సూ.॥ ఉపాదానాద్విహారోపదేశాచ్చ॥ (2-3-34) (231)*

**ఉపాదానాత్**-- (శరీరేంద్రియాలని) ఆశ్రయించి, **విహారోపదేశాచ్చ**-- (జీవుడు) సంచరిస్తున్నట్టుగా ఉపదేశించడంవల్లనూ (జీవుడు కర్త).

*420* "ఏతాన్ ప్రాణాన్ గృహీత్వా స్వే శరీరే పరివర్తతే"॥*
*421. ఇతి ప్రాణాద్యుపాదానే విహారే చాస్య కర్తృతా।*
*ఉపదిష్టా తతశ్చాయమేవ కర్తా భవేత్ఖలు॥*

**420*-421. సిద్ధాంతం**: "స యథా మహారాజో జానపదాన్ గృహీత్వా స్వే జనపదే యథాకామం పరివర్తతే। ఏవమేవేష ఏతాన్ ప్రాణాన్ గృహీత్వా స్వే శరీరే యథాకామం పరివర్తతే" (బృహ 4-1-18)( మహారాజు తనదేశంలోనున్న ప్రజలని తీసుకొని తనదేశంలో ఇష్టప్రకారం ఎలా సంచరిస్తున్నాడో, అలాగే ఈజీవుడుకూడా (స్వప్నకాలంలో) ఈఇంద్రియాలతో తన శరీరంలో ఇష్టప్రకారం సంచరిస్తున్నాడు) అని ఉపనిషత్తులో ఇంద్రియాలని ఆశ్రయించడంలోనూ, శరీరంలో విహరించడంలోనూ జీవుడినే కర్తగా ఉపదేశం చెయ్యడంవల్లకూడా జీవుడే కర్తగా అయినాడుగదా!

*సి.సూ.॥ వ్యపదేశాచ్చ క్రియాయాం నచేన్నిర్దేశవిపర్యయః॥ (2-3-35) (232)*

**క్రియాయాం వ్యపదేశాత్ చ**-- (లౌకిక వైదిక)క్రియల్లో (కర్తగా) చెప్పడంవల్లనూ (జీవుడే కర్త) **న చేత్**-- (విజ్ఞానశబ్దంచేత ఆత్మని) చెప్పకపోయినా, **నిర్దేశవిపర్యయః**--(విజ్ఞానేన అని)విభక్తిమార్పు కలిగిఉండవలసింది.

*422. "విజ్ఞానం తనుతే యజ్ఞం కర్మాణి తనుతేఽపి చ"।*
*ఇతి సర్వక్రియాస్వస్య కర్తృవ్యపదేశతః॥*
*423. కర్తాఽయం, నను విజ్ఞానశబ్దాన్నాత్మోచ్యతేఽపితు।*
*అన్తఃకరణరూపోక్తా బుద్ధిరేవేతి చేన్న తత్॥*
*424. తథా సత్యత్ర నిర్దేశవిపర్యాసో భవేత్ఖలు।*
*విజ్ఞానేనేతి కరణవిభక్తిః పఠితా భవేత్॥*
*425. తతో విజ్ఞానశబ్దేన జీవాత్మైవోచ్యతే శ్రుతౌ।*

**422-*425. సిద్ధాంతం:** *"విజ్ఞానం తనుతే యజ్ఞం కర్మాణి తనుతేऽపి చ" (తై. ఆన 5-1)* (జ్ఞానస్వరూపుడైన జీవుడు యాగం మొదలైన వైదికక్రియలని చేస్తున్నాడు, ధనం సంపాదించడం మొదలైన లౌకికకార్యాలనికూడా చేస్తున్నాడు) అని లౌకికాలుగానూ, వైదికాలుగానూ ఉన్న క్రియలని చేసే కర్తగా శ్రుతిలో జీవాత్మే చెప్పబడడంచేత జీవుడే కర్త అయినాడు. 'ఈవేదవాక్యంలో 'విజ్ఞాన'శబ్దంచేత జీవాత్మ చెప్పబడలేదు, అంతఃకరణమైన బుద్ధే విజ్ఞానం అనబడుతోంది" అని పూర్వపక్షులు చెప్పడం కుదరదు. ఎందుకంటే, అంతఃకరణమనేది క్రియకి సాధనమైఉన్నది. "విజానాత్యనేన ఇతి విజ్ఞానమ్" అనే వ్యుత్పత్తివల్ల విజ్ఞానశబ్దంవల్ల జ్ఞానక్రియాసాధనమైన అంతఃకరణాన్ని చెప్పజూస్తే, "కరణే తృతీయా" అన్న వ్యాకరణవ్యవహారప్రకారం తృతీయావిభక్తిరావాల్సిఉండడంవల్ల "విజ్ఞానేన యజ్ఞం తనుతే" (విజ్ఞానమనే బుద్ధిచేత యజ్ఞాన్ని చేస్తున్నాడు) అనే ప్రయోగం జరిగిఉండాల్సింది. ఇక, "విజానాత్యనేన" అని జ్ఞానవిషయంలో బుద్ధిఅనేది కరణం అయిఉన్నప్పటికీ, క్రియావిషయంలో అది కర్తగానే ఉండడంవల్ల తృతీయావిభక్తి రావలసిన అవసరం లేదు అని పూర్వపక్షులు చెప్పుదామనుకుంటే, అదికూడా కుదరదు. ఎందుకంటే, "జ్ఞాతృత్వం, భోక్తృత్వం, కర్తృత్వం" అనే మూడూ ఒకే ఆశ్రయాన్ని పట్టి ఉన్నవేగనుక, బుద్ధిఅనేది జ్ఞానానికీ భోగానికీ కర్తగాగాక కరణంగానూ, క్రియలకి మాత్రం కర్తగానూ అవడం సాధ్యంగాదు. కనుక, జ్ఞానానికీ, భోగానికీ కర్తైన జీవుడే క్రియకికూడా కర్తగా ఉండడం సాధ్యం అనే శ్రుతితాలూకు భావం. అంతఃకరణంఅనే బుద్ధిఅనేది కరణంగానే కాగలదుతప్ప కర్తగా కాలేదని శాస్త్రానికి భావంగనుక "మనసైవ అనుద్రష్టవ్యం", "విజ్ఞానేన విజ్ఞానం ఆదాయ", "బుద్ధ్యాయయా ధారయతే మనః ప్రాణేన్ద్రియక్రియాః" అని అన్నివిధాలైన క్రియలకీ బుద్ధిని కరణంగా భావించి శాస్త్రం తృతీయావిభక్తినే ప్రయోగించింది అదేవిధంగా, "విజ్ఞానేన" అని తృతీయావిభక్తిని ప్రయోగించకుడా, ఇక్కడ "విజ్ఞానమ్" అని జీవుడే చెప్పబడుతున్నాడు అనిన్నీ, వాడే కర్త అనిన్నీ స్పష్టం.

### *సి.సూ.॥ ఉపలబ్ధివదనియమః॥ (2-3-36) (233)*

**ఉపలబ్ధివత్--** (వెనుకటి అధికరణంలో చివరి(2-3-32) సూత్రంలో చెప్పబడిన) ఉపలబ్ధిలాగే, **అనియమః--** (కర్మఫలభోగంలో) నియమంలేకుండాపోతుంది.

*425* ఉపలబ్ధేరనియమః విభుత్వేऽతాక్మనః పురా॥*
*426. య ఉక్తస్తద్వదత్రాపి హ్యకర్తృత్వేऽస్య చాత్మనః।*
*ప్రకృతేశ్చాపి కర్తృత్వే భోక్తృత్వానియమో భవేత్॥*
*427. ప్రకృతేస్సర్వపురుషసామాన్యాదఖిలాః క్రియాః।*
*భోగాయ స్యుః సర్వపుంసాం నైవవా యస్య కస్యచిత్॥*
*428. అన్తఃకరణభేదేऽపి హ్యాత్మనాం సర్వగత్వతః।*
*సాధారణ్యం చానివార్యం వ్యవస్థాऽతో న సిద్ధ్యతి॥*
*429. తతశ్చాస్యైవ కర్తృత్వం, ప్రకృతేర్న హి సర్వథా।*

**425*-*429. సిద్ధాంతం:** వెనుకటి అధికరణం చివరి సూత్రం(2-3-32)లో ఆత్మకి విభుత్వాన్ని ఒప్పుకున్నట్లైతే, ఆత్మ అంతటా ఎప్పుడూ ఉద్భవించి ఉండాల్సివస్తుంది, లేదా ఉద్భవించకుండా పోవాల్సివస్తుంది అని ఉపలబ్ధితాలూకు అనియమం చెప్పబడ్డట్టుగా, ఇక్కడకూడా, ఆత్మని కర్తగా ఒప్పుకోకుండా ప్రకృతినే కర్తగా అంగీకరిస్తే, ప్రకృతి అన్నది సమస్తమైన ఆత్మలకీ సాధారణం అయిఉండడంచేత, ప్రకృతిచేసే సమస్తక్రియలఫలాన్నీ అన్నిఆత్మలే అనుభవించాల్సివస్తుంది. లేదా

ఒకఆత్మకూడా అనుభవించకుండానే పోవాల్సివస్తుంది. "ప్రతీఆత్మకీ అంతఃకరణం (మనస్సు) వేరువేరుగా ఉండడంవల్ల ఈనియమంలేకపోవడం జరగదు. ఎవడు ఏఅంతఃకరణాన్నిగలవాడిగా ఏకర్మని చేసేడో, వాడు ఆఅంతఃకరణంతో ఆకర్మఫలాన్ని అనుభవిస్తాడు అని నియమం చెప్పవచ్చు" అని పూర్వపక్షులు చెప్పాలనుకుంటే ఇదికూడా కుదరదు. ఎందుకంటే, ఆత్మలన్నీ విభువైఉండడంచేత అన్ని ఆత్మలకీ అన్ని అంతఃకరణాలతోటీ సంబంధం ఉంటుంది. అంచేత అంతఃకరణాలతో, కర్మఫలభోగనియమం చెప్పడం కుదరదు. కనుక, జీవుడికే కర్తృత్వం కుదురుతుంది. ప్రకృతికి కర్తృత్వం ఏవిధంగానూ రాదు.

## సి.సూ.॥శక్తివిపర్యయాత్॥ (2-3-37) (234)

**శక్తివిపర్యయాత్--** (ప్రకృతికి కర్తృత్వాన్ని అంగీకరిస్తే దానికే భోక్తృత్వశక్తినికూడా అంగీకరించాల్సి ఉంటుందిగనుక, ఆత్మకి) భోక్తృత్వశక్తి లేకుండా పోతుంది.

*429* ప్రకృతేస్సతి కర్తృత్వే తదన్యస్య తు సర్వథా॥*
*430. భోక్తృత్వాయోగతస్తస్యా ఏవ స్యాత్ భోక్తృతా తతః।*
*ఆత్మనో భోక్తృతాశక్తిర్న స్యాత్సా ప్రకృతేరితి॥*
**431. మానం నాత్మస్థితౌ తస్మాత్కర్తా భోక్తా చ చేతనః।*

***429*-*431.*సిద్ధాంతం:** కర్తగాఉండే తత్త్వమే తానుచేసే కార్యాలఫలాలని అనుభవించవలసి ఉండడంవల్ల బుద్ధినే కర్తగా అంగీకరించేపక్షంలో, దానికే భోక్తృత్వశక్తినికూడా అంగీకరించాల్సివస్తుంది గనుక, ఆత్మకి భోక్తృత్వశక్తిలేకుండా పోతుంది. "పురుషోఽస్తి భోక్తృభావాత్" (సాంఖ్యతత్వకౌముది 27) అన్న ప్రకారం సాంఖ్యులు భోక్తగానే ఆత్మతత్త్వాన్ని అంగీకరించడంచేత ప్రకృతే భోక్త అని స్పష్టమైనతర్వాత ఆత్మఅనే తత్త్వాన్ని అంగీకరించడం అవసరంలేకుండాపోతుంది. కనుక, కర్తగానూ, భోక్తగానూ, జీవుడిని అంగీకరించడమే సరియైనది.

## సి.సూ.॥సమాధ్యభావాచ్చ॥ (2-3-38) (235)

**సమాధ్యభావాత్ చ--** (మోక్షసాధనభూతమైన) సమాధి కుదరకపోవడంవల్లకూడా (ఆత్మే కర్త.)

*431*. కర్తృత్వే ప్రకృతేస్తస్యాః సమాధౌ మోక్షసాధనే॥*
*432. సా స్యాత్కర్త్రీ సమాధిశ్చ ప్రకృత్యన్యోఽస్మ్యహన్త్వితి।*
*ప్రకృతిః ప్రకృతేరన్యాస్మీతి ధ్యాతుమలం న హి॥*

**431*-432. సిద్ధాంతం:** ప్రకృతినే కర్తగా అంగీకరిస్తే, మోక్షసాధనమైన సమాధిని చేసే కర్తకూడా అదే అని అంగీకరించాలి. ఆసమాధిని "ప్రకృతికంటే వేరుగానున్నాను" అనే అనుసంధానమనే సమాధి ప్రకృతికి ఎలా కలిసిఉంటుంది? కనుక, సమాధే కుదరకుండాపోవలసివస్తుందిగనుక, ఆత్మే కర్త అని అంగీకరించడమే తగినది.

## సి.సూ.॥ యథాచ తక్షోభయథా ॥ (2-3-39) (236)

**యథాచ తక్షా ఉభయధా--** (ఆత్మ కర్తగా ఉంటేనే) వడ్రంగివాడిలా (ఇష్టముంటే పనిచేస్తాడు. ఇష్టంలేకపోతే పని చేసేదిలేదు అనే) రెండురకాలైన వ్యవస్థనికూడా (నడుస్తుంది)

*433. వాగాదీన్ద్రియసమ్పన్నోప్యాత్మేచ్ఛతి యదా తదా।*
*కరోతి నేచ్ఛతి యదా న కరోతి తదా యథా॥*
*434. తక్షా వాస్యాదియుక్తోపి స్వేచ్ఛయైవ కరోతి చ।*
*న కరోతి చ, కర్తృత్వే ప్రకృతేరచితస్తథా॥*

*435. వాఙ్మ్ఛాదిహేత్వభావాద్ధి సర్వదా కర్తృతా భవేత్।*
*తస్మాత్ కర్తృత్వభోక్తృత్వే జీవస్యైవేతి సుస్థితమ్॥*

*॥ ఇతి కర్త్రధికరణమ్॥*

**433-435. సిద్ధాంతం**: వాక్కు మొదలైన ఇంద్రియాలతో కలిసిఉన్నప్పటికీ, జీవుడన్నవాడు కోరికఉన్నవాడే, మాట్లాడడం మొదలైన క్రియల్లో అభినివేశంగలిగిఉంటాడు. కోరికలేనప్పుడు అభినివేశం లేదు. చెక్కడం మొదలైన తనపనులకి ఉపకరణమైన ఉలి (వాసి)మొదలైన పనిముట్లతో ఉన్నవాడయినప్పటికీ, వడ్రంగి తాను కోరినప్పుడే ఆపనిని చేస్తున్నాడు. లేకపోతే చెయ్యడంలేదు అనే విషయాన్ని లోకంలో మనం చూస్తున్నాం. అచేతనమైన బుద్ధిని కర్తగా అంగీకరిస్తే, దానికి జీవుడికి ఉన్నట్లుగానేకోరిక, కోరికలేకపోవడం అనే కారణాలు లేకపోవడంవల్ల వెనుక చెప్పిన వ్యవస్థ కలగకుండా ఎప్పుడూ అది కర్తగా ఉండాల్సివస్తుంది. కనుక, కర్తృత్వభోక్తృత్వాలనే రెండూ జీవుడికే ఉన్నవి అన్నది నిశ్చయం అయింది.

కర్త్రధికరణం ముగిసినది

## ॥ పరాయత్తాధికరణమ్ ॥ (2-3-6)

### సి.సూ.॥ పరాత్తు తచ్ఛ్రుతేః ॥ (2-3-40) (237)

**తత్ తు**-- (జీవుడి) ఆకర్తృత్వమైతే, **పరాత్**--పరమాత్మవల్లనే ఏర్పడుతోంది. **శ్రుతేః**--శ్రుతి అలా చెప్పడంవల్ల.

*436. పూర్వం జీవస్య కర్తృత్వం యత్ వ్యవస్థాపితం నయైః।*
*తత్ పరాత్మాధీనమితి స్థాప్యతేఽధికృతావిహ॥*

**436. అవతారిక**: వెనుకటి అధికరణంలో యుక్తులతో జీవుడికి ఉన్నదిగా స్థాపించబడిన కర్తృత్వం పరమాత్మాధీనమైనది అని ఈఅధికరణంలో స్థాపింపబడుతోంది.

*పూ. 437. స్వాయత్తమేవ కర్తృత్వం న పరాయత్తమాత్మనః।*
*పరాధీనం యది స్యాత్తత్ విధ్యాదేర్వ్యర్థతాఽఽపతేత్॥*

*438. యః స్వబుద్ధ్యా ప్రవృత్త్యాదిశక్తః ప్రేర్యస్స ఏవ హి।*
*తస్మాజ్జీవస్య కర్తృత్వం స్వాతన్త్ర్యేణేతి చేన్న తత్॥*

**437-438.-పూర్వపక్షం**: జీవుడి కర్తృత్వం స్వతంత్రమైనదా లేక పరమాత్మకి వశపడినదా అని పరిశీలించినప్పుడు స్వతంత్రమైనది అనే నిర్ణయించాల్సిఉన్నది. ఎందుకంటే, పరమాత్మాధీనంగా జీవుడు కార్యాలని చేస్తున్నాడు అని అంగీకరిస్తే, "ఇదిచెయ్యి, అది చెయ్యి" అని విధించే శాస్త్రాలూ, "దీనిని చెయ్యకు, దానిని చెయ్యకు" అని నిషేధించే శాస్త్రాలూ ఫలంలేనివే అవుతాయి. ఎవడు తనజ్ఞానంతో ఒకకార్యాన్ని ప్రారంభించడమో, దాన్లోంచి వెనక్కిరావడమో వాడే చేస్తున్నాడో, వాడినిగురించే శాస్త్రం ఒకకార్యాన్ని "చెయ్యి"అనీ, మరోకార్యాన్ని "చెయ్యకు" అనిన్నీ ఆజ్ఞాపించశక్యం. కనుక, ఇలా ఆజ్ఞాపించే శాస్త్రాలు ఫలంలేనివికాకుండా ఉండడానికి జీవుడు తనజ్ఞానంతో స్వతంత్రంగానే కార్యాలని చేస్తున్నాడు అనే తీసుకోవాలి.

*439. కర్తృత్వమస్య జీవస్య పరాత్మాయత్తమేవ హి।*
*"అన్తః ప్రవిష్టశ్శాస్తా, య ఆత్మనీ"త్యాదివాక్యతః॥*

*440. "సర్వస్య చాహ"మిత్యాదిగీతావచనతస్తథా।*

*అతో జీవస్. కర్తృత్వం పరాత్మాధీనమిష్యతే॥*

**439-440. సిద్ధాంతం:** జీవుడి కర్తృత్వం పరమాత్మాధీనమైనదే. ఎందుకంటే, వేదవాక్యాలు -- "జీవుడు పరమాత్మవల్ల నియమింపబడే కార్యాలని చేస్తున్నాడు" అనిగదా చెప్తున్నాయి. ఏవాక్యాలలా చెప్తున్నాయంటే, "అన్తః ప్రవిష్టః శాస్తా జనానాం సర్వాత్మా" (తై. ఆర. 3-11-10) (సర్వాంతర్యామియైన భగవానుడు జనాలని లోపలప్రవేశించి నియమిస్తున్నాడు), "య ఆత్మని తిష్ఠన్ ఆత్మనోఽన్తరః యమాత్మా న వేద యస్యాత్మా శరీరం య ఆత్మానమన్తరో యమయతి స త ఆత్మాఽన్తర్యామ్యమృతః" (బృహ 5-7-22) (ఎవడు జీవాత్మకి బైట నించుని ఉన్నాడో, జీవుడిలోపలకూడా ఉన్నాడో, ఎవనిని జీవుడు తెలిసికొనలేదో, ఎవనికి జీవుడు శరీరమో, ఎవడు జీవుడిలోపల ప్రవేశించి నియమిస్తున్నాడో, మరణంలేని ఆఅంతర్యామియే నీకు ఆత్మ అయిఉన్నాడు) మొదలైన శ్రుతులు పరమాత్మే జీవుడిని ఎప్పుడూ నియమిస్తున్నట్లు చెప్పడం చూస్తున్నాం. కనుక, జీవుడి కర్తృత్వం పరమాత్మాధీనమే కావాలి. 'సర్వస్యచాహం హృదిసన్నివిష్టః మత్తః స్మృతిర్జ్ఞానమపోహనం చ" (గీత. 15-15)(సమస్తజీవుల హృదయాల్లోనూ నేను ఉంటున్నాను. నావల్లనే జీవుడికి తలంపు, జ్ఞానం, మరుపు మొదలైనవన్నీ కలుగుతున్నాయి), "ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి। భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥" (గీత. 18-61) (అర్జునా! సర్వేశ్వరుడైన వాసుదేవుడు అందరు జనాల హృదయదేశాల్లో ప్రకృతి అనే యంత్రంలో ఎక్కిఉండే, వాటిని సత్వాదిగుణమయమైన ప్రకృతికార్యమైన శరీరేంద్రియాలతో ఆయా సత్వాదిగుణాలకి అనుగుణమైన క్రియలలో అభినివేశంతో ఉన్నాడు) అని గీతలోకూడా, ఈఅర్థమే చెప్పబడింది. కనుక, జీవుడి కర్తృత్వం పరమాత్మాధీనమైనది అనే గ్రహించాలి.

*సి.సూ.॥ కృతప్రయత్నాపేక్షస్తు విహితప్రతిషిద్ధావైయర్థ్యాదిభ్యః ॥ (2-3-41) (238)*

**కృతప్రయత్నాపేక్షః తు--** (సమస్తకార్యాల్లోనూ) జీవుడిచేత చెయ్యబడిన (మొదటి)ప్రయత్నాన్ని ఎదురుచూసే, (పరమాత్మ ఆప్రయత్నాన్ని అనుమతించి ఆకార్యాన్ని చేయిస్తున్నాడు) (ఎందుకంటే) **విహితప్రతిషిద్ధ -అవైయర్థ్యాదిభ్యః--** విధినిషేధశాస్త్రాలు వ్యర్థంకాకుండాఉండాలనికోరడం మొదలైన కారణాలవల్ల.

*441. సర్వక్రియాసు జీవేనప్రథమం స్వేచ్ఛయా కృతం।*
*యత్నం పరాత్మాపేక్ష్యాథ తత్రానుమతిదానతః॥*

*442. ప్రవర్తయత్యయం చార్థః విధ్యవైయర్థ్యతస్తథా।*
*నిగ్రహానుగ్రహాభ్యాం చ జ్ఞాయతేఽతః పరాత్మనా॥*

*443. ప్రవర్తితోఽపి జీవాత్మా యోగ్యో విధినిషేధయోః।*
*తస్మాజ్జీవస్య కర్తృత్వం పరాయత్తమితి స్థితమ్॥*

*444. ఔదాసీన్యానుమన్తృత్వేప్రేరకత్వమితీశితుః।*
*ఆకారాస్సన్తి తత్రాద్యప్రవృత్తౌ ప్రత్యగాత్మనః॥*

*445. ఔదాసీన్యం, ద్వితీయాదిప్రవృత్తావనుమన్తృతా।*
*తదభావే ప్రవృత్తేరప్యాత్మనోఽసంభవాత్తథా॥*

*446. య ఈశస్యానుకూల్యే వా ప్రాతికూల్యేఽథవా పుమాన్।*
*అత్యన్తవ్యవసాయ్యస్మిన్ విషయే ప్రేరకత్వవాన్॥*

*॥ఇతి పరాయత్తాధికరణమ్॥*

**441-446. సిద్ధాంతం**: కర్తృత్వం పరమాత్మాధీనం అని అంగీకరిస్తే, విధినిషేధశాస్త్రాలు వ్యర్థమై పోతాయి అని పూర్వపక్షంలో చెప్పబడిన ఆక్షేపానికి ఇక పరిహారం చెప్పబడుతోంది. అన్ని కర్మలనీ ప్రారంభించేటప్పుడు జీవుడు తన ఇష్టప్రకారం మొదటి క్షణంలో చేసే ప్రయత్నాన్ని పరమాత్మ అనుమతించకుండానూ, అడ్డుకోకుండానూ ఉపేక్షించి ఉంటాడు. మరుక్షణంనించీ చేసే ప్రయత్నాలని మొదటి ప్రయత్నానికి అనుగుణంగానే చెయ్యడానికి అనుమతించడంద్వారా జీవుడిచేత కార్యాలు చేయిస్తున్నాడు. ఎందుకిలా అంగీకరించాలి? అంటే, మొదటి ప్రయత్నంలోకూడా జీవుడిని కార్యంచెయ్యడానికి పరమాత్మే ప్రేరేపిస్తున్నాడని అంగీకరిస్తే "ఇది చెయ్యి, అది చెయ్యి" అంటూ విధించే శాస్త్రాలూ, "ఇది చెయ్యకు, అది చెయ్యకు" అని నిషేధించే శాస్త్రాలూ వ్యర్థమైపోతాయి. తానే ప్రేరేపించి పుణ్యపాపకర్మల గురించి పరమాత్మే క్రమంగా ప్రీతిని, కోపాన్నీ చూపించడం, దానికారణంగా పుణ్యం చేసినవాడికి సుఖాన్నీ, పాపం చేసినవాడికి దుఃఖాన్నీ ఇవ్వడం కుదరకుండా పోతాయి. కనుక, పరమాత్మవల్ల జీవుడు తనచేత కార్యాలు చేయించబడినవాడైనా, జీవుడు మొదటిప్రయత్నంలో స్వాతంత్ర్యంపొందినందువల్ల వాడు శాస్త్రవిధినిషేధాలకి అర్హత పొందినవాడైనాడు. జీవుడు కర్మలని చేసేటప్పుడు 1. ఉదాసీనుడై ఉండడం, 2. అనుమతించేవాడవడం, 3. ప్రేరేపించేవాడవడం అని మూడాకారాలు పరమాత్మకి ఉన్నాయి. వాటిలో 1. జీవుడు మొదటిక్షణప్రయత్నంలో పరమాత్మ దాన్ని అనుమతించకుండాను, అడ్డుకోకా, జీవుడిని వాడిదారికివాణ్ణి వదిలేసివాడుచేసేకర్మల్లో ఉదాసీనుడుగా ఉంటున్నాడు. 2. జీవుడు మొదటిక్షణంలో తన ఇష్టప్రకారం ఒకవిధంగా కార్యాన్ని మొదలుపెట్టినతర్వాత రెండోక్షణంనించీ వాడుచేసే పరయత్నాలని పరమాత్మ అనుమతిస్తున్నాడు. ఇది ఎందుకోసం? అంటే, పరమాత్మ అనుమతిలేకపోతే, జీవుడిచేత మొదలుపెట్టబడిన కార్యాన్ని చెయ్యలేడుగదా, అందుకే అనుమతిస్తాడని శాస్త్రవచనాలనిబట్టి అంగీకరిస్తున్నాం. పరమాత్మ అనుమతిలేకుండా మొదటిక్షణంలోనే వీడు ఎలా కార్యాన్ని ప్రారంభించగలడు? అంటే విధినిషేధశాస్త్రాలు వ్యర్థమైపోవడం మొదలైన వెనుకచెప్పిన దోషాలు రాకుండా ఉండడానికి పరమాత్మే జీవుడికి ఆస్వాతంత్ర్యబుద్ధిని ఇస్తున్నాడుగనుక మొదటిక్షణంలో జీవుడు తానే కార్యాన్ని ప్రారంభించడానికి అడ్డులేదు. రాజు మొదలైనవాళ్ళు తమ ఇష్టప్రకారం మంత్రి మొదలైనవాళ్ళకి కొన్నివిషయాల్లో స్వతంత్రాన్నిస్తే, దాంతో మంత్రులు మొదలైనవాళ్ళు తమ ఇష్టప్రకారం కార్యంచేసేటప్పుడు రాజుతాలూకు స్వాతంత్ర్యానికి, మంత్రిగారి పారతంత్ర్యానికీ లోటురానట్లుగానే పరమాత్మచేత తన ఇష్టప్రకారంఇయ్యబడిన స్వాతంత్ర్యబుద్ధితో జీవుడు పూర్వకర్మని ఎదురుచూడకుండా వాసననికూడా ఎదిరించగలవాడై, మొదటిప్రయత్నం చేసేటప్పుడు సర్వేశ్వరుడి స్వాతంత్ర్యానికిగాని, సర్వకారణత్వానికిగాని కర్మానుగుణఫలప్రదత్వానికిగాని జీవుడిపారతంత్ర్యానికిగాని ఏలోటూ కలగదు. 3. "ఏష హ్యేవ సాధుకర్మకారయతి యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతి। ఏష ఏవ అసాధుకర్మకారయతి తమ్ యమధో నినీషతి" (కౌషీతకి 3-9) (ఏజీవుడిని ఈప్రాకృతలోకాల్లోంచిమీదకి తీసుకువెళ్ళడానికి పరమాత్మకోరుకుంటాడో, వాడిచేత ఈపరమాత్మే మంచి కర్మలని చేయిస్తాడు. ఏజీవుడిని ఈపరమాత్మేఅధోలోకాల్లోకి త్రోసివేయాలనుకుంటాడో, వాడిచేత ఈపరమాత్మే పాపకర్మలని చేయిస్తాడు) "దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తితే" (గీత 10-11) (ఎవడు నన్ను పొందడానికి మార్గం చూపే బుద్ధినినేనే వారికి ఇస్తాను) "తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్। క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు" (గీత 16-19) (నన్ను ద్వేషించేవాళ్లై క్రూరులై, మనుష్యుల్లో అధములై, అమంగళకరమైనవారైన వాళ్ళని సంసారగతిలో

అసురయోనులలో ఎప్పుడూ నేనే (త్రోసివేస్తాను) అని పరమాత్మే జీవుడిని పుణ్యపాపకర్మలలో ప్రేరేపించి దానికనుగుణమైన ఫలాలని ఇస్తాడని కొన్ని శ్రుతి స్మృతివాక్యాలు చెప్పడానికి అర్థం ఏమిటి? అంటే, ఈశ్వరుడిచేత, మొదటిప్రయత్నంలో ఇయ్యబడిన స్వాతంత్ర్యాన్ని సరిగ్గా ఉపయోగించుకొని ఎవరు పరమాత్మకి చాలా అనుకూలులైఉంటారో, వాళ్ళని ఈశ్వరుడు మంచికర్మలు(పుణ్యకర్మలు) ఇంకాఇంకా ముందరచేసేందుకు ప్రేరేపించివాళ్ళకి మంచిగతిని ఇస్తాడు అనిన్నీ, ఆస్వాతంత్ర్యాన్ని తప్పుగా ఉపయోగించుకొని ఎవళ్ళు పరమాత్మకి చాలా ప్రతికూలురుగా ఉంటారో, వాళ్ళని ఆయన చెడ్డకార్యాలని ఇంకా ముందుముందు చేసేటట్టుగా ప్రేరేపించి వాళ్ళకి దుర్గతులని ఇస్తాడని ఆశ్రుతిస్మృతులు చెప్తున్నాయిగనుక, ఇవికూడా జీవుడి ఇదివరకటి మొదటి ప్రయత్నాల ఫలమే అవుతుంది. కనుక, ఇలా తరువాతిప్రయత్నాల్లో పరమాత్మ జీవుడిని కార్యంచేయ్యడానికి అనుమతించడం మొదటి ప్రయత్నపు ఫలంగనుకనూ, మొదటి ప్రయత్నంలోనే కొంతమందిని ప్రేరేపించడం ఇదివరకటి మొదటి ప్రయత్నఫలంగనుకనూ, ఏవిధమైన లోటూ లేదు. మొదటిప్రయత్నంలో పరమాత్మకి కారయితృత్వమనే (చేయించడం అనే)విశేషకారణత్వం లేకపోయినా, జీవుడికి ఆస్వాతంత్ర్యబుద్ధిని ఇచ్చేవాడు పరమాత్మేగనుక, జీవకర్తృత్వవిషయంలో సామాన్య కారణత్వం ఉండే చేస్తోంది. కనుక, పరమాత్మతాలూకు సర్వకారణత్వానికి దోషం కలగలేదు. ఇలా జీవుడి కర్తృత్వం పరమాత్మాధీనమే.

పరాయత్తాధికరణం పూర్తి అయింది.

## *|| అంశాధికరణమ్ || (2-3-7)*

### *సి.సూ.|| అంశో నానావ్యపదేశాదన్యథా చాపి దాశకితవాదిత్వమధీయత ఏకే || (2-3-42) (239)*

**అంశః--** (జీవుడు బ్రహ్మయొక్క) అంశమై ఉన్నవాడే. **నానావ్యపదేశాత్--** (కొన్ని శ్రుతులలో జీవుడు బ్రహ్మకంటే) వేరైనవాడని ఉపదేశించడంచేతనూ, **అన్యథా చ(వ్యపదేశాత్)--** (కొన్ని శ్రుతులలో) మరోవిధంగా (అంటే, బ్రహ్మంతో ఒకటైనవాడిగా ఉపదేశించడంవల్లా) **దాశకితవాదిత్వం అపి--** (బ్రహ్మం) దాసులు, ఏతవాళ్ళు మొదలైన కిందిజాతివారిగా ఉండడంకూడా, **ఏకే--** కొంతమంది భేదవాదులు, **అధీయతే--** చెప్తారు.

*447. పూర్వం జీవస్య కర్తృత్వం పరాయత్తమితీరితమ్।*
*తేన జీవబ్రహ్మణోశ్చ రాజతద్భృత్యయోరివ॥*

*448. అత్యన్తభేదానగమాత్ తదభేదార్థకశ్రుతేః।*
*ఆశ్రిత్యాముఖ్యతాం ప్రాప్తో వాదోऽత్ర వినివార్యతే॥*

**447-448. అవతారిక:** వెనుకటి అధికరణంలో జీవుడి కర్తృత్వం పరమాత్మాధీనమందని చెప్పబడింది.ఈవిధంగా, నియమించే రాడూ, నియమింపబడే (వాడి)పనివాడిలా నియమించే బ్రహ్మం, నియమించబడే జీవుడు చాలా భేదమైనవాళ్ళని స్పష్టమవడంవల్ల, ఇద్దరినీ ఒక్కరేఅని చెప్పే అభేద శ్రుతులు అముఖ్యమనే గ్రహించాలని (ద్వైతుల) వాదం ఈఅధికరణంలో నిరసింపబడుతోంది.

*పూ. 449. జీవః పరాత్మతోऽత్యన్తభిన్నో "జ్ఞాజ్ఞా"వితి శ్రుతేః।*
*అభేదశ్రుతయోऽముఖ్యాః విరుద్ధార్థబోధనాత్॥*

*450. భ్రాన్తం బ్రహ్మైవ వా జీవః బ్రహ్మాత్మత్వోపదేశతః।*
*"అయమాత్మా బ్రహ్మ, తత్త్వమసీ"త్యాద్యభేదశ్రుతౌ॥*

*451. భేదశ్రుతిస్తు ప్రత్యక్షసిద్ధభేదానువాదినీ।*
*యద్వా బ్రహ్మోపాధియుక్తం జీవ ఉక్తాభిదాశ్రుతేః॥*

**449. ద్వైతుల పూర్వపక్షం:** జీవుడు పరమాత్మకంటే చాలా భిన్నమైనవాడే. "జ్ఞాజ్ఞౌద్వావజావీశనీశౌ" (శ్వే.1-9) (ఈశ్వరుడూ, జీవుడూ అనే ఇద్దరూ క్రమంగా సర్వజ్ఞుడూ, అజ్ఞుడుగానూ, నియమించేవాడూ, నియమింపబడేవాడుగానూ ఉన్నారు) మొదలైన శ్రుతులు జీవుడిని పరమాత్మకంటే చాలా భిన్నమైనవాడని గదా చూపిస్తున్నాయి! ఆఇద్దరినీ ఒక్కరిగాకూడా కొన్ని శ్రుతులు చూపుతున్నాయిగదా అంటే, "ఆదిత్యో యూపః" అని యూపస్తంభాన్ని సూర్యుడిగా చెప్పే శ్రుతి ప్రత్యక్షవిరుద్ధంగనుక 'ఆదిత్యుడివంటి ప్రకాశంగలది యూపస్తంభం" అని దానికి అముఖ్యంగా అర్థం చెప్పుకున్నట్లుగా, వెనకచెప్పిన ఎన్నో భేదశ్రుతులకి వ్యతిరేకంగనుక, అభేదశ్రుతులకి "బ్రహ్మానికి జీవుడు పరతంత్రుడు అని అముఖ్యంగానే అర్థం చెప్పుకోవాలి. లేకపోతే, "అగ్నినా సించేత్" (నిప్పుతో తడపవలెను) అన్నవాక్యంలా శ్రుతివాక్యాలు ఒకదానికొకటి వ్యతిరేకించినవే అవుతాయి.

450-*451. **అద్వైతుల పూర్వపక్షం:** బ్రహ్మమే మాయచేత భ్రాంతిచెంది జీవుడిగా అవతరించింది అనే చెప్పుకోవాలి. ఎందుకంటే, "అయమాత్మా బ్రహ్మ" (బృహ 6-5-4) (ఈజీవాత్మ బ్రహ్మమే), "తత్ త్వమసి" (ఛాం. 6-10-3) ( నువ్వు బ్రహ్మమే అయినావు) మొదలైన అభేదశ్రుతుల్లో బ్రహ్మం, జీవాత్మ ఒకటి అనిగదా ఉపదేశించబడుతోంది! ద్వైతులు ప్రమాణంగా చెప్పే భేదశ్రుతులు - ప్రత్యక్షంతో తోచే భేదాన్ని, అభేదశ్రుతులతో త్రోసిపుచ్చడానికి అనువదిస్తున్నవే తప్ప భేదాన్ని విధిస్తున్నవిగావు.

*452. అస్యోపాధేర్భ్రాన్తిపరికల్పితత్వం న సంభవేత్।*
*బన్ధమోక్షవ్యవస్థాయాస్సర్వథాऽనుపపత్తితః॥*
*453. భేదశ్రుతిస్తు గౌణ్యేవ, నేశాంశో జీవ ఇష్యతే।*

**451*-*453. భేదాభేదవాదుల పూర్వపక్షం:** ముందర చెప్పిన రెండుపక్షాలూ తప్పే. నిజమైన ఉపాధివల్ల బ్రహ్మమే జీవుడిగా తోస్తోందని అభేదశ్రుతులవల్ల స్పష్టం అవుతోంది. మిధ్యయైన మాయవల్ల బ్రహ్మం మూతబడిపోతోందని అద్వైతులు చెప్పేది కుదరదు. మిథ్యఅనే మాయవల్ల సుఖదుఃఖానుభవ రూపమైన సంసారబంధం కలుగుతోంది అన్నదీ, తరువాత వాక్యార్థజ్ఞానంవల్ల ఆఆనుభవంపోవడం అనే మోక్షంరావడం అనేదీరెండూ కుదరనివేగదా! అభేదశ్రుతులకి విరుద్ధంగా ఉండడంవల్ల, భేదశ్రుతులు ఉపాధికల్పితమైన భేదాన్ని చెప్పుతున్నాయనే అముఖ్యమైనదిగా అర్థం చెప్పుకోవాలి.

*453* ఏకవస్త్వేకదేశత్వం హ్యంశత్వం నాస్య తద్భవేత్॥*
*454. తస్య బ్రహ్మైకదేశత్వే తద్దోషౌఘః పరే భవేత్।*
*న బ్రహ్మఖండో జీవోऽస్య ఖణ్డనాదేరసంభవాత్॥*

453*- 454. **పూర్వపక్షాల సిద్ధాంతదూషణం:** జీవుడు బ్రహ్మతాలూకు అంశం అని సిద్ధాంతం చెయ్యడం కుదరనిది.ఒకవస్తువులో ఒకభాగంఅనేకదా అంశం అంటే. అవయవాలులేని బ్రహ్మన్ని భాగాలుభాగాలుగా విడదాయడం కుదరదుగనుక, జీవుడు బ్రహ్మలో ఒకభాగమైన అంశం అని అనుకుంటే జీవుడి దోషాలన్నీ పరమాత్మవే అవాల్సివస్తుంది. కనుక, జీవుడు బ్రహ్మతాలూకు అంశం అన్నది కుదరదు.

సి. *455. ఇతి చేన్న బ్రహ్మణోంశః జీవో భేదోపదేశతః।*
*అభేదవ్యపదేశాచ్చ, పరస్యైకే చ శాఖినః॥*
*456. 'బ్రహ్మ దాశ" ఇతి శ్రుత్యా దాశత్వాద్యపృథియతే।*

*ఏతేన సర్వజీవాత్మవ్యాపిత్వేనాభిదోచ్యతే॥*

***457.*** *విశిష్టవస్త్వేకదేశోఽపృథక్సిద్ధవిశేషణం।*
*యత్, తదేవ ద్రవ్యమంశశబ్దవాచ్యం భవేదిహ॥*

***458.*** *చేతనాచేతనాభ్యాం చ విశిష్టం బ్రహ్మ సర్వదా।*
*జీవస్యబ్రహ్మదేహత్వం "యస్యాత్మే'త్యాదినా శ్రుతమ్॥*

***459.*** *శరీరం హ్యపృథక్సిద్ధద్రవ్యభూతవిశేషణం।*
*అతో జీవస్య పూర్వోక్తమంశత్వం స్యాత్పరం ప్రతి॥*

***460.*** *శరీరవాచిశబ్దానాం దేహిపర్యన్తవాచితా।*
*ఆకృతిన్యాయసిద్ధాఽతః శబ్దానాం జీవవాచినామ్॥*

***461.*** *బ్రహ్మపర్యన్తవాచిత్వాత్ తత్త్వమస్యాదిషు శ్రుతమ్।*
*సామానాధికరణ్యంహి ముఖ్యం స్యాల్లక్షణం వినా॥*

***462.*** *భేదశ్రుతిస్తు సర్వత్ర స్వరూపేణ స్వభావతః।*
*జీవేశయోర్మిథో భేదం వక్త్యతోఽస్యాశ్చ ముఖ్యతా॥*

***463.*** *తస్మాస్సిద్ధాంతినాం సర్వశ్రుతేర్ముఖ్యత్వమక్షతమ్।*
*అతో జీవః పరాత్యన్తభిన్నః స్యాదితి వాక్ హతా॥*

***464.*** *నిత్యనిర్దుష్టసర్వజ్ఞబ్రహ్మణో భ్రాన్తతాదశా।*
*న కదాపి భవేత్తస్మాత్పక్షోఽయమపి వారితః*

***465.*** *పరస్య సుఖదుఃఖాదేరాశ్రయత్వ ప్రసజ్గతః।*
*తృతీయశ్చాపి పక్షోఽయం సుదూరం వినివారితః॥*

***466**** *తస్మాజ్జీవో బ్రహ్మణోంఽశః ఇతి పక్షః సమఞ్జసః।*

455-466. సిద్ధాంతం: ఈమూడు పూర్వపక్షవాదనలూ సరిగా లేవు. కొన్ని శ్రుతులు జీవబ్రహ్మలకి భేదాన్ని చెప్తున్నాయి. కొన్ని శ్రుతులు వాటికి అభేదాన్ని చెప్తున్నాయి. ఈరెండు శ్రుతులున్నూ ముఖ్యమైనవి కావాలంటే జీవుడిని బ్రహ్మయొక్క అంశంగా తీసుకోవాలి. అధర్వణవేదానికి చెందిన బ్రహ్మసూక్తం "బ్రహ్మదాశా బ్రహ్మదాసా బ్రహ్మమేమే కితవాః" అని దాసరులు, కితవలు మొదలైన తక్కువవాళ్ళైన వేటజాతికి చెందిన జీవులుగా, బ్రహ్మన్ని చెప్తోంది. ఇలా అందరు జీవులకీ బ్రహ్మనికీ అభేదం చెప్పబడడంవల్ల దాన్ని శుకబ్రహ్మం అన్నట్టుగా గొప్పదనాన్నిచ్చి బ్రహ్మం జీవులే అన్నట్టుగా ఔపచారికంగాకూడా నిర్వహించడం కుదరదు. కనుక భేదశ్రుతులు, అభేదశ్రుతులు అయిన రెండురకాలైన శ్రుతులు ముఖ్యార్థం పొందడానికి జీవుడు బ్రహ్మఅంశం అని అంగీకరించాల్సిందే. విడదీయలేని విశేషణాలతో ఉన్న వస్తువు విశిష్టం అవుతుంది. ఈవిశిష్టపదార్థానికున్న విశేషణాలు అందులో ఒకభాగం గనుక ఇక్కడ అంశం అనబడుతున్నాయి. చేతనపదార్థాలు, అచేతనపదార్థాలు బ్రహ్మన్ని వదిలి విడదీయరానట్లుగా ఎప్పుడూ దానితోటే కలిసిఉండే విశేషణాలైఉండడంవల్ల అవి బ్రహ్మంశాలైనాయి. శరీరమనేది ఆత్మకి విడదీయరాని ద్రవ్యరూపమైన విశేషణం అయిఉన్నది."యస్యాత్మా శరీరమ్" (బృహ 5-7-22) అని శ్రుతుల్లో జీవుడు బ్రహ్మకి శరీరమని వర్ణించబడడంవల్ల బ్రహ్మనివదిలి విడదీయరాని విశేషణమై బ్రహ్మకి అంశమైనాడు. శరీరాన్ని చెప్పే శబ్దాలు శరీరియైన పరమాత్మనికూడా చెప్తుతున్నాయని స్పష్టం అవుతోంది. కనుకనే "తత్ త్వమసి" (ఛాం. 6-10-3) (నీవు బ్రహ్మమైనావు)

మొదలైన శ్రుతుల్లో అద్వైతులలా "తత్" అనే శబ్దంలోనూ, "త్వమ్' అనే శబ్దంలోనూ విశేషాలన్నింటినీ వదిలి లక్షణవల్లనే నిష్కృష్టస్వరూపాన్ని చెప్పుతున్నదని అనుకోవాల్సిన అవశ్యం, ద్వైతులలాగ అముఖ్యంగా 'బ్రహ్మానికి జీవుడు పనివాడిలా పరతంత్రుడుగనుక ఇద్దరినీ ఒకటంటోంది" అని చెప్పుకో వలసిన అవసరంలేకుండా బ్రహ్మానికీ జీవుడికీ అభేదాన్ని చెప్పే శ్రుతులు శరీరాత్మభావం అనే అంశాంశీ భావంతో ముఖ్యంగానేఉంటున్నాయి. జీవుడిని శరీరరూపమైన అంశంగానే తీసుకోవడంవల్ల బ్రహ్మం అవయవాలులేనిది అనే శ్రుతికూడా మనకి వ్యతిరేకంగా కనబడదు. శరీరమైన జీవుడి దోషాలు శరీరిఐన పరమాత్మకి అంటవు. భేదశ్రుతులు - ప్రత్యక్షసిద్ధమైన భేదాన్ని అభేదశ్రుతులవల్ల త్రోసివేయడానికి అనువదిస్తున్నాయి అని అద్వైతులు చెప్పడంకూడా సరిగాదు. బ్రహ్మం లోకాన్ని సృష్టించి రక్షించి, నశింపజేస్తోంది, వ్యాపించి ధరించి నియమిస్తోంది మొదలైన- ప్రత్యక్షంచేత సిద్ధించని భేదాలనికదా భేదశ్రుతులు ఉద్ఘోషిస్తున్నాయి. భేదశ్రుతులు జీవులకీ, బ్రహ్మానికీ స్వరూపంలోనూ, స్వభావంలోనూ ఉన్న సమస్తభేదాలనీ చెప్పున్నవిగనుక మనపక్షంలో అవికూడా ముఖ్యం అయినాయి. కనుక, సిద్ధాంతంలో భేదశ్రుతులు, అభేదశ్రుతులు శరీరాత్మభావమనే అంశాంశీభావాన్ని చెప్పే ఘటకశ్రుతులు మొదలైన సమస్తశ్రుతులూ దోషంలేకుండా ముఖ్యం అవుతున్నాయి. కనుక, జీవాత్మ పరమాత్మకంటే చాలాభిన్నమైనవాడని చెప్పే ద్వైతులమతం నిరసింపబడింది. ఎప్పుడూ దోషం లేనిదై, అన్నింటినీ తెలిసిన పరమాత్మవస్తువు, మాయచేత కప్పబడింది అని చెప్పడంకూడా ఒక్కసారికూడా తగలదు. కనుక అద్వైతులపక్షంకూడా నిరసింపబడ్డది. నిజమైన ఉపాధివల్ల బ్రహ్మమే జీవుడిగా తోస్తోందనే భేదాభేదవాదులపక్షంలోకూడా పరమాత్మేసుఖదుఃఖాలుగలవాడుకావలసిరావడంవల్ల అదీ అసలే కుదరదు. కనుక జీవుడు శరీరమైఉండి బ్రహ్మతాలూకు అంశమౌతున్నాడు అనే పక్షమే తగియున్నదైంది.

## *సి.సూ.॥ మంత్రవర్ణాత్ ॥ (2-3-43) (240)*

**మంత్రవర్ణాత్--** మంత్రవర్ణంచేతకూడా (జీవుడు బ్రహ్మయొక్క అంశమే.)

*466* "పాదోస్య విశ్వాభూతానీ"త్యాదిపుంసూక్తమన్త్రతః॥*

**467. బ్రహ్మంశఏవ జీవోఽత్ర పాదశబ్దోఽ ంశవాచకః।*

***466*-*467.*** సిద్ధాంతం: *"పాదోఽస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి"* (సమస్తజీవరాసులూ ఇతని ఒకపాదభాగము. పరమపదంలో ముక్కాలుభాగం ఉన్నది) అని పురుషసూక్తంలో జీవుడిని బ్రహ్మకి అంశంగానే చెప్పిఉండడంకూడా ఈవిషయంలో ప్రమాణం. పాదశబ్దం కాలిభాగాన్ని చెప్పుందిగనుక అంశం అనే అర్థంగలది అని స్పష్టం.

## *సి.సూ.॥ అపి స్మర్యతే ॥ (2-3-44) (241)*

**స్మర్యతే అపి--** (జీవుడు పురుషోత్తముడి అంశమే అని) స్మృతిలోకూడా(గీతలో) చెప్పబడుతోంది.

*467* మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః"॥*

**468. ఇతి జీవస్య గీతాయాం స్మర్యతే హి పరాంశతా।*

467*-*468. సిద్ధాంతం: *'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః"* (గీత 15-7) (బద్ధజీవులు ఉండే ఈలోకంలో అనాదికాలంగా ఉన్న బద్ధజీవుడుకూడా నా అంశంగా ఉన్నవాడే) అని గీతలో జీవుడు పరమాత్మ అంశంగానే ఘోషింపబడుతున్నాడు. ఇందువల్లకూడా జీవుడు బ్రహ్మయొక్క అంశమే అని స్పష్టం అవుతోంది.

## *సి.సూ.॥ ప్రకాశాదివత్తు నైవం పరః ॥ (2-3-45) (242)*

**ప్రకాశాదివత్ తు--** (జీవుడు) ప్రకాశం మొదలైనవాటి (మణి మొదలైనవాటికి)వలె (పరమాత్మకి అంశం అనబడుతున్నాడు) **పరః--** పరమాత్మ, **న ఏవమ్--** (స్వరూపస్వభావాల్లో) జీవుడివంటివాడుకాడు.

*468*. జీవః ప్రకాశాదిరివ పరమాత్మాంశ ఉచ్యతే॥*

*469. యథా ప్రకాశో మణ్యాదేరంశః స్యాత్తద్విశేషణమ్।*
*తథాత్మదేహకత్వాత్తద్విశిష్టస్య పరాత్మనః॥*

*470. జీవోంశః స్యాద్విశిష్టైకదేశరూపవిశేషణమ్।*
*విశిష్టస్యాంశ ఏవ స్యాదేవం జాతిగుణాదయః॥*

*471. విశేషణత్వైకరూపాః ద్రవ్యాంశా ఏవ సర్వదా।*
*విశేషణవిశేషాఖ్యజీవాత్మేశ్వరయోర్ద్వయోః॥*

*472. స్వరూపస్యస్వభావస్యన్తభేదాత్ పరస్పరమ్।*
*యత్స్వరూపో యత్స్వభావో జీవో నైవం పరోభవేత్॥*

**473. సర్వజ్ఞస్సత్యసఙ్కల్పో నిరవద్యః పరః పుమాన్।*

**468*-*473. సిద్ధాంతం:** జీవుడు పరమాత్మ అంశమైతే జీవుడు బ్రహ్మయొక్క ఒకభాగమే అని అవడంచేత జీవుడికి ఉన్న దోషాలు బ్రహ్మనివే అవుతాయిగదా అనే సందేహం ఈసూత్రంలో తీర్చబడుతోంది. ప్రకాశం మొదలైన విశేషణాలు మణి, సూర్యుడు మొదలైన విశేష్యాలని వదిలి విడదీయలేని అంశాలుగా ఉన్నాయి. "గో"మొదలైన విశేష్యాలకి "గోత్వం"మొదలైన జాతులు విడదీయరాని విశేషణాలైఉన్నాయి. దేహంతోకలిసిఉన్న దేహియైన(జీవుడైన) విశేష్యానికి అతనిదేహాన్ని వదిలి విడదీయరాని విశేషణమై ఉన్నది. వీటిలాగే, జీవుడుకూడా విశేష్యమైన పరమాత్మకి వదిలి విడదీయరాని శరీరరూపమైన విశేషణమైఉన్నవాడుగనుక అతనిని బ్రహ్మయొక్క అంశమని చెప్పడంలో దోషంలేదు. ఎన్నో విశేషణాలతోనున్న ఒకవస్తువుతాలూకు ఒకభాగంగా ఉండడం అంశం అనబడుతుంది.విశేషణాంశం, విశేష్యాంశం అని లోకవ్యవహారంలో చూస్తుంటాం. కనుక, గోత్వజాతి గోవ్యక్తికి విశేషణరూపమైన అంశమైఉన్నట్లే, ప్రకాశం అనే గుణం మణికి విశేషణరూపమైన అంశమైఉన్నట్లు, పరమాత్మశరీరమైన జీవుడుకూడా విశిష్టుడైన పరమాత్మకి విశేషణరూపమైన భాగమై, అంశం అవడంలో దోషంలేదు. అలాంటప్పుడు విశేషణాలు విశేష్యాల అంశమైనా, విశేష్యాల స్వరూపస్వభావాలు, విశేషణాల స్వరూపస్వభావాలకంటే చాలా భిన్నమైనట్లుగా, అంశమైన జీవుడి స్వరూపస్వభావాలకంటే అంశియైన పరమాత్మ స్వరూపస్వభావాలు చాలాభిన్నంగా ఉండడానికి ఆటంకంలేదు. ఇలా జీవేశ్వరుల స్వరూపస్వభావాలు చాలా భిన్నంగా ఉండడంచేత జీవుడు పరమాత్మకి విశేషణరూపమైనభాగంగా ఉన్నప్పటికీ జీవుడికున్న దోషాలు పరమాత్మవే అవుతాయా అనే సందేహానికి తావులేదు. కనుక, అజ్ఞుడై, అసత్యసంకల్పుడై అనేకదోషాలనిండుగా ఉన్నజీవుడిలాకాకుండా సర్వజ్ఞుడై, సత్యసంకల్పుడై, హేయగుణప్రత్యనీకుడై పరమపురుషుడు ప్రకాశిస్తున్నాడు.

### సి.సూ.॥ స్మరన్తి చ॥ (2-3-46) (243)

**స్మరన్తి చ--** స్మృతులుకూడా (ఇలాగే అంశాంశీభావాన్ని జీవేశ్వరులకి) చెప్తున్నాయి.

*473* పరాశరాదయోంశత్వం ప్రభాయా ఇవ చాత్మనః॥*

*474. "ఏకదేశస్థితస్యాగ్నేర్జ్యోత్స్నే"త్యాదౌ స్మరన్తి చ।*
*"యత్కిఞ్చిత్సృజ్యతే యేనే"త్యాదినా చ పరం ప్రతి॥*

**475. తనుత్వమస్య జీవస్య సుస్పష్టం కథయన్తిహి।*

**473*-*475. సిద్ధాంతం:** పరాశరుడు మొదలైన మహర్షులుకూడా,

"ఏకదేశస్థితస్యాగ్నే ర్జ్యోత్స్నా విస్తారిణీ యథా।

పరస్య బ్రహ్మణః శక్తిస్తథేదమఖిలం జగత్॥ (వి.పు. 1-22-56)

(ఒకచోటుండే అగ్నియొక్క కాంతి ఎన్నో చోట్లకి విస్తరించినట్లుగా ఈప్రపంచమంతటా పరబ్రహ్మంతాలూకు శక్తే ఉన్నది.) అని శ్రీవిష్ణుపురాణం మొదలైన వేదాన్ని వివరించడానికి ఉద్భవించినస్మృతుల్లో అగ్నికి కాంతిలా పరమాత్మకి చేతనాచేతనాలన్నీ విశేషణాలు అని చూపించేరు.

"యత్కిఞ్చిత్ సృజ్యతే యేన సత్వజాతేనవై ద్విజ।

తస్య సృజ్యస్య సమ్భూతౌ తత్ సర్వం వై హరేస్తనుః॥

(బ్రాహ్మణోత్తమా! ఏజీవరాశివల్ల ఏకొంచెమైనా సృష్టింపబడుతోందో, అది సమస్తసృష్టితాలూకు పదార్థం. ఆకారణపదార్థాలన్నీ, హరికి శరీరంఅవుతున్నాయి) అని పరమాత్మకి జీవులందరూ శరీరరూపమైన అంశాలుగానే ఉన్నాయని చూపేరు. అందువల్లకూడా జీవుడు పరమాత్మతాలూకు అంశమే.

*సి.సూ.॥ అనుజ్ఞాపరిహారౌ దేహసంబంధాత్ జ్యోతిరాదివత్ ॥ (2-3-47) (244)*

**అనుజ్ఞా పరిహారౌ--** (వేదాధ్యయనం మొదలైనవాటిలో) (కొంతమందికి) అనుమతి, (కొంతమందికి) ఆటంకం, **దేహసంబంధాత్--** శరీరసంబంధంవల్లనే. **జ్యోతిరాదివత్--** అగ్ని మొదలైనవి (ఆశ్రయాన్ని ఇవ్వడం, త్రోసివేయడం)లాగే.

*475*. ద్విజాది సర్వజీవానాం బ్రహ్మాంశత్వే సమేఽపి చ॥*

*476. వేదపాఠాద్యనుజ్ఞాతన్నిషేధౌ యేషుకేషుచిత్।*

*శుచ్యశుచ్యాత్మవిప్రాదిదేహయోగకృతౌ, యథా॥*

*477. అగ్నిరాహ్రియతేఽఽగారాత్ శ్రోత్రియస్య, శ్మశానగః।*

*స పరిహ్రియతే కిఞ్చ యథాన్నం శ్రోత్రియస్య హి॥*

**478. గ్రాహ్యం తదభిశస్తాదేః త్యాజ్యం తద్వదిహోచ్యతే।*

**475*-*478. సిద్ధాంతం:** ఈవిధంగా సమస్తజీవులూ బ్రహ్మతాలూకు అంశం అయితే, బ్రాహ్మణులు మొదలైన కొంతమంది వేదాలని అధ్యయనం చెయ్యడం మొదలైనవాటిలో అనుమతింపబడడం, శూద్రులు మొదలైన కొంతమంది వాటికి నిషేధింపబడడం ఎలా కుదురుతుంది? అంటే, సమస్తజీవస్వరూపాలూ బ్రహ్మాంశమైఉండడం మొదలైనవాటివల్ల ఒకేరకమైనవైనప్పటికీ, బ్రాహ్మణులు మొదలైన పరిశుద్ధశరీరాలుగలవాళ్ళకి వేదాలని అధ్యయనం చెయ్యడం మొదలైనవాటిలో అనుమతింపబడడం, శూద్రులు మొదలైన అపరిశుద్ధశరీరాలుగలవాళ్ళని వాటిని నిషేధించడం కుదురుతుంది. అగ్ని ఒకటే అయిఉన్నా, బ్రాహ్మణగృహాల్లో ఉన్న అగ్ని అంగీకరించబడినట్లు, శ్మశానంలోఉన్న అగ్ని ఆటంకపరవబడినట్లుగానూ, వేదాధ్యయనపరుడి అన్నం అంగీకరింపబడినట్లు, పతితుడి అన్నం అడ్డుకోబడినట్లుగానూ ఇదికూడా అని చెప్పడానికి ఆటంకం లేదు.

*సి.సూ.॥ అసన్తతేశ్చావ్యతికరః ॥ (2-3-48) (245)*

**అసన్తతేః చ--** (జీవులు) అణువులై ఉండడంవల్లనూ, **అవ్యతికరః--** (వాళ్ళ)భోగం ఒకటవదు.

*478*. జీవానాం ప్రతిదేహం చ భిన్నత్వాదణుమానతః॥*

*479. మిథో జీవవిభేదాచ్చ భోగావ్యతికరో భవేత్।*

*బ్రహ్మైవ బధ్యతేఽజ్ఞానోపాధిభ్యామితి పక్షయోః॥*

**480. భోగవ్యవస్థితిర్నైవ స్యాదతోఽసాధు తద్ద్వయమ్।*

***478*-*480.** **సిద్ధాంతం:*** జీవులు అణుపరిమాణంగలవాళ్ళవడంవల్ల, ఒక్కొక్కశరీరంలోనూ వేరువేరుగా ఉండడంవల్ల, జీవులు వేరువేరైనవాళ్ళన్నది సకలప్రమామసిద్ధంగనుక, జీవుల ఒకళ్లఅనుభవం మరొకళ్ళ అనుభవంతో ఏకీభవించకుండా ఉండడం జరుగుతోంది. బ్రహ్మమే అజ్ఞానంవల్ల భ్రమించి జీవుడైనది అనేఅద్వైతులపక్షంలోకూడా బ్రహ్మమే (యథార్థమైనది లేదా మిథ్యైన)ఉపాధివల్లనే జీవుడైనాడనిచెప్పే యాదవప్రకాశులపక్షంలోనూ, జీవుల అనుభవం ఒకటిగాకాకుండానే ఉన్నదన్నది ఒకసారికూడా కుదరదు. కనుక ఆపక్షాలు కుదరనివే.

## *సి.సూ.॥ ఆభాసా ఏవ చ ॥ (2-3-49) (246)*

**ఆభాసాః ఏవ చ-- (బ్రహ్మానికి అజ్ఞానాన్నీ, కప్పబడడాన్నీ నిరూపించడానికి అద్వైతులుచెప్పే హేతువులు) దోషమున్నవిగాకూడా (శ్రుతివిరుద్ధాలుగానూ) ఉన్నాయి.**

*480* సర్వజ్ఞబ్రహ్మణోఽజ్ఞానతత్తిరోధానసాధకాః॥*

*481. ఆభాసా హేతవః స్యాచ్చ బాధో నిర్దోషతాశ్రుతేః।*

*అవిద్యాకల్పితోపాధిభేదవాదేఽపి పూర్వవత్॥*

**480*-481. సర్వజ్ఞుడైన పరమాత్మకి అజ్ఞానాన్ని నిరూపించడం, ఆబ్రహ్మం అవిద్యచేత కప్పబడుతోంది అని నిరూపించడానికి అద్వైతులు చెప్పే హేతువులు దోషభూయిష్టాలవడంవల్ల** యథార్థమైన హేతువులు కానేరవు. *"అపహతపాప్మా"*(ఛాం. 8-7-1), *"అనశ్నన్ అన్యః"* (ముండ. 2-1-1; శ్వే. 4-6) అని బ్రహ్మం దోషాలులేనిది అనిచూపించే అనేక వేదవాక్యాలతోబాటు, *"పృథగాత్మానం ప్రేరితారంచ మత్వా"*(శ్వే. 1-6), *"జ్ఞాజ్ఞౌ ద్వౌ"*(శ్వే. 1-9) మొదలైన ఎన్నో భేదశ్రుతులతోకూడా వాళ్ళపక్షం వ్యతిరేకిస్తోంది. అవిద్యవల్ల కల్పించబడిన ఉపాధిభేదంవల్ల జీవులమధ్య అనుభవవ్యవస్థ సిద్ధంచవచ్చుగదా అంటే, అవిద్యకి వెనుక చెప్పబడిన దోషాలు, అవిద్యవల్ల కల్పించబడిన ఉపాధులకీ వస్తాయిగనుక, అద్వైత పక్షంలో భోగవ్యవస్థ కలగదు అనే దోషం పరిహరించసాధ్యంకాకుండానే ఉంటుంది.

*పూ. 482. సత్యోపాధియుతబ్రహ్మజీవవాదేఽప్యదృష్టతః।*

*ఉపాధిభేదహేతోస్తద్వ్యవస్థేత్యత్ర కథ్యతే॥*

**482. పూర్వపక్షం:** యాదవప్రకాశపక్షంలో జీవులకి భోగవ్యవస్థ కలగదు అన్నది కుదరదు. ఎలా అంటే, ఆయా అదృష్టంచేత ఆయా యథార్థమైన ఉపాధులు (శరీరేంద్రియాలు) ఏర్పడి, ఆయాజీవులకి భోగవ్యవస్థ కలగడానికి కుదురుతుందిగదా!

## *సి.సూ.॥ అదృష్టానియమాత్ ॥ (2-3-50) (247)*

**అదృష్టానియమాత్--** అదృష్టానికికూడా వ్యవస్థ లేకపోవడంవల్ల (భోగానికి కూడా వ్యవస్థ లేదు)

*483. ఉపాధిహేత్వదృష్టానామాశ్రయస్య పరస్య చ।*

*ఏకత్వాత్తదదృష్టానాం నియమాసిద్ధితస్తదా॥*

*484. ఉపాధిభిరదృష్టైశ్చ స్వసమ్బన్ధాత్పరస్య హి।*

*ఛేదాసమ్భవతశ్చాపి న స్యాత్ భోగవ్యవస్థితః॥*

**483-484. సిద్ధాంతం:** వెనక చెప్పిన యాదవప్రకాశమతస్థుల పూర్వపక్షంకూడా కుదరదు.

ఉపాధులకి హేతువుగా చెప్పబడేఅదృష్టాలుకూడా బ్రహ్మమొక్కదాన్నే ఆశ్రయించి ఉండడంవల్ల ఆఅదృష్టాలకికూడా, "ఇది ఫలానా జీవుడిది" అనే నియమం లేకపోవడంవల్ల దానివల్ల భోగవ్యవస్థ ఏర్పాటు అవడం కుదరదు. బ్రహ్మంతాలూకు ఒక్కొక్కభాగానికీ ఒక్కొక్క అదృష్టాన్నీ, దానివల్ల ఒక్కొక్క ఉపాధినీ తీసుకొని జీవులకి భోగవ్యవస్థని ఏర్పాటు చేయవచ్చుగదా అంటే, నిరవయవమైన బ్రహ్మం అదృష్టాలవల్లా, ఉపాధులవల్లా అనేకభాగాలుగా విడదీయరానిదవడంవల్ల యాదవప్రకాశమతంలోకూడా భోగవ్యవస్థ ఏర్పడదు అని చెప్పినది నిశ్చయం అయింది.

*సి.సూ.// అభిసన్ధ్యాదిష్వపి చైవమ్ // (2-3-51) (248)*

**అభిసన్ధ్యాదిషు అపి చ--** (అదృష్టానికి కారణంగాకూడా చెప్పబడే)సంకల్పం మొదలైనవాటిలో కూడా, **ఏవమ్--** వెనకచెప్పిన దోషం ఏర్పడుతుంది.

*485. అదృష్టహేతుభూతేషు సఙ్కల్పాదిష్వపీశితుః।*
*పూర్వోక్తాత్కారణాదేవ తద్వ్యవస్థా న సమ్భవేత్॥*

**485. సిద్ధాంతం:** దీనితర్వాత అదృష్టాలకి కారమమైన సంకల్పం మొదలైనవాటితో భోగవ్యవస్థని కుదర్చవచ్చనియాదవప్రకాశమతస్థులు చెప్పడం, అదృష్టానికి కారణమైన ఈశ్వరసంకల్పంలోకూడా నియమంలేకపోవడంవల్ల వెనకచెప్పిన పద్ధతిలో కుదరదు.

*సి.సూ.// ప్రదేశభేదాదితి చేన్నాన్తర్భావాత్ // (2-3-52) (249)*

**ప్రదేశభేదాత్--** (ఉపాధిసంబంధంవల్ల ఏర్పడిన)బ్రహ్మప్రదేశభేదంవల్ల (భోగవ్యవస్థ కుదురును) **ఇతిచేత్--** అన్నట్లైతే, **న--** కుదరదు. **అన్తర్భావాత్--** (ఉపాధులు నడిస్తే సమస్త "బ్రహ్మ"ప్రదేశమూ కూడా వాటిలో) అంతర్భావాలుగా ఇమిడి ఉండడంవల్ల.

పూ. *486. ఉపాధియోగినో బ్రహ్మప్రదేశాత్తదయోగినః।*
*బ్రహ్మప్రదేశా భిద్యన్తే తస్మాద్భోగవ్యవస్థితిః॥*

**486. పూర్వపక్షం:** విభజించవీలుగాకుండా ఒకటిగా ఉన్న బ్రహ్మస్వరూపమే, ఎన్నో విధాలైన దేహరూపమైన ఉపాధులతో సంబంధించినదైనప్పటికీ, ఆయాఉపాధులు సంబంధించిన బ్రహ్మప్రదేశాల కంటే సంబంధించని బ్రహ్మప్రదేశాలు వేరుగా ఉండడంవల్ల భోగవ్యవస్థ కుదురుతుంది.

*487. ఇతి చేత్తన్న, గచ్ఛత్సు సర్వత్రోపాధిషు స్వయమ్।*
*అన్తర్భావాత్ప్రదేశస్య పూర్వానుపహితస్య చ॥*
*488. తస్మాద్భోగవ్యతికరః దుర్వారః, సకలస్య చ।*
*బ్రహ్మదేశత్వతస్సర్వదుఃఖం తస్యైవ సమ్భవేత్॥*
*489. అతః పరస్మిన్ చిదచిద్విశిష్టబ్రహ్మణి స్వయం।*
*విశేషణత్వేనాంశోఽయం జీవ ఇత్యేవ సుస్థితమ్॥*

*//ఇత్యంశాధికరణమ్//*

*//ఇతి ద్వితీయాధ్యాయే తృతీయః పాదః//*

॥శ్రీమతే రాఘవార్యమహాదేశికాయ నమః॥

॥శ్రీమతే అప్పలార్యమహాదేశికాయ నమః॥

**487-489. సిద్ధాంతం: యాదవప్రకాశమతస్థుల ఈపూర్వపక్షంకూడా దోషభూయిష్ఠమే.** ఎందుకంటే, ఉపాధులైన దేహాలు స్థలాలైఒకచోట ఉండకుండా, ఎన్నో చోట్ల సంచరించడంవల్ల అనాదిగా అవి తిరుగుతున్నప్పుడు, ఒకప్పుడు సంబంధించని బ్రహ్మప్రదేశాలుకూడా మరొకప్పుడు

సమస్తఉపాధుల్లోనూ కాలభేదంతో సంబంధించినవైనట్లుగా, అటువంటి బ్రహ్మప్రదేశభేదంకలిగించే జీవులదగ్గర భోగవ్యవస్థని కల్పించడం కుదరదు. పైగా ఒక్కొక్కఉపాధులకి సంబంధించేబ్రహ్మప్రదేశాలు అన్నీ బ్రహ్మనివేగనుక, ఒక్కొక్కజీవుడి దుఃఖమున్నూబ్రహ్మనిదే అవవలసివస్తుంది. కనుక, ఈవిధంగా *"ఆభాస ఏవ చ"* (2-3-49) తో మొదలయ్యే నాలుగుసూత్రాలవల్లా ***"నిత్యోపలబ్ధ్యనుపలబ్ధి ప్రసంగః అన్యతరనియమో వా అన్యథా" (2-3-32), "ఉపలబ్ధివత్ అనియమః" (2-3-36)*** అని వేదబాహ్యులై సర్వవ్యాపి జీవవాదులైన సాంఖ్యులమతంలో చెప్పబడిన దోషాలు, వేదానికి అపార్థాలని వల్లించే ఏకాత్మవాదులైన అద్వైతుల మతంలోనూ, యాదవప్రకాశీయులమతంలోనూకూడా ఏర్పడతాయి అని నిరూపించబడింది. కనుక, ఈఅంశాధికరణంవల్ల జీవులు బ్రహ్మంకంటే చాలా భిన్నమైనవాళ్ళనిన్నీ, బ్రహ్మంతో స్వరూపైక్యంగలవాళ్ళని చెప్పే పక్షాలు నిరాకరించబడి, చేతనాచేతనవిశిష్టమైన పరబ్రహ్మంలో విశేషణరూపమైన అంశంగానే జీవుడు ఉన్నాడు అని నిశ్చయంగా నిర్ణయించబడింది. ఈమూడో పాదంలో జీవులు బ్రహ్మధీనమైన కర్తృత్వాన్నీ,జ్ఞానాశ్రయత్వాన్నీ గలవారై, అచేతనంవలె వికారంలేనివారుగనుక, సమష్టిలో నిర్వికారులైనప్పటికీ, వ్యష్టిలో జ్ఞానవికారంతోటీ, శరీరసంబంధంతోటీ బ్రహ్మనికి కార్యవస్తువులైఉంటారుగనుక, చేతనాచేతనాలు అమిరియున్న సమస్తలోకానికీ బ్రహ్మం కారణమైఉండడం కుదురుతుందని నిర్ణయింపబడినట్లయినది.

అంశాధికరణం పూర్తి అయినది.

రెండో అధ్యాయం మూడో పాదం పూర్తి చెందినది.

**శ్రీః**

## అథ ద్వితీయాధ్యాయే చతుర్థః పాదః

### ॥ప్రాణోత్పత్త్యధికరణమ్॥ (2-4-1)

***పూ.సి.సూ. ॥ తథా ప్రాణాః॥ (2-4-1) (250)***

**(పూ.సూ) తథా-** జీవుడిలా, **ప్రాణాః-** ప్రాణాలు అనబడే ఇంద్రియాలుకూడా (నిత్యమైనవే)

**(సి.సూ) తథా-** ఆకాశం మొదలైనవాటిలాగే, **ప్రాణాః-** ఉంద్రియాలుకూడా సృష్టించబడినవి.

*490. ప్రాగుక్తం బ్రహ్మకార్యత్వం స్యాద్వేద్జీవాత్మనామపి।*
*అత్రేన్ద్రియాదిజీవోపకరణానాం తదుచ్యతే॥*

490. పాదసఙ్గతి- **ఆకాశం** మొదలైన అచేతనపదార్థాలకి స్వరూపవికారరూపమైన బ్రహ్మ కార్యత్వమున్నూ, స్వరూపవికారంలేనందువల్ల నిత్యమైన చేతనపదార్థాలకి స్వభావవికారరూపమైన బ్రహ్మకార్యత్వమున్నూ వెనుకటిపాదంలో నిరూపించబడింది. ఈపాదంలో జీవుడి ఉపకరణాలైన ఇంద్రియాలు ప్రాణం మొదలైనవాటికి స్వరూపవికారరూపమైన బ్రహ్మకార్యత్వం నిరూపించబడుతోంది.

పూ. ***491. యథా నోత్పద్యతే జీవః తథైవేన్ద్రియసఙ్ఘయః।***
***ప్రాక్సృష్టేరిన్ద్రియాణామప్యవస్థానప్రమాణతః॥***

***492. "ఋషయో వావ తే, కే తే, ప్రాణా వావే"తి చ శ్రుతిః।***
***ప్రలయేఽపి స్థితిం తేషాం బ్రవీత్యుత్పత్తివాదినీ॥***

***493. జీవోత్పత్తిశ్రుతిరివ నేయేత్యేతన్మతం న సత్।***

**491-*493. పూర్వపక్షం-** వేదవాక్యాలవల్ల జీవుడు ఏవిధంగా సృష్టింపబడలేదని తెలియ

బడుతోందో, అదేవిధంగా, వేదవాక్యాలవల్ల ఇంద్రియాలుకూడా సృష్టింపబడలేదని తెలుస్తోంది. ఏవాక్యంవల్ల అంటే, "***అసద్వా ఇదమగ్ర ఆసీత్। తదాహుః కిం తదాసీదితి। ఋషయో వావ తే అగ్రే అసదాసీత్। తదాహుః కే తే ఋషయ ఇతి। ప్రాణా వావ ఋషయః।***" (శతపథబ్రాహ్మణం 6-1-1) (ఈలోకం మొదట అసత్తుగానే (లేనిదిగానే) ఉండెను. అప్పుడు ఏమి ఉండెను? అని (శిష్యులు) అడిగేరు. "అసత్తైన ఇది ఋషులుగానే ఉండెను" అని (ఆచార్యుడు సమాధానం చెప్పేరు) "ఆఋషులు ఎవరు?" అని (శిష్యులు) అడిగేరు. "ప్రాణాలే ఋషులు" అని (ఆచార్యుడు సమాధానం చెప్పేరు)) అని లోకం సృష్టించబడడానికి ముందు ముందుగా ఇంద్రియాలున్నట్టుగా చెప్పే వాక్యమే ఇంద్రియాలని నిత్యమని చూపుతోంది. "ప్రాణాః" అని బహువచనం ఉండడంవల్ల ఈశబ్దం ఇంద్రియాలనే సూచిస్తుందని స్పష్టం. ***వాయుశ్చాన్తరిక్షం చ; ఏతదమృతమ్*** (బృహ 4-3-3) (వాయువు, అంతరిక్షం అనే రెండూ నాశంలేనివి.) ***సైషా అనస్తమితా దేవతా యద్వాయుః*** (బృహ 3-5-22) (వాయువనేది నాశంపొందని దేవత)మొదలైన వాక్యాల్లో వాయువు, అంతరిక్షం మొదలైనవి చాలాకాలం ఉండడంవల్ల నాశంలేనివని చెప్పడంలాగే, ఇక్కడకూడా గౌణంగా ఇంద్రియాలని నిత్యంగా చెప్పుతున్నట్లు చెప్పవచ్చుగదా అంటే, ***అసద్వా ఇదమగ్ర ఆసీత్. అని ప్రారంభమయి,*** ప్రళయంలో సమస్తలోకమూ నశించినప్పుడు ఇంద్రియాలున్నట్టుగా చెప్పడంవల్ల ఆవిధంగా తీసుకోవీల్లేదు. ఇంద్రియాలు జీవుడిలాగే నిత్యమనే తీసుకోవాలి. ఇంద్రియాలకి సృష్టిని చెప్పే వాక్యాలు జీవుడికి సృష్టిని చెప్పే వాక్యాలలాగే అముఖ్యం అని తీసుకోవాలి.

*సి. 493* ప్రాక్ సృష్టేః పరమాత్మైకత్వావధారణతస్తథా॥*
*494. "ఏతస్మాజ్జాయతే ప్రాణః" ఇత్యుత్పత్తిశ్రుతేస్తథా।*
*తన్నిత్యత్వవచోభావాచ్చోచ్ఛద్భవన్తీంద్రియాణి తు॥*
*495. "ప్రాణ వావే"త్యాదినోక్తః పరాత్మాऽస్యైవ సంభవేత్।*
*ఋషిశబ్దేనావగతం సర్వజ్ఞత్వం, నచాऽచితామ్॥*

**493*-495. సిద్ధాంతం:** ఈపూర్వపక్షం తప్పు. "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్", (ఛాం. 6-2-1) "ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్", (ఐతరేయ 1-1-4) మొదలైనవేదవాక్యాల్లో పరమాత్మే ప్రళయకాలంలో ఉన్నట్టుగా చెప్పబడడంవల్ల ఆకాశం మొదలైనవాటిలాగే స్వరూపవికారంపొంది, ఇంద్రియాలుకూడా సృష్టింపబడ్డాయనే చెప్పుకోవాలి. "ఏతస్మాజ్జాయతే ప్రాణా మనస్సర్వేంద్రియాణి చ" (ముండ 2-1-3) (ఈపరమాత్మనుండే ప్రామం, మనస్సు, సమస్త ఇంద్రియాలూ సృష్టింపబడ్డాయి) ్నే వేదవాక్యంలో ఇంద్రియాలు సృష్టింపబడినట్లుగా చెప్పబడటంవల్లనూ, ్వి నిత్యంఅని చెప్పే వేదవాక్యాలు లేకపోవడంవల్లనూ ఇంద్రియాలు, ాకాశం మొదలైనవాటిలాగే సృష్టింపబడ్డాయనే తీసుకోవాలి. "ప్రాణా వావ ఋషయః" అనేవాక్యంలో ప్రాణశబ్దంవల్ల చెప్పబడ్డవాడు - మొదట ఎత్తబడిన కారణశ్రుతులలో చెప్పబడిన పరమాత్మే అని అనుకోవాలి. ఋషిశబ్దంతో ప్రాణశబ్దవాచ్యుడిని సర్వజ్ఞుడనిగదా ఆవాక్యం చూపుతోంది. అచేతనాలైన ఇంద్రియాలకి సర్వజ్ఞత్వం కుదరదుగదా. కనుక, ఆవాక్యంలో "ప్రాణాః" అనబడ్డవాడు పరమాత్మేగనుక ఇంద్రియాలు నిత్యాలుగావు.

*అవ. 496. "ప్రాణా ఋషయ"ఇత్యత్ర బహూక్తిస్సమ్భవేత్కథమ్।*
*బహుత్వాసంభవాదత్రేత్యాశఙ్కైవం నివార్యతే॥*

**496. అవతారిక:** దీనితర్వాత "ప్రాణా వావ ఋషయః" అనే వాక్యంలో "ప్రాణాః" అన్న బహువచనం అనేక ఇంద్రియాలని చెప్పేదేతప్ప ఏకమాత్రుడైన పరమాత్మని స్పర్శించదు - అనే

సందేహం తరువాతి సూత్రంవల్ల నివారింపబడుతోంది.

*సి.సూ. ॥ గౌణ్యసంభవాత్ తత్ప్రాక్‌శ్రుతేశ్చ॥ (2-4-2) (251)*

***గౌణీ***-(బహువచనశ్రుతి) అముఖ్యమైనది. **అసమ్భవాత్-** (అంతా నశించిన తర్వాత అనేకపదార్థాలు) ఉండసంభావనలేకపోవడంవల్ల, తత్‌ప్రాక్‌శ్రుతేః చ- సృష్టికి ముందర (పరమాత్మే ఉన్నాడని) శ్రుతి చెప్పడంచేతనున్నూ.

*497. బహూక్తిరత్ర గౌణీ స్యాత్ బహ్వర్థాసంభవాత్తదా।*
*పరమాత్మన ఏవ ప్రాక్ అవస్థానశ్రుతేరపి॥*

497. **సిద్ధాంతం:** *"ప్రాణా వావ ఋషయః"* అనే వాక్యంలో బహువచనం అముఖ్యమైనదే. ఎందుకంటే, సమస్తలోకమున్నూ నశించినతర్వాత నశించిన లోకంలో ఇమిడిన ఇంద్రియాలనే ఎన్నో పదార్థాలు ఉండసాధ్యంగాదుగనుక, మొదట ఎత్తుకున్న కారణవాక్యాల్లో సృష్టికి ముందర పరమాత్మ ఒక్కడే ఉన్నాడని చెప్పబడటంవల్లనూ, ఆపరమాత్మనే గౌణంగా బహువచనంచేత "ప్రాణాః" అని చెప్పున్నట్లుగానే అనుకోవాలి.

*సి.సూ. ॥ తత్పూర్వకత్వాద్వాచః ॥ (2-4-3) (252)*

**వాచః**-(పరమాత్మ తప్ప ఇతరవస్తువుల) నామధేయం, **తత్పూర్వకత్వాత్-** సృష్టిని ముందుగాగలది అవడంవల్ల (ప్రళయంలో ఇంద్రియాలు లేవు)

498. *నామధేయస్య సర్వస్య పరమాత్మాన్యవాచినః।*
*వియదాదేస్సృష్టిపూర్వకత్వాత్ ప్రాణాః పరః పుమాన్॥*

*499. ప్రాక్సృష్టేర్వియదాదీనామభావాన్నామరూపిణామ్।*
*వాగాదీన్ద్రియకార్యస్య తదా కస్యాప్యయోగతః॥*

*500. నేన్ద్రియాణి తదా సన్తి తదత్ర ప్రాణశబ్దితా।*
*నైషాం, కిన్తు పరస్యైవ, ప్రసిద్ధిశ్చాత్ర వైదికీ॥*

*॥ ఇతి ప్రాణోత్పత్త్యధికరణమ్॥*

498-500. **సిద్ధాంతం.** పరమాత్మని తప్పిస్తే ఇతరపదార్థాలని చెప్పే నామధేయాలన్నీ ఆకాశం మొదలైనవాటి సృష్టికి తర్వాతే రావడంవల్ల ఆసృష్టికిముందర ప్రాణశబ్దం ఇంద్రియాలని చెప్పసాధ్యంగాదు. కనుక ప్రాణాః" అనబడేవాడు పరమపురుషుడే. సృష్టికి ముందరనామరూపంగల ఆకాశం మొదలైన పదార్థాలు లేకపోవడంవల్ల వాక్కు మొదలైనఇంద్రియకార్యాలు ఏవీ సృష్టికి ముందు కుదరవుగనుక, అప్పుడు ఇంద్రియాలు లేవనే గ్రహించాలి. కనుక, ప్రాణం అనబడేవాడు పరమాత్మేతప్ప ఇంద్రియాలుగావు. "సర్వాణి హ వా ఇమాని భూతాని ప్రాణమేవాభిసంవిశన్తి" (ఛాం. 1-11-5) (ఈసమస్తభూతాలూ (ప్రళయకాలంలో) ప్రాణం అనబడే పరమాత్మలో లయమౌతున్నాయి) అనే వేదవాక్యంలో పరమాత్మవద్దనే ప్రాణశబ్దం ప్రసిద్ధమైయున్నది. కనుక, ఇంద్రియాలు పరమాత్మనుండి ఆకాశాదులలాగే సృష్టింపబడ్డాయన్నది సుస్థిరంగా స్పష్టం అయింది.

ప్రాణోత్పత్త్యధికరణం పూర్తి అయింది.

*॥సప్తగత్యధికరణమ్॥ (2-4-2)*

*పూ.సూ॥ సప్తగతేర్విశేషితత్వాచ్చ॥ (2-4-4) (253)*

***గతేః***- (జీవుడితో కూడ) సంచారం (ఏడు ఇంద్రియాలకే) చెప్పబడడంవల్ల, **విశేషితత్వాత్ చ-**

(ఏడు ఇంద్రియాలూ ఏవి అని) సూచించి ఎత్తుకొనబడడంవల్లనూ, **సప్త**- (ఇంద్రియాలు) ఏడుమాత్రమే.

*501. సమస్తానాం ఇన్ద్రియాణాం కార్యత్వం ప్రాఙ్నిరూపితమ్।*
*తేషాం సఙ్ఖ్యాऽత్రాధికృతౌ విచార్య స్థాప్యతే నయైః॥*

***501. సంగతి***- అన్ని ఇంద్రియాలూ బ్రహ్మయొక్క కార్యమే అయిఉండడంవల్ల అని వెనుకటి అధికరణంలో నిరూపించబడింది. అవి ఎన్ని అన్నది ఈఅధికరణంలో న్యాయాలతో పరిశీలించి నిశ్చయింపబడుతోంది.

*502. "సప్త ప్రణా" ఇతి శ్రుత్యా గతిర్జీవాత్మనా సహ।*
*సప్తానామేవోచ్యతేऽథ "యదా పఞ్చే"తి వాక్యతః॥*

*503. ఏతేషామేవ యోగే చ విశిష్య వచనం తతః।*
*పఞ్చశ్రోత్రాదీని బుద్ధిర్మన ఏతాని సప్త వై॥*

*504. ఇన్ద్రియాణి న వాగాదీన్యాత్మనా గత్యభావతః।*
*అల్పోపకారకేష్వేషు ప్రాణోక్తిస్త్వౌపచారికీ॥*

**502-504.** **పూర్వపక్షం:** *"సప్త ఇమే లోకాయేషు చరన్తి ప్రాణా గుహాశయా నిహితాః సప్త సప్త"* (ముండక. 2-1-8) ((హృదయ)గుహలో ఉంచబడినవై, ఈఏడులోకాల్లోనూ సంచరించే ఏఏడు ఇంద్రియాలూ) అనే వేదవాక్యం -జీవుడుపుట్టేటప్పుడు, చనిపోయేటప్పుడూ, వాడితోబాటు సమస్తలోకాల్లోనూ సంచరించే ఇంద్రియాల లెక్కని ఏడు అనే చెప్తోంది. *"యథా పఞ్చావతిష్ఠన్తే జ్ఞానాని మనసాసహ। బుద్ధిశ్చ న విచేష్టేత తామాహుః పరమాం గతిమ్॥* (కఠ. 2-6-10) (ఐదు జ్ఞానేంద్రియాలు, మనస్సు, బుద్ధి, ఎప్పుడు విషయాంతరాల్లో పట్టు విడిచి ఉంటాయో, అదే ఉత్తమమైన స్థితి అని చెప్తున్నారు) అన్న వేదవాక్యంలో యోగస్థితిలో ఉండే త్వక్, వాక్, నేత్ర, నాసిక, శ్రోత్రాలనే ఐదు జ్ఞానేంద్రియాలూ, ఆలోచించే ఇంద్రియమైన మనస్సు, నిశ్చయించుకొనే ఇంద్రియమైన బుద్ధి అనే ఆఏడు ఇంద్రియాలు అని విశేషించబడే (సూచింపబడి గ్రహింపబడే)విగా ఉన్నాయి.కనుక, ఇంద్రియాలు, జీవుడు తెలుసుకుందికి ఉపకరించే జ్ఞానేంద్రియాలైన ఈఏడు మాత్రమే అని గ్రహించతగినది. వాక్ (మాటకి సాధనమైన వాక్కు), పాణి (గ్రహించడానికి ఉపకరించే చెయ్యి), పాయు (మలమూత్రాదులని విసర్జించడానికి ఉపకరించే ఇంద్రియం), పాదం (నడవటానికి ఉపకరించే కాలు), ఉపస్థం (స్త్రీ, పురుష సంగమానికి ఉపకరించే ఇంద్రియం) అని జీవుడు ఒక్కొక్క పని చెయ్యడానికి ఉపకరించే ఐదు కర్మేంద్రియాలు - ఆత్మతోబాటు జననమరణాలలో వెనక చెప్పిన ఏడు జ్ఞానేంద్రియాలలా కూడావెళ్ళేవికాకపోవడంవల్ల ఇంద్రియాలు కానేరవు. జీవుడికి ఈలోకంలో జీవించేటప్పుడుకొంత ఉపకరించడంతో, శాస్త్రాల్లో వాటిని ప్రాణాలు, ఇంద్రియాలు, అని ఔపచారికంగా చెప్పబడుతున్నాయి. కనుక, ఇంద్రియాలు వెనుక చెప్పినట్టుగా ఏడే అవుతాయి.

*సి.సూ.॥హస్తాదయస్తు స్థితేऽతో నైవమ్॥ (2-4-5) (252)*

**స్థితే**- జీవుడు దేహంలో ఉన్నప్పుడు, **హస్తాదయః తు**- చెయ్యి మొదలైన కర్మేంద్రియాలుకూడా (ఉపకారం చెయ్యటంవల్ల ఇంద్రియాలే) **అతః**- కనుక, **న ఏవమ్**- ఇంద్రియాలు ఏడు అని చెప్పడం సరిగాదు.

*505. జీవే స్థితే శరీరాన్తః హస్తాదీన్యపి పఞ్చ హి।*
*తస్యోపకరణాని స్యుః బోద్ధ్యం సప్తైవ నేత్యతః॥*

506 "దశేమే పురుషే ప్రాణాః, ఇన్ద్రియాణి దశే"తి చ।
శ్రుతిస్మృతిభ్యాం జీవోపకరణత్వావిశేషతః॥

507. పఞ్చశ్రోత్రాదీని పఞ్చ హస్తాదీన్యేకకం మనః।
ఏకాదశేన్ద్రియాణి స్యుః న్యూనసంఖ్యోక్తిరత్ర హి॥

508. తత్తద్వ్యాపారమాత్రస్య తత్ర తత్ర వివక్షయా।
యోగకాలే విశిష్యోక్తిః శ్రోత్రాదేర్మన ఆదినా॥

509. జ్ఞానేన్ద్రియత్వప్రాధాన్యాత్ దశైకం చేన్ద్రియాద్యతః।
సప్తైవేత్యుక్తినియమో న స్యాన్మానవిరోధతః॥

॥ఇతి సప్తగత్యధికరణమ్॥

504-509. **సిద్ధాంతం:** జీవుడు శరీరంలో ఉన్నప్పుడు చెయ్యి, కాలు, వాక్కు, పాయు, ఉపస్థ అనబడే ఐదు కర్మేంద్రియాలున్ను వాడికి ఉపకరిస్తున్నాయి. అంచేత కర్మేంద్రియాలకి గతి లేదని అనుకున్నా, ఇంద్రియాలు ఏడు అన్నది కుదరదు. జ్ఞానేంద్రియాలుకూడా ఏడు కావు. త్వక్కు, వాక్కు, నేత్రం, నాసిక, శ్రోత్రం అనే ఐదూ, ఇంద్రియాన్నింటికీ మీదిదైన మనస్సు, మొత్తం ఆరే అవుతాయి. ఆలోచించేటప్పుడు "మనస్సు" అనబడే ఇంద్రియమే నిశ్చయించేటప్పుడు "బుద్ధి" అనిన్నీ, అభిమానించేటప్పుడు "అహంకారమ"నీ వ్యవహరింపబడడంతో బుద్ధిగాని, అహంకారంగాని వేరైన ఇంద్రియంగాదు. వెనుకచెప్పిన ఆరు జ్ఞానేంద్రియాలు ఐదు కర్మేంద్రియాలు మొత్తం పదకొండు అవుతున్నాయి. అందుచేతనే "***దశేమే పురుషే ప్రాణాః ఆత్మా ఏకాదశః***" (బృహ 5-9-4) (ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, మొత్తం పది ఇంద్రియాలు, వీటిని నియమించే పదకొండో ఇంద్రియంగా మనస్సు ఇలా జీవుడికి ఇంద్రియాలు పదకొండు) అని శ్రుతిలోనూ, "ఇన్ద్రియాణి దశైకం చ" (గీత 13-5) (ఇంద్రియాలు పదకొండే) మొదలైన స్మృతులలోనూ జీవుడికి ఉపకరించేవికావడంతో వెనుకచెప్పిన పదకొండే ఇంద్రియాలుగా చెప్పబడుతున్నాయి. "(శరీరే) స్థితే హస్తాదయః" అని సూత్రకారులు జీవుడు శరీరంలో ఉన్నప్పుడు మాత్రం కర్మేంద్రియాలున్నట్లుగా చెప్పడం - "జీవుడు ఒకశరీరాన్ని వదిలి మరో శరీరంలోకి వెళ్ళినప్పుడు జ్ఞానేంద్రియాలే కూడా వెళ్ళేవి, కర్మేంద్రియాలు మాత్రం శరీరంతోబాటుగా పుట్టడం, శరీరం ఉన్నంతకాలం ఉపకరించి శరీరంతోటే నశిస్తున్నాయి" అన్న యాదవప్రకాశులమతాన్ని తీసుకుని అభ్యుపగమ్యవాదరీతిలో సమాధానం చెప్పినట్లవుతుంది. నింగా కర్మేంద్రియాలు జ్ఞానేంద్రియాలలాగే సృష్టికాలంలో సృష్టింపబడి, మహాప్రళయకాలంవరకూ జీవుడితోబాటు కలిసివెళ్తూంటాయి అన్నదే సిద్ధాంతం. "***యదా పఞ్చావతిష్ఠన్తే జ్ఞానాని***" (కఠ 2-6-10) అని యోగకాలంలో జ్ఞానేంద్రియాలనిమాత్రం చెప్పడం జ్ఞానేంద్రియాలప్రాధాన్యతవల్లనే. ఈవిధంగా ప్రమాణవిరోధంలేదుగనుక ఇంద్రియాలు పదకొండేఅవుతాయి. ఇంద్రియాలు ఏడే అనడం - కర్మేంద్రియాలని ఇంద్రియాలుగా చెప్పే ప్రమాణాలకీ, ఇంద్రియాలని పదకొండు అని చెప్పే ప్రమాణాలకీ వ్యతిరేకంగా ఉండడంవల్ల సరిగాదు.

సప్తగత్యధికరణం పూర్తి అయింది.

## ॥ప్రాణాణుత్వాధికరణమ్॥ (2-4-3)

## సి.సూ.॥అణవశ్చ॥ (2-4-6) (253)

**అణవః చ-** (ఇంద్రియాలు) అణుపరిమాణంగలవి కూడా.

*510. సంఖ్యా నిర్ధారితా పూర్వం ఇన్ద్రియాణాం ప్రమాణతః।*
*అత్రాధికరణే తేషాం పరిమాణం నిరూప్యతే॥*

**510. సంగతి:** వెనుకటి అధికరణంలో ప్రమాణాలని చూపి ఇంద్రియాలసంఖ్యని నిర్ణయించడం జరిగింది. ఈఅధికరణంలో వీటి పరిమాణం నిర్ణయింపబడుతోంది.

*పూ. *511. "సర్వేఽనన్తా" ఇతి శ్రుత్యా ప్రాణానన్త్యావబోధనాత్।*
*విభుత్వమేషాం సిద్ధం స్యాత్ ఇతి వాదోఽసమఞ్జసః॥*

*511. పూర్వపక్షం: *"ఏతే సర్వ ఏవ సమాః సర్వేఽనన్తాః"* (బృహ 3-5-13) (ఈఇంద్రియాలన్నీ సమపరిమాణంలోనూ, అనంతమైనవిగాను ఉన్నాయి) అనే ఉపనిషద్వాక్యంలో ఇంద్రియాలు అంతులేని విభుపదార్థాలని చెప్పబడడంవల్ల, వీటిని అనంతమైన విభువులనే స్పష్టం అవుతోంది.

*సి. 512. "సర్వే ప్రాణా అనూత్క్రామన్తీ"తి గత్యుపదేశతః।*
*సిద్ధే సత్యల్పమానత్వే చాప్రత్యక్షత్వతోఽణవః॥*

**513. తదానన్త్యశ్రుతిస్తావత్ కార్యానన్త్యావబోధికా।*

511*-*513. ఈపూర్వపక్షం సరిగాదు. *"ప్రాణమను ఉత్క్రామన్తం సర్వే ప్రాణా అనూత్క్రామన్తి"* (బృహ 6-4-2) (బైటకి వెళిపోయే జీవుడితోబాటు ప్రయాణించే ముఖ్యప్రాణంతోబాటు సమస్త ప్రాణాలు (ఇంద్రియాలు) బైటకి పోతున్నాయి) అని జీవుడు మరణించేటప్పుడు వాడితోబాటు ప్రాణాలనబడే ఇంద్రియాలుకూడా బైటికివెళ్తున్నాయని ఈఇంద్రియాలకి *"గతి"* (బైటకి వెళ్ళటం) చెప్పబడిఉండటంవల్ల ఇవి విభువైఉండడం కుదరదనిన్నీ, అల్పపరిమాణమున్నవేననిన్నీ తెలుస్తోంది. ఇవి బైటికివెళ్ళేటప్పుడు దగ్గరున్నవారి కంటికి కనబడకపోవడంవల్ల ఇవి అప్రత్యక్షమైన అణువులే అనికూడా స్పష్టం అవుతుంది. *"సర్వేఽనన్తాః"* (బృహ 3-5-13) అని వీటిని అనంతాలని చెప్పినప్పుడు, *"అథ యో హైతాన్ అనన్తానుపాస్తే"* (బృహ 3-5-13) (ఎవడు ఈఇంద్రియాలని అనంతాలని ఉపాసిస్తున్నాడో) అని వీటిని అనంతాలుగా ఉపాసించాలని చెప్పిఉండడంచేత ఉపాసింపబడేవాటి కార్యాలు లెక్కిమించినవని చెప్పి వాటిని అనంతాలంటారని స్పష్టం అవుతోంది. కనుక, అనన్తశ్రుతితో విరోధంలేదు. అందుచేత ఇంద్రియాలు అణుపరిమాణంగలవే.

### *సి.సూ.॥శ్రేష్ఠశ్చ॥ (2-4-7) (254)*

**శ్రేష్ఠః చ:-** ముఖ్యప్రాణం కూడా (ఉత్పత్తియున్నదే అయిఉంటుంది)

*పూ. 513* శరీరస్థితి హేతుత్వాత్ శ్రేష్ఠత్వగుమసంయుతః॥*
*514. ప్రాణో న జాయతే సృష్టేఃప్రాక్ స్వకార్యస్థితిశ్రుతేః।*
*జీవస్యేవాస్య చోత్పత్తిశ్రుతిర్న్యాయాన్యథేతి చేత్॥*

**513*-514. పూర్వపక్షం**-ముఖ్యప్రాణంకూడా , ఇంద్రియాలయిన ప్రాణాల మధ్యలోదేనని ఉపనిషత్తుల్లో వచ్చిన సంవాదంలో ప్రాణాలలో శరీరాన్ని స్థిరంగా నిలపడానికి కారణమైనందువల్ల శ్రేష్ఠమైనదిగా చెప్పబడిన ముఖ్యప్రాణం *"ఆనీదవాతం స్వధయా తదేకం తస్మాద్ధాన్యన్ నపరః కిఞ్చనాస"* (ఋక్ - అష్టక 8-7-17) ((ప్రళయకాలంలో) వాయువులేనిదై తనశక్తిగలదైన ముఖ్యప్రాణమనే ఒకటే ఊపిరిగా ఉన్నది. దానికంటే వేరేదీ లేదు.) అని మహాప్రళయకాలంలో అననం, ప్రాణనం అనబడే తనపనైన ఊపిరివదలడం చేసి ఉండేదిగా ఋగ్వేదంలో చెప్పబడటంతో, *"ఏతస్మాత్ జాయతే ప్రాణః"* (ముండక. 2-1-3) అనే శ్రుతిలో దానికి చెప్పబడే ఉత్పత్తి జీవుడికి చెప్పబడే ఉత్పత్తిలాగే గౌణమైనది

చెప్పుకోవాలి. కనుక, ముఖ్యప్రాణానికి ఉత్పత్తిలేదు.

సి. *515. ముఖ్యప్రాణోపీన్ద్రియవదుత్పద్యత ఇతీర్యతే।*
*"ఏతస్మాజ్జాయతే ప్రాణ" ఇత్యుత్పత్తిశ్రుతేస్తథా॥*
*516. జీవస్యేవాస్య చోత్పత్తి నిషేధాశ్రవణాత్తథా।*
*ప్రాక్సృష్టేశ్చ పరైకత్వావధారణవిరోధతః॥*

**515-518. సిద్ధాంతం:** ఈపూర్వపక్షం తప్పు. ఇంద్రియాల్లాగే ముఖ్యప్రాణంకూడా ఉత్పత్తిగలదనే గ్రహించాలి. "ఏతస్మాజ్జాయతే ప్రాణః మనః సర్వేంద్రియాణి చ " (ముండక 2-1-3) అనే వేదవాక్యంలో ముఖ్యప్రాణానికి ఇతర ఇంద్రియాలతోబాటు ఉత్పత్తి చెప్పబడింది. "న జాయతే " (కఠ. 1-2-18) అని జీవుడికిఉపనిషత్తులలో ఉత్పత్తిలేదని చెప్పబడినట్లుగా ముఖ్యప్రాణానికి ఉత్పత్తిలేదని ఏవాక్యంలోనూ చెప్పబడలేదు. "సదేవ", "బ్రహ్మ వా", "ఆత్మా వా", "ఏకో హవై నారాయణ ఆసీత్" అన్న శ్రుతులల్లో ప్రళయకాలంలో బ్రహ్మమైన నారాయణుడు ఒక్కడే ఉన్నట్టుగానూ, వేరేదీలేనట్టుగానూ, చెప్పబడడాన్ని అనుసరించి "ఆనీదవాతమ్"అనే శ్రుతిలోకూడా తన శక్తితోనున్న నారాయణుడే చెప్పబడినట్లుగా గ్రహించవలసిందిగనుక, ఆశ్రుతివల్ల ప్రాణం చేసే ఊపిరిపీల్చడమనేపని చెప్పబడిందనటం సరిగాదు. "అవాతమ్" (వాయువులేనిది) అని అక్కడనే వాయువులేదనే చెప్పటంవల్ల వాయువిశేషమైన ప్రాణంకూడా ప్రళయకాలంలో లేదు అనే సిద్ధిస్తుంది. కనుక, ముఖ్యప్రాణంకూడా, ఉత్పత్తి గలిగినదే.

ప్రాణాణుత్వాధికరణం పూర్తి అయినది.

## ॥ వాయుక్రియాధికరణమ్ ॥ (2-4-4)

### సి.సూ.॥ నవాయుక్రియే పృథగుపదేశాత్ ॥ (2-4-8) (255)

**పృథగుపదేశాత్- (వాటికంటే) వేరైనదిగా చెప్పబడడంవల్ల, వాయుక్రియే న-** (ప్రాణం) వాయువో దానిక్రియో కానేరదు.

*519. ముఖ్యప్రాణోపీన్ద్రియవదుత్పద్యత ఇతీరితమ్।*
*తస్య స్వరూపం ప్రాణస్య విచార్యాత్ర నిరూప్యతే॥*

***519.* అధికరణసంగతి:** వెనుకటి అధికరణంలో ముఖ్యప్రాణంకూడా ఇంద్రియాలలాగే సృష్టింపబడిందని నిరూపించబడింది. ఆముక్యప్రాణం అనబడేది ఏది అని విచారించి ఈఅధికరణంలో నిశ్చయింపబడుతోంది.

పూ. *520. శ్రేష్ఠప్రాణో వాయుమాత్రం "యః ప్రాణః స" ఇతి శ్రుతేః।*
*భూతద్వితీయే ప్రాణత్వప్రసిద్ధిర్నేతి చేత్తదా॥*
*521. వాయోరుచ్ఛ్వాసాదిరూపక్రియా వా ప్రాణ ఉచ్యతామ్।*

**520-*521. పూర్వపక్షం-** "యః ప్రాణః స వాయుః" (ఏది ప్రాణమో అది వాయువే) అని శ్రుతిలో చెప్పబడడంవల్ల ముఖ్యప్రాణం వాయువే అవుతుంది. పంచమహాభూతాల్లోనూ రెండోదైన వాయువునిగురించి "ప్రాణం" అనే లోకవ్యవహారం లేదే అంటే, ఊపిరితియ్యడం మొదలైన వాయుక్రియలే ప్రాణం అనబడుతోందని గ్రహించాలి.

సి. *521*. ఇతి పక్షద్వయమపి న మానానుగుణం భవేత్॥*
*522. న వాయుస్తత్క్రియా వాపి ప్రాణో భవితుమర్హతి।*
*దేహాదిధృతియోగ్యత్వదశావాన్ వాయురేవ సః॥*

*523. "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనస్స ర్వేన్ద్రియాణిచ।*
*ఖం వాయురి"తి వాయోశ్చ ప్రాణస్య పృథగుక్తితః॥*

*524. న వాయుమాత్రం ప్రాణః స్యాత్ తత ఏవ న తత్క్రియా।*
*క్రియాయాః పృథగుక్తిర్న తేదఆదిషు దృశ్యతే॥*

**521*-524. సిద్ధాంతం:** వాయువో, దాని క్రియో ప్రాణం అనబడుతోందనే రెండుపక్షాలూ ప్రాణాలకి తగినవికాకపోవడంవల్ల వాయువో, దానిక్రియో ప్రాణం కాలేవు. *"యః ప్రాణః స వాయుః"* అన్న ప్రమాణాన్న నుసరించి దేహం, ఇంద్రియాలు మొదలైనవాటిని ధరించేయోగ్యతనిపొందిన ఒకస్థితిని పొందిన వాయువే ప్రాణం అవుతుంది. అది వాయువో, క్రియో కాలేదనడానికి ప్రమాణం ఏమిటంటే, *"ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేంద్రియాణిచ । ఖం వాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్య ధారిణీ॥"*(ముండక. 2-1-3) ( ఈపరమాత్మనుండి ప్రాణం, మనస్సు, సమస్త ఇంద్రియాలు, ఆకాశం మొదలైన ఐదు భూతాలు సృష్టింపబడ్డాయి) అన్న ఉపనిషద్వాక్యంలో వాయువుకంటే వేరుగా ప్రాణం చెప్పబడటంవల్ల ప్రామం అనేది వాయువు కానేరదు. అగ్ని మొదలైన మిగతాభూతాల క్రియని వేరుగా చెప్పకపోవడంవల్ల వాయుక్రియనిగూడా ఇక్కడ చెప్పసాధ్యంకాకపోవడంవల్లనూ, అదికూడా ప్రాణం కాదు. కనుక, వెనకచెప్పినట్లుగా ఒకస్థితినిపొందిన వాయువే ప్రాణం అవుతుంది.

*525. అవ- ప్రాణో వాయువికారశ్చేత్ తేజో భూతాన్తరం యథా।*
*తథాऽయమప్యన్యభూతం స్యాదిత్యాశంక్య కథ్యతే॥*

525. **అవతారిక:** వాయువుతాలూకు ఒక ప్రత్యేకస్థితే ప్రాణం అయినట్లైతే, వాయువుతాలూకు ఒకకార్యస్థితైన అగ్ని ఎలా వేరు భూతం అయినదో, అదేవిధంగానే వాయువుతాలూకు మరో స్థితైన ఇదికూడా మరోభూతంకావలసివస్తుందే అన్న సందేహం ముందువచ్చే సూత్రంలో తీర్చబడుతోంది.

*సి.సూ.॥ చక్షురాదివత్తు తత్సహశిష్ట్యాదిభ్యః ॥ (2-4-9) (256)*

**చక్షురాదివత్ తు:-** కన్ను మొదలైనవాటిలాగే (ఇది ఒక ఉపకరణమే తప్ప భూతంగాదు). **తత్సహశిష్ట్యాదిభ్యః-** (ఉపకరణాలైన) కన్ను మొదలైనవాటితోబాటుగా చెప్పబడిఉండడం వంటి కారణాలవల్ల.

*526. చక్షుఃశ్రోత్రాదివత్ప్రాణో జీవోపకరణం మతమ్।*
*తథోపకరణత్వం చ తాదృశైరిన్ద్రియైస్సహ॥*

*527. ప్రాణసంవాదికేऽస్య శాసనాదవగమ్యతే।*
*తత్ప్రజాత్యే హి సత్యేవ పాఠతైస్సహ యుజ్యతే॥*

*528. కరణేషు విశిష్యోక్త్యాప్యయమర్థోऽవగమ్యతే।*
*తస్మాదగ్న్యాదివన్నాయం ప్రాణో భూతాన్తరం భవేత్॥*

**526-528. సిద్ధాంతం:** త్వక్కు, వాక్కు, కన్ను, ముక్కు, చెవి మొదలైన ఇంద్రియాలలాగ ప్రాణంకూడా జీవుడికి ఉపకరణంగా భావింపడేదేగాని వేరుభూతంగా భావింపబడలేదు. ఛాందోగ్యం మొదలైన ఉపనిషత్తుల్లో ముఖ్యప్రాణానికీ కన్ను మొదలైన ఇంద్రియాలకీ జరిగిన సంవాదాన్ని చెప్పే ప్రకరణంలో ప్రాణంఅన్నది జీవోపకరణాలైన కన్నుమొదలైనవాటితో కూడా చెప్పబడడంవల్ల ప్రాణంకూడా జీవోపకరణమేతప్ప వేరు భూతంగాదని తెలుస్తోంది. పైగా, ఉపకరణాలైన కన్ను మొదలైనవాటిని ప్రాణాలని ప్రాణాన్ని ముఖ్యప్రాణంఅనీ వాటిలో ముఖ్యమైనదిగా చెప్పడంవల్లనూ ఇది వాటితో చేరిన

ఉపకరణమే తప్ప అగ్ని మొదలైనవాటిలా వేరొక భూతంగాదని స్పష్టం అవుతోంది.

*సి.సూ.॥ అకరణత్వాచ్చ న దోషస్తథాహి దర్శయతి ॥ (2-4-10) (257)*

**అకరణత్వాత్ చ న దోషః-** (జీవుడికి ప్రాణంవల్ల) ఉపకారక్రియలేదే అనే దోషంకూడా లేదు. **తథా హి దర్శయతి-** (శరీరేంద్రియాలని నిలపడమనే) ఉపకారాన్ని శ్రుతి చూపుతోందిగదా.

*529. జీవం ప్రత్యుపకారాత్మక్రియాశూన్యత్వతోఽస్య చ।*
*ఉద్భావ్యతే యశ్చ దోషః న భవేత్ స యతః శ్రుతిః॥*
*530. "యస్మిన్నుత్క్రాన్త"ఇతి చ "పాపిష్ఠతర"మిత్యపి।*
*శరీరేన్ద్రియధృత్యాఖ్యక్రియాం దర్శయతి స్ఫుటమ్॥*
*531. జీవోపకారకత్వేన శరీరాదిధృతేరతః।*
*ప్రాణస్యైత స్యేన్ద్రియవత్ కరణత్వం తదక్షతమ్॥*

**529-531. సిద్ధాంతం:** కన్ను మొదలైనవాటికి చూడడానికి ఉపకరించడం మొదలైన ఉపకారక్రియ కనబడలేదే అనే దోషాన్ని చెప్పడం కుదరదు. *"యస్మిన్ ఉత్క్రాన్తే ఇదం శరీరం పాపిష్ఠతరమివ దృశ్యతే స వః శ్రేష్ఠః"* (ఛాం. 5-1-7) (ప్రాణాలైన మీకు ఏది శరీరాన్ని వదిలి వెళ్ళేటప్పుడు ఈశరీరం చాలా దెబ్బతిన్నట్టుగా కనబడుతుందో అదే మీలో గొప్పదౌతుంది) అని ఉపనిషద్వాక్యమే ముఖ్యప్రాణానికి శరీరేంద్రియాలని ధరించడం అనే ఉపకారక్రియని స్పష్టంగా చెప్తోంది. ఈవిధంగా శరీరేంద్రియాలని ధరింపజేయడం ఉపకారం ఉండడంవల్ల ముఖ్యప్రాణమున్నూ, కన్నుమొదలైనవాటిలాగే జీవుడికి ఉపకరణమే అని చెప్పడానికి ఏఆటంకంలేదు.

*సి.సూ.॥ పఞ్చవృత్తిర్మనోవద్వ్యపదిశ్యతే ॥ (2-4-11) (258)*

**పఞ్చవృత్తిః-** ఐదుపనులుగల ప్రాణమే **మనోవత్-** (ఎన్నోరకాలైన పనులనిగల) మనస్సులాగ, **వ్యపదిశ్యతే-** (ప్రాణం,అపానం మొదలైన) ఐదుపేర్లతో సూచింపబడుతోంది.

*532. యథా కామాది మనసః "కామః సఙ్కల్పః" ఇత్యతః।*
*వృత్తితత్కార్యయోర్భేదేఽప్యన్యతత్త్వం న సమ్మతమ్॥*
*533. తథా "ప్రాణోఽపాన" ఇతి గిరా ప్రాణస్య వై గతః।*
*వృత్తిభేదమపానాదిర్నాన్యతత్త్వమితి స్థితమ్॥*

*॥ ఇతి వాయుక్రియాధికరణమ్ ॥*

**532-533- సిద్ధాంతం:** ప్రాణం , అపానం, వ్యానం, ఉదానం, సమానం అని ఐదుపేర్లుండడం వల్ల, ఒక్కొక్కదానికీ ఒక్కొక్క పని ఉన్నందువల్లనూ, ఇవి ఐదు తత్త్వాలనవచ్చుగదా అంటే, *"కామః సఙ్కల్పో విచికిత్సా శ్రద్ధాఽశ్రద్ధా ధృతిరధృతిర్హ్రీర్ధీర్భీరిత్యేతత్ సర్వం మన ఏవ"* (బృహ 3-5-3) (కాం, సంకల్పం, సందేహం, త్వర, త్వరలేకపోవడం, ధైర్యం, పిరికితనం, లజ్జ, చింత, భయం అనే సమస్తమూ మనస్సే.) అని ఒక మనస్సుకి అనేకవృత్తులనిపెట్టి, కామం మొదలైన ఎన్నో పేర్లున్నప్పటికీ కామం మొదలైనవి మనస్సుకంటే వేరైన తత్త్వాలు కానట్టే, *"ప్రాణోఽపానోవ్యానఉదానః సమాన ఇత్యేతత్ సర్వం ప్రాణ ఏవ"* (బృహ 3-5-3) (ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం అనే అన్నీ ప్రాణమే.) అన్న వాక్యంవల్ల ఐదుక్రియల వేరుపాడువల్ల ఐదు పేర్లున్నా, ప్రాణం ఒకటే అని స్పష్టం అవుతోంది. కనుక, ఽపానం మొదలైనవి ప్రాణంకంటే వేరైన తత్త్వాలుగావు.

వాయుక్రియాధికరణం పూర్తి అయినది.

## // శ్రేష్ఠాణుత్వాధికరణమ్ // (2-4-5)

### సి.సూ.// అణుశ్చ // (2-4-12) (259)

**అణుః చ-** (ముఖ్యప్రాణం) అణువుకూడాను.

*534. అవస్థాన్తరమాపన్నో వాయురేవ ప్రాణశబ్దితః।*
*ఇత్యుక్తం పూర్వమస్యాత్ర పరిమాణం నిరూప్యతే॥*

**534. సంగతి:** ఒక అవస్థని పొందిన వాయువే ముఖ్యప్రాణం అనబడుతోంది అని వెనుకటి అధికరణంలో నిరూపించబడింది. ఈఅధికరణంలో ఆముఖ్యప్రాణ పరిమాణం నిరూపించబడుతోంది.

*535. "ప్రాణోనూత్క్రామతీ"త్యాదావుత్క్రాన్తిశ్రవణాదయమ్।*
*ముఖ్యప్రాణోపీన్ద్రియవదణురానన్త్యబోధికా॥*

*536. "సమ ఏభిస్త్రిభిర్లోకై"రిత్యాద్యా శ్రుతిరస్య చ।*
*తదధీనాఖిలప్రాణిస్థిత్యుత్కర్షం బ్రవీతి హి॥*

*// ఇతి శ్రేష్ఠాణుత్వాధికరణమ్ //*

**535-536. సిద్ధాంతం:** *"తమ్ ఉత్క్రామన్తం ప్రాణోऽనూత్క్రామతి"* (బృహ 6-4-2) (శరీరాన్ని వదిలి బైటికిపోతున్నజీవుడితో ముఖ్యప్రాణంకూడా బైటికిపోతోంది) అని జీవుడు మరణించినప్పుడు, శరీరాన్ని వదిలివెళ్ళడంలో ఇంద్రియాల్లాగే ముఖ్యప్రాణంకూడా జీవుడివెనకాలే వెళ్ళటం చెప్పటంవల్ల ఇంద్రియాల్లాగే ప్రాణంకూడా అణుపరిమాణమనే గ్రహించవలెను. "సమ ఏభిస్త్రిభిర్లోకైః" (బృహ 3-3-22) (ముఖ్యప్రాణం అనేది ఈమూడులోకాలతో సమమైనది) మొదలైన శ్రుతులనించి ఇది పెద్దపరిమాణం గలదని తెలుస్తోందే అంటే, ఈశ్రుతులు పరిమాణాన్ని చెప్పడంలేదు, లోకంలో సమస్తప్రాణులూ ప్రాధీనమై జీవుస్తున్నాయి అని ప్రాణానికున్న గొప్పదనాన్నే చెప్పున్నాయిగనుక, ఉత్క్రాన్తిశ్రుతివల్ల స్పష్టమయే అణుత్వానికి లోటులేదు.

శ్రేష్ఠాణుత్వాధికరణం పూర్తి అయినది.

## // జ్యోతిరాద్యధిష్ఠానాధికరణమ్ // (2-4-6)

### సి.సూ.// జ్యోతిరాద్యధిష్ఠానంతు తదామననాత్ప్రాణవతా శబ్దాత్ // (2-4-13) (260)

**ప్రాణవతా (సహ) జ్యోతిరాద్యధిష్ఠానమ్ తు-** ప్రాణంతోనున్న జీవుడితో, (ప్రాణం) అగ్ని మొదలైన దేవతలుకూడా అధిష్ఠించడం, **తదామననాత్-** పరమాత్మసంకల్పంవల్లనే. **శబ్దాత్-** శ్రుతినుండి (ఇది తెలుస్తోంది)

*537. ఏవం సప్రాణేన్ద్రియాణాముత్పత్త్యాది నిరూపితమ్।*
*అగ్న్యాదేస్తదధిష్ఠానే నిరపేక్షత్వమస్యతే॥*

537. **సంగతి:** ఈవిధంగా ఈపాదంలో వెనుకటి అధికరణంవరకూ ప్రాణంతోకూడా ఉన్న ఇంద్రియాలకి ఉత్పత్తి, పరిమాణం మొదలైనవి నిరూపింపబడ్డాయి. ఈఅధికరణంలో 'అగ్ని మొదలైన దేవతలుకూడా జీవుడు, ఇంద్రియాలని ముఖ్యప్రాణాన్నీ అధిష్ఠించినప్పుడు, పరమాత్మనిరపేక్షంగా అధిష్ఠిస్తున్నారు" అనే వాదనని తిరస్కరించడం జరుగుతోంది.

*538. జీవస్య వాగ్న్యాదీనాం చేన్ద్రియసంఘప్రవర్తనమ్।*

*538. **పూర్వపక్షం:** *"అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్ ... వాయుః ప్రాణో భూత్వా నాసికే*

*ప్రావిశత్"* (ఐతరేయ 1-2-4) ( అగ్నిదేవత వాక్కుని అధిష్ఠించి ముఖంలో ప్రవేశిస్తోంది. ... వాయువు ముఖ్యప్రాణాన్ని అధిష్ఠించి నాసిక(ముక్కు)లో ప్రవేశిస్తోంది) అని శ్రుతిలో అగ్ని మొదలైన దేవతలు ఇంద్రియాలైన ప్రాణాలని, ముఖ్యప్రాణాన్ని అధిష్ఠిస్తున్నట్లుగా చెప్పబడ్డది. తన అనుభవానికి సాధనమైన వీటిని జీవుడు అధిష్ఠిస్తున్నాడన్నదికూడా లోకసిద్ధం. *"ఏవమేవైష ఏతాన్ ప్రాణాన్ గృహీత్వా స్వే శరీరే యథాగమమం పరివర్తతే"* (బృహ 4-1-48) (ఈవిధంగా ఈజీవుడు ఈఇంద్రియప్రాణాలని అధిష్ఠించి తన శరీరంలో ఇష్టప్రకారం సంచరిస్తున్నాడు) అనే శ్రుతినుండికూడా ఇది స్పష్టం అవుతోంది. ఈవిధంగా దేవతలూ, జీవుడూ ప్రాణాలని అధిష్ఠించడానికి పరమాత్మయొక్క సహాయం అవసరంలేదుగనుక, పరమాత్మనిరపేక్షంగానే వీళ్లు ప్రాణాలని అధిష్ఠిస్తున్నారని స్పష్టం అవుతోంది.

*538*. స్వాయత్తం నైరపేక్ష్యాదిత్యుక్తిర్మాననిరాకృతా॥*

*539. జీవాత్మనా సహాగ్న్యాదేరిన్ద్రియాదిప్రవర్తనమ్।*
*సఙ్కల్పాదేవేశితుస్సంభవతి శ్రుతివాక్యతః*

*540. "యోగ్నౌ తిష్ఠన్, యమయతి, స ఆత్మే'త్యాదికా శ్రుతిః।*

**538*-*540. సిద్ధాంతం:** ఈపూర్వపక్షం ప్రమాణవిరుద్ధమకనుక తప్పు. దేవతలు, జీవుడు, ఇంద్రియప్రాణాలని అధిష్ఠించడం పరమాత్మసంకల్పంవల్లనే అవుతోంది. "యోఽగ్నౌ తిష్ఠన్ అగ్నేరన్తరః, యమగ్నిర్నవేద, యస్యాగ్నిశ్శరీరం, యోగ్నిమన్తరో యమయతి, స త ఆత్మాఽన్తర్యామ్యమృతః" (బృహ 5-7-5) (ఎవడు అగ్నిలోపల, బైట ఉన్నాడో, ఎవనిని అగ్ని తెలియలేదో, ఎవనికి అగ్ని శరీరమో, ఎవడు అగ్నిని లోపల ప్రవేశించి నియమించుచున్నాడో, అతడే నీకును ఆత్మగనున్న నాశంలేని అంతర్యామి) అని ప్రారంభించి " యో వాయౌ తిష్ఠన్", "య ఆదిత్యే తిష్ఠన్" "య ఆత్మని తిష్ఠన్", "యశ్చక్షుషి తిష్ఠన్" అని ప్రతీసారీ ఈదేవతలతో జీవుడితో వాళ్ళవల్ల అధిష్ఠించబడే ఇంద్రియప్రాణాలతో భేదంలేకుండా, అన్నింటినీ పరమాత్మ అధిష్ఠించి నిల్పినట్టుగా చెప్పడం చేతను, *"భీషాస్మాద్వాతః పవతే భీషోదేతి సూర్యః। భీషాస్మాదగ్నిశ్చేన్ద్రశ్చ మృత్యుర్ధావతి పఞ్చమః॥"* (తై-ఆన 8-1) (పరమాత్మకి భయపడి వాయువు వీస్తున్నది. సూర్యుడు ఉదయిస్తున్నాడుఅగ్ని, ఇంద్రుడు, యముడు మొదలైనవాళ్ళు కర్మలను చేస్తున్నారు) అనే శ్రుతిలో సమస్త దేవతలూ ఈయనకి భయపడి వారివారి పనులు చేస్తున్నారని చెప్పడంవల్లనూ, *"ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః"* (బృహ 5-8-9) (గార్గీ, ఈపరమాత్మ ఆజ్ఞచేతనే సూర్యచంద్రులు ధరించి ఉన్నారు) అనే శ్రుతి పరమాత్మసంకల్పంవల్లనే దేవతలు ధరించి ఉన్నట్టుగా చెప్పడంవల్లనూ, దేవతలు, జీవుడు ఇంద్రియప్రాణాలని ధరించి ఉండడం పరమాత్మ సంకల్పంవల్లనే అని స్పష్టం అవుతోంది.

*సి.సూ.॥ తస్య చ నిత్యత్వాత్ ॥ (2-4-14) (261)*

**తస్య**- సమస్తాన్నీ పరమాత్మనియమిస్తున్నాడు అన్నది **నిత్యత్వాత్ చ** - నిత్యమై ఉండడంవల్ల.

**540. పరాత్మాధిష్ఠితత్వస్య సర్వేషాం నియతత్వతః॥*

*541. తత్సఙ్కల్పాదేవ తేషామధిష్ఠాతృత్వముచ్యతే।*
*"తత్సృష్టే"'త్యాదినేశస్య నియన్తృత్వేన సర్వదా॥*

*542. చిదచిత్సు ప్రవేశో హి శ్రూయతే స్మర్యతేఽపి చ।*
*"విష్టభ్యే"త్యాది, తస్మాత్సాదర్థః ప్రోక్తః సమఞ్జసః॥*

*॥ ఇతి జ్యోతిరాద్యధిష్ఠానాధికరణమ్॥*

**540*- 542. సిద్ధాంతం:** సమస్తపదార్థాలనీ పరమాత్మ అధిష్ఠించి ఉన్నాడన్నది అతడికి ఎప్పుడూ ఉండే గొప్పతనం. ఈగొప్పతనం అతనికి స్వరూపనిరూపకంకావడంతో, ఏపదార్థంకూడా ఆయనచేత ధరింపబడకుండా ఉండడం సాధ్యంగాదు. కనుక, అధిష్ఠింపబడే ప్రాణాలతోబాటు వాటిని అధిష్ఠించే అగ్నిమొదలైనవాటితోబాటు తేడాలేకుండా, సమస్తమూ పరమాత్మవల్ల అధిష్ఠింపబడు తున్నాయి. కనుక, ఆతని సంకల్పంవల్లనే అగ్ని మొదలైనవి ప్రాణాలని అధిష్ఠించి ఉన్నాయని స్పష్టం అవుతోంది. *"తత్ సృష్ట్వా తదేవానుప్రవిశత్। తదనుప్రవిశ్య సచ్చ త్యచ్చాభవత్॥"* (తై. ఆనం. 6-2,3) ((పరమాత్మవస్తువు) లోకాన్ని సృష్టించి దానినే లోపల ప్రవేశించి వ్యాపించింది, ఆతర్వాత వికారంలేనిదైన చిత్తుగాను, వికారముగల అచిత్తుగాను అయినది.) అన్న శ్రుతికూడా, సర్వేశ్వరుడు సమస్త చేతనాచేతనపదార్థాలనీ నియమించి ఎప్పుడూ వ్యాపించి ఉన్నాడు, అని చెప్పింది. గీతఅన్న స్మృతిలోకూడా *"విష్టభ్యాహమిదం కృత్స్నం ఏకాంశేన స్థితో జగత్" (గీత 10-42)* ( ఈసమస్తలోకాన్నీ నాశక్తిలో ఒక చుక్కవలన నేను ధరించి ఉన్నాను) అని ఈఅర్థాన్నే చెప్తోంది.

జ్యోతిరాద్యధిష్ఠానాధికరణం పూర్తి అయినది

## *॥ ఇంద్రియాధికరణమ్ ॥ (2-4-7)*

### *సి.సూ.॥ ఇన్ద్రియాణి తద్వ్యపదేశాదన్యత్ర శ్రేష్ఠాత్ ॥ (2-4-15) (262)*

**శ్రేష్ఠాత్ అన్యత్ర- ముఖ్యప్రాణం** తప్ప ఇతరప్రాణాలేవైతే, **తే ఇంద్రియాణి-** అవే ఇంద్రియాలు. **తద్వ్యపదేశాత్-** (వాటిని సూచించే) ఇంద్రియాలని వ్యవహరింపబడుతున్నాయి కనుక.

*543. శ్రేష్ఠస్య చక్షురాదేశ్చ జీవోపకరణత్వతః।*
*సర్వేషామిన్ద్రియత్వం స్యాదితి వాదోऽత్ర వార్యతే*

***543.* అవతారిక.** ముఖ్యప్రాణమున్ను, కన్ను మొదలైన ఇంద్రియాలున్నూ అయిన అన్నీ, ప్రాణం అని పిలవబడటంవల్లనున్నూ, జీవుడికి ఉపకరణం అయినందువల్లనూ, ఇవన్నీ ఇంద్రియాలనబడతగినవి" అనేవాదం ఈఅధికరణంలో నిరసింపబడుతోంది.

*పూ. 544. కరణత్వాత్ప్రాణశబ్దవాచ్యత్వాదవిశేషతః।*

***544.* పూర్వపక్షం:** శ్రుతివాక్యాల్లో ముఖ్యప్రాణంకూడా ప్రాణం అనబడుతోంది. కన్ను మొదలైనవికూడా ప్రాణం అనబడుతున్నాయి. అవిరెండే జీవుడికి ఉపకరణాలైఉన్నాయి. ఏది జీవుడికి ఉపకరణమో అది ఇంద్రియం అనతగినది. కనుక కన్ను మొదలైనవి, ముఖ్యప్రాణం భేదంలేకుండా, అన్నీ ఇంద్రియాలే.

*544*. తే సర్వ ఏవేన్ద్రియాణి భవేయురితి చేన్న తత్॥*
*545. శ్రేష్ఠాతిరిక్తాః ప్రాణాస్త ఇన్ద్రియాణ్యేషు వై స్ఫుటమ్।*
*"ఇన్ద్రియాణి దశైకం చే"త్యాదినేన్ద్రియతోక్తతః॥*

**544*-545. సిద్ధాంతం:** ఈపూర్వపక్షం తప్పు. ముఖ్యప్రాణం తప్ప మిగతా ప్రాణాలే ఇంద్రియాలు అవుతాయి. ఎందుకంటే, కన్ను మొదలైనవాటినిగురించే ఇంద్రియశబ్దం ప్రయోగించబడింది. *"ఇన్ద్రియాణి దశైకం చ"* (గీత 13-5) మొదలైనచోట్లకూడా త్వక్కు, నోరు, కన్ను, ముక్కు, చెవి అనబడే ఐదు జ్ఞానేంద్రియాలు, వాక్పాణిపాదపాయురుపస్థ అనే ఐదు కర్మేంద్రియాలూ, వీటిని నియమించే మనస్సు అయిన పదకొండింటిని గురించే ఇంద్రియం అని స్పష్టంగా వ్యవహరింపబడడం చూస్తున్నాం. కనుక, ముఖ్యప్రాణం ఇంద్రియంగాదు.

### సి.సూ.॥ భేదశ్రుతేర్వైలక్షణ్యాచ్చ ॥ (2-4-16) (263)

**భేదశ్రుతేః** - ఇంద్రియాలనీ, ప్రాణాన్నీ వేరుచేసి చెప్పడంవల్లనూ, **వైలక్షణ్యాత్ చ**- (ఇంద్రియాలకంటే ముఖ్యప్రాణం) వేరురకంగా ఉండడంవల్లనూ, (ముఖ్యప్రాణం తప్ప ఇతరప్రాణాలే ఇంద్రియాలు.)

*546. "ఏతస్మాజ్జాయతే ప్రాణో మనస్సర్వేన్ద్రియాణి చ।*
*ఇత్యాదిష్విన్ద్రియేభ్యోఽస్య ప్రాణస్య పృథగుక్తితః॥*
*547. ఇన్ద్రియత్వం తదన్యేషామేవేతి జ్ఞాయతే స్ఫుటమ్।*
*మనసః పృథగుక్తస్య త్విన్ద్రియత్వం ప్రమాణతః॥*
*548. శ్రేష్ఠస్య చక్షురాదేస్తు వైలక్ష్యాచ్చ నాస్య తత్।*
*సుషుప్తౌ వృత్తిరస్యాస్తి నేన్ద్రియాణాం హి దృశ్యతే॥*
*549. సమనశ్చక్షురాదేస్తు కార్యం జ్ఞానాదికం భవేత్।*
*దేహేన్ద్రియధృతిస్త్వస్య తస్మాన్నేన్ద్రియతాస్య హి॥*

**546-549. సిద్ధాంతం:** *"ఏతస్మాజ్జాయతే ప్రాణో మనః సర్వేన్ద్రియాణిచ"* (ముండక 2-2-3) (ఈపరమాత్మనుండే ప్రాణం, మనస్సు సమస్త ఇంద్రియాలూ సృష్టింపబడ్డాయి) మొదలైన చోట్ల ఇంద్రియాలకంటే ప్రాణమనేది వేరుగా చెప్పబడిఉండడంవల్ల ముఖ్యప్రామం తప్ప మిగత ప్రాణాలే ఇంద్రియాలవుతాయని స్పష్టమవుతోంది.ఇంద్రియమైన మనస్సు వేరుగా చెప్పబడినా, ***"మనష్షష్ఠానీన్ద్రియాణి"*** (గీత 15-7) (మనస్సుని ఆరోదిగా గల ఐదు జ్ఞానేంద్రియాలని) మొదలైనచోట్ల మనస్సనేది మిగతా ఇంద్రియాలని నియమించే ఇంద్రియంగానే చెప్పబడిఉండటంచేత, అదికూడా ఇంద్రియమనే గ్రహించబడుతోంది. అలా ప్రాణాన్ని అంతటా ఇంద్రియంగా చెప్పబడకపోవటంవల్ల అది ఇంద్రియంగా తీసుకోబడడంలేదు. పైగా కన్ను మొదలైన ఇంద్రియాలకంటే, ముఖ్యప్రాణానికి ఎన్నోరకాలైన శ్రేష్ఠతలు కనబడుతున్నాయి. మనుష్యుడు నిద్రపోతున్నప్పుడు కన్ను మొదలైనవి పనిచెయ్యడం లేదు. ముఖ్యప్రాణం పని చేస్తోంది. ఇంద్రియాల్లో జ్ఞానేంద్రియాలు జ్ఞానసాధనాలుగానూ, కర్మేంద్రియాలు క్రియాసాధనాలుగానూ ఉన్నాయి. మనస్సు వీటన్నిటినీ నియమిస్తోంది. ముఖ్యప్రాణంమాత్రంఅన్ని సమయాల్లోనూ శరీరం, ఇంద్రియాలు అనే అన్నింటినీ ధరించి నిలపడం అనే అరుదైనకార్యాన్ని చేస్తోంది. (ముఖ్య) ప్రాణంవల్ల ధరింపబడేవిగనుకనే ఇంద్రియాలు ప్రాణాలనబడుతున్నాయి. ***"న ఏతస్యైవ సర్వే రూపమభవన్ తస్మాదేత ఏతేన ఆఖ్యాయన్తే"*** (బృహ 3-5-21) ( ఆప్రాణాలు (ఇంద్రియాలు) అన్నీ ఈముఖ్యప్రాణానికి శరీరంగా (ధరింపబడేవిగా) అయినాయి. అందువల్లనే, ఇంద్రియాలు ప్రాణం అనబడుతున్నాయి) అని శ్రుతిలోకూడా ఈవిషయం చెప్పబడ్డది. కనుక, ముఖ్యప్రామం తప్ప మిగత ప్రాణాలే ఇంద్రియాలని స్పష్టం అయింది.

ఇంద్రియాధికరణం పూర్తైనది.

## ॥ సంజ్ఞామూర్తిక్లుప్త్యధికరణమ్ ॥ (2-4-8)

### సి.సూ.॥ సంజ్ఞామూర్తిక్లుప్తిస్తు త్రివృత్కుర్వత ఉపదేశాత్ ॥ (2-4-17) (264)

***సంజ్ఞామూర్తిక్లుప్తిః*** - నామరూపవ్యాకరణం, ***త్రివృత్కుర్వతః తు***- త్రివృత్కరణం చేసే పరమాత్మదే ఔతుంది. ***ఉపదేశాత్*** - (ఆపరమాత్మకే నామరూపవ్యాకరణం) ఉన్నదిగా చెప్పబడటంవల్ల.

*550. సమష్టిసృష్టిర్బ్రహ్మైకకృతేతి ప్రాజ్నైరూపణాత్।*

*నిశ్చితం బ్రహ్మకార్యత్వం మహాభూతేన్ద్రియాదిషు॥*

551. *దేవాదివ్యష్టిసృష్టిర్యా చతుర్ముఖకృతైవ సా।*
*ఇతి శఙ్కాపనోదేన దేవమర్త్యాదిదేహినామ్॥*

552. *తత్కార్యతానిశ్చయాయ ప్రవృత్తేయమధిక్రియా।*

550-*552. **సంగతి.** అండసృష్టైన సమష్టిసృష్టి అనేది బ్రహ్మంవల్లనే చెయ్యబడిందని ఇంవరకూ నిరూపించినందువల్ల, పంచభూతాలు, ఇంద్రియాలు, ప్రాణం మొదలైనవి బ్రహ్మకార్యవస్తువులే అని నిశ్చయింపబడింది దేవతలు మొదలైనవాళ్ళని సృష్టించినదైన వ్యష్టిసృష్టి అండంలో బ్రహ్మంచేత సృష్టింపబడిన చతుర్ముఖుడుచేసినదేఅవుతుందనే సందేహాన్ని నివర్తించడంద్వారా దేవతలు, మనుష్యులుమొదలైన సమస్తజీవులూ బ్రహ్మకార్యపదార్థాలేనని ఈఅధికరణంలో నిర్ణయించబడుతోంది.

పూ. 552*. *నామరూపవ్యాక్రియాత్మప్రపఞ్చవ్యష్టిసర్జనమ్॥*

553. *సమష్టిజీవరూపస్య ధాతురేవ క్రియా భవేత్।*
*"అనేన జీవేనే"త్యాదివ్యతిరేకశ్రుతేస్తథా॥*

554. *అత్ర "వ్యాకరవాణీ"తి హ్యుత్తమోక్తిః కథఞ్చన।*
*జీవాత్మనః పరాంశత్వాత్ ఉపపద్యత ఏవ చ॥*

555. *తస్మాదేతద్వ్యాకరణం ధాతురేవేతి చేన్న తత్।*

**552*-*555. పూర్వపక్షం:** లోకంలో సమస్తపదార్థాలకీ నామరూపాలని ఇవ్వడం అనే వ్యష్టిసృష్టి సమష్టిదీవరూపుడైన చతుర్ముఖుడి కార్యమే అవుతుంది. ***"అనేన జీవేన ఆత్మనాऽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి"*** (ఛాం. 6-3-2) (నా అంశమైన ఈ (చతుర్ముఖుడనే) జీవుడితో లోపలికి ప్రవేశించి నేను నామరూపాలని ఇస్తున్నాను) అనే ఉపనిషద్వాక్యంలో "ఈజీవుడితో" అని తనకంటే వేరైన చతుర్ముఖబ్రహ్మని ఎత్తుకొని, అతనిద్వారా కదా నామరూపవ్యాకరణాన్ని చేసినట్లుగా శ్రుతి చెప్తోంది. కనుక, "వేగులవాడివల్ల రాజుగారు గూఢచర్యని చూసేడు" అన్నప్పుడు రాజుగారి నియమనంతో వేగులవాడు గూఢచర్యని చేసినట్లుగా స్పష్టమైనట్లుగా బ్రహ్మనియమనంవల్ల చతుర్ముఖుడు నామరూపవ్యాకరణాన్ని చేసేడని స్పష్టం. ఆశ్రుతిలో ***"నామరూపే వ్యాకరవాణి"*** అని తానే నామరూప వ్యాకరణక్రియని చేసినట్లు, బ్రహ్మవల్ల చెప్పబడిందే, ఇది ఎలా కుదురుతుంది? అంటే చతుర్ముఖుడైన జీవుడు పరబ్రహ్మతాలూకు అంశంగనుక, బ్రహ్మం తానే చేసినట్లుగా చెప్పినట్లు ఒకవిధంగా నిర్వాహం చెయ్యవచ్చు. కనుక, చతుర్ముఖుడే నామరూపవ్యాకరణమనే వ్యష్టిసృష్టిని చేసేడని స్పష్టమైంది.

సి. 555* *త్రివృత్కుర్వత ఏవైతద్వ్యాకృతేరుపదేశతః॥*

556. *నామరూపవ్యాకరమవ్యష్టిసృష్టిః పరాత్మనః।*
*త్రివృత్కరణమేతత్తు ధాత్రా కర్తుం న శక్యతే॥*

557. *చతుర్ముఖజనిర్వ్యణ్డసృష్ట్యనన్తరభావినీ।*
*త్రివృత్కృతైరే తేజోబన్నైస్తత్సృష్టిసంభవః॥*

558. *"తస్మిన్ జజ్ఞే స్వయం బ్రహ్మ సర్వలోకపితామహః।*
*సమేత్యాన్యోన్య సంయోగమణ్డముత్పాదయన్తి తే॥*

559. *ఇత్యాది స్మర్యతేऽతో వై చతుర్ముఖశరీరకాత్।*
*పరమాత్మన ఏవైషా వ్యష్టిసృష్టిరతీర్యతే॥*

*560. శ్రుతౌ వ్యాకరవాణీ"తి నిర్దేశశ్చ సుసఙ్గతః।*
*"అనేన జీవేనే"త్యాది వ్యతిరేకవచోపి తత్॥*

*561. జీవాత్మ దేహకేనాత్మనేత్యర్థాద్ధి సుసఙ్గతమ్।*
*జీవశబ్దస్తేజఆదిశబ్దవజ్జీవదేహకమ్॥*

*562. బ్రహ్మ వక్తి తతో జీవేనాత్మనేతి శ్రుతౌ శ్రుతమ్।*
*సామానాధికరణ్యం చ ముఖ్యం నిర్దిష్టయోరిహ॥*

*563. ప్రవేశవ్యాకరణయోరేకకర్తృకతాపి చ।*
*నామరూపవ్యాకరణం క్రియాఽతః పరమాత్మనః॥*

**555*-563. సిద్ధాంతం:** ఈపూర్వపక్షం తప్పు. వెనుక ఎత్తుకున్న శ్రుతివాక్యం తరువాత *"తాసాం త్రివృతం త్రివృతం ఏకైకాం కరవాణి"* (ఛాం. 6-3-2) అని అగ్ని, నీరు, భూమి అనే మూడు భూతాలనీ ఒకదానితో ఒకటి చేర్చడం అనే త్రివృత్కరణాన్ని చేసినట్లుగా చెప్పబడిన బ్రహ్మమే నామరూపవ్యాకరణాన్ని కూడా చేసినట్లు తెలియజేయడంతో, నామరూపవ్యాకరణమనే వ్యష్టిసృష్టి పరమాత్మ చేసినదే అని స్పష్టం అవుతోంది. *"నానావీర్యాఃపృథగ్భూతా స్తతస్తేసంహతిం వినా । నాశక్నువన్ ప్రజాః స్రష్టుం అసమాగమ్యకృత్స్నశః॥ సమేత్యాన్యోన్యసంయోగం పరస్పర సమాశ్రయాః।మహదాదివిశేషాన్తా హ్యణ్డముత్పాదయన్తి తే॥"* (వి.పు. 2-2-52,53) (మహత్తు మొదలుగా భూతాలతోబాటు సమస్తమూ వేరువేరుగాఉంటూ, ఒకటిగా చేరనందువల్ల ప్రజలని సృష్టింపకుదరలేదు. కనుక ఒకదాంతోమరొకటి చేరి పరస్పరం బలాన్నిపొందేవై అండాన్ని సృష్టించేయి.) అన్నప్రకారం, త్రివృత్కరణం చెయ్యబడిన భూతాలనించే అండం సృష్టింపబడింది. *"తస్మిన్ జజ్ఞే స్వయం బ్రహ్మ సర్వలోకపితామహః"* (మను 1-9) (ఆఅండంలో లోకం అంతటికీ పితామహుడైన బ్రహ్మ సృష్టింపబడ్డాడు.) అని ఆఅండం సృష్టింపబడినతర్వాతే అందులో చతుర్ముఖుడు సృష్టింపబడినట్లు స్పష్టం అవుతోంది. కనుక, త్రివృత్కరణాన్ని అతను చెయ్యడం కుదరదు. బ్రహ్మమే చెయ్యగలడు. కనుక త్రివృత్కరణం చేసిన బ్రహ్మమే నామరూపవ్యాకరణంకూడా చేసేడని స్పష్టం. అలా అయితే, "అనేన జీవేన" (ఈజీవుడివలన) అన్నది ఎలా కుదురుతుంది? అంటే, "ఆత్మా జీవేన" అని జీవుడైన చతుర్ముఖుడిని తనతోబాటు ఒకే వర్గంలో చెప్పబడడంవల్ల జీవుడిని శరీరంగా గల బ్రహ్మమే జీవశబ్దంచేత సూచింపబడుతోంది అని స్పష్టం. "*తత్ తేజ ఐక్షత... తదపోఽసృజత....... తా ఆప ఐక్షన్త*"(ఛాం. 6-2-3,4) అన్న శ్రుతిలో -- అగ్నిఅనేది సంకల్పించి జలాన్నీ, జలమనేది సంకల్పించి భూమినీ సృష్టించేయని చెప్పినది -- అగ్ని, జలం, మొదలైనవాటిని శరీరంగా గల బ్రహ్మం సంకల్పించి సృష్టించిందనే చెప్తోందని ఇదివరకే నిర్ణయింపబడినట్టుగా ఇక్కడకూడా జీవసమష్టిగాఉన్న చతుర్ముఖుడు శరీరంగా గలిగిన బ్రహ్మమే నామరూపవ్యాకరణాన్ని చేసినట్టుగా గ్రహించాలి. ఇలా తీసుకున్నట్లైతే, "*జీవేన ఆత్మనా" (ఛాం.*6-3-2) (జీవుడైన నావలన) అని జీవుడైన చత్రుర్ముఖుడిని, తననీ ఒకేవర్గంలో చెప్పడం, శరీరశరీరిభావంతో ముఖ్యంగానే అయింది. *"అనేన జీవేన"* (ఛాం. 6-3-2) (ఈజీవుడివలన)అని చతుర్ముఖుడిని తనకంటే వేరైనవాడిగా పరమాత్మ చెప్పడంకూడా, "ఈచతుర్ముఖుడిని శరీరంగాగల నావలన" అనే అర్థంచెప్పుకోవడంతో ఇది తగినదే అవుతుంది. నామరూపవ్యాకరణం, అనుప్రవేశం, పరమాత్మ ఒక్కడే చేస్తున్నాడు అని చెప్పడంకూడా తగినట్టుగానే ఉంటుంది. పైగా, "లోపల ప్రవేశించి నామరూపాలని ఇస్తాను" అని పరమాత్మవస్తువే నామరూపాలని చేస్తాడని స్వభావంగా చెప్పడంకూడా ఇలా గ్రహిస్తేనే

ముఖ్యంగానే తగిఉంటోంది. చతుర్ముఖుడిసృష్టినిచెప్పే ప్రకరణంలో నామరూపవ్యాకరణాన్ని చేస్తాడని చెప్పడం ప్రకరణవిరుద్ధంగాదా అంటే, చతుర్ముఖుడిని శరీరంగాగల పరమాత్మే సృష్టించడంవల్ల ప్రకరణవిరోధంకూడా లేదు. కనుక, నామరూపాలని చెయ్యడం పరమాత్మక్రియేనని తేలింది.

564. *త్రివృత్కారప్రకారోఽత్ర వేధస్సృష్టేషు వస్తుషు।*
*ప్రదర్శ్యతేఽ"న్నమశితం త్రేధే"త్యాద్యైరతశ్చ సః॥*

**565.** *వేధఃకృతాస్త్రివృత్కారః తత ఏవోపపద్యతే।*
*'నామరూపే వ్యాకరో"దిత్యే"కైకామకరో"దితి।*

**566.** *పౌర్వాపర్యమపీత్యేతద్వచోఽత్ర వినివార్యతే।*

**564-*566. అవతారిక:** ఇక వెనుక చెప్పిన సిద్ధాంతంమీద ఇలా పూర్వపక్షం చెయ్యబడుతోంది. (1) అండసృష్టికిపూర్వమే త్రివృత్కరణం అవడంవల్ల , అది పరమాత్మ చేసినదిగానే ఉండాలని చెప్పడం కుదరదు. అండసృష్టితర్వాత చతుర్ముఖసృష్టిప్రకరణంలో *"అన్నమశితంత్రేధా విధీయతే తస్య యః స్థవిష్ఠోభాగస్తత్ పురీషం భవతి, యో మధ్యమ స్తన్మాంసం, యోఽణిష్ఠస్తన్మనః" (:ఛాం.* 6-5-1,2,3) (ప్రాణులచేత తినబడిన అన్నం మూడుభాగాలుగా విభజింపబడుతోంది.అందులో స్థూలమైన భాగం మలం అవుతోంది. (స్థూలమూ, మరీ సూక్ష్మమూ కాని) మధ్యభాగం మాంసమౌతుంది. అతి సూక్ష్మ మైన భాగం మనస్సుని పోషిస్తుంది) అని ప్రారంభించి త్రివృత్కరణం చెప్పబడడంవల్ల, అదికూడా చతుర్ముఖుడైన జీవుడు చేసినదే అవుతుంది. (2) దీనికి ముందరి ఒకవాక్యంలో, "*యదగ్నే రోహితం రూపం తేజసస్తద్రూపం, యచ్ఛుక్లం తదపాం, యత్కృష్ణం తదన్నస్య"* (ఛాం. 6-4-7) {అగ్నిరూపంలో ఎర్రగాఉండే భాగం తేజస్సుతాలూకు రూపం అవుతుంది. తెల్లగా ఉండే భాగం నీటిది. నల్లగాఉండే భాగం భూమిది) అని ప్రారంభించి చతుర్ముఖుడు సృష్టించిన అగ్ని మొదలైన పదార్థాల త్రివృత్కరణం చూపబడడం, అది చతుర్ముఖుడివల్ల చెయ్యబడిందని బలంగా స్థాపించబడుతోంది. (3) *"నామరూపే వ్యాకరోత్, తాసాం త్రివృతం త్రివృతం ఏకైకాం అకరోత్"*(ఛాం. 6-3-33) అని నామరూపవ్యాకరణానికి తరువాతిదిగా త్రివృత్కరణం చెప్పబడడంవల్ల, త్రివృత్కరణానికి తర్వాతే నామరూపవ్యాకరణం అని సిద్ధాంతంలో చెప్పడం కుదరదు. ఈమూడు కారణాలవల్లా, నామరూపవ్యాకరణాన్ని చేసే జీవుడైన చతుర్ముఖుడే త్రివృత్కరణం చేస్తున్నాడనీ, అండసృష్టికోసం దానికి ముందరే పరమాత్మవల్ల త్రివృత్కరణం చెయ్యబడుతోందని చెప్పడం తప్పు అని స్పష్టం అవుతోంది. కనుక, జీవుడైన చతుర్ముఖుడే నామరూపవ్యాకరణం చేస్తున్నాడని తేలింది. ఈవిధంగాఉన్న పూర్వపక్షాన్ని, తరువాతి సూత్రంలో ఖండిస్తున్నారు.

*సి.సూ.॥ మాంసాది భౌమం యథాశబ్దమితరయోశ్చ ॥ (2-4-18) (265)*

**యథాశబ్దం-** "అన్నమశితం" అన్న వేదవాక్యంప్రకారం **మాంసాది-** మాంసం, మనస్సు, అనబడే రెండూకూడా (మలంలాగ), **భౌమం-** భూమితాలూకు వికారమే. **ఇతరయోః చ-** "ఆపః పీతాః", "తేజోఽశితమ్" అనే వేదవాక్యాల్లోకూడా ఇదేవిధంగా.

**566*.** *అన్నమిత్యాదినా నాత్ర త్రివృత్కరణముచ్యతే॥*

**567.** *భుక్తాన్నాదేః త్రిప్రకారః పరిణామోఽత్ర కథ్యతే।*
*"యః స్థవిష్ఠో భాగ"ఏవమాదిపర్యాయతః క్రమాత్॥*

**568.** *పురీషం మాంసమనసీ వికారా అన్నవస్తునః।*

*మూత్రాసృజీ ప్రాణ ఇమే పరిణామా జలస్యచ॥*

**566*-579. సిద్ధాంతం:** అవతారికలో చూపబడిన పూర్వపక్షం తప్పు. ఎందువల్లంటే, ***"అన్నమశితం", "ఆపః పీతాః" "తేజోऽశితమ్"*** **అని** మొదలయ్యే వాక్యాల్లో త్రివృత్కరణం చెప్పబడలేదు. అందరూ తినే అన్నం, త్రాగే నీలు, తేజస్ అనే మూడూ ఒక్కొక్కటీ మూడుమూడుగా పరిణమించడమే చెప్పబడింది. "స్థూలమైన వంతు మలం, మధ్యభాగం మాంసం, అతి సూక్ష్మమైన భాగం మనస్సు" అని మలమాంలమనస్సులు అన్నం ఆనే పృథివీభూతమనే ఒకపదార్థపు పరిణామంగానే చెప్పబడుతోంది. ఇదేవిధంగా పైన చెప్పిన వాక్యాలలో మూత్రం, అసృక్ (రక్తం) 'ప్రాణం అనే ఈమూడూ నీరనే భూతం తాలూకు పరిణామంగానూ, ఎముకలు, మజ్జ, వాక్కు అనే మూడూ తేజస్సనే భూతపు పరిణామంగానే చెప్పబడుతున్నాయి. ఈవాక్యాలు ఒక్కొక్కదాంట్లోనూ అగ్ని, నీరు, భూమి అనే భూతాలకి త్రివృత్కరణం చెప్పిఉంటే, అప్పుడు మొదటివాక్యంలో భూవికారమైన మలంకంటే, సూక్ష్మమైన మాంసం నీటివికారంగానూ, అంతకంటే సూక్ష్మమైన మనస్సుని తేజోవికారంగానూ చెప్పబడినట్లుగా రావల్సిఉండేది. ఎందుకంటే, త్రివృత్కరణం చెయ్యడానికి ముందు భూమి స్థూలమైనదిగానూ, నీరు ఆనికంటే సూక్ష్మమైనదిగానూ, తేజస్సు దానికంటే సూక్ష్మమైనదిగానూ అంగీకరించడంవల్ల, ఇదే కారణంవల్ల, రెండో వాక్యంలో మూత్రం భూమివికారంగానూ, ప్రాణం తేజస్సువికారంగానూ, మూడోవాక్యంలో, ఎముకలు భూమివికారంగానూ, మజ్జ నీటివికారంగానూ, చెప్పబడిఉండాల్సివస్తుంది. ఇది కుదరదుగనుక, ఇక్కడ వెనకచెప్పినట్లుగా త్రివృత్కరణం చెప్పబడలేదు. ఆహారపదార్థపుపరిణామమే చెప్పబడుతోంది అని స్పష్టం. ఎందుకు కుదరదు అంటే, ***"అన్నమశితమ్"*** (ఛాం. 6-5-1) అని మొదలయే మొదటివాక్యంలో మలమాంసమనస్సులు మూడే భూవికారంగా చెప్పబడటంవల్లనూ, "ఆపః పీతాః"(ఛాం. 6-5-2) అని మొదలయ్యే రెండోవాక్యంలో మూత్రరక్తప్రాణాలుమూడింటినే నీటివికారంగానూ చెప్పబడటంవల్లనూ, ***"తేజోऽశితమ్"*** (ఛాం.. 6-5-3) అని మొదలయ్యే మూడో వాక్యంలో అస్థి, మజ్జ, వాక్కులు మూడింటినే తేజోవికారంగా చెప్పబడటంవల్లనూ ప్రతీవాక్యంలోనూ, మూడు భూతాలవికారాలనీ చెప్పబడినట్లుగా అనుకోవడం కుదరదన్నది బైటపడింది. ఈమూడువాక్యాలనీ వివరించే వాక్యశేషమైన తరువాతివాక్యంలో ***"అన్నమయం హి సోమ్య మనః, ఆపోమయః ప్రాణః, తేజోమయీ వాక్"(ఛాం.*** 6-5-4) (అబ్బాయీ! మనస్సు అన్నం అనబడే భాగపు వికారమే, ప్రాణం నీటి వికారమే వాక్కు తేజస్సుతాలూఽు వికారమే) అని చెప్పడంకూడా ఇది బలిష్ఠమౌతోంది. *"నానావీర్యాః"* (వి.పు. 1-2-52, 53) అని మొదలయ్యే శ్రీవిష్ణుపురాణశ్లోకాల్లో త్రివృత్కరణం చెయ్యబడని భూతాలు ఒకటిగాకూడి కార్యాలని సృష్టించటం కుదరదని చెప్పి ఉండడం ఇదివరకే చూపేం. కనుక, అండసృష్టికి పూర్వం త్రివృత్కరణం చెయ్యబడిన భూమి మొదలైనవి ఆహారపదార్థాలుగా జీవరాసిచేత తినబడేటప్పుడు, మూడువిధాలుగా పరిణమించేవిధమే ఇక్కడ నాలుగు మంత్రాలవల్లనూ చెప్పబడుతోంది అని స్పష్టం అవుతోంది. కనుక, ఇంతమాత్రంవల్ల పూర్వపక్షంలో చెప్పబడిన మొదటి కారణానికి సమాధానం చెప్పబడ్డట్టైంది. *"నామరూపే వ్యాకరోత్, తాసాం త్రివృతం త్రివృతం ఏకైకాం అకరోత్"* (ఛాం. 6-3-4) అని నామరూపవ్యాకరణానికి తర్వాత త్రివృత్కరణాన్ని వేదవాక్యం చెప్పినప్పటికీ, వెనుకచెప్పిన శ్రీవిష్ణుపురాణశ్లోకంలో చెప్పినట్లుగా త్రివృత్కరణం చెయ్యబడని పదార్థాలతో సృష్టించడం నామరూపవ్యాకరణం చెయ్యడం సాధ్యంగాదుగనుక, పాఠక్రమంకంటే అర్థక్రమం బలిష్ఠమైనదిఅనే న్యాయంప్రకారం ఈఉపనిషద్వాక్యంలో పఠించబడిన క్రమాన్ని మార్చి, నామరూపవ్యాకరణానికి

ముందరిదిగా త్రివృత్కరణాన్ని తీసుకోవాలి. ఇలా దీనివలన, పూర్వపక్షంలో ఎత్తుకొనబడిన మూడో కారణానికికూడా సమాధానం చెప్పబడినట్లైంది. *"యదగ్నేః రోహితం రూపం"* (ఛాం. 6-4-7) అని మొదలయ్యే వాక్యంలో అగ్ని ఆదిత్యుడు మొదలైన వాటిలో త్రివృత్కరణం చూపబడడంలోకూడా విరోధం లేదు. ఎందుకంటే, ఇక్కడ త్రివృత్కరణాన్నిగురించి అడిగిన శిష్యుడైన శ్వేతకేతు అండంలోఉన్నవాడుగనుక, అండానికి బాహ్యంగానున్న వస్తువుల్లో త్రివృత్కరణాన్ని వీడికి చూపసాధ్యంగాదుగనుక, వీడికి తెలిసేటట్లు త్రివృత్కరణం చెయ్యబడిన పదార్థాలైన అండంలోనుండే అగ్ని, ఆదిత్యుడు, మొదలైనవాటిలో త్రివృత్కరణం చూపబడింది. కనుక, దీనివల్ల పూర్వపక్షంలో ఎత్తుకోబడిన రెండో కారణానికి కూడా సమాధానం చెప్పబడింది. కనుక, నామరూపవ్యాకరణం పరమాత్మ చెయ్యడమే తప్ప చతుర్ముఖుడు చెయ్యలేదన్నది స్థాపించబడింది.

### *సి.సూ.॥ వైశేష్యాత్తు తద్వాద స్తద్వాదః ॥ (2-4-19) (266)*

**వైశేష్యాత్ తు-** (ప్రతీ భూతభాగం) వ్యాపించి ఉండడంవల్ల **తద్వాదః--** ఒక్కొక్కటీ ఒక్కొక్కభూతంగా చెప్పబడుతోంది.

*580. అన్నమాప స్తేజ ఇతి పదానాం శుద్ధవాచినామ్।*
*త్రివృత్కృతపృథివ్యాదిపరత్వం చాత్ర యుజ్యతే॥*
*581. ఏకైకస్యహి బాహుల్యాదేకైకస్మిన్నథ త్రిషు।*
*అన్నాదివాక్, పదాభ్యాసోఽధ్యాయపూర్తేః ప్రదర్శకః॥*

*॥ ఇతి సంజ్ఞామూర్తిక్లుప్త్యధికరణమ్॥*
*॥ ఇతి ద్వితీయాధ్యాయే చతుర్థః పాదః ॥*
*॥ ఇతి ద్వితీయాధ్యాయః ॥*
*॥ శ్రీరస్తు ॥*
*॥ శ్రీమతే శ్రీ రాఘవార్యమహా దేశికాయ నమః ॥*
*॥ శ్రీమతే అప్పలార్యాయ నమః ॥*
*॥ అస్మద్గురుపరమ్పరాయై నమః ॥*

**580-581. సిద్ధాంతం:** త్రివృత్కరణక్రమప్రకారం ప్రతీ భూతంలోనూ, ఇతరభూతభాగాలు కలిసిఉన్నా, ప్రతీదాంట్లోనూ, ఒక్కొక్కటే ఉన్నట్లుగా భూమి, అప్పు, తేజస్సు, అని ఒక్కొక్క భూతాన్నీ వ్యవహరించడానికి కారణమేమి అంటే, భూమి అని వ్యవహరించబడుతున్నదాంట్లో మిగతా రెండూ కలిసిఉన్నా, భూభాగం అధికంగనుక, అది భూమి అని వ్యవహరింపబడుతోంది. ఇదే విధంగా, నీటిభాగం అధికంగాఉండటంవల్ల నీరు(అప్పు) అనిన్నీ, అగ్నిభాగం అధికంగా ఉండడంవల్ల అగ్ని (తేజస్) అనిన్నీ వ్యవహారం ఏర్పడింది.

"తద్వాదః" అన్న పదాన్ని రెండుమారులు చెప్పడం అధ్యాయం పూర్తి అవడాన్ని చూపుతోంది.

సంజ్ఞామూర్తిక్లుప్త్యధికరణం సమాప్తమైంది.
రెండో అధ్యాయం నాలుగోపాదం పూర్తి అయింది.
శ్రీకృష్ణస్వామివిరచితమైన శారీరకకారికావళీ వివరణానికి
శ్రీనివాసదాసరచితమైన ఆంధ్రీకరణంలో
రెండవ అధ్యాయం పూర్తి అయినది.